శ్రీరస్తు.

శ్రీమత్పర్వతరాజకుమార వేంకటనాథరాజకవివరవిరచిత

# పంచతంత్రము

పద్యకావ్యము.

UNIVERSITY OF HYDERABAD

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచేం

ప్రకటితము.

1924

All Rights Reserved.

University of Hyderabad
LIBRARY
Acc. No. 29120
Date 17.9.87
Hyderabad - 500 134.

T
I
VSJP

Printed
at the "VAVILLA" Press,
Madras.—1924.

# పీఠిక.

## వేంకటనాథకవి.

ఈమహాకవి పంచతంత్రమును పద్యకావ్యమునుగా రచించి మిగులఁ గీర్తిని జేకొన్న మహనీయుఁడు. ఇతనియింటిపేరు బైచరాజువారు. ఇతనితాతతాత బైచభూపాలుఁడు. ఇందుచేతనే యాతని కీ యింటిపేరు గల్గెనని తోఁచుచున్నది ఇవ్విషయమునే పంచతంత్రమున,

"ధీరత రాజవంశజలధిం బ్రభవించె మహావిరోధిసం
హారవిహారి సార్వబిరుదాంకుఁడు బైచనృపాలుఁ డద్ధరి
త్రీరమణీమనోహరుని తీవ్రయశస్స్ఫురితేభ హారాద్రిస
హారసుంధరాధరము లయ్యె సమగ్రవిహారశైలముల్."

ఈ బైచరాజుకుమారుఁడు తిరుమలధరణీనాథుఁడు. ఇతనికుమారుఁడు వీరభద్రరాజు. ఇతనికిఁ బుత్త్రు లిరువురు. లింగభూపాలుఁడు, పర్వతరాజు. ఈపర్వతరాజునకుఁ బుట్టిన మువ్వురుకుమారులలో నగ్రజుఁడే యీ వేంకటనాథమహాకవి. ఈ కారణముననే యాతనిఁ బర్వతరాజకుమారవేంకటనాథుఁ డనియు నందురు. పై పద్యమునుబట్టియే యాతఁడు క్షత్త్రియకులావతంసుఁడని తెల్లమగుచున్నది. ఈకవిశ్వరుఁడు తన్నుగుఱించి,

"అసహాయరసకవితా,రసికుఁడ వేంకటనాథప్రభుఁడ గుణ
ప్రసరప్రకాండమదన,ద్భుపలాయితవిద్వదఖిలబంధుప్రజుఁడన్."

అని తనపాండిత్యగరిమంబును జేసుకొనియున్నాఁడు.

కవికాలము, దేశము నిర్ణయించుటలో గొప్ప చిక్కుగలదు. పూర్వపుఁగవులు తమగ్రంథములలోఁ దమకాలమును దేశమును జక్కఁగాఁ జెప్పుకొనువారు కారు. అట్లు చెప్పియుండినచోఁ బీఠికాలేఖకులయూహలకును జర్చలకును నెడము లేకుండెడిది. ఐనను నీతని కాలమును గుఱించి 'బ్రౌన్‌దొరవారు' తమనిఘంటువునందు క్రీ॥ శ॥ 1500 సంవత్సరప్రాంతమువాఁడని వ్రాసి యున్నారు. కాఁబట్టి యీకాలమునకుఁ బ్రమాణేతరము లగుపడునంతకు నియ్యదియే యని నిర్ధారణ

చేయక తప్పదు. ఇదియునున్గాక వేంకటనాథుఁడు దాను బూర్వకవు లను స్తుతించుచు,

> "హ్రాదయప్రస్తారథం బతిప్రియతమం బెక్కింతు జేతోమరు
> త్సదనాసానికిఁ దెత్తు మానసనభస్సంచారిఁ గావింతు హ్రా
> ద్విదితక్షీరసముద్రఖేలనమునం దేలింతు నుత్కృష్టవ
> స్తుగులం బ్రాజ్ఞుల దిక్కయాజ్య నమరేశు నోస్సము శ్రీనాథునిన్."

అని శ్రీనాథుని బేర్కొనియుండుటచే నీతఁడు 1450-వ సంవత్సరమునకుఁ బూర్వపువాఁడు కాఁడని స్పష్ట మగుచున్నది. మఱియును నీతఁడు తన జ్యేష్ఠపితృవ్యునిఁగూర్చి చెప్పుచు, 'కుమారలింగక్షోణిపాలుండు యవనసైంధవకాననానలుండు.' అనిచెప్పియున్నందునఁ గవి హిందువులకును మహమ్మదీయులకును యుద్ధములు జరగుచున్న సమయంబున నుండు నని యేర్పడుచున్నది.

ఇతఁడు కవులందఱివలెనే దనకుఁ బ్రబంధరచనాకాలంబున భగవంతుఁడు స్వప్నంబున సాక్షాత్కరించినట్లు చెప్పియున్నాఁడు. ఇయ్యది పూర్వకాలంబునుండి యాచారముగ వచ్చుచున్నది. ఇందలి సత్యాసత్యంబు లప్పరమేశ్వరుఁడే యెఱుంగు.

ఈతఁడు తనకృతియగు నీపంచతంత్రంబును స్వప్నంబున సాక్షాత్కరించిన హరిహరదేవున కంకిత మిచ్చినాఁడు. తద్విషయంబును, నాహరిహరనాథునియందలి భక్తిపారవశ్యంబును,

> "ఏ చనవు గలుగు హరిహర, సాచివ్యము నొంద నన్యజనులకు మది నా
> లోచింపఁ దిక్కయజ్వకు, నాచనసోమునకు మఱియు నాకుం దప్పన్."

అని చక్కఁగ వక్కాణించెను. ఇక్కారణంబుననే యీతఁడు నెల్లూరి మండలనివాసిగానుండ నోపునని యూహింపవలసి యున్నది. కవి తా నేమండలమువాఁడైన నేమి యెందుఁ బుట్టిన నేమి యెందుఁ గిట్టిన నేమి యెందు జీవనంబు గడపిన నేమి తనపాండిత్యముచేఁ గీర్తిని గడించినఁ జాలును.

కవితామాధుర్యంబుచే శిరంబు లూపించినఁ జాలు. అతఁడు భారతభూమి నలంకరించినవాఁడే యగు. ఈవిషయ మింతటితో విరమించి యితనికవిత్వముయొక్క పక్కినిగుఱించి కొంచెమాలోచింపవలయును.

ఇతనికవిత్వములో లక్షణవిరుద్ధములగు ప్రయోగము లున్నవనియు, నందుచేతనే లక్షణకర్త లుదాహరణముగా నీతనికృతిఁ గొనకపోయి రనియు నందురు. ఈలక్షణవిరుద్ధప్రయోగము లెల్లగ్రంథంబులయందును గన్పడుచున్నవి కాని యవి కొందఱియదృష్టంబుఁబట్టి సాధువులుగను గొందఱిదౌర్భాగ్యముఁబట్టి యసాధువులుగను సాధింపఁబడుచున్నవి. ఇతఁ డీపంచతంత్రంబును సంస్కృతమునకు భాషాంతరీకరణమువలెఁ గాక ప్రబంధశైలిలో వ్రాసినాఁడు. కవిత్వ మెట్లుండవలయునో యీతఁడే యీపంచతంత్రమున,

"ఘనతరఘూర్జరీకుచయుగక్రియ గూఢము గాక ద్రావిడ
స్తనగతిఁ దేట గాక యరచాటగు నాంధ్రవధూటిచొక్కపుం
జనుగవఁ బోలి తేటయును జాటుతనంబును లేకయుండఁ జె
ప్పిన యదె పో కవిత్వ మనిపించు నగిం చటుగాక యుండినన్".

అనుపద్యముచేఁ జెప్పియున్నాఁడు. తిలకింపుఁడీ!.

కావ్యంబున నొక్కొక్కఁ డొక్కొక్కయిక్క. నరయుచుండును. 'భిన్నరుచిర్హి లోకః' అనునట్లు లోకంబునఁ బలువురు పలువిధంబులగు రుచులు గలిగియుండుదురు. దీనినే యీవేంకటనాథుఁడు,

సీ. "ఒకఁ డలంకారంబునకు వేడుకవహించు నొకఁడు వార్తాసమృద్ధికిఁ జెలఁగు
నొకఁడు శబ్దస్ఫూర్తులకు మాయురే యను నొకఁ డర్థస్పష్టికి నుత్సహించు
నొకఁడు రసాభోగతకు మస్తముఁ గదల్చు నొకఁ డుపమానచర్చకకు నలరు
నొకఁడు పదప్రౌఢిమకు నిచ్చలో నెచ్చు నొకఁడు జాతిశ్లాఘ కుబ్బుచుండుఁ
తే. గామి చందానఁ దలపరి కరణి బధిరు, పలె దరిద్రునిగతి వాఁడి పగిదిఁ గనక
కాఁపు చొప్పునఁ బంగు ప్రైఖరిఁ గుజాతి, బాప నిందలే మదలింపఁ జాలు కొల్లు."

అని చాటియున్నాఁడు. 'అవిదితగుణాపి సత్కవిభణితిః కర్ణేషు వమతి మధుధారామ్' అన్నట్లు చవిఁ గొనుఁ డీపద్యమునందలి మాధుర్యము!

ఎట్టివానికృతియందును దప్పులుండక పోవు. ఉండినంతనే వానికృతికిఁగాని యాతనికిఁ గాని కళంక మాపాదింపరాదు. గుణపరీక్షణము చేయవలయుఁ గదా? రసపుష్టిఁ గనుఁగొనవలయుఁ గదా? దీనినే యీతఁడు,

"ఒప్పులు గలకృతిలో నొక, తప్పున్నను గడమ గాదు దానికిఁ గళలం
జొప్పడు శశికిఁ గళంకము, కప్పేర్పడి యేమి నిందఁ గావించె నొకో."

అని వక్కాణించె.

ఇతఁడు కృతిని రాజుల కిచ్చునభిప్రాయమందు విముఖుఁడు. ఒంటిమిట్ట శ్రీకోదండరామమూర్తి కంకితమిచ్చి కీర్తిఁగాంచిన బమ్మెర పోతనామాత్యుని యనువునను, బిలకాపురీకుక్కుటేశ్వరున కర్పించి తన కృతుల వాసి నొందిన కూచిమంచి తిమ్మకవివడువునను, మఱియు భగవదర్పణ మొనరించిన మహాకవులజాడ ననుసరించియే యీతఁడును రాజాంకితమును గుఱించి,

> "అతికుటుంబరక్షణాపేక్షఁ బ్రాల్మాలి, కృతులు మానవభూమిపతుల కిచ్చి
> చచ్చి నిరయమునకుఁ జనుకంటె హరిహరార్పణముఁ జేసి సుగతిఁ బడయరాదె."

అని ఘోషించి యున్నాఁడు, చూచితిరే యీతని దైవభక్తి!!!

ఈపంచతంత్రమునే దూబగుంట నారాయణామాత్యుండును దెనిఁగించెను. పద్యములలో భావసామ్యముండక మానదు. కథ యొక్కటియే కదా? నారాయణామాత్యుఁడు సులభశైలిని వ్రాసినాఁడు. కాని యందుసైతము లక్షణవిరుద్ధములగు ప్రయోగములు లేకపోలేదు. వేంకటనాథుఁడు మాత్రము తాను గవిత్వమెట్లుండవలయునని యొప్పఁజెప్పెనో యాచొప్పుఁ దప్పింపక తగినచోటులం దనువయిన వర్ణనములను జేర్చి రచించినాఁడు. ప్రబంధమునం దుండఁదగిన వర్ణనము లన్నియు నిట్టకేలకుఁ గల్పించి రసపోషణముఁ జేసి వాసిఁ గాంచినాఁడు. ఐనను లక్షణవిరుద్ధములగు ప్రయోగము లందందుఁ జూపట్టుచున్నవి. వానినెల్ల నిట వ్రాయఁ బూసలేదు. 'ఓటికొక్కపాట' 'నోటికొక్కమాట'యనునామెత మనకుఁ జిరపరిచితంబు కాదే. అట్లే సామాన్యముగఁ బాఠభేదములచే లక్షణవిరుద్ధములగు ప్రయోగములును గలిగియుండునని యూహింప వచ్చును. ఈదోషములను గృతికర్తనెత్తిపై వైచుట ధర్మమార్గమని యెవ్వరైన నెన్నఁ బూనుకొనరని నానమ్మకము.

హంసవింశతికర్తయగు అయ్యలరాజు నారాయణామాత్యుని వలె నీతఁడును స్వభావవర్ణనముల గడునేర్పున నలవరించి యున్నాఁడు. కొన్నింటి నీక్రిందనుదాహరించెద. గ్రంథమునందే తిలకింపనగు నని పాఠకమహాశయుల వేఁడెద.

## స్వభావవర్ణనములు.

| పుట. | | పద్యము. |
|---|---|---|
| వేసఁగి | 58 | 517 |
| గొల్లచాన | 59 | 586 |
| హేమంతము | 69 | 677 |
| వేఁట | 99 | 186 |
| చోరుఁడు | 122 | 199 |
| సిద్ధుఁడు | 151 | 101 |
| వనము | 196 | 522 |

ఇట్టి వెన్ని యేని కానన గు. ఉదాహరింపఁ బూనిన గ్రంథమం తయు నెన్న వలసి యుండును.

ఈతఁడు శబ్దాలంకారంబులఁ గూర్చుటయందు మిక్కిలి ప్రియుఁడు. అంతం దనేకపద్యములఁ గానన గు. అయినను గొన్నింటిని దెలిపెద.

## శబ్దాలంకారములు.

| పుట. | పద్యము. |
|---|---|
| 6 | 100 |
| 17 | 123 |
| 87 | 70 |
| 69 | 676 |
| 114 | 119 |
| 140 | 380 |

ఈ గ్రంథము నీతులకుఁ బుట్టినిల్లని వేఱ చెప్పనేల? నీతులను బొందుపఱచి వ్రాసిన పద్యములఁ గొన్నింటి నుదాహరింప మన స్సువ్విళ్లూరు చున్నది. కాంచుఁడీ కవిమహిమము!

"పురుషవిశేషలీల విరిబోఁడియు వాలు విపంచి శాస్త్రముల్
దురగము వాణియు న్నరుఁడు దొడ్డతనంబు వహింతు రట్ల కా
పురుషవిశేషలీల విరిబోఁడియు వాలు విపంచి శాస్త్రముం
దురగము వాణియు న్నరుఁడు దొడ్డతనంబువహింప రుర్వరన్." ప్రథమాశ్వాసము.

"గజ మంటినట్లు యుండుము, భుజగము మూర్కొనినయట్లు పొరిగొను ధరణీ
భుజుండు నగినట్లు చంపుం, గుజనుండు మన్నించునట్లు కొను బ్రాణంబుల్."

మనుజుం డెన్నండును స్వతంత్రుండు కాండు. భగవంతుండే యేకాలమున నెట్టి త్రిప్పుం ద్రిప్పునో యట్లు తిప్పక యనుభవింపవలయు ననుటకీ మహాకవి యెట్లు కథాంశమును వాక్రుచ్చెనో కనుంగొనుండు.

సీ. "ఘనరూపనిధి యనంగునకా యనంగత్వ? ముచితమే బలికహీవ్యూహవసతి?
పాండునందనునకా బహుకాలవనవాస? మిత్రపురాధిపునకా యేటిపోరు?
యదుకులాగ్రజునకా శాపమరణంబు? జాహ్నవీసుతునకా శస్త్రశయ్య?
నలరాజునకా మహానసపాకభజనంబు? నహుషునకా ఘోరనాగమూర్తి?
తే. మతిత్రిశంకునకా పచ్చిమాలతనము?, ద్రుపదనందనకా రాచతొత్తుపాటు?
మనుజుం డెవ్వండు కర్మస్వతంత్రుండనగ?, నీశ్వరుండు గాక సమర్థు డిట్టిపనులు."

ఇందుంగల యైతిహ్యముల నెట్లు జతకూర్చెనో.

ఇట్టి నీతులుగలపద్యములును, గంఠపాఠము జేసి పలుమారులు ప్రస్తావనావశంబునం జదువుకొనందగిన పద్యము లనేకము లున్నవి. అక్కడక్కడం బద్యములలో నామెతలనుగూడ నిమిడించి యున్నాండు. భాషయందుం బాండిత్యము లోకమునం గలిగింపవలెనన్న సామాన్యముగం బ్రచారములో నున్నమాటలనే యుపయోగించుచు గ్రంథములను వ్రాయుట యుచితమను వారికెల్లరకు వందనసహస్రంబులు. శ్రోత్రపర్వంబులును సమాసచాతుర్యంబులును, నలంకారవిశేషంబులును భాషకలంకారప్రాయంబు లని యెన్ని గ్రంథజాలంబులను రచించి మహాకవిపండితులు లోకంబున భాషను బోషింతురు గాక యని నాయూహ.

ఇం దెందైన లోపంబు లుండక మానవు. 'ప్రమాదో ధీమతామపి' యనువాక్యంబును దమమనంబున నిడి పరిశీలించి దోషంబులం బోంద్రోచి గుణగణంబుల గ్రహింతు రని భాషాభిమానుల నెల్లరను వేండుచున్నాండను.

ఇట్లు విన్నవించు,
పండితాఖండలమండల పాదసేవకుండు,

కావ్యతీర్థ. కవిభూషణ జనమంచి. వేంకటసుబ్రహ్మణ్యశర్మ,
సహాయాంధ్రపండితుండు, మునిసిపల్ హైస్కూలు, కడప.

HYDERABAD LIBRARY

శ్రీరస్తు.

# పంచతంత్రము.

## ప్రథమాశ్వాసము

### అవతారిక.

శ్రీవృత్తస్తననిస్తులైణమదసంసిక్తం బురోవీథి బా
గై విన్నాణపుఁబుట్టుమచ్చ రవికన్యాసన్న విశ్వంభరా
దేవీవిభ్రమలక్ష్మిఁ దేటపఱుపం దీపించు త్రైలోక్యర
క్షావర్ధిష్ణుఁడు కృష్ణుఁ డూర్జితమనీష న్మాకు దిక్కయ్యెడిన్. 1

మ. సరసీజాతము లాటపట్టులు నిశాచారారి చంచద్భుజాం
తరమావాసము పుట్టినిల్లు సలిలస్థానంబు దారిద్ర్యభూ
ధరవజ్రాయుధకోటిచూపు నిగమాంతప్రోక్తు లాశంసినీ
పరిషద్భాగముగాఁ జెలంగుజగదంబం బద్మఁ గీర్తించెదన్. 2

చ. తరల కహో యుపాంశుజపదంభమున న్వనజాతపీఠి క
న్నరమొగిడించి సృష్టికరుణాయతి మూలకుఁద్రోఁచి భారతీ
చరణశిఖాంతవిభ్రమరసంబులఁ బ్రస్తుతిసేయుధాత మ
న్నిరుపమదివ్యకావ్యపదనిర్మితిఁ బ్రోఁదియొనర్చుఁ గావుతన్. 3

మ. నవమేఘాళిఘటించు మచ్చికురబంధశ్రీ నిరీక్షించి గో
త్రవరేణ్యంబులఁ జేయువృత్తకుచముల్ దర్శించి భావించి నా
యవలగ్నాంగముఁ జూచి సింహస్పృజనం బర్థింపుమంచు న్మనో ధవు
మేలంబునఁ దేల్చువాణి నను నంతర్వాణిఁగాఁ జేయుతన్. 4

ఉ. చేకొని బ్రహ్మమంత్రములఁ జెప్పనహో ప్రతిసీర జాఱ మై
నాకుఁడు దేవతాళిగళనాదమున న్జదివించుచోట భూ
షీకృత భోగిదర్శనముచే ధృతిదూలి చలించుగౌరి నా
లోకముఁ జేసి నవ్వ ప్రబలు స్వరమేశ్వరు నాశ్రయించెదన్. 5

ఉ. ఆసవనారిమోవిరుచు లానఁగఁ దద్ఘనకంధరావల
ద్వ్యాసుకి భూరిభూత్కరణ వాతకనన్నిటలాంబకాగ్నిగం
గాసలిలాప్తి నార్పుటకుఁగా వడిదోయిలిసాఁచుచండముం
డాసురహంత్రి నన్ను సకలార్థవిధిజ్ఞునిఁ జేయుఁగావుతన్. 6

చ. నసుఁగక బాల్యచాపలమున న్దనపిమ్మటి వ్రేలఁ జొక్కపున్
గడియపుట ట్టటంచుఁ ద్రిజగజ్జను లచ్చెరువందిచూడ న
క్కడపటికొండ సొంపులెలుఁగం దవిలించినటించుశూలిపె
న్గొడుకు మదీయకావ్యమునకుం గలిగించు నిరంతరాయముల్. 7

ఉ. భూరి విరాడ్వికారగతిఁ బూర్వకుభృచ్చరమాద్రులం బదాం
భోరుహముల్ఘటించుకొని పోకలరాకల మేన్నలంచి వి
ద్యారుచిఁ జొక్కుచోఁ జెవివదన్రవిశోగున కెంపువోలెఁ జె
న్నారమహోన్నత స్మెఱయు నక్షురు నక్షురిపు న్భజించెదన్. 8

మ. ఫణమూర్ధంబుపయోధిపర్వశశిచెప్పం జొక్కి పెక్కంద్రకై
దవఖండంబసమగ్రముగ్రనగమంథక్షుభ్యమాణంబు సిం
ధువసారంబు తనుస్వమొప్పఁగలచంద్రుండంచు దివ్యామృతం
బవలంబించు భుజంగకోటియగునా గారింబ్రశంసించెదన్. 9

చ. అతినిశితాశుధారకు మహామహనీయ విచిత్రవర్ణసం
గతికి నిరూఢగూఢసుముఖత్వదసత్యపదార్థసంగ్రహ
స్థితికిఁ బహుప్రయత్ననియతిం జనతాశ్రుతిరత్నకుండలా
యితహితసూక్తియుక్తి నుతియించెద బాణమయూరచోరులన్. 10

మ. హృదయబ్రహ్మరథం బతిప్రియతమం బెక్కింతుఁ జేతోమరు
త్పదనాస్థానికిఁ దెత్తు మానసనభస్సంచారిఁగావింతు హృ
ద్విదితక్షీరసముద్రఖేలనమున న్దేలింతు నుత్కృష్టన
స్తుతులం బ్రాజ్ఞులదిక్కయజ్వనమరేశు న్సోము శ్రీనాథునిన్. 11

క. వాచావిధీకృత, లోచనకర్ణాగ్రయాయి లోకసుధాంధో
న్వైచికిఁ దలఁతు న్మద్వం,శాచార్యుం దిరుమలశ్రియగిపతి గురునిన్. 12

మ. రసవిస్ఫూర్తిగొలంత దీనికిదిపూర్వచ్ఛాయ యిప్పోటఁ ద
ప్పస దిప్పట్టున నర్థసృష్టిపసతే ధప్పోట నశ్లీల మ
ద్దెస నాదిక్కునదుస్సమాస మిది సందేహాస్పదంబీడ నం
చుసుమాళింబునఁ బాండితుల్మెరపునీచు ల్వ్రోఁతవాక్రువ్వఁగన్. 13

సీ. ఒకఁ డలంకారంబునకు వేడుకవహించు నొకఁడు వార్తాసమృద్ధికిఁ జెలంగు
నొకఁడు శబ్దస్ఫూర్తులకు మాయురె యను నొకఁ డర్థసృష్టికి నుత్సహించు
నొకఁడు రసాభోగతకు మస్తముఁ గదల్చు నొకఁ డుపమానచర్చికకు నలరు
నొకఁడు పదప్రౌఢిమకు నిచ్చలో మెచ్చు నొకఁడు జాతిశ్లాఘ కుబ్బుచుండుఁ
తే. గామిచందానఁ దలవరికరణి బధిరు, వలె దరిద్రునిగతి వాదిపగిదిఁ గనక
కాఱుచాడ్పునఁ బంగుపైఖరిఁ గుబ్జాతి, జూడ నిందటిముదలింపఁ జాలు పెల్లు. 14
కం. ఒప్పులు గలకృతిలో నొక, తప్పున్నను గడమగాదు దానికిఁ గళలం
జొప్పడు శశికిఁ గళంకము, కప్పెప్పడి యేమినిందఁ గావించెనొకో. 15
ఉ. ఆనుటకీరసంబున నహంకృతిపండితు లల్పకాకవు
లీనుల నీనిమత్కవిత విద్వదుపాసితగాకయున్నె యా
హానరభుక్తశేషకబళాహరణక్షమకుర్కురాళికిం
గాని నవాజ్యధార క్రతుకార్యసమాచరణీయగాదొకో. 16
*చ. మృదుగతి మించితావులకు మెచ్చుసదావనిఁ బావనాళి దా
వదిగొనిరోయుపంకిలను వంచకసంచయ మట్టిదేకదా
చదురుఘటిల్లఁ జూచు సరసప్రసవంబులఁ బంచరీకపుం
గదుపులు నిచ్చలు న్వదకుఁ గా కుణపంబుల నక్క లేర్పడన్. 17
చ. ఘనతరఘూర్జరీకుచయుగశ్రీయు గూఢముగాక ద్రావిడీ
స్తనగతిఁ దేటగాక యరవాటగునాంధ్రవధూటిచొక్కపుం
జనుఁగవఁబోలి గూఢమును జాటుదనంబును గాకయుంటఁ జె
ప్పినయది పో కవిత్వ మనిపించు నగిం చటుగాకయుండినన్. 18
చ. ఎడపక తారుదారె లిఖియించి పఠించి కృతుల్ ప్రతుల్ జగం
బడిగిన నిచ్చి హెచ్చి సకలావనగంబుల దారయై దిశల్
గడచి నటించుకావ్యములు కావ్యములా హరణాఘశాంతికై
విడువక కూలిఁ బెట్టి చదివించుకృతు ల్కృతులే వసుంధరన్. 19
వ. అని యిష్టదేవతానుతియును బురాతనకవిస్తుతియు నాచార్యపురస్కృతియును గుక
వితిరస్కృతియుం గావించి, యే నొక్కనాఁడు పంచతంత్రం బాంధ్రభాషం జంపూ

---

*చ. మృదుగతి మించితావులకు మచ్చుసదావనిఁ బావనాళి దా
వడిగొనిరోయుపంకిలను వంచకుఁడేర్తలనట్టిదేకదా
వెదకుమహోరసప్రసవవిభ్రమసంపదలన్నొజ్ఞష
ట్పదములు పూతిగంధకుణపంబుల రోయవె నక్కలెక్కడన్.

ప్రబంధంబుఁ జేయం బ్రారంభించి యేతత్కావ్యకన్యకారత్నంబున కనుకూలవల్ల
భుం డేదేవుండొకో యని విచారించి శయ్యాతలంబున శయనించిన. 20

శ్లో. హ్యాన్నిత్యయాచర మయా ప్యమయా ప్రభుత్వం
మాళీతుషార ఘృణినా జగతాం గురుత్వం
సందీపయ న్నభసి కోఽపి మహాన్పుమా న్నే
స్వప్నే శుభే సితసితద్యుతి రావిరాసీత్.

క. కలలో నలుపుం దెలుపుం, గలవేలుపుదార యాగణ్యకారుణ్యరసం
బొలయ ననుఁ జూచి ద్రాక్షా,ఘన మధురప్రణయపూర్వభాషలఁ బలికెన్. 22

క. నను హరిహరనాథునిఁగా, మనమునఁ దలపోయు నృపకుమారక విద్వ
జ్జనసేవ్యము నీకావ్యముఁ, దనకి మ్మభిమతవరప్రదాతకు భక్తిన్. 23

వ. అని యానతిచ్చి యావేల్పు విచ్చేసిన నానందకందళితపులకదంశితుండనై మేలు
కని. 24

క. ఏచనువుగలుగు హరిహర, సాన్నిధ్యము నొందు నన్యజనులకు మది నా
లోచింపఁ దిక్కయజ్వకు, నాచనసోమునకు మఱియు నాకుం దక్కెన్. 25

ఉ. సన్నుతశబ్దలక్షణరసస్ఫురితంబుఁ బురాణభారతో
త్పన్నము నైన సాధుపఠితం బయి యొప్పదు మర్త్యసేవ్యమై
యున్న ప్రబంధ మెప్పటి కహో జగదేకపవిత్రభూమిదే
వాన్నము సారమేయచరణాంకితమైన భుజక్రియార్హమే. 26

గీ. అతికుటుంబరక్షణాపేక్షఁ బ్రాల్మాలి, కృతులు మూఢభూమిపతుల కిచ్చి
చచ్చి నిరయమునకుఁ జనుకంటె హరిహరా, ర్పణముఁ జేసి సుగతిఁ బడయరాదె.

ఉ. అంగధృతాబ్జు నిశ్చలతరాతను సర్వదు సర్వమంగళా
లింగితు భీషణాశరకులీనజమోన్ముఖపౌరుషక్రియా
సంగతు భీషణాంబకకృశాను నిరూపిత వైరిసద్మ యో
గాంగయుతాద్భృతిన్ హరిహరాకృతి మత్కృతిభర్తఁ జేసెదన్. 28

వ. అని నిశ్చయించి యత్త్రిలోకీకర్త మత్కృతిభర్తఁగా నొనర్చితి మదీయ వంశా
వతారం బభివర్ణించెద. 29

ఉ. ధీరత రాజవంశజలధిం బ్రభవించె మహావిరోధి సం
హారవిహారి సాళ్వబిరుదాంకుఁడు భైచనృపాలుఁ డద్ధరి
త్రీరమణీమనోహరుని తీవ్రయశస్స్ఫూర్తికిన్ హరాద్రినీ
హారనసుంధరాధరములయ్యె సమగ్రవిహారశైలముల్. 30

క. అల వైచక్షితిపతికి, న్బలభిత్ప్రతిమానభోగపరతంత్రునకున్
గలిగె న్దిరుమలధరణీ, తలనాథుఁడు నిర్భరప్రతాపోజ్జ్వలుఁడై. 31

ఉ. అంబుజనేత్రఁ జిమ్మసుధాధిపరత్నము గూరిమ్మేర్మిఁ ది
ప్పాంబికఁ బెండ్లియై కనియె నప్రతిమానగుణాఢ్యు వీరధౌ
ర్యుం బరిపంథిరాజకులతోయధిమందరు ఘోరసంగరా
డంబరచుంబిభీషణకటుప్రకటద్విపసైన్యసంయుతున్. 32

సీ. అతఁడు తుంపల్లిశ్రీపతిరాజనరపుత్త్రి శృంగారములయక్క లింగమక్కఁ
బరిణయంబై లింగనరనాయకవతంసుఁ బ్రాభవస్తంభముఁ బర్వతేంద్రుఁ
గనియెఁ గుమారలింగక్షోణిపాలుండు యానసైంధవకాననానలుండు
పోరులఁ బెక్కండ్రఁ గూరిపుచ్చె నసహ్యహేతునిత్యుఁడు పర్వతప్రభుండు

తే. వైరికాంతారదవవారివాహమూర్తి, పోత ఘలితిప్పనసుమతీపాలపుత్త్రిఁ
బుణ్యచారిత్ర వికసితాంభోజనేత్ర, నన్నమాంబికఁ బరిణయంబయి ముదమున.

క. నను వేంకటజనవల్లభు, వినుతపరాక్రముని రంగవిభుధైర్యకథా
కనకాద్రిని శేషాద్రినిఁ, గనియెను నిహతసుస్సౌఖ్యఘటనాయతికిన్. 34

క. అసహాయసరసకవితా, రసికుఁడ వేంకటధరావరప్రభుఁడ గుణ
ప్రసూనప్రకాండపదవ, ద్భాసురాయిత *విద్వదఖిలబంధుప్రజుఁడన్. 35

షష్ఠ్యంతములు.

క. భువనత్రయసాక్షృతికిన్, బవిషాణిప్రముఖలోకపాలకమకుటీ
దినమణికి రణవికసిత, సవికరుణాచరణచరణజలజాతునకున్. 36

క. శ్వాస్త్యవరదునకు నా, ర్యాలోకచకోరతాపహరణక్రీడా
గ్లాలాలితాస్యశశినం, హోలుంపకహృదయమునిజనోపాస్యునకున్. 37

క. వినతానందనగతికిన్, ఘనవరకత్రాసకరణ కరవాలభుజా
భినవాదృతసురతతికిన్, జనితప్రహ్లాదవినుతజటిసంతతికిన్. 38

క. బహుభువనవిహారునకున్, స్వసహజబ్రహ్మాండభాండజటిలఫలాళీ
వహనమహనీయవిగ్రహ, మహితోదుంబరగతక్రమశ్రీకునకున్. 39

క. తరణిశశిలోచనునకుం, బరమాణువిలోకి యోగమార్గఖురాళీ
పరివిహృతిసనాథునకున్, హరిహరనాథునకు సద్గృహసనాథునకున్. 40

కథాప్రారంభము.

వ. సభక్తికసమర్పితంబుగా నాయొనర్పం బూనిన పంచతంత్రంబునకుం గథాక్రమం
బెట్టిదనిన. 41

* సకలబంధు పరిపుష్కలుఁడన్.

సీ. వనజగర్భకటాహవర్ధిష్ణువరణంబు బలిబహులాక్షతపుణ్యసలిలఖేయ
మరుణాంశుకలశభాసుర రత్నసౌధంబు కుధరభిద్గృహముంబిగోపురంబు
ఘనఘనాక్రీడసద్ధాత్రనిష్కుటకంబు బ్రహ్మనిష్ఠద్విజప్రాంజలంబు
ప్రబలభార్గవశౌర్యబంధురక్షత్రంబు పౌలస్త్యనిభవణిగ్భాసురంబు
తే. పద్మనాయకశుభవిభావర్త్యమాన, విద్వదావాసమండలీవిహరమాణ
భూరిసంతాపతిమిరంబు పొగడ నెగడుఁ, బూర్ణగరిమంబు పాటలీపురవరంబు. 42

సీ. హాలహాలం బిదిగాదె యభ్యమిత్రయజీ వానిలగ్రాహివ్రాహిపతికి
బలుమదం బిదిగాదె పరుషారివారిజోన్మూలకృత్యాలశుండాలపతికిఁ
జిరతమం బిదిగాదె పరరాజసంరోధి వరణమండలచక్రవాళమునకుఁ
గ్రొమ్మెఱుం గిదిగాదె కుటిలశాత్రవతను క్షతజయుక్ప్రాకారచక్రమునకు
తే. క్షౌద్ర మిదిగాదె ప్రతిపక్షజాతిఁ జెనని, కొమ్మరేసుల గనుపట్టుకోటతమ్మి
కనఁగ జన లోచనోత్సవం బావహిల్లఁ, బరిఘవిల్లుఁ బొగడ్త నప్పురియగడ్త. 43

గీ. మొదలి వప్పులలోఁ గొంత మునిఁగి పిదప, రాసికెక్కిన పెనుమచ్చరాలఁ బెరిగి
పరఁగుతనపెంపుఁ గొమ్మలపాలుఁ జేసి, కోట యవ్వీట కుర్విటుపాటఁ దనరు. 44

చ. పురనిధిరక్షణక్షమతఁ బూనిన శుద్ధసుధాసముజ్జ్వలా
వరణ ముకుందభృత్ఫణికి వాలికకొమ్మ లతిస్ఫుటస్ఫటో
త్కరము తదగ్రశీతకరకాంత శిలామణులం బురుడ్బిసా
హరణచరన్మరాళపరిఘాంబువుకంచుక మెంచి చూడఁగన్. 45

మ. దివిషద్వాహిని యప్పులం బొరసి యుద్వృత్తిన్ విజృంభింపఁగా
నవరోధించినపీటికోట యభ్రమన్మాచార మేహాం వాం
బనకచ్ఛంబునఁ బొఁగుకొన్న యడుగొప్పం బ్రస్తరస్వీకృతి
న్నినసద్రత్నతదాతపోచ్చలన వహ్నిం బ్రాఁగున శ్రాంతమున్. 46

మ. గళబద్ధానిలభుగ్విషస్ఫురిత భూతాకారంబునం గాలుఁగొం
డలునీ తేరిగురాల నెట్లు చెడకుండం బ్రోతు పవ్వప్రర
క్షులు గారుత్మతశోభఁ బూనిధరియించుం జూడుఁడా యంచు ని
స్తులదత్తోత్తరభాషఁ దెల్పు చను ఖద్యోతుం డుదాత్తాచితిన్. 47

చ. కులుకుకుచంబులానకలుగుల్పడఁ గొమ్మలఁ దొంగిచూచు కొ
మ్మలముఖచంద్రచంద్రికలమ్రువ్వుఁ దేటగవాక్షచంద్రను
శ్శిలల స్రవించునీటఁ బడి శీఘ్రగతిం బఱతెంచు మీనకం
దళములయుత్మపద్మదళదామకశోభఘటించుఁ గోటకున్. 48

ఉ. బంభరడింభఝంకృతినిబద్ధకటప్రకటప్రదానస
త్కుంభిరదప్రహారముల సోకల త్రొక్కులునైనమిన్నువి
శ్వంభరఁగూలున న్కలఁక సారసగర్భుఁ డొనర్చు సంభృతి
స్తంభములో యనం గనక సౌధము లుల్లసిలుం బురంబునన్. 49

చ. పవనజవంబునం బొనము పై గరుడాగ్రజు గంధవాహకృతిం
బవలుగ్రమించి రాఁగ నృణిమాని హయాళి హయాళికక్ర మో
త్సవముఘటించు నౌర దివిషద్వనితాజనతాముఖేందుజ
చ్ఛవినికషంబునం బొడము సౌధనిశాపదవృత్తివాహముల్. 50

చ. మరకతకుంభము ల్దలల మానసమానవిహీనకేతువుల్
కరములు మధ్యవర్తిరవికౌస్తుభరత్నముతారకాసము
త్కరము సరోజదామకముగాఁ బొగడొందినసౌధరాడ్విరా
ట్పురుషుఁడు ప్రత్యహం బహుళపూజితుఁడై కొమరొప్పునప్పురిన్. 51

ఉ. వన్నియమీఱ నన్నగరివాడల మేడలఁ గ్రీడలం గురు
ల్వెన్నెల మెఱుంగుమిన్నులతనూనలకుం జెలులై నిలింపవి
ద్యున్నిభదేహలిప్తరళితుంపవిముక్తవితీర్ణభూరుహో
త్పన్నసముగ్రసౌరనితాంతలతాంతగుచ్ఛకచ్ఛటల్. 52

* చ. గురుపురగోపురాగ్రములఁ గూడినభూషసుతల్పతల్పనో
హరవరదత్తమత్తవిహమాయుధజన్యవిహారకల్పన
చ్ఛరికఘటిల్ల వేసవులు గోరుదురఁ దీమన మేమమారుతాం
కురములఁ బ్రోతు రచ్చరుచకుంభజవిక్రమపుష్కరప్లుతిన్. 53

* చ. అలఘుసరోజనీముఖశిరోగమకాంతకరాళిజాతర
జ్వలనశిఖోగ్రజీర్ణవిధినాహసులా యుజకోటి కిచ్చు ను
త్కలిక నిలింపధామశిఖధామసమాగమప్రతిబింబితామిళ
త్కలిత సుగంధచంద్రఘటికాపురగోపురయానతాస్యముల్. 54

ఉ. ఆపురిఁ జంద్రికానిశల హాటకహర్మ్యమృగేంద్రమధ్యల
భ్రాపగనీట మజ్జనములాడి యలంకృతిమచ్చరీయులై
డాఁపురనున్కిఁ జేకొనఁ గడంగు గరింగు నిలింపపుష్పలా
వీపటలార్పితాపహితవృత్తులతో ఘనగానచ్ఛకస్మృతిన్. 55

చ. అలతొలివేల్పురాఁ బగరయాకటిపంటలు వేదబీజముల్
మొలచినచేలుదారగుణము ల్దనియించినయిండ్లు సత్క్రియా

---

* ఈరెండుపద్యములు ప్రక్షిప్తములనితోఁచెను.

ఫలతరువుల్ వివిక్తశుకపంజరముల్ గళకల్పితధాతతా
తలమన నేర్తురౌపరతత్త్వవిధిజ్ఞులు వీటిభూసురుల్. 56

శా. దూరారాతు లుదారధర్మగురుమూర్తు ల్వద్మినీహృద్విశా
సారంభు ల్వసుభూషితుల్ హృదయపద్యాబంధవిశ్వంభరుల్
ధారాసారవిధాయకు ల్ఘనపదాలంకారు లత్యర్థతే
జోరమ్యు ల్రుచిరోదయు ల్సుచివితంసు ల్వాల్తు రచ్చో నినుల్. 57

ఉ. ఉన్నతవైభవు ల్పరివిహారుభవుల్ భవనాంగణంబులం
దెన్నఁగఁ గోటికొక్కటిగ నెత్తినటెక్కెయము ల్లతాద్వరు
క్తిన్నెరయుంఘటించు మణిదీప్తములై గగనస్రవంతికా
సన్నఫలాభిరామదివిషత్కుటనిష్కుటవాటి కెంతయున్. 58

ఉ. స్ఫారతరత్వరాప్తి ప్రతిసాలగరాధిపనిశ్చలత్వగం
భీరముమాన్ప వాహినులు పెక్కులుగొల్వఁగ వచ్చిఁ గాంచి యా
పూరితసత్వరేఖపొలుపుం గని సద్ఘనులాశ్రయింప ని
ర్వారణమంద్రు భూరిగుణ రత్నసముద్రులు సాంద్రు లప్పురిన్. 59

శా. చూడం జాడ్కులరాగలక్ష్మి గలిగించు న్మించుఁ దోడ్తోన నా
క్రీడక్రీడనకాంక్ష కర్ణకుహరాగ్రిం బాపు పాదంబునం
దోడై తీర్చు రమాకుమారుపను లెందు న్వందులంబోలి యొం
తే డాకం బళిరే పురంబుకలకంఠీజాతి యశ్రాంతమున్. 60

ఉ. రాగములం బరాగములరాగములంగరఁగింతు రంగరే
ఖాగతి మెచ్చ రచ్చరలఁగాంచినశుద్ధము కల్మిదేశసం
ధాగరిమంబునం దడసినం గడకాల్ల నదల్చి రంభ నే
లాగునసైనగెల్తురు కళావతు లాపుటభేదనంబునన్. 61

సీ. వదనాబ్జములెచాలు వలపులఁ బ్రేరేఁప వెలిదమ్ములేటికి విక్రయింప
సోగకన్నులెచాలు సొంపుసంపాదింపఁ గలువలేమిటికి నంగళ్లఁబెట్ట
మొలకనవ్వులెచాలు ముదముఁ బ్రోదియొనర్ప నచ్చమల్లియ లేటి కమ్మఁజూప
గురుకుచంబులెచాలుఁ బరితోషమొనరింపఁ బూగుత్తు లేటికి బుటములెత్తఁ
తే గాయదీధితిచాలు రాగముఘటింప, బేరమెటిఁగింప నేల చాంపేయములకు
ననుచుఁ బతికులు నర్మోక్తు లాడనాడ, వేడ్క విహరించుఁ బుష్పలావీజనంబు. 62
సీ ఆలాన దారుబద్ధాంసువుల్ దెగఁ బిటిందికినీఁగి ముకుచాయ నిగిడినిగిడి
పత్రభాగములవెంబడికుధంబులుజాటిపోవ రజల్ ప్రయ్యఁ బొంగిపొంగి

నిర్యాణకోణము ల్విండి యుప్పర మెక్కు శీధువీచికలపైఁజిమ్మిచిమ్మి
సృణిఘాతముల లెక్కసేయక చేయిచ్చుకృత్తిశృద్భటపంక్తిఁగిట్టికిట్టి
తే. హస్తిపకముఖ్యసంహతు లతులగతుల, మఱువుఁడని చూళికలకోజఁ గఱపికఱపి
వఱలునవ్వీట గర్వదుర్వారవైరి, మారణారంభబలములు మదకలములు. 63

చ. సురసరణిం బడల్పడఁగఁజూచి కరాహతిఁ దత్పరోపరి
న్నిరవధికత్వరం జనఁగ నెట్టిన మావులఁ దూలవైచుకో
యరదముఁ బట్టునో యనుభయంబున నేగు నదృశ్యుఁడై విభా
కరుఁడవ వీటిదంతులకుగల్గిన యున్నతులెన్న నేటికిన్. 64

ఉ. రాజిలుపోతుమానికపురాల జిరాలగురాల సారధా
రాజవగౌరవం బడపరా కతిపుష్కరవాహకోటి గా
ఘాజవవీధిఁదోలువిరియంబడధారలకల్మి మత్సరో
త్తేజితమై హయాంకభృతి దీప్తసమీరణ మూర్జితత్వరన్. 65

శా. వైరూఢాతభటీరటన్ముఖధనుర్బాణ ప్రచండాసి భృ
చ్ఛూరుల్ గ్రాలఁ బరోపతాప మొనరించు న్దీవ్రసంచారరే
ఖారంభంబున సంఘటించుమహికి న్గంపంబుఁ గల్యాణము
న్జైర న్నాఱు మొగంబులౌఁబురము తేజీ ల్దుష్ప్రభుప్రక్రియన్. 66

మ. పరికింప న్మకుళప్రవాళగతి నభ్రంబంటుమావు ల్సమీ
పరసంగన్నులవిందుఁజేయు భువనప్రఖ్యాతచక్రభ్రమిం
బరమోత్కృష్టతఁగాంచి ఖడ్గశరసంపత్తి న్బ్రకాశించి య
ప్పారితేరు ల్మహానీయజంగమనగ స్ఫూర్తిన్నడు న్రాజిలున్. 67

వ. మఱియుఁ గమలాలంకృతంబులై మురవైరియురంబుం బురుడించు సరోవరంబులును బ్రతిపర్వరసోదయంబులై యనారతంబు భారతంబుంబోలు నిక్షువనంబులును వెండియుం బేరుగల వస్తువులుం గలిగి జగత్ప్రసిద్ధివహించిన యారాజధానిం బాలించురాజేంద్రుండు. 68

సీ. తనరూపమనురూప ఘరఘూతి గురుసూతి మఘుపూత విభుజాత మర్దిగాఁగఁ
దనదానమినజానఘనగారివనవారి ధరవాహవరదేహతాపిగాఁగఁ
దనశౌర్య మనివార్యతర కోపపరభూప ఘనసైన్యజనదైన్యకారిగాఁగఁ
దననీతి వినయాతిధనరజ్యవనరేజ్య శతపత్త్రహితపుత్త్రసహజగాఁగఁ
తే. దనమహాసత్య మంతికోద్యత్త్రిశంకు, తనయసత్యతపశ్చరిత్రంబుగాఁగ
మనుశుభస్ఫూర్తి నిత్యధర్మప్రసక్తి, తత్త్వవిద్దర్శనుండు సుదర్శనుండు 69

సీ. తనదానగౌరవంబునఁ బుణ్యజనపరంపర చిరస్వాస్థ్యసంపద వహింపఁ
దనమహాహవము పెంపునఁ జక్రవాళచలోత్తరతిమిరంబు లుడ్డుకుడుపఁ
తనఘనావనబలోద్యమమున నతిమిత్రగోత్రకుంజరజాతి కుతుకమందఁ
దనమహాంగున దురంతప్రతాపస్ఫూర్తి హానణించు నినుఁడు నున్నతిఁ గియుండ
తే. సమధికాద్భుతిఁ బూని విశ్వంభరుండు, తప్ప కెప్పుడుఁ గన్నులఁ గప్పకొనఁగ
వాలుమగఁడయి యత్యంతవసుసమృద్ధి, దనరుఁ బ్రియదర్శనుండు సుదర్శనుండు.
సీ. తనయశోనటికి గోత్రావలచ్చతురబ్ధి ఘనతరంగములు రంగములు గాఁగఁ
దనమహాస్త్రప్రజిహ్వానుఁ బ్రాజ్యారిరాజ్యములు నిస్తులతరాజ్యములు గాఁగఁ
దనహేతిశతధార ధారకాశాపకృత్కృతిగోత్రములు గోత్రములు గాఁగఁ
దనగూఢకలహంసమునకు భౌమామానసములు నిర్మలమానసములు గాఁగఁ
తే. దనమహాగుణరత్నసంపతికి శాస్త్ర, చతురభాషణకృతు లలంకృతులు గాఁగఁ
మనుసుదర్శనుఁ డభినవామ్నాయవితత, ఘనతతోషితహస్తసుదర్శనుండు. 71
సీ. పరధరాధిపచిత్రపత్రఖండనకేళి దశదిశావిదితప్రతాపరేఖ
యసదనుశాసనవ్యాపారత మహాతరావళిదత్తచిత్తాద్భుతగతి
భువనసంచారయోగ్యవినీతగతిమత్తసారంగరంగదాస్థానగరిమ
నిరుపమాన నిధాన పరిపూర్ణతమనోజ్ఞగుణసమేతాన్వయానుకూలవృత్తి
తే. బహువితానోన్ముఖుఁడు సమిద్ధవిహారశాలి, సత్యసిధ పుణ్యజనుఁ డతిచండవర్తి
గంధవాహుండు హృష్టారిగాఢభూతి, యతఁడు దక్షిణకాంతరాజుం డగుటఁ దలిపె.
సీ. అతిశీధుమదవికారత మేనులెఱుఁగని కిరటులసఖ్య మప్రాహ్య మనియుఁ
గుత్తుకవిసము వాకునఁదీపుఁ గలపాపజాతితో సఖ్యంబు జరుగదనియు
గలుపాటున ద్రవ్వి కడుపుఁబోసికొని నడి సందతోఁ బొందు నిర్బంధమనియు
నఖిలకంటకసహాయతఁ బెచ్చుపెరిగిన కఠినమూర్తులచెల్మి కష్టమనియు
తే. ధరణి కరి ఫణి కిటి ధరణీశ్వరులఁ ద్రోసి, యప్రమత్తు మహావిశుద్ధాంతరంగు
నాదిగర్భేశ్వరునిఁ గరుణార్ద్రహృదయు, విష్ణుసన్నిభు నన్నయవిభునిఁ జేర. 73
శా. సత్యఖ్యాతి నిధానదానజనితస్వాస్థ్యప్రతిష్ఠాకృతి
ప్రత్యర్థిం బహువేదశాస్త్రపఠనప్రస్తావవర్తిం బ్రజా
ప్రత్యక్షాదియుగప్రమాకృతి కలిప్రారంభుఁ గారుణ్యసం
పత్యత్యాదృతమిత్రుఁ బోలద నుతింపం దద్ధరాధీశ్వరున్. 74
సు. బుధసంభావితమూర్తి నిస్తులకళాపూర్ణుండు నిష్పర్వపూ
ర్వధరాధీశపదప్రవర్తి హితసద్రక్షాచరిత్రుండు దా

వధురాధుర్యుఁడు గర్వభాగరిపుధానందుండు శోభాసుధా
నిధి యారాజిభవైరిపీఠిఁ గొలువుండెం గొల్వుకూటంబునన్. 75

క. ఇనుఁ డుదయాద్రింబలె న,య్యనుఁ డమ్మణిపీఠ మెక్కి యేమని చెప్పం
దనయుల ననయులఁ జెంతం, గనుఁగొని నిశ్వాసవీచికలు గడలెత్తన్. 76

క. చిత్తమునం గలఁగి యిట్లను, విత్తము ప్రాభవము సద్వివేకము పయిసా
పత్తిదము లోకఁడొకండో, కృత్తున నన్నియును గలుగ నేమని చెప్పన్. 77

క. లేదఁట పాండిత్యము చవి, గాదఁట శాస్త్రం బదేటికో నుపుడాఁ జాల్
గాదఁట యేనాఁడును బా, లీదఁట యా ధేను వేరికేలా యేలన్. 78

క. సుకృతంబున గాంచు సొకా, నొకఁడు ప్రియవిభూతి కాంక్ష నుత్తము నతిపా
తకునకు లేఁడైన సులాం, తకుఁడు పుత్రులు వినయము సంపత్తిని నయముఁ గను పుట్టున్. 79

మ. పరమైకాంతికవాస ముష్టము ప్రియాపంధ్యాత్వ మామోదసం
ఘరలాభంబు బుతూచితాభిగమన ప్రారంభవై ముఖ్యమా
పరితోషంబు బలాసుతాప్తి దగు గర్భస్రావమే సొ న్వపుః
పురుషత్వ న్యతిపుత్రు డుత్తముగుణాంభోరాశి లేకుండినన్. 80

ఉ. కావున యుస్సభాపమద గర్వవికారుల మ్ముక్కుమారులం
గేవలనీతిబోధమునఁ గీర్తితమూర్తులఁ జేయువాఁడు లేఁ
డే విమలాత్ముఁ డొక్కఁ డని యెందును నందలపోయ నద్ధర
త్రివిభుఁ జూచి యొక్కఁ డగు తీసురపుంగవుఁ డాసభాస్థలిన్. 81

వ. అధీతనీతిశాస్త్రుండు విష్ణుశర్ముం డనునతండు బృహస్పతియునుంబోలెఁ దేజరిల్లుచు దక్షిణహస్తం బెత్తి యిలాప్రియుదర్శనంబు సేసి సుదర్శనున కుదారస్వరంబున నిట్లనియె. 82

క. పరుసముచేతను లోహమొ, త్కరములఁ గాంచనముఁ జేయుగతి మద్బోధా
చరణమున మూఢమారుల, గురుకీర్తి నీతిపారగులఁ గావింతున్. 83

చ. ఇది నిజ మిందు కొంకు సెలవిమ్మిక నాలొనరింపు మన్ననీ
పదఁ బదమూఁడు నెలలు పనవాసమొనర్చెద నన్న రాజస
మ్మదము వహించి యావిమలమానసు నంతటి వానిఁ గా నెలుం
గుదు నిను వీర ముద్దులొడుకుల్ నయవేదులఁ జేయు మన్పుడున్. 84

వ. అని సమర్పించినం గైకొని విష్ణుశర్ముం డక్కుమారులకొఱకుఁ దంత్రంబు లయిదు
కల్పించి కథాద్వారంబున నీతి గ్రహింపంజేయువాఁ డయ్యె నత్తంత్రనామంబు

లెయ్యవియనిన మిత్రభేదంబును సుహృల్లాభంబును సంధివిగ్రహంబును లబ్ధనా
శంబును నసంప్రేక్ష్యకారిత్వంబును నాఁ బొగడ నెగడు నందు మిత్రభేదం బారం
భించి రాజకుమారుల కతం డిట్లని చెప్పందొణంగె. 85

క. సాహంకృతి బహుమృగకో, లాహలహలహాళిక వనతలంబున నొక నాఁ
డాహాకేసరివృషభ, స్నేహం బొకజంబుకంబుచే వీడ్వడియెన్. 86

క. నావిని రాజకుమారకు, లావిప్రునిఁ జూచి పలికి రనఘా వృషదం
తావళశాత్రవసఖ్యం, బేవిధమున నక్క చెఱిచె నెఱిఁగింపఁగదే. 87

క. అన నతఁ డిట్లను దక్షిణ,మున మహిళారోప్యనామనగరమున నీతికళా
వనరాశివర్ధమానుం, డన నర్థకుఁ డొకఁడు మెఱయు నతఁడు నిజాత్మన్. 88

వ. ఇట్లని విచారించె. 89

ఉ. కొంచక లేనిచోఁ బసిడిఁ గూర్చుట కూర్చినకాంచనంబుర
క్షించుట రక్షితత్వ మడఁగింపక సొంపెసగం బ్రవృద్ధినొం
దించుట దాని నేమరక తీర్థముఖప్రతిపాదితంబుగా
వించుట లెస్సనీతి రసవేదులకుం బలుమాటలేటికిన్. 90

క. పాలింపనిసిరి చోరుల, పాలగుఁ జెడుఁ గూర్పఁగూడఁబడిననిజస్వం
బీలేమి నిష్ప్రయోజన, మా లేమియు కలిగియున్న నతిలోభులకున్. 91

క. పరికల్పితసస్యపరం, పరకుఁ దటాకోదకంబువలె గూర్పం జే
కుఱినసిర యర్థులకునిడు, కొఱకుఁగదా యనుచుఁ దలఁచుకొని యత్నమునన్.

క. ఆవణిజుఁడు నందక సం, జీవక నామముల నుల్లసిలువృషముల నా
నావిధవస్తుధురంధర, మై వెలసినబండిఁ బూన్చి యనుజీవులతోన్. 93

క. ఘనధర్మకర్మసాధన, ధనసంగ్రహబుద్ధిఁ దావు దలరిపురంబుల్
జనపదములుగడచియశో, ధన ధనదాశాభిముఖతఁ దడయక యేగెన్. 94

ఉ. ఆవిధి నేగి యొక్క భయదాటవిలో విషమస్థలంబునం
బోవఁగ వస్తుభృచ్ఛకట భూరిభరంబునఁ బోవ నందు సం
జీవక జానుదేశ మవిసెం బవిసందితశైలశృంగమో
నావడిఁ గ్రమ్మ రక్తమదనప్రదపో నటు నేలఁగూలినన్. 95

క. కాదవపడియెఁ బని యనుచు, న్మదిఁ జాలించాలి వర్ధమానుఁడు దానిన్
వద్దనుండి తునుచునందుల, ను దయాపరతంత్రుఁ డగుచుఁ గొందఱ నిలిపెన్. 96

క. నిలిపి శకటమున నొండొక, బలవద్వృషభమునమర్చి పథమున నవ్యా
కులమానసుఁడై చనియె, న్గలవారలకనికి సేగిగలదే పుడమిన్. 97

ఉ. కావనియుక్తులై యచటఁ గాఁకొనియున్నభటుల్ మతంగజ
గ్రావచరత్తరక్షుభయకంపితులై యటఁబోయి చచ్చె సం
జీవకుఁ డంచు నేలికకుఁ జెప్పిరి చెప్పిన నమ్మువారుగా
కావల నెవ్వరైనఁ గపటాత్ములచిత్తముఁ జొచ్చి చూచిరే. 98

క. భీషణవనమున నాయము, శ్లేషవిశేషమునఁ గుళ్ళి చివుకక యచ్చో
నీషద్రుజలేకమహా, ఘోషవృషంబునను నిరవుకొని కాల్వచ్చెన్. 99

వ. స్వచ్ఛందాహారాదిలాభంబుల హృష్టపుష్టాంగంబున నై యాశాక్వరప్రవరంబు యమునాప్రాంతకాంతారంబునం గ్రుమ్మరుచుండె నక్కాలంబున. 100

చ. కరటులమేల్మదంబణఁచి కర్కశపంచకధూర్తకృత్యము
ల్సెటిచి పరోగ్రఖడ్గపటలి న్నెఱవాఁడికిఁ బాపి క్రొవ్వనం
గుఱువులువారుకంటకులఁ గొండగపుల్గొనఁ దోలి పౌరుషం
బటిమఁ జేఁగ్రాలఁ బింగళకుఁడ న్మృగరాజు చరించు నచ్చటన్. 101

క. హరికి మృగరాజ్య మెవ్వరు, కరుణించిరి తనకు దాన కాదా పరకుం
జరభంజనునకు జలనిధి, సురువిక్రమవైభవునకు నొక రీవలెనే. 102

క. ఆకంఠీరవము పిపా, సాకలుషితహృదయ మగుచు సలిలాశన్ స
త్వాకీర్ణంబగు కాళిం, దీకచ్ఛంబునకు ద్రుతగతిం జనుచుండెన్. 103

వ. అప్పుడననుభూతపూర్వంబై యకాలప్రళయజలధరగర్జితంబునుంబోని యఖండసంజీవకగర్జనంబు పరిసరధరాధరదరీద్వారంబులం బ్రతిధ్వానంబులం బుట్టించిన నాకర్ణించి యశనిపాతకంపితంబగు నీహారాహార్యశృంగంబునుంబోలె సింగంబు వికలితాంతరంగంబై నిలువంబడి యిది యేమిటిది యొక్కొ యిద్దిక్కున నేమియొకో యనుచు మందగతిం జనుచుండె నంత నంతయుం గని దమనకుండు కరటకున కిట్లనియె. 104

ఉ. ఈవడఁజల్లు నెండ గళ మెండ నఖండతరత్వరం బురో
భూవనదుర్గమార్గనవిపుత్రికిఁ బోయెడురాజు వెల్వెలం
బోవుమొగంబుతో నిపుడు పుల్గుటితోఁ జనుచేవ మెత్తఁగాఁ
బోవఁదొడంగె నేమిగతమో గతమోహ యెఱుంగఁ జెప్పవే. 105

క. అనిదంపూర్వపరాక్రమ, ఘనుఁడ సుహృత్కుంజరముల దారుణమదమే
ర్చినయాతఁ డివ్విధంబునఁ, జన ననఘా యిప్పు డేమిచందమొ యనుడున్. 106

క. కరటకుఁ డిట్లను మన కీ, తెరువేటికి నుచితవృత్తి తెరువెఱుఁగనియ
న్నరుఁడు సెడుం భగ్నారస, తరుకీలంబూడ్చి తెగినతరుచరుభంగిన్. 107

క. నావిని కరటకునవసు నరు, కోవిదుఁ డిట్లనియె దమనకుఁడు నీతికళా
శేవధి యాకథ యెట్లు సెప్పు మా విని యెద ననిన నతని కతఁ డిట్లనియెన్. 108

చ. మితరహితారిమండలసమిజ్జయయుజ్జయినీపురంబున
న్వితతవిలాససంభ్రమణవిశ్రుతవిశ్రుతనామిటారి యా
యతనుకటారి కర్కశకుచాంగజితప్రకటారి నృత్తనం
దితశకటారి వారసుదతీమణి యొప్తు నటించు నన్నతిన్. 109

క. రాగరుచిగలుగు దెస నల, భోగినిమయిమణుపుఁ దిగిచి పొడితెమ్మర త్వ
ష్టాగతిదరలింపఁగ సం, భోగంబొసఁగుం భుజంగపుంగవతతికిన్. 110

చ. దినమును దినంబు నిద్రకరుదెంచిన వేడుకకానిగుండె ఝు
ల్లన జననిప్రయత్నమున నచ్చెలి వేఁకున మేలుకాంచి మ
జ్జనవిధిఁ దీర్చి సొమ్ములిడి చందనపుందళుకొంద జాళువా
పని నును గాసెయును నైఱయుఁ బార్వతి సేవకు బోవు కీవిధిన్. 111

ఉ. ఆసఖిచూపుఁ దూఁపుగము లంగములం జెరలింప నాసనో
పాసన శాసన ల్గుదిసి పావనభావనధ్యానంబుల
న్నోసరిలంగరాఁబడిన యోగముఁ ద్యాగము సేసి దీర్ఘని
శ్వాసము నించు శీఘ్రసరసాగ్రజాతహానించుఁ జూచుచున్. 112

చ. చెలి నెఱకీవి దేవిగుడి సేవకునచ్చిన వేళ వీటిలో
గలిగిన కోడెకాండ్రు సిరిగందము కస్తురి మంబరంబు కుం
చెలు ఘృతము ల్గితంబు విరచెండులు పండులు కానుకిచ్చు ర
చ్చలిమలపట్టి కొక్కదినసంబును రా దదిరాక తక్కినన్. 113

చ. నిలివెడువిత్తమిత్తునని నీతికిఁ జాసినఁ గాని పూని య
చ్చెలి కలనేని యు న్నిలుపుఁ జెప్పెద నీతికిఁ దుచ్ఛజాతికిన్
బలితునకున్ విచారపరిపాకవిమూఢునకుం దురుక్తికిం
బలునిసు రోగికిం దురభిమానికి దానికి మద్యపానికిన్. 114

మ. ప్రవసీభూతభుజంగజీవ యాలయాపాజీవ దాక్షాయణీ
భవనశ్రోణి నటించు షోడశఘటీపర్యంత మంతంత మూఁ
డనయామంబున నొక్కనాఁడు ముకుచాయం దివ్వెటి గ్గొల్చి గా
నవధానంబున నింటి ప్రోవఁ గలహంసానూనయానంబునన్. 115

క. నడ తెంచుచుఁ ద్రోవ బడఁ, ల్పడఁ ద్రొక్కిన నెగసి యొరబాగయి ఘనమే
ర్పడ నచ్చెరువుగ నచ్చెలి, కడకా లొకత్రాఁచుబాము గడఁకం గఱచెన్. 116

క. తొలువులన్నాలాకీ, లాలంబులు చెమ్మగింప లగ్నత్వేశా
జ్వాలం దూలి శతుక్రతు, నీలతమో నీలవాల నేలం గూలెన్. 117

వ. అట్లు విషధరవిషంబువం గ్రాఁగి కూలినకూతుం గని శోకించి నిమిషంబునుండక.

చ. ధనికులుగాన దానితలిదండ్రులు జాలెలుచించి యర్థకాం
చనము లవారిగాఁగ వెదచల్లి వసుంధర పేరుకీర్తియుం
గని మనువారలం బరమగారుడమంత్రకులం బొరింబొరిం
గొనిచనుదేర వార లలికుంతలచెంతలఁ జేరి నేర్పునన్. 119

సీ. కాటుపట్టున గత్తివాటులువైచి నిర్విషమూఁది మనకున్న విసివె నొకఁడు
ఘటపూర్ణమంత్రపుష్కరధార లెత్తించి గుణముగానకరోసి గునిసెనొకఁడు
కలితంబుఁగను దోయిఁగదియించి బ్రదికించుద్రోవ దుర్ఘటమైనఁ దొలఁగెనొకఁడు
పసరునెన్నడు నెత్తిఁ బ్రామి బెత్తమున నిట్టటుమోఁది పనికిరా కరిగెనొకఁడు

తే. కదియఁబడియున్న కౌడలఁ గాలుజొనిపి, పాయఁబడఁజేసి తగుపాటి పలుచనైన
యౌషధీసాధములఁ బోసి యవియులావు, సేయుకుంజిన నొకఁడు లజ్జించి చనియె.

క. అప్పాట విషచికిత్సకు, లొప్పనివదనములతోడ నొండెవ్వరికిం
జెప్పక వచ్చినచొప్పునఁ, దప్పక పోవుటయు నాసుదతితలిదండ్రుల్. 121

ఉ. కాంచనపుత్రి నెత్తుకొని క్రుష్టిపోయి శివానివాసముం
దుంచి నమస్కరించి యడలూఱఁగ నిట్లని విన్నవించి రో
పంచముఖప్రియా పడుచు ప్రాణము వచ్చిన మంటపంబుఁగ
ట్టించెదమమ్మ నిన్నుఁ బురుడింపగలేరుగదమ్మ వేలుపుల్. 122

చ. తరువుగదమ్మ మామనవి తానకపాదయుగంబు దేవతా
తరువుగదమ్మ యీపడుచు దక్కకపోయినఁ గన్నమాకును
త్తరువుగదమ్మ నీవరువుదానికి నిట్టియవస్థవచ్చుట
చ్చెరువుగదమ్మ మమ్ము దరిఁజేరుపుమమ్మ త్రిలోకమాతృకా. 123

చ. అని తనువేఁడి పాడి నెగులారక వారకయేడ్చువారలం
గని గిరిజాతజాత సుముఖత్వమున న్గడకంటిచూడ్కిఁజూ
చిన నపుడేమి చెప్ప నటఁ జేడియ నిర్విషయౌచు నిద్రమే
ల్కనినవిధంబున న్దెలిసి కౌతుకసంపదఁదేల్చె నాప్తులన్. 124

క. దేవీవరమహిమంబున, జీవితయగుపుత్రిఁ గొనుచు గృహమున కానం
దావిలలీలం జని రా, జీవేక్షణ కిడిన మ్రొక్కు చెల్లించుటకున్. 125

గీ. అల్లన త్రకదంపతు లతులమతులఁ, బవనభుగ్భూషగృహిగృహప్రాంతమునకు

వవనిజంబుల దెప్పించి రందులోన, స్థూలతరుకీలమగు నొక్కదూల మమరు. 126

ఉ. ఆనగగోపకంఠవనికావనజాతలతాచరన్మహా
వానరయూథ ముద్దవడి వచ్చి యొకానొకవేళ దారుణో
ద్భావనటనంజొనర్ప రభసంబున నందొకక్రోఁతి యంత నా
హా నవలాఘవంబునఁ గృతాంతవశంబున దూల మెక్కుచున్. 127

క. వాలం బల్లార్చుచు నిరు, గేలం బిగియూఁచబట్టి కీలము వడి ను
న్మూలింప నిటికికొనియె, నీవ్రిలివయద్దారు వృద్ధవిడి ముష్కములున్. 128

క. ఇటికెవ విప్రతాస్యంబై, యొఱలుచుఁ బొరలు న్వడంకు నులుకుఁదలంకున్
మరలుం బడు లేచుం గపి, యురిఁ దవిలినపులుఁగుపోలె నుడుగనియంతన్. 129

క. ప్లవగం బట్లలమటి మే, నవశంబగుటయుఁ ద్యజించె నసువుల నుచిత
వ్యవహార క్రియఁదెలియని, యవివేకికిఁ జేటువొందదా యొందైనన్. 130

క. హరిభుక్తశేషతరసం, బిరువురకుం గలదు చాలు నీపాటివృథా
పరచింతలేటి కన విని, గురుమాయాశాలి దమనకుం డిట్లనియెన్. 131

క. తనవారిఁ బ్రోచుటకు నొం, టనివారి వధించి వైచుటకుఁగా నృపులం
బనివడికొలుచుట లే కె,వ్వని కెద్దడి వృత్తై నన్నవస్త్రంబులకున్. 132

చ. అతివిరసత్వసత్వకుణపాదికపారణసారమేయ మూ
ర్జితజఠరాగ్ని శాంతియొనరించు సముచ్ఛ్రియ కృఛ్రి సంకుల
స్థితివెగడందియు న్వేదకి సింహము మత్తకరింభుజించు నే
గతులబలానురూపఫల కాంక్షులుగా ధర నెట్టివారలున్. 133

చ అనుగతియుం గటీచలనమగ్రపదభ్రమణంబు వాలచా
లనమును భుక్తశేష కబళప్రదుఁగూర్చి యొనర్చు వేఁపి చ
య్యన బుధసాంత్వనోక్తి శతకాయుతసంఖ్యలఁగానిభుక్తికిం
దనకరమీదు కుంజరవతంసము నెట్టన నెట్టకేఁకున్. 134

క. తను లోను లభినుతింపఁగ, మనఁగఁగలిగినమని? నిమిషమాత్రమెచాలుం
దనివిసనం బ్రేతాన్నముఁ, దిని యూరం గాకి బ్రతుకదే వేయేఁడుల్. 135

క. ఘనవిద్యావిక్రమజం, బనఘుండై కుడుచు నెవ్వఁడతనిదివో భో
జనము పశుశిశు ఖురంబు, ల్దిను గొలేయకము దానిదియుఁ గుడుపగునే. 136

క. అల్పమునవిండు శశపద, మల్పంబునవిండు మూషకాంజలికులు వెం
చల్పమునవిండుగుపురుషుఁ, డల్పమునం బూర్ణుఁడగు మహాత్ముఁడు గామిన్. 137

క. శ్రుతిశాస్త్రప్రకరబహి, ష్కృతము నయానయవివేకరిక్తము కుక్షి

స్థితిజాగరూక మేయున్నతిఁ జెపుమా మనుజపశువునకుఁ బశువునకున్. 138

క. కసవుదినుఁ గూడుదెమ్మని, కసరదు బరువిడిన మోయుఁ గర్శనమునకున్
విసువదు మారొడ్డాడదు, పసరమునకుసరియె మనుజపశు వెప్పటికిన్. 139

క. అన విని కరటకుఁ డతని, న్ననుఁగొని యిట్లనియె దమనకా విభునకుఁగ
ల్గినదండనాథులము దగ, మన కీవ్యాపార మనభిమత ముడుగదగున్. 140

వ. అనిన దమనకుండు. 141

క. పరమస్వతంత్రులయిభూ, వరుసన్నిధి మంత్రులుండవలె నమ్మంత్రుల్
పరతంత్రులయినఁగలవే, పురుషార్థము గౌరవము ప్రభుత్వము యశమున్. 142

క. గ్రావాగ్రమునకు భూరి, గ్రావం బెక్కింప భరముగా దది ధరకున్
ద్రోవఁ బ్రయాసమె యున్నతి, కయివలెబా టధమవృత్తి కది యేమిటికిన్. 143

క. తనకున్ హృదయము వశమై, యనుచరుచందమున నుండు నది యేమియొకో
మనుజుఁడు గౌరవమొల్లక, ఘనలాఘవదంశితుండుగా నీక్షించున్. 144

క. అనిచెప్పి మఱియు గరటకుఁ, గనుఁగొని దమనకుఁడు పలికెఁ గంటే పంచా
ననసార్వభౌమునకు నా, నవమొప్ప దిదేమికారణము నేఁ డనుచున్. 145

క. అదివిని కరటకుఁడు మదిం, గదిరిన యచ్చెరువున న్మొగము జూచి యహో
యిది నీ వేతెఱగున నెఱుఁగుదు వన నాయనకు దమనకుం డిట్లనియెన్. 146

మ. మతినేనిచ్చినఁగానిలేదు చన దాత్మశ్లాఘనామానసం
బితరాకారవిచేష్టితార్థముల నూహించు న్ధరిత్రిం బశు
ప్రతతుల్నేర్చు నుదీరితార్థముల దిక్ప్రఖ్యాతమేధాసమ
న్వితుఁడై పత్రిలు పండితుం డకట వానిం బోలఁడే చెప్పుమా. 147

క. చతురుఁడుగనుఁ బతిచేష్టా, గతిఁ దెలిసితినన్న నతఁడు కాఁగా నోప
మ్మతిగాదునాకు సేవా, స్థితినీకెఱుకపడుఁ గుశలచిత్తములేమిన్. 148

వ. అని కరటకుండు పలికిన దమనకుం డతని కిట్లనియె. 149

క. భూషింప మెచ్చు లోకము, దూషింపం జంపఁజూచుఁ గుది నదె విద్వ
ద్భాషితుని నన్ను నేలా, దూషించితి వైన నేరుతుం బతిఁగొల్వన్. 150

క. నృపసంశ్రయమున నా కతి, నిపుణతయేవలనలేదు నీవయనియెదో
యిపు డెవ్వారెని శత్రుం, తప యోరిమిలేక యనియెదరొ ననుఁ జెపుమా. 151

క. అను దమనకునావనము, న్గనుఁగొని కరటకుఁడు పలికెఁ గాదా మును నీ
పనవసరంబునఁజనవో, కినుక న్నిను విభుఁడు గోపగింపఁడొ నెఱయన్ 152

సీ. ఆఁకొని భుజియింప నరుగువేళ నొకింత యొడలికి సుఖఘాత మొదవినపుడు

భూరినిద్రాభరంబున సోలునెడఁ గులస్త్రీలతో నలిగి విచ్చేసినతఱి
రతికి నుర్వీభ్యాళుఁగతి శరక్షతుఁడైన యవసరంబున వేఁట లాడి యలసి
ధరణీరుహచ్ఛాయ లరయుచోఁటఁ బిపాస సలిలమన్వేషించుసమయమునను
తే. మజ్జనంబాడుపట్టున మౌననియతి, నర్ధమీలితలోచనుండై పురాణ
పురుషు ధ్యానించునకాలమున నృపాలుఁ, జేరరాదండ్రు తద్జ్ఞులు సేవకులకు.
క. మఱచితివే యన దమనకుఁ, డెఱుఁగుదునను జీవధర్మ మిట్టిద భటుఁ డే
తెఱఁగున నేనియు నరవరు, కుఱఁగట రేపగలు గాచి కొలువఁగవలయున్. 154

క. అతి కంటకుఁడైన విసం, గతుఁడైన గుజాతుఁడైనఁ గానీ లతలున్
సతులు ధరిత్రీపతులం, జితవైరీ యల్లికొండ్రు చేరువనున్నన్. 155
క. కోపప్రసాదచిత్త, వ్యాపారము లెఱిఁగి కొలిచి వర్తిల్లుభటుల్
భూపాలబాహుశాఖా, రోపితులై యుండ్రు చనవు రొక్కం బగుటన్. 156
క. అన విని కరటకుఁడు దదా, ననము నిరీక్షించి పలికె నయ తత్త్వనిధీ
వినవలతు నాదరంబునఁ, దన కిఁక నీవేమి చెప్పెదవు తరువాతన్. 157

క. విత్తునవిత్తుం బలెఁ బ్ర, త్యుత్తర ముత్తరమువలన నుదయించు భవ
చ్చిత్తము నీతికళాసం, పత్తికిఁ బుట్టిల్లు గాదె పరికింపంగాన్. 158
వ. అను కరటకు పలుకు లాకర్ణించి యతం డిట్లను నీతిపోషణంబులు దుఃఖశోషణం
బులు గావె భవద్భాషణంబులు నప్రాప్తకాలవచనం బెవ్వరికి నశుభంబుఁ జేయదు.
క చతురలవలె నృపసేవా, వ్రతులను నప్రాప్తకాలవచనంబు బృహ
స్పతియంతవాఁడు బలికినఁ, బ్రతివీరధ్వంసి హాస్యపదనిరతుఁ డగున్. 160
వ కావున దేశకాలేంద్రియ పరిపక్వంబు లెఱింగి యుచితజ్ఞుఁ డగునతండు విన్నపంబు
చేసికొని నిజప్రయోజనం బీడేర్చుకొనుచు. 161
క. తనకే విద్యాభ్యాసం, బున ముఖ్యఖ్యాతిలాభములు సిద్ధించున్
ఘనతరముగఁ గులపురుషుం, డనఘుండయి నేరవలయు నాసద్విద్యన్. 162
క. కలగుణరూపప్రజ్ఞా, బలములచే నేమి వానిఁ బ్రకటింపరు భూ
తలపతులు సములు విషములు, దలపోయ నఖర్వపర్వతంబులభంగిన్. 163

క. కావున నవనీవల్లభు, లేవిధమున నుండి రేమిహితబుద్ధిన్నే
వావృత్తి నూది వర్తిలఁ, గావలయు న్భటుల కనినఁ గరటకుఁ డంతన్. 164
క. అగు నగుఁ బోపొమ్మెప్పని, మొగమున నున్నాఁడు రాజు మెప్పొలకుఁ దేర్పం
దగుతఱి మేలయ్యెడునో, సుగుణీ నీకనిన నతఁడు సొం పెసలారన్. 165
చ. మెలపునఁ జేరనేగి ప్రణమిల్లి వినీతత నిల్వఁ జూచి పిం

గళకుఁడువల్కె నోదమనకా చనుదెంచితివేమి నావుడు
జ్వలమతి నాతఁ డిట్లను భవచ్చరణంబులఁ గొల్వవచ్చితి
న్నెలసము దీనికంటెఁ బరికింపఁగ నెయ్యది నాకుఁ జెప్పుమా. 166

క. సచివకుమారుఁడ వగునా, కుచితములగుపనులు గలిగియుండుఁగదా నా
వచనము విన దేవరకును, రుచియగుఁగద కార్యతత్పరుఁడఁగద మొదలన్. 167

మ. శ్రుతికండూయన రుక్ప్రశాంతియొనరింపుం దంతనిర్ఘర్షణ
క్షితికిం జాలునఖాగ్రభిన్నయవసచ్ఛేదంబు విశ్వంభరా
పతికార్యంబుల నప్రయోజకుఁడె ప్రాప్తజ్ఞానచాతుర్యశౌ
ర్యతతోపాయన యప్రియాలపనమేధాకారశీలుం డిలన్. 168

చ. పరమశుచి న్సమిద్బలు నపారమహోమహు నుత్సవక్రియా
సిరు నిరసించి క్రిందుపడఁజేసినఁ గ్రిందుపడంగనేర్చునే
కెరలి యొకప్పు డేని దలక్రిందుగఁబట్టిన నూర్ధ్వకీలుఁడై
దరికొన కంబుసంభవుఁ డపశ్శిఖుఁడై నశియింపనేర్చునే. 169

చ. హాలికుఁడు విత్తు చేనఁబడునప్పు డెఱుంగఁడు చాలు చక్కనై
తలకొనఁజూచి మంచిదిగ దాయనుఁ బిమ్మట నట్లు రాజు సొం
పలరఁగఁ గూర్చునప్పుడు భటాలి నెఱుంగఁడు ప్రస్తుతంబున
న్నెలసముఁబూని నిల్వఁబరికించుఁ బ్రయోజకుఁ డంచు నెంతయున్. 170

తే. గీ. అతిశయస్థానయోగ్య సింహాసనమున, నునుమవిశ్వంభరావల్లభునకునింద
మస్తకోచితకోటీరమండనములఁ, గాళ్ళఁదొడిగినయమ్మర్త్యుఁగఁ బటిమయనరె. 171

ఆ. వె. అధమవృత్తి కధికు నమరించుపతి దిట్టుఁ, గుడుచుఁగాదె యారకూటకటక
కలితమణికి నిందగాద పొనర్చిన, వుత్సితుండు నిందఁగుడుచుఁగాని. 172

క. శిరమున మకుటము రశనా, భరణము కటి నూపురంబు పదమునఁ బోలెన్
గురుబంధుభటులనిల్పు న, మరును త్తమ మధ్య మాధమస్థానములన్. 173

చ. పురుషవిశేషలీల విరిబోఁడియు వాలువిపంచిశాస్త్రమున్
దురగము వాణియు న్నరుఁడు దొడ్డతనంబువహింతు రట్ల కా
పురుషవిశేషలీల విరిబోఁడియు వాలువిపంచి శాస్త్రముం
దురగము వాణియు న్నరుఁడు దొడ్డతనంబువహింప రుర్వరన్. 174

వ. ఇది సృగాలమాత్రంబు దీనిచేత నేమి యని నన్నవజ్ఞ సేయకుము. 175

క. హరిసూకరరూపంబున, హరిణాదిమృగాకృతుల మహార్షులజంబయి
హరిసుతుఁడు పూజ్యులైయుం, డర వారలగౌరవంబు గరిమవడియె నే. 176

వ. అశక్తుండయిన భక్తుండును భక్తిలేనిశక్తుండును నప్రయోజకులు ద్యాజ్యులు నేను బరమభక్తుండ శక్తుండ నత్యాజ్యుండ నన్ను గౌరవము సేయుము. 177

చ. పతినయదూరుఁ డైనభటపంక్తియు నీతికిఁ బాయుఁ దత్ప్రధా
నత బుధులుండరా బుధజనంబులులేమి నధర్మ మూర్జిత
స్థితిఁగను నయ్యధర్మమునఁ జేసి యఘంబులుపుట్టు వానిచే
నతులవిపద్దశ ల్వొడము నవ్విపదాయతిరాజ్యము జైడున్. 178

వ. అని దమనకుండు పలికినఁ బింగళకుండు నతనిం బ్రసాదపురస్సరాలోకంబుల నాలోకించి. 179

ఉ. వాసికి వన్నెకుం దగినవాఁడవు రాజ్యమునీనయంబునం
జేసెదఁగాదె నిన్నడప సేవకులెవ్వరునాకుఁ బెద్దవి
శ్వాసము నీయెడంగలదు శక్తుఁడు భక్తుఁడు నిన్నుఁబోలఁడో
హో సఖ విన్నవై వదనమొప్పక వచ్చితి వేమిచెప్పుమా. 180

క. నావిని దమనకుఁ డను దే,వా విన్నపమొకటి వారివాంఛ న్వడిగాఁ
బోవుచునిలిచితి విదియే,లా విన్ననిమోముతోఁ గలంగినమతితోన్. 181

వ. అనివిన్నవించిన దమనకునకుఁ బింగళకుం డిట్లనియె మచ్ఛరణ్యం బగునియ్యరణ్యం బపూర్వసత్వాధిష్ఠితంబయి యున్నయది యట్లగుట చిత్తచాంచల్యంబుఁ బుట్టించుటయు దానంజేసి యంగవైకల్య మావిర్భవించె నెట్లనిన విలయసమయసముజ్జృంభమాణ పుష్కలావర్తకవిధంబున శబ్దగ్రాహకంబులకు నధికతాపం బొనర్చుచున్నయది యద్దిక్కున నొక్క యపూర్వదుర్వారఘోషంబు వీతేర నాకర్ణించితి మంత్రప్రతిబద్ధశక్తి యగుఫణాధరంబువిధంబున ప్రుక్కితి నీవాకర్ణింప వొకో శబ్దానురూపబలమహత్త్వం బగుసత్వం బచ్చోటఁ గలిగియున్నది మదీయరాజ్యంబునకు హాని వాటిల్లకుండునే యని నిట్టూర్పునించు నప్పంచాననునకు దమనకుం డిట్లనియె. 182

క. జలముల సేతువుబెడిదపుఁ, బలుకుల భీతుండు చెనటిపాడిం జాతిన్
జెలిమిరహస్యమొనర్పం, దలఁపనిపని చెడు నిగూఢతరమంత్రంబున్. 183

క. నీతెరు వనిలచరన్మహి, జాత లతాఘాతభగ్నసంగరభేరీ
జాతరవశ్రవణమహా, జాతరహ్మజీర్ణజంబుకముకథ యయ్యెన్. 184

క. నావిని పింగళకుఁడు నయ,కోవిదు దమనకునిఁజూచి గుణరత్నసము
ద్రా వినియెద నీకథఁజెపు, మా వాచాపాటవం బమర నా కనుడున్. 185

క. దమనకుఁ డిట్లను పరవి, క్రమవిక్రమసింహపుడనికటపటకాంతా

రమున నొకనాఁడు గాఢ, క్రమమున నే నరిగి తిరుగఁ గాఁ గన్పట్టెదురన్. 186

ఉ. జన్యముకాంతకుంతపరుషక్షతిపాతి బృహద్వపాళిరా
జన్యము హస్తిమస్తతరసక్షతజద్రవలుబ్ధదైత్యదా
ర్జన్యము భానుభేది ఘనసాహసపూజనరాజమానప
ర్జన్యముఁ జూపెఁ బర్యుషితసామజవిస్రసమేతవాతముల్. 187

చ. కదన మొకింత చేర నరుగ న్విలుగంబడి యున్న శేరులం
బ్రిదిలుటలేనియేనుఁగులు బెంటలుగొన్న జిరాల్గురాలు పె
న్గురుడిపోని నెత్తురులు గాఢపుకెంపలఁ గ్రాఁగి చిక్కనై
పొదలు మెదళ్లు నాంత్రముల ప్రోవులుఁ జూచి ప్రహృష్టమూర్తినై. 188

వ. మఱియు నక్కలను సమున్నాళీపుండరీక వ్యాకీర్ణం బగుటఁ గాసారంబును నఖండఫలకాండమండితం బగుట నారామంబును నమోఘప్రాసవిలాసం బగుటఁ గర్ణాటక ప్రబంధంబును ననంగవిహారయోగ్యం బగుట మధుమాసంబును దప్తకబంధవాహినీబంధురం బగుటం గ్రీష్మసమయంబును నవ్యక్తతారకవ్యూహం బగుట నహర్ముఖంబును బహుద్విజవిరాజమానం బగుట యాగంబును ననాత్మజ్ఞపాదంపరీసంపూర్ణం బగుట గంగానిలయంబును విభాగీకృతచరణంబు గావున శ్లోకపఠనంబును గర్ణశల్యసైంధవభీష్మదుర్నిరీక్ష్యం బగుట సుయోధనాయోధనంబును బ్రయుక్తశక్తిపాతనిర్ఘాతధరాధిక ప్రాగల్భ్యం బగుటఁ గుమారసమారంభంబును నవఖండమనోహరం బయి యోషాభాషావిశేషంబును రసాభిసుప్తపురుషోత్తమం బై శరత్కాలంబును ననుకరించె నప్పుడు. 189

క. దూరప్రాణధురీణము, హోరణమున నేమిచెప్ప నాశ్చర్యకరం
బయిరోదసితో విను మొక, భేరీనినదంబు కర్ణపిశిత మగల్చెన్. 190

తే. భయము దోస్తోప ముక్కునబంటి యయ్యెఁ
గెరలు జఠరాగ్ని గుములుచుఁ "గింకరోమి
యాగతోస్మి క్వయాస్యామి" యని యడలితిఁ
బలలపారణకరుగంగఁ బొటుగామి. 191

ఉ. ఎంచినభీతి మే న్వడక నేనొక యించుకసేఁపు బుద్ధిశం
కించి యిదేమి యొక్కొ పరికించెదఁగా కని చేరి ముందర
న్గాంచితి వాతపోత పరికంపితభూజలతాహతి న్దిశ
ల్సించురవంబునీను నొకజీర్ణసమిద్ధతభేరిఁ జేరువన్. 192

సీ. కనుఁగొని చర్మసంగత దారువుగ నిశ్చయించి మెల్లన నంఘ్రిలిడుచు నరిగి

కదిసి తద్భేరీముఖము వ్రచ్చి లోపల నరయ నిర్మాంసమగుట మేను
పొదలఁ జేసెనామహాభోజనం బని చని పడి మేనుమఱచి నల్గడలుసూచి
కరట గృధ్రోలూకకంకాదుల శవామిషాదులఁబోలి నేనాఢ్యలీల

తే. దంతిపలల మశ్వతరసంబు శాక్వర, క్రవ్యముష్ట్రి మాంస ఖండ కాండ
మొలసి యున్న నరులపాలయును దిని గాఢ, కౌతుకమున నుంటిగాఁదె తొలుత.

వ రన శ్రవణమాత్రంబున నేమి తెలిసికొని నిర్భయుండ వగుము శబ్దం బేదిక్కున
నాకర్ణింపంబడియె నద్దిక్కునకు నన్నుంబనుపు మంతయుం దెలిసి వచ్చెద ననుట
యుఁ బింగళకుం డట్లచేయుమనియె నట్లు నియుక్తుండై దమనకుండు సకలమృగ
సంచారఘోరం బగు యమునా ప్రాంత కాంతారంబున కరిగి పురోభాగంబున. 194

ఉ. చేవఁ జిగుర్చుశృంగములు శృంగములం బ్రకటింప భూరిశో
భావహనైకపాదములు పాదముల న్దలఁపింప జంగమ
గ్రావముభంగి భానుభవకచ్ఛమున న్విహరించువాని సం
జీవకుఁ గాంచి మ్రొక్కి నిలిచె న్మృగధూర్తకుమారుఁ డయ్యెడన్. 195

వ. అట్లు వినీతత్వంబు నెరపి కైవారంబుసేసి యతనిచేత నాగమనకార్యం బడుగం
బడినవాఁడై. 196

చ. హృదయముపల్లవింప నతఁ డిట్లను నెంతయు సమ్మదంబునం
బొదలుచు నీసమాగమము పూర్వము నీ కెనయైనవానితోఁ
గదిసి యఖండసఖ్యమునఁ గాలమతీతముగా నొనర్ప కి
న్నదిదరి నొంటి నుండఁదగునా మృగనాథులు లేర మైత్రికిన్. 197

చ. అనఘచరిత్ర పింగళకుఁడ న్మృగరాజిటనుండు నమ్మహా
ఘనుని ప్రధాననందనుఁడగా నను బుద్ధినెఱుంగు నీవు నా
యనకు ఘటింతు మైత్రిసమయం బిదె న న్బనిఁగొమ్ము మా హితం
బనలము గూడినట్లయగు నాతఁడు నీవును జెల్మి సేసినన్. 198

క. అన విని దమనకునిఁ గనుం, గొని సంజీవకుఁడు పలికె గొబ్బున మరలం
జని చెలిమిసేయుమా మా, కనుకూలత మెఱయ మీమృగాధిపుతోడన్. 199

క. పొమ్మన నెమ్మనమలరం, గ్రమ్మఱ మృగధూర్తకులశిఖామణి చింతా
సమ్మూర్ఛితాకృతింబడి, నమ్మేర న్గాంచి వినతుఁడై నిలుచున్నన్. 200

క. కనుఁగొని పింగళకుం డి, ట్లను సనయా మంత్రితనయ యచ్చోటికి నా
యనుమతిఁ గైకొనిపోయిన, పనియేమియొనర్చితనినఁ బలికె నతండున్. 201

క. పోనపోనఁ గానపు దేవర, పనుపునఁ జని యచటఁ గంటిఁ బ్రళయాంతరపు

ధ్వననినదు గోత్రగిరినిభ, తనునభ్రంకషవిషాణధరుఁ గట్టెదురన్. 202

వ. భవత్కర్ణశూలాయమానం బగునప్పటిభయంకరధ్వానంబు నిన్ను నుద్దేశించి చేయుటగా నెఱుంగుము. 203

క. అలఁతులఁ బొరిఁ గొనరు మహా, బలు లాహో ఘనులఁగాని పవమానుఁ డిలం
బిలువెఱుకునె బహుశాఖా, కులగగనస్పంది వృక్షకోటులుదక్కన్. 204

క. ఈదృశబలవంతుని నీ, పాదముల కుపాయనంబుఁ బట్టెద లేదా
నా వెసనిచ్చిన నిర్మ, ర్యాదప్రేమమున సింహ మాతని కనియెన్. 205

క. నీ వనఁగ నంతవాఁడవె, కావా సంరావభిదురఘాతంబున ధై
ర్యాళి నగల్చిన యబ్బలిఁ, దే వేగమె యనిన నతఁడు దెచ్చె న్వచ్చెన్. 206

క. వచ్చినసంజీవకునకుఁ, బొచ్చెములేక లమృగాధిపుఁడు సౌహార్దిం
బచ్చుపడ నెదురుసని కొని, తెచ్చి సదృక్షాసనప్రతిష్ఠితుఁ జేసెన్. 207

తే. తనువుఁ బ్రాణంబువిరియునుదావిభాను, డాతపముఁ బోలె నలమృగాధ్యక్షుఁ డతఁడు
పాలునీరును గూడిన పగిది నుండి, రతిశయస్నేహమునను నయ్యడవిలోన. 208

వ. ఇట్లు పింగళకసంజీవకు లన్యోన్యప్రసన్నస్నేహప్రవర్ధమానులయి యొరుల కవకాశంబీక యేకగ్రీవంబయియుండ ననుజీవులు పొలపెట్టులేక యాఁకట నాకట నొంది యొండేనియుం బోవ దాపదిపడిన నచ్చెట్టకపంతం జింతిలి దమనకుండు కరటకుఁ జేరంబోయి నిట్టూర్పునిగిడించి తలనంచుకొనిన నతం డతని నాలోకించి.

చ. దమనక యోపలేననిన దప్పని యిప్పను జెట్ట నీనిమి
త్తమున జనించెగాదె పతిదండకుని న్నొరు లేగుమంచు హ
స్తముఁ దెమలించిరో కుడిచి సమ్మతినుండఁగ దైవమిచ్చునే
సమకొని వీరి కిద్దఱికి సఖ్యము సేయకయున్న పోగదే. 210

ఉ. యెవ్వ రటుండి రేమి మన కేమి ప్రయోజన మంచు మున్ను నే
నవ్వలఁ జూటిమోపి పతినారయునప్పుడు నీకుఁ జెప్పనే
యవ్వచనంబు లిప్పుడు యథార్థములాయెగదా భుజించువా
రెవ్వరు నీవె కాక మఱి యేమనలేక స్వయంకృతాగమున్. 211

క. చేసినయంతయుఁ దడయక, చేసేతం గుడువుమనినఁ జింతానలకీ
లాసంతాపితుఁడై మే, ధాసంగతుఁ డతనిఁ జూచి దమనకుఁ డనియెన్. 212

క. కృతకేతరవచనంబుల, గతి నీపలుకులు యథార్థకథనంబులు నా
కతమున నకటా యీాదు, స్థితివుట్టెం దీని కేమి సేయఁగవచ్చున్. 213

ఉ. ఈతటి నక్కవెక్కసపు టేఁడిక కయ్యము చేతఁ దొల్లి చే

సేతఁ బరిగ్రహించి యతిశిష్యునిచే నొకనేఁతకానిచే
దూతికనొచ్చె నాత్మకృత దోషమునన్నద నావు డుల్లస
త్కౌతుకవల్లిపల్లవిలఁ గా నతఁ డాతనిఁ జూచి యిట్లనున్. 214

క. అది యెట్లు విస్తరింపం, గదె యాకర్ణింతు సకలగాథాబోధా
స్పదహృదయ యనుడు వికస, ద్వదనుండై కరటకునకు దమనుఁ డనియెన్. 215

క. యువనాశ్వ నగరమునఁ గే, శవశర్మ యనంగ నొక్క సన్యాసి మఠం
బవలంబించి యశిష్య, ప్రవరుండై యుండె భైక్ష్య భక్షుఁ డగుచున్. 216

క. కల దాసన్యాసికి బహు, కలధౌత సువర్ణపూర్ణ కంథసదా యా
బ్బలుగుయతి మరపు మోసము, గలవేనియు లేక దానిఁ గని రక్షించున్. 217

తే. స్నాన మొనరించునప్పుడు జపము సేయు, నప్పుడు కరపాత్రమున భిక్ష మడుగునప్పుడు
పండునప్పుడును బొంతపై నుంచు మనసు, పదగఱచినబూరె యబ్భిక్షునకును. 218

క. చిరకాల మివ్విధంబున, నరిగిన నాషాఢభూతి యను ధూర్తధరా
మరసుతుఁడు సేరి కంథా, హరణేచ్ఛ న్యతికి శిష్యుఁడై సేవించెన్. 219

ఉ. ఆయతి యొక్కనాఁ డొక గృహంబునకుం దగ భిక్షచేసి రాఁ
బోయిన వాఁడు వెంబడినె పోయి భుజించి మఠంబుఁ జేరి యా
చాయ నిజోత్తరీయపరిసక్తతృణాగ్రము గాంచిపట్టి నా
రాయణ కృష్ణ యంచు గురుఁ డద్భుతమందఁగ మ్రొక్కి నెవ్వగన్. 220

క. వెలవెలనిమోముతో మఱి, యలుఁగొందఁగ గురునిఁ జూచి యెవ్వారి కెందుం
గలుగనికలుషము నాకిదె, గలిగె నయో యిట్టిపాపకర్ముఁడ నొక్కో. 221

క. అని మడమలు మోపక నడఁ, జని కపటవిచారశీలుఁ జపలాత్ముని శి
ష్యునిఁ దిరుగఁ బిల్చి మదిఁ గ, ల్గొనినమహాద్భుతముతోడ గురుఁ డిట్లనియెన్.

క. నిను నేకలుషము పొందెన్, జనఁ గారణమేమి సరభసంబున నాతో
వినిపింపు మనినఁ దత్పద, వనజంబులవ్రాలి యతికి వాఁ డిట్లనియెన్. 223

క. గురునాథ నిన్ను భిక్షా, గరిమంబునఁ జాలఁ దృప్తుఁ గావించినభూ
సురునింటిపూరి నసనో, పరిదవిలెం దీని కంటెఁ బాపముగలదే. 224

గీ. మగుడ నీపూరిపుడకఁ దన్మందిరమునఁ, గూర్చి క్రమ్మఱ నిష్పాపతకుండ నగుచు
వచ్చి సేవింతుఁ ద్వత్పాదవనరుహములు, భక్తి నామీఁద గలదేనిఁ బనుపు మటకు.

క. పావనుఁడఁ గాక యేవిధి, సేవించెద నిన్ను నోవిశేషవిధిజ్ఞా
నావుడు యతి విస్మయసం, భావితుఁడై వానిఁ జూచి పలికెం బ్రీతిన్. 226

చ. కలుషములేదు పూరిపుడకన్ ధనమో కనకంబో చీరలో

వలదటుపోవ నిల్వ మన నాఁడు కృతాంజలియై కనుంగవం
జలజలనశ్రువుల్దొరుగ సన్నుతిఁజేసి యతీంద్రు నివ్విధిం
బలుకకు మెట్టులేనిఁ దృణభంగము నేఁ డట వైచివచ్చెదన్. 227

క. నావిని యతిబంధువుఁ డతి, పావనుఁగా వాని నగచి పనిచె నతండున్
వేవేగ నరిగి తృణమొక, చో వైచి భజింపఁ దొంటిచొప్పున నచ్చెన్. 228

వ. ఇట్టి యుపాయాంతరంబుల సంత్యక్తపరప్రత్యయస్థితికి విప్రతిపత్తిగలుగకుండఁ గొండొకకాలంబు నప్పుడిరిగిన నెళవెఱుంగక నేయిపూసినకత్తి యగుటఁ దెలియక గోముఖవ్యాఘ్రంబగుట విచారింపనేరక యత్తులువం బరిగ్రహించి వసుగర్భ యగు కంథఁ జేతికిచ్చి యలుఁగులఁదిరుగుట గజంబును నవువులఁ బెంచుట మారుతభుగ్దష్టుని భువనవికారంబగుట నగజారమణుని విలాసభాసమానంబగుట వెలయాలిని దుర్గాభైరవపాలితంబగుట నవిముక్తస్థలంబును సరసంబగుట విద్యుత్ప్రబంధంబును ననుకరించి యచ్చెరువుసేయు చెరువునకు ననుష్ఠానార్థియై చనియె నయ్యవసరంబున. 229

క. అప్పాపజాతి మస్కరి, యెప్పుడు దనచేతికిచ్చె నేమిటి నుత్రి వాఁ
డప్పుడపోయె ఘనంబుగఁ, గప్పినతమి కంథనొండుగంత గ్గానుచున్. 230

క. బొంతగొని నిజనివాసము, పొంతకు నాపాషభూతిపోవుట మదిలోఁ
జింతింపక నికటతటా, కాంతమునకుఁజనిన యాతని యతిఁగన్గొనఁగన్. 231

సీ. కఠినశృంగాగ్రసంఘటితలోహపలాశఘళీఘణాత్కృతులనక్రములు బెదర
నన్యోన్యసంపాతహతి ప్రస్విన్నఫాలభాగమున శోణితము ముచ్చి కటుడుగట్టఁ
జించికాంగారరోచిర్ధురాఘోరేయ నేత్రాంతముల గొప్పనిప్పు లురుల
ఖురశిఖాటంకసంక్షుభితగోత్రోత్థితధవనిరేణువుల నీరసలు గాఁగ

తే. గళవినిర్గతఘోరభూత్కారనినద, మమితకాదారచరపతంగములఁ దఱుమఁ
బరమగర్వోన్నతములు రష్ట్రములు రెండు, చెఱువుకొమ్మునఁగయ్యంబు సేయుచుండె.

క. తిరుగక విఱుగక యాఫీ, కరమేషము లాహవంబుఁ గావింపంగా
సరిదంటిన డుమ నెత్తురు, దొరిగెం బ్రవహించె నిలిచె దొప్పలుగట్టెన్. 233

క. ఆనెత్తు రానుతమి న,చ్చో నొకజంబుకము నడుమఁజొచ్చి తదీయా
మానవిషాణశిఖాహతి, చే నెమ్ములువిఱిగి నొరిగి జీవముఁ విడిచెన్. 234

క. జంబుకము మేషయుద్ధము,నం బడుట యనంగ నిది జనస్తుతవినుము
ల్లంబమర మఱియుఁ జెప్పెదఁ, బంబినతాత్పర్యమేరుపడ సన్యాసిన్. 235

వ. అట్లు స్వాపరాధంబున మేషవిషాణసంపాతసంఘాతంబునఁ గొలెమ్ములువిఱిగి కాలమ్ముసేసిన సృగాలమాత్రమ్ముం జూచి యిట్టిద నావివేకంబు స్వప్నాద్యవస్థలయం

దును మోసపోవక రక్షించిన చిరకాల సంచితార్థంబు శిష్యునిచేతి కిచ్చి వచ్చితి శంకాయత్తం బై చిత్తంబు తత్తరించుచున్నయది యేమియగునొకో యనుచు తనుస్థానంబునకుం బాసి యబ్బడుగుసన్న్యాసి నిప్పుఁ ద్రొక్కినక్రోఁతిపడువున మడిమ లూఁదక మఠంబునకువచ్చి. 236

క. తానకమున నిజశిష్యుం, గానక యాషాఢభూతిగా రారా తే
రా నాసొమ్మనిచీరు, న్దీనత నోరెండ యతి యతివ్యథతోడన్. 237

చ. వెలవెలనై మఠాలయమువెల్వడుఁ దాపనిషక్తకంఠుఁడై
కెలఁకులఁజూచు భూమిసురగేహము లారయు నేఁడు భిక్షుకై
తెలతెలవేగి శిష్యుఁ డరుదేఁడుగదా కనుఁగొన్నఁ జెప్పరే
కలుషవిదూరులార పనిగల్దను నుస్సను నూర్చు హా యనున్. 238

క. తప్పెనుగార్యం బను నిఁక, నెప్పుడువీక్షింతునను నిఁకెక్కడనున్నాఁ
డెప్పుడు చేదొరికెం ధన, ముప్పుడె కపటాత్ముఁ డరిగె నని తలయూఁచున్. 239

క. అడిగినవారిం గ్రమ్మఱ, నడుగంజనుఁ జనిన కడకు నతఁ డార్తుండై
గుడిగుండమనక పల్లియ, పడుసరనాకరయుఁ జెటిచి పఱచినశిష్యున్. 240

క. ఈగతి యతి వేసటలే, కాగడపుంబోక శిష్యు నారసి యచ్చో
నేగుఱుతునుగానక యా,భోగతరశ్రాంతి నొక్క పురమున కరిగెన్. 241

ఉ. స్నానమొనర్ప దీమసముచాలక నోంకృతి నోరఁ బేర్కొనం
గానక భిక్షుకుండు దిరుగం జరణంబులురాక ద్రవ్యకం
థానుఁబాసితే యనుచుఁ దాపభరంబున మేన్పలింప లో
లో నడలూన రేయుఁబగలు న్విలపించు నతండు దీనతన్. 242

ఉ. గాసిలి పట్టుఁగోల్పడిన గాలిపిశాచముపోలెఁ గష్టస
న్న్యాసి దురంతతాపమున నారటమందుచు నార్జితార్థకం
థాస్మృతివాడలం దిరుగుఁ దాంతదశం గృశియించి యిచ్చలో
వేసరి నిల్చె సంజకడ నేఁబోక సాలియవానిలోఁగిటన్. 243

క. నిలిచి యతి కొంతచింతం, బలవించుచుఁ బంచ తిన్నెపైఁబడి వలకే
ల్దలక్రిందం జేరిచికొని, వెలవెలనై నిద్రలేక వేఁగునునుండెన్. 244

వ. అంత. 245

ఉ. వెంగలిపోకఁ బానగృహవీథికి నెక్కటి నేఁతకాఁడు పో
వంగనుజూచి దూతిపిలువం దలవాకిటిఁబాసి పల్లవా
లింగనకాంక్షఁ దన్మహిళ లేఁగనుమబ్బునఁ దక్కఁబెట్టి తు

చ్ఛాంగన రథ్యనేగ నెదురై పతిగన్నులు గోచరింపఁగన్. 246

చ. కని యదలించి యోసిచెడుఁగా కడగాలము సేర నెక్కడం
జనియెదు భర్తకాఁపురము సైఁపదె కుక్కకునాజ్యమిందునే
మునమునసైన నిచ్చెనఁటిమార్గముఁబట్టుదె కాచువాఁడుఁగా
డని నను నిచ్చలో నెఱుఁగవా తగవా నగుబాటుసేయఁగన్. 247

క. కెళవులనీచెడుపోకలఁ, దెలియనె రేపగలుగాచి తిరుగనె చేయం
గలిగినడాఁగునె యన నం, దుల కాజగఱాఁగ జాలిఁదూలక పలికెన్. 248

ఉ. ఓసరిపోయె ని ల్వెడలకుండ నయో నను రాణివాసిఁగాఁ
జేసితొ తొత్తులం బనులుసేయఁగనిచ్చినఁ బోలదంటిసే
వానికిఁబోర నన్నుఁగడవం బనిపాటలు సేయువార లే
రీ సురఁ ద్రావి మైమఱచి ప్రేలెదు కంటివొ పట్టుకొంటివో. 249

క. కూరకు నారకు బయలికి, రారా దనుమేర గలదొ రానో పోనో
యూరా చూడవె నేఁడే, లారోసమువచ్చెఁ గ్రొత్తలా యిత్తెఱఁగుల్. 250

క. పలుకులకేమీ రోసము, గలిగినముగవాఁడనయినఁ గాచి కడంకం
దలతలఁబట్టికొనంగా, వలదంటినొ చంపి త్రోవ వలదంటినొకో. 251

క. రుసివంటిదాన నన్నీ, కుసిగుంపొనరించి యేమిగుడిచెదు పాపం
బనివోలెఁ దాకు నిను నే,నుసురన్నం జాలుఁ జాలు నోహో యనుఁడున్. 252

ఉ. కాలికుడన్పతివ్రతవు గావె యయో నిను నీవ యెన్నకో
నేల జగం బెఱుంగు మఱి యేను నెఱుంగుదు పింతనాఁడ నే
చాలుఁ బురె పతివ్రతలు సంజకడం బెఱవాడఁబోక సం
శీలమ యిల్లుసేరు మెడసేయక యన్నియుఁ జక్కనయ్యెడున్. 253

వ. అని రోషపరుషవచనంబులం గినియుచు గృహంబునకుం గొనిపోయి యయ్యవ
గాకి అంకుటాలిం గాలంగేలం బొడిచి పెడమఱలందిగిచి నిట్రాత నేఁతపగ్గంబున
బంధించి కాలికుండు నిద్రించె నంతఁ గొంతప్రొద్దరిగిన. 254

శా. జారప్రేరితయై వినిర్భయమనీషం దూతి యేతెంచి చే
బారంబెట్టి కుటీరభారవహశుంభత్సంభృతస్తంభవి
స్ఫారప్రాంజాలరజ్జుబంధితవయస్యం గాంచి కన్నీరుము
న్నీరై వెల్లివడంగఁ గాలికుని లో నిందింపుచుం గూరిమిన్. 255

క. ఎదఁజేర్చి కన్ను మొయ్యనఁ, గదిసి ప్రయోజనముఁజెఱచెఁ గా చెలియా యీ
ముదకఁడు సరిప్రొద్దాయె,న్నిదురించిరి ప్రజలు వే చనిన మేల్గాదే. 256

ఉ. వెన్నెలరాకకై మొగము వ్రేల్చుచకోరముభంగి జారుఁ డో
కన్నులఁగల్కినిద్ర గడకన్నులఁగూర్పక యెప్పుడెప్పు డ
చ్చిన్నను డాయునం చెదురుచూచుఁ బ్రియంబున నీవురాక కి
ట్లిన్నియుఁ జెప్ప నేల చను మే నిటనుండెదఁ గట్టివైచినన్. 257

క. చనిరమ్మా నీవని బం,ధనమూడ్చినఁ దంతువాయి తాలిమిమై నొం
డనక గృహస్తంభంబునఁ, దనుఁగట్టిన త్రాటఁ బెనఁచి దానిం గట్టెన్. 258

క. కట్టి తనమాఱుగా న,ద్దిట్ట గృహస్తంభమునఁ బ్రతిష్ఠించి నరుల్
మిట్టాడని యాబెడిదపు, నట్టక నడురేయి మబ్బునం జెలి చనియెన్. 259

చ. అలమిననిద్రఁ జొక్కి చెడి యంతనె మేల్కని కౌళికుండు పే
ఁగలుఁగున సారెకుం బిలువ నించువెఱం బదకీయ గావునం
బలుకక యుండె నందులకు భావమునం గనలుట్టి మేలువాల్
కెళవులఁబూని ముక్కుఁదఱిగెం దొరిగ న్రుధిరంబు భోరునన్. 260

క. ముక్కరకు నోఁచకుండ, న్ముక్కఱఁ గావించి పూనముండా చెడుమం
చొక్కమనంబున నిదురం, జొక్కెం గౌళికుఁడు దొంటిచొప్పున నంతన్. 261

ఉ. అక్కడఁ దంతువాయి ప్రియు నప్రతిమాంగజసౌఖ్యసంగతిం
జొక్కఁగఁజేసి మందిరము చొప్పునఁ గ్రమ్మఱ యిల్లుసొచ్చి పే
రక్కునఁజేర్చి వార్తగలదా యన మాటిక యేపవార్త నా
ముక్కుకువచ్చె నీచెలిమి మూలబడ న్విడు మిల్లుసేరదన్. 262

ఉ. నావిని తంతువాయి పదనంబున లేనగ నంకురింప దూ
తీవిధికృత్య మెవ్వరికిఁ దీఱదు మానుషనంచు బంధముల్
వేవదలింపఁ ద్రెవ్వి పృథివీస్థలిఁ గూలినముక్కుఁ గొంచు నా
త్మావసథంబుఁ జేర తురకాంగన డెందమునం దలంకుచున్. 263

క. ఆనేఁతకానిచెలి గృహ, మానిన నిట్రాత నఁటి యటునిటు త్రొటం
దా నిరుచేతులమర్చి య,థానియతిం గూయకుండెఁ దత్సమయమునన్. 264

సీ. సింధుజామాతృదక్షిణచక్షురంగంబు మందేహగర్వనిర్మథనకేళి
సకలవేదద్రుమస్కంధంబు జలరుహప్రభవరాత్రించరోద్భవమహంబు
సంజ్వరార్తరథాంగసమ్మదప్రతిపాది దారుణతిమిరకాంతారవహ్ని
కమలినీవదనప్రకాశఘోషణమూల మాశ్రితజనజీవనౌషధంబు
తే. కుముదసమ్మదమథనని స్తిమితవేగ, మసితతద్వారకృతసురాయాతనమార్గ
మలఘునీహారకరటిపాకలవరంబు గ్రహపతింసంబు పూర్వాద్రిఁ గానవచ్చె. 265

చ. తెలతెలవేఁగిన న్నిదురఁ దేఱి కరంబులు సాఁచి లేచి క
న్గెలఁకులఁ బొఱిఁ జూచు మగని న్గని నాలిపిసాళి యొక్క నా
కలితపతివ్రతామహిమఁ గానక నన్ను వియోగిఁ జేసితి
క్కలుషము నిన్ను ముంచుకొనుఁ గాక వియోగతి నన్నుఁ బొందునే. 266

చ. అనుచితచిత్తవృత్తిఁ బురుషాంతరచింత సహింప నిన్ను నొ
క్కనిగడపం బతివ్రతను గాని యొకప్పుడుఁ గాను బుంశ్చలిన్
వినుఁ డిదె లోకపాలకులు వేయును నేటికి సాధ్వనేని సం
జనితకృప న్మదాననముఁ జక్కఁగఁ జేయుఁడు కీర్తికెక్కఁగన్. 267

వ. అని యేడ్చి మఱియు నద్దుశ్చరి మగనినుద్దేశించి యిట్లను హాలామదంబునం జేసి కల్ల నిజంబు లేర్పఱుప నేరక నన్నింతఁ జేయుదుగా కేమి నీచేతులు నొచ్చెడు నన్నుం గీడువొందునే యని మందలించినం జూచి భయవిస్మయంబులు సందడింప నక్కువిందుండు తచ్చరణంబులం బడి పరమపాతకుండ నపరాధి నా నేరంబు క్షమింపుము నను బంధంబులూడ్చి ప్రశంసించె నత్తెఱం గంతయు నందుండుటం జేసి చూచి యాతి యతివిస్మయరసావేశితాంతఃకరణుండయ్యె నంతకుమున్న గృహీతచ్ఛిన్న నాసాపుటయై చని కుటీరాభ్యంతరంబున ముసుఁగిడికొనియున్న క్షురకాంగనం బిలిచి తద్వల్లభుం డిట్లనియె. 268

చ. గరితలఁ జూడవే నిమురఁ గానవె యివ్విధి నున్న వెట్లు కాఁ
పురము పురంబునం గొఱఁగఁ బోవదె నా క్షురభాండమిమ్ము నా
కరమున కన్న వయ్యవిధ గాకిముసుంగిడి లింప మూర్ఖత
క్షురమొకటిచ్చె గాజుఱొదసూక్ష్మతరాగ్రివంబుగన్నఁగన్. ... 269

చ. క్షుర మొకఁ డిచ్చినం గినలుచు న్నగఁ డాజగడాఁగ కిట్లనున్
గరుసము నీవుఁ జెల్లినది గా క్షురభాండము గాక యొందు కీ
క్షురమొకఁ డంచు నోఁబలుకుచుం గుటిరాంతరసీమకై చెంద
త్తురము కఠోరభంగి నదిచూచి తదీయ నఘూటి యేడ్చుచున్. 270

ఉ. నేరము సేయ మార్పలుక నీతికిఁ బాసినఁ దాన గాను న
న్నారకముక్కఁ గోసె వినరో ప్రజలార దయాగుణేంద్రుల్
గారె యనాథ నైననుఁ గాపరె ధర్మము లేక పోయెనే
యూరికి దిక్కు లేదె యిట నుండఁగఁ బాపము నన్నుఁ బోఁటికిన్. 271

చ. కురియఁ దొడంగెఁ జూడుఁ డిదిగో రుధిరంబు శితక్షురంబునన్
దఱిగిన ముక్కుఁ గన్గొనుఁడు నా కిటుగాఁ గత మేమి వానలే

పరుసునవచ్చె నెట్లవనిఁబండు జగంబు సుభిక్షమెట్లగు
న్నరపతిలేఁడె యిక్కడ ననాథలపెన్మొఱ యాలకింపఁగన్. 272

వ. అని తల విరియఁబోసికొని రక్తసిక్తంబగు మొగంబు విధుంతుదదంతకుంతనిర్భిన్నచంద్రబింబంబు విడంబింప గుంపులుగొనిచూచు జనులకుఁ దునిసినముక్కుఁ జూపి వెక్కి వెక్కి యేడ్చుచు నెట్లాయెం గంటిరే యనుచు నద్దంట మగనిమీఁద నపరాధం బొదవ నీ వదువున మొఱపెట్టుచుండె నప్పుడు. 273

క. ఇటు నటు నన నోరాడక, తటతట నెద యదర నోరఁ దడిలేక కొడలా
రటపడఁగనుండె నపుడ, చ్చట మంగలి తొంగలించుసంత్రాసమునన్. 274

క. గిలుకలు వేసినగుదియలు, ఘలుఘల్లననూఁదికొనుచుఁ గతమేమీ యీ
కలకలమునకనుచు వడిం,దలవరు లేతెంచి యవ్విధం బరసి ధృతిన్. 275

ఉ. మంగలిఁబట్టి కట్టికొని మానవనాథుని మ్రోలఁ బెట్టి చె
ప్పం గనలెత్తి యాత్మపరిపాలితవిశ్వధరిత్రి నింతహం
తం గనుగొంటలేదు కొఱఁతం బడవైవుఁడు వీనినంచు రా
జుంగరమిచ్చి యారెకుల కొప్పనఁజేసె దృఢప్రయత్నుఁడై. 276

క. తలవరులు వానిఁ గొనిచని, తలపొలమునఁ గొఱఁతఁ దివ్వఁ దమకించుతఱిన్
గలతెఱఁగుఁ జెప్పి భిక్షుకుఁ, డలమంగలి నిరపరాధుఁడని యొఱఁగించెన్. 277

వ. మేషయుద్ధంబున నక్కయు నాషాఢభూతిచేత సన్యాసియుఁ దంతువాయిచేత దూతికయు స్వాపరాధంబున బాధంబొందిరి యేనును నిట్టివాఁడనేకదా యని వెచ్చనూర్చిన దమనకునకుం గరటకుం డిట్లనియె. 278

క. కేసరివృషమైత్రి యనా, యాసక్రియఁ జెఱుపఁజాలు నట్టియుపాయం
బోసుగుణీ చేకూరదో, కోసరసప్రజ్ఞ తలంచుకొమ్మన నతఁడున్. 279

క. పరసోపాయముచేనగు, కరణి పరాక్రమముచేతఁ గాదెట్లన్నన్
గరటముసుతపరిపంథిం, బొరిగొనదే కనకసూత్రమున గృష్ణాహిన్ 280

క. అన రిపుదమనకు దమనకుఁ, గనుఁగొని కరటకుఁడు వలికె ఘనబోధనసా
ధనసాధుసూక్తి నిక్కథ, వనురక్తిం జెప్పుమనిన నతఁ డిట్లనియెన్. 281

క. మనుజాలు మిట్టాడని యొక, ఘనగహన మహీరుహమునఁ గాకంబులజో
డొనరించుడింభములఁ గీ,లొక్కనసీకమ్మునికిఁ గఱచిలువ దినుదప్పిన్. 282

క. ప్రతిసంవత్సరమును నీ,గతిఁ బిల్లలఁ బాము పాము గడతేర్పంగాఁ
బ్రతికృతికి నేర్పుచాలక, యతిదీనతఁ గాకమిథున మచ్చోనుండున్. 283

ఆ. అంతఁ బ్రసవయోగ్యయగుభార్యఁ జూచి కా,లాహిచకితచిత్తముగుచుఁ గాక
మదలుగడలుకొనఁగ వడి నేగఁ దనమైత్రిఁ, గలిగితిరుగు జంబుకంబుకడకు. 284

వ. అట్లరిగిన నల్లోకశోకం బగు కాకంబునకు జగత్ప్రసిద్ధుండగు నాప్రబుద్ధుం డాతిథ్యం బాచరించి స్వాగతం బడిగిన నశ్రుమిశ్రితాక్షుండై వాయసాధ్యక్షుం డిట్లనియె. 285

చ. ఘనవనమండలంబున నొకానొక భూమిరుహంబునందు నీ
యనుజయు నేను గాలిడుదు మచ్చెలి చూలువహించి కాంచి పెం
చినపృథుకవ్రజంబుఁ గఱిచిల్వ దినుం బ్రతివత్సరంబు దా
ని నుడుపశక్తిలేక యొకనేర్పున నూరక చూచుచుండుదున్. 286

సీ. నూఁగారువోదలు మేనులతోడ నెరకునై కిఱుకూత లిడ నాలకింపలేదు
అల్లంతఁ గాంచి యుల్లార్చుపక్షములతో శిరములంకింప నీక్షింపలేదు
యొగుబోదలయి గూఁడుదిగనాడి పెఱమ్రాఁకులెక్క నారని యుత్సహింపలేదు
చంక్రమక్రమవిలాసముల నంబరవీథిఁ దిరుగఁజిత్తమున మోదింపలేదు
తే. ప్రేమ మెసలారఁ గని యొత్తి పెనుచుచుండ, ననుఁగుమనమలఁ దిగిచి ముద్దాడలేదు
బహువిపద్దశ లనుభవింపఁగ దినంబు, లరిగెఁ జూచితె వాయసాధ్యక్షుబ్రతుకు.

చ. కడపితి నిట్టు లేను జిరకాలము చాలముదంబొనర్చనే
పడఁతుక కాననయినయది పన్నగభీతిధరించి యొవ్విధిం
జెడకసుఖింతు నిందులకు జెప్పు ముపాయము నావు డప్పుడ
య్యెడ లడఁగించి జంబుకకులాగ్రణి వాయసభర్త కిట్లనున్. 288

క. యీలీల నుత్తమముల, స్త్రీలం గాపట్యమెసఁగ మెసవికుభీరా
భీలగ్రహణమున సరః, కూలద్రుమవర్తి యుసలికొక్కెర దెగదే. 289

క. అనిచెప్పిన గోమాయువుఁ, గనుఁగొని వాయసమువలికెఁ గర్కటకముచేఁ
దనివిసన మీలజాలం, దిని కొక్కెర యెట్లుపొలిసెఁ దెలుపవెయనుడున్. 290

వ. ప్రబుద్ధుండిట్లనియె. 291

మ. క్షుణదాయామవిఘాతి భాస్కరమహస్సంపాతి విశ్వంభరా
ప్రణమ తుక్కంతముసింధువింధ్యకుధరప్రచ్ఛేత్తృదావానలా
రణినానామృగమస్తకద్రుమకులాళం బధ్వనీనార్తికా
రణభైషజ్యముదోఁచె వేసవి మహోగ్రప్రేక్షణోదగ్రమై. 292

చ. అడుగిడరాదు నేల నెరయం దలచూపఁగరాదు నిప్పుక
ల్జడిగొనరాలు నెండవడఁ జల్లెడువీఁడిఁక నే డమిత్రుఁడం
చుడుగక భానుఁజూచి వగనొందుశరీరులఁ దేర్పగాడ్పు ల
ప్పుడు పరపోషణవ్రతులు వోఘనదానకళాధురంధరుల్. 293

సీ. దండినిప్పుల వసంతములాడు నెండల వడఁజల్లు పడమటివాయువులును
గ్రోవిగుంటలుదక్క గుల్లలుచిక్కంగ నివిరినగొంగరాయిడికి మిడికి
కొరదయుఁగడిసె పాపరమ్మల్గుముచ్చంగి కొంటె ముక్కును లొంపిఁగ్రుచ్చుకొనియె
వాలువముకుదమ్ము వల్లెగండెరనత్తె గుజ్జుబేడిసతాతికొఱుకు మడిస
తే. నూతయులజళ్ళ చెఱువులనుండరాక, కార్మొసళ్లు నెగళ్లును గవులువిడిచి
తరలి చెంతల నూతిగుంతల వసించె, *గొరలివర్తిలు నమ్మహాగ్రీష్మమునను. 294

ఉ. శంబర శోషణక్రియకుఁ జాలి దురంతతరప్రతాపరే
ఖం పథికాంగకంబులకు గాఁక ఘటించి హరింతు రంగసే
వ్యంబు మహాబలోద్ధతము నయినశతాంగము నెక్కి యున్నదా
ఘుంబునఁ బద్మినీయువతికాముఁడు కామునిదెల్పెఁ బొల్పుగన్. 295

వ. మఱియు నవ్వేసవి శోషితసింధురాజంబయి ధనంజయుం గృశీకృతదశకంధరంబయి దాశరథిని ఘనాఘనవర్తితశిఖిమండలంబయి కంధరావంభంబును భోగివిరాజమానం బయి బలిసదనంబుననుకరించె మఱియును. 296

చ. అనిమిష మండలీరుచిరమయి శవిరాజవిరాజితోత్పల
న్దనరి మరున్నికేతనమున న్గనుపట్టిన దాని నొక్కచోఁ
గనియె సరోవరంబు ఝుషకంబులఁ బట్టుకొనంగశక్తిలే
కనిలిచి క్రౌంచమెచ్చిరులు కారియుఁ దత్తటి నూరకుండఁగన్. 297

వ. దానినిరీక్షించి యొక్క కుళీరం బిట్లనియె. 298

క. బకమా గృహదఖిలకదం, బకమా యాహారవిధికిఁ బోనిట్టుల సరో
నికటమున నూరకుండెద, వకటా యిదియేమి యనిన నది యిట్లనియెన్. 299

ఉ. యీదశ యెట్లుగాఁదెలిసి తీవు కుళీరమ నిక్కనంబు మ
త్స్యాదుఁడ వృత్తి నాకిదియయైనను నీయెడ నేమి చెప్ప ద
త్తాదృతి నీయవస్థ కరయంగత మున్నది విన్ము జాలరుల్
మేదుర శక్తి నిక్కలనిమీనములం గొనిపోవువారలై. 300

క. పలువురు రానున్నారని, తెలియ న్విని చెప్పవచ్చితి న్మితోనిం
దులకయి యాహారింపం, దలఁపక వలవంత నొందెదం గర్కటకా. 301

క. జాలములన్ గాలముల, న్మిల్లెల్లం బొలియకున్నె మృత్యుసమంబీ
జాలియెటనుండివచ్చెం, గాలము దరియింపరాదు గదయెవ్వరికిన్. 302

---

* నూష్మకరమయినయీమహాగ్రీష్మమునను. (పాఠాంతరము.)

వ. అని యశ్రుమిశ్రితాంబకంబై బకంబు వగచిన విషంబునంగలఝుషంబు లన్నియు
నెఱుకచేసికొని యక్కొక్కెర కిట్లనియె. 303

ఉ. ఆరయ మీనభక్షకుఁడవయ్యును గూరిమిపెద్ద మాయెడం
గారుణికాగ్రగణ్య యటుగావున విప్రతిపత్తిలేదు ని
చ్చో రయమార మమ్ము నొకచొప్పునదుస్స్థితినొందకుండ నీ
డేరుపుమయ్య సేమము ఘటింపగదయ్య ప్రసన్నమూర్తివై. 304

వ. అని మీనంబులు దన్నుం బ్రార్థించిన సత్సుకంబయి బకంబు తనలోన. 305

క. యీయంబుచారములు దన, మాయకులోనయ్యెఁ గంటి మన పని సంతో
షాయతి నంతర్లీనముఁ, జేయుచు మాయాకళారసికమదిపలికెన్. 306

క. వాదించి జాలరులనొఁ, గాదన నాచేతఁగాదుగద నిజవృత్తి
చ్ఛేదమునకు నోరుచుకొన, రాదేకద పరమదుష్కరము కద పూనన్. 307

క. ఐన నిఁకనేమిసేయుద, మేనొకఁ డెటెఁగింతుఁ జేయుఁ డిష్టంబైనన్
మీనముల నితరసలిల, స్థానములను బెట్టివచ్చెదను మిముఁ గరుణన్.

క. రావలసిన రారం డని, భావంబున లేనికరుణపరిఢవిలంగా
నావృద్ధబకముపలికిన, జీవనచారములు విశ్వసించినమదితోన్. 308

క. చేటెఱుఁగనికూనలు మీ, లాటోపము మీఱఁ జేరనరిగిన నిశిత
త్రోటి నొకఝుషముఁగొని యొక, చోటికిం జని మ్రింగి వగచుచుం గ్రమ్మఱియెన్.

వ. ఇట్లు క్రమ్మఱి. 310

క. రారం డిఁక నొకరని రా, జీరియొకానొకఝుషంబు శితచంచువునన్
గూరిచిచని మును మెసవిన, చోరూపఱ మెసవి తొంటిచొప్పున మఱలెన్. 311

క. మగిడివిరివియును లోతున్, దిగియుం గలనీటవిడిచి తీఁగొన్నిటి న
క్కగములుదన్నెన్ మృత్యువు, మొగము న్నొరుత్తమాంగమును డాఁకాలన్.

క. మీకును మృత్యుత్రాసము, లేకుండం జేయనేర్తు లేలెండని రా
నాకొక్కెర యొకమీనముఁ, గైకొని చని తిని సరోముఖమునకువచ్చెన్. 313

క. ఎడతాఁకితాఁకి యొండొక, మడువున నిడుకైతవమున మఱియు న్మఱియున్
బడుగుంగొక్కెరమీలం, గడుపార న్మెసవి తృప్తిఁగైకొని యంతన్. 314

వ. సరోవరతీరంబునం గాల్నిలిచి వాంఛితపరనీరస్థానంబు లగుమీనంబులం గదిసి
యిట్లనియె. 315

గీ. అరిగి తిరిగి నేఁటి కలనీతి భరమాన, వసమె మూఁడుగాళ్లముసలిగా నె
కండవడియె వయఃసా గర్వమో సంచారశక్తి ముదుక కెట్లు సంభవించు. 316

క. బడలికఁ బాసినఁ దిరుగం, బడి ప్రాణసమానులైనబంధుల మిమున
మ్మడుగునఁ జేర్చెదనని యొడఁ, బడఁ జెప్పం దనకు నరుగఁ బాఱినదనుకన్. 317

క. తనివిసన నిట్లు కతిపయ, దినముల కుదరానలంబుదీఱ న్నాయా
ఖనియాబడుగుంగొక్కెర, యనఘా యాటెంకిమీల నన్నిటి మెసవెన్. 318

వ. ఇట్లు నిరవశేషంబుగా మీనంబులం దిని యొండేనియుం బోవ నుద్యోగించు నజ్జరత
బకంబున కెఱుకఁ జేసికొని మున్నెఱింగించుకొన్నకుళీరం బిట్లనియె. 319

గీ. భావికైవర్తకత్రాసభగ్నమాన, మానముల మీనముల నొండుమడుగుఁ జేర్చి
సుకృతసామ్రాజ్యవిభవంబు చూఱఁగొంటి, బకపురందర కలఁడె నీవంటిధర్మి. 320

క. నాళీజంఘాదులు నినుఁ, బోలరు పరహితవివాసమునఁ జుట్టములం
బాలించి నన్ను నేలా, పాలింపవు సఖుఁడఁ గానె పగవాఁడనొకో. 321

వ. జలస్థలాంతరంబునుం జేర్చి పొగడ్తఁగనుమని కైవారంబుసేయు కుళీరంబు నిరీ
క్షించి కర్కటమాంసం బపూర్వం బదియుఁ జవిచూడవలయు నని విచారించి
యక్కొక్కెర దానిం గఱచుకొని వధ్యశిలాతలంబునకుంబోయి భక్షింపఁ దివురు
టయు నయ్యుద్యోగం బెఱింగి యయ్యెండ్రి. 322

చ. బలిమి హుటాహుటిం దఱిమి పట్టుకొన న్వడిలేక మాయపుం
దలఁపున రిత్తజాలరులదాడి గడించి ఝషంబుల న్నిరా
కులగతి మెక్కెని మ్ముసలికొక్కెర యన్యజలాశయంబునం
గలుపుమిషంబునం జనదు గా కపటాత్ములవిశ్వసింపఁగన్. 323

క. మేనివసమయంబున ధృతిఁ, బాసినమది కార్యహానిఁ బ్రాణులనిలుగన్
వ్రాసె విధి మృతికినేలా, గాసిలి పౌరుషము విడువఁగా నేమిటికిన్. 324

క. పరుషకరపత్త్రధారా, స్ఫురణఁ బ్రకాశించు మద్విపులదంష్ట్రికలన్
శిర ముత్తరించి పాథ, శ్చరములకొలఁదీర్తు నీరసంబున ననుచున్. 325

క. అక్కర్కటముండఁగ నల, కొక్కెర దత్తరసమొలిచికొని తినునదియై
ముక్కెత్తిచాఁచు నాలో, నొక్కూఁకునఁ గొండ్లనిఱికి యొత్తెన్ గళమున్. 326

క. ఒత్తిన సుమడుండుభుకము, కత్తెరచేఁదునియుమాడ్కిఁ గర్కటదంష్ట్రా
కృత్తగళంబై నెత్తురు, జొత్తిలననలవృద్ధబకము సోలెన్నేలన్. 327

క. రోయక ప్రాణులకపకృతి, సేయుదురాచారుఁ డిట్లు చేట్పడు విను మో
వాయసవల్లభ శిశురిపు, వాయుభుజాం డీల్గునిట్టివాఁడై యునికిన్. 328

ఉ. భవదర్భాహితకృష్ణసర్పహరణోపాయంబెఱింగింతు నీ
వవధానంబునఁ జేయు మేమఱక రాజాగారసంచారివై

ఛవిమత్కాంచన మేఖలాలతిక దృష్టంబైన లాగించి నీ
పవిలంబంబునఁ బెట్టుమమ్మనికి రా జాపాముఁ జంపించెడిన్. 329

ఉ. నావిని కాక మవ్విధమునం జరియించెదనంచుఁ బోయి రా
జావసథంబుఁ జేరి యరయం బ్రతిసాధనఁ జేయఁబోవుచుం
బ్రావృతమేఖలాలత ఖురాళ్యుపకంఠముఁ జేర్చి దాని నా
లోవెస నంఘ్రులం గమిచి లోకులుసూడఁగ నభ్రగామియై. 330

చ. అరుదుఘటిల్లమందగతి నంతట నింతట నాసపాటుగా
నరుగుచునుండ రాజపురుషావళి మ్రోయుచు రాజునానతిన్
గెరలుచు వెంటరాఁ దొలుతఁ గృష్ణభుజంగమమున్న వృక్షకో
టరమున మేఖల న్విడిచి దాఁపున నొండొక మ్రాననుండినన్. 331

క. పరశుప్రహారములఁ ద, త్తరుకోటరమగలవైచి తత్రత్యఫణిన్
మెరిగొని మేఖలయుఁ గొని, పరిజనులుం జనిరి కాకిపగయునుదీరెన్. 332

వ. పరాక్రమంబునకంటె నుపాయం బెక్కుడ యనిచెప్పి వెండియుం దమనకుండు.

క. ఇల బుద్ధిగలుగునతనికి, బలముంగల దెట్టులనినఁ బటుబుద్ధిసము
జ్జ్వలమొకశశక మొకానొక, పొలమున నున్మత్తకరిరిపుం బొరిగొనదే. 334

క. నావిని కరటకుఁ డది యె, ట్లీవిధ మెఱిఁగింపు మనిన నినసంసత్సం
భావితనయశాస్త్రకళా, కోవిదుఁ డాయనకు దమనకుం డిట్లనియెన్. 335

సీ. దంతిదంతాగ్రనిర్దళితమస్తకగళ న్మూత్నముక్తౌఘపాండూకృతంబు
బహుళతిర్యగ్దృషత్ప్రతిహతస్యదన దఝ్ఝరఘనస్తనిత లాస్యదమయూర
మచ్ఛభల్లప్రహారాస్థాతృమాక్షిక చ్ఛత్రపంకీకృతక్ష్మాతలంబు
బిలసదాహారితుందిలసంకునిర్ముక్తసాంకవసురభితస్థాణుమూల

తే. మాదృతాఖండవాగురికావర్తిత, రజ్జురజ్జ్వద్గరుచ్ఛటాభ్రాంతిదాయి
చమరవాలవిలోకసంచకితమృగము, గల దొకానొకగహన మక్కానలోన. 336

క. కుక్షింభరి యగునొకహ, ర్యక్షము వర్తించు నహరహ మమర్యాదా
దక్షంబై నానామృగ, శిక్షాభక్షాప్తి నుల్లసిలు నది నెఱయన్. 337

క. ఈరీతి మేరమీఱి య, వారణవారణవిరోధివధియింపంగాఁ
బోరా దెరువెఱుఁగక యా, ఘోరాటవిమృగములెల్ల గుములై భీతిన్. 338

వ. వచ్చి యక్కేసరికిం బ్రణామంబులాచరించి. 339

సీ. గిరిదరీముఖ బహుద్విరదశోణితసిక్తగండశైలము కనత్కనకపీఠి
పరితోవిసారి శంబరలులాయవ్యాఘ్రహారణఘోషములు తూర్యారవములు

మస్తకోపరి పతన్మహీధరాధిత్యకా ఝరవారియభిషేకసలిలధార
సవిధపాదపలతాస్థాయినీడజకులాంచితతతు ల్యాభసురాశీర్వచములు.

తే. గావె మృగరాజవిఖ్యాతిఁ గనిన నీకు, నౌరగాంభీర్య మారసాహసవిలాస
మార గారవ మారస త్త్వాతిశయము, చారుతరమూర్తి పంచాస్యచక్రవర్తి. 340

క. హరి సాగా నీరూపము, శిరమునధరియించి కాదె శిక్షించె మరు
త్పరిపంథిఁగనకకశిపుం గరివైరీ నిన్నుఁ బొగడఁగా మావశమే. 341

వ. అని యనేకప్రకారంబుల మాతంగధ్వనిం బ్రశంసించి యుల్లాసంబుఁ బుట్టించి
మెచ్చుఁ బుచ్చుకొనివచ్చిన కార్య మ్మడుగంబడినయవిస్థై మృగంబు లమ్మృగపతి
కిట్లనియె. 342

క. అగపడినవారి నెల్లం, దెగటార్పక మేరచేసితిని మను మటనీ
మృగములజాతికి నొకఁడొకఁ,డుగ నిది మామనవి చెవినిడుము మృగనాథా. 343

క. ఈతగవునడపుమని సం, జాతత్రాసమునఁ దనుఁ బ్రశంసించిన నా
రీతినొనర్చెద నని యడి, జాతికి నొకఁడొకఁడుగా మెసవు నదిమొదలున్. 344

క. అంత నొకవారమునఁ దన, వంతగుటయు నిశితబుద్ధివహనము ధీర
స్వాంత మొకధూర్తశశకము, దంతిప్రతిపక్షికడుపుఁ దనియించుటకున్. 345

క. చావునకుందెగి త్రోవం, బోవుచుఁ దలపోసి స్వగతముననిట్లను న
య్యోవననిధిఁజొచ్చెలుల, కైవడి హరికడుపుఁజొచ్చెఁ గా వనమృగముల్. 346

క. ఈనెటికేసరిజఠరా, ధీనత దిన మొకటిలెక్కఁ దినెఁగామృగసం
తానంబు మల్లెపట్టిన, చేనిక్రియం జెప్ప నేమి శివపాదయ్యోర్యన్. 347

క. దీనికిఁ దుదమొద లెయ్యది,పో నెయ్యదితెరువు బుద్ధిపూర్వకముగ నేఁ
డే నెడ కేసరిఁ బొరిగో, ల్కొ నేడని వనమృగాళికొల వారింతున్. 348

క. బలమునకంటెను బ్రజ్ఞా, బల మెక్కుడుగాదె బుద్ధిబలమునఁ బేర
చ్చెలమునఁగైదువువెలిగాఁ, దలఁద్రుంతుం జెండి రెంటఁ ద్రావుడుదిండిన్. 349

క. ధైర్యము పెట్టనివరణము, ధైర్యము నానాశుభప్రదము నేద్గడయున్
ధైర్యధురాధుర్యునకు న,వార్యము లెక్కడివి వార్ధివలితధరిత్రిన్. 350

వ. కావునధైర్యాదిగుణంబులుగలిగి యుక్కుఁ అంతఁ బొపుకొనియెదనని నిశ్చయించి
మందగమనంబునఁ బ్రొద్దువోయిన తరువాత డాయంబోవుటయు నతిక్షుత్పిపాసా
భిభూతంబగు కంఠీరవంబు రోషకషాయితేక్షణంబులనిరీక్షించి శశకంబున
కిట్లనియె. 351

శా. ఓరీ యాఁకటఁ గ్రుస్సితి న్నరగ రాకుండెట్లు త్రాసంబుతే
దో రామాదులఁ బాసి రా మనసురాదో వచ్చుమార్గంబున
దేరడ్డంబుగఁ బాఱెనో బలిమి రొండే నేమి చేకూఱెనో
యా రా జాగొనరించితీవనిన బ్రజ్ఞాయత్తచిత్తంబునన్. 352

ఉ. కేసరివంకఁ జూచి పలికెన్ శశ మే నపరాధిఁ గాఁ జుమీ
యాసరసీరుహాప్తుఁ డుదయంబగునప్పుడె లేచి యాఁకటం
గాసిలె వల్లభుండని తగం బఱతేరఁగ ద్రోవ నున్మిష
త్కేసరపఙ్క్తిఁ దూల నొక కేసరినాథుఁ డహో యవారణన్. 353

చ. సెలవులవెంట భూరిమద సింధురమజ్జముగాఱఁగా విశృం
ఖలగతివచ్చి వచ్చి యరికట్టియదల్చి సమీపవర్తియై
పలికె మృగాధమా బలముఁ బాపెద మత్సదృశద్విపాహితుం
బొలమునఁ గానవే కదిసి పోరొనరింపఁగ నింపువుట్టెడిన్. 354

క. వనుఁబోల సింగములులే,వని కేసరి పోతరమున నాడినమాట
ల్వినివిని వారితభీతిన్, ఘనరీతి గజాభియాతిఁ గని యిట్లంటిన్. 355

క. సంగరసంరంభపుటా, సంగరముప్పొంగెనేని క్షణమాత్రము ని
ల్వంగలవేనిదె తెచ్చెద, ముంగలికరిమథనచంగము న్సింగంబున్. 356

క. అది నికోరికఁ దీర్తుం, గదలకు మిచ్చోటననుచు గాఢప్రజ్ఞా
భ్యుదయమునఁ జేసిచావక, బ్రదికి యహో నీకు విన్నపము సేయుటకున్. 357

క. ఏతెంచితిఁ దడయుటకిది, హేతువుపంచాస్యమూర్తివీవగుటఁ జుమీ
యోతీవ్రశౌర్యయారా, జాతతవిఖ్యాతనిరతుఁడై యొప్పెసఁగెన్. 358

క. చేరి నినుఁ గొలువవలెనో, వారక యాహరినె కొలువవలెనో మాకె
వ్వారింక రాజులనఁ గం, ఠీరవ మిట్లనియె నెవ్వడి న్శశమునకున్. 359

శా. ఏమేమీ నిను నడ్డగించుకొనెనా యిట్లాడెనా నిక్కమా
నా మేలే సహరేచ్ఛయంతబలుపౌనా ప్రాదమా చూపలే
వా మున్నెక్కడఁ గంటి వప్పరమగర్వగ్రంథి మచ్ఛాతదం
ష్ట్రామోఘాభిహతి న్వధింతుఁ దగ నాహారింతుఁ దన్మాంసమున్. 360

క. నావిని శశకము నామా, యావాగురఁ జిక్కెసింహమని యుబ్బుచునో
దేవా విచ్చేయుము సం, ధావిభవంబెసఁగఁ జూపెదం బ్రతిపక్షిన్. 361

చ. నిలువకవత్తుగాకని వని న్గొనిపోయి చలింప కారసా
తలజలపూర్ణకూప ముచితస్థితిఁ జూపి శశంబువల్కె లో

పలుఁగనుపట్టుచూడు ప్రతిపక్షినసం బరికించి తజ్జల
స్థలిఁ బెఱసింగముంబలె నిజప్రతిబింబము గోచరింపఁగన్. 362

క. కడుఁగెరలియొగసినూతం, బడనుఱికె మునింగి తేలెఁ బాసియంబు
ల్గడుపారఁద్రావె నసువు, ల్విడిచెం గరివైరి తీవ్రవేదనఁగృశమై. 363

వ. బుద్ధిగలవానికి బలంబునుంగలదనుట కిది నిదర్శనంబనుటయుఁ గరటకుండు దమ
నకు నలరుమొగంబునంజూచి బుద్ధిమంతుండవగుదు నీకు శుభంబయ్యెడు మిత్రభేదం
బున కుద్యోగింపుము పోయిరమ్మనిన నతండు కరటకునీడ్కొని సంజీవకుండు లేని
వేళఁ బింగళకుసమీపంబున కరిగి ప్రణామంబాచరించి నిలిచిన మృగరాజమ్మంత్రి
తనయున కిట్లనియె. 364

క. నీవలనఁ బ్రాజ్యరాజ్యముఁ, గావించెదఁగాద దమనకా యేకార్యం
బీవూఁది తెలుపవచ్చితి, వావిధ మెఱిఁగింపు మనిన నతఁ డిట్లనియెన్. 365

సీ. చిరకాలసంశ్రయస్థితి నమ్మిరిగిన తనవారిచెప నవాదరము సేసి
సిరిఁగోరి నడుమవచ్చినవారి మన్నింతు రభినవప్రియులు భూవిభులు గారె
పురుషగుణాగుణంబులు విచారింపక నీతియేపతికి మన్నింపఁ దెలుపఁ
బరులవందఱుఁ దమువలెనిరీక్షింతు రక్కటటులు చనుత్రోవ తెఱుఁగలేరు

తే. నమ్మఁగలవారుగాకదుర్నయము పేర్మి, నెవ్వరటుసేయుదురొ యెట్టు తెఱుఁగవచ్చుఁ
గర్కటిక గాదుకద ముంటిగంటిఁ దెలియఁ, గాఁబరసాంత్వమనినఁ బింగళకుఁ డతని.

చ. కనుగొనిపల్కె నోదమనకామతిశంకితమయ్యె నిప్పు డి
ట్లనుటకు హేతువెద్ది తెలియన్వలె సర్వముఁ జెప్పుమన్న నా
యనయను విన్నవింపవలెనా మృగనాయక నీతిఁ జెప్పఁగా
వినువినకుండు నాకుఁ దగవే కలకార్యముఁ గప్పిపుచ్చఁగన్. 367

ఉ. తోఁపకు శుద్ధసాధుచరితుండని చిత్తమునందలంచి సం
జీవకుఁ దెచ్చి నీసఖునిఁ జేసితి నీవును వానికూర్జిత
శ్రీవిభవంబొసంగి సవరించితి వందఱు మూలభృత్యులం
జీవితతుల్యులం జవుకఁ జేసి కడంబడవయిచితీవిటన్. 368

సీ. సదృశభోగము సమాసనముఁ దుల్యవిభూతియును భృత్యునకు నీఁగి చనదు పతికి
నిన్నియును నతనికి నిచ్చితిసామ్రాజ్యమేమిపాపముఁ జేసె నిత్తుగాక
సంజీవకునితోడి సఖ్యంబుపైవచ్చి హెచ్చించి యాపదఁ దెచ్చుకొంటి
యొంటిపాటున నాతఁ డొకనాఁడు నాతోడ నోడక నీసుద్దు లుగ్గడించి

తే. రహితశక్తిత్రయుఁడు మందరశ్మి మూఢుఁ, డితనికెక్కడిసామ్రాజ్యమేడబ్రదుకు
చెడియెఁ దెక తేరయనుచుఁ గేరడములాడె, ననిన విని విన్నవయియుండెహరివరుండు.

గీ. మృగవిభుండిట్లువిన్ననిమొగముతోడ, మలఁగుచుండంగమఱియునమ్మంత్రిసుతుఁడు
మంత్రియొకఁడైన నతఁడు సన్న్యాస్యుఁడైనఁ, బుడమిఱేఁడెల్ల చేటులఁ జెడునిజంబు.

చ. శ్రవణయుగాంతరావరణచక్రము లగ్గలపట్టు తోరపుం
జెవుడుకనీనికావసుధసీమకు నమ్మలికాదు దృష్టిపా
టవము చురుక్తి నాలుకకు డాసినచుట్టము పారుపత్యము
న్తైవులు నవైద్య సాధ్య మెడత్రెవ్వక నెవ్వని నాశ్రయించినన్. 371

క. కరణ మధికారియయినం, ధర లెక్కలువ్రాయువా రతనివారైనన్
బోరపిడిపుట్టునె ధరణీ, శ్వరునకుఁ దదితరుల నిలుపవలెఁ బనిమీఁదన్. 372

క. పరిశుద్ధులకరణిఁ బర, స్వరబంధువులయ్యు సర్వభక్షకులయ్యుం
నరవల్లభు దగ్గఱమా, ర్తురభంగి న్రిత్తఁబోరుదురు పనివారల్. 373

చ. తనఘనరాజ్యమంతయు ప్రధానునిపై నిడియున్న మత్తుఁగాఁ
బెనిచి నరేశ్వరుండు నడిపించినవాఁ డతిరూఢమూఢుఁడై
కనుకని వల్లభు న్సరకుగాఁగొనఁ డాసచివాననీశులం
దనయము నెవ్వఁ డాఢ్యతముఁడయి మనువానినచేరు లక్ష్మియున్. 374

క. ధారుణి నపకారికి నుప, కారముఁగావించువారిఁ గానము తద్దు
శ్చారిత్రులయెడ విశ్వా, సా రంభణ మనుచితము క్రియానిపుణులకున్. 375

క. ఊఁగడుపల్లును విసమునఁ, దోఁగినపంటకముఁ గుత్సితుండగుమంత్రిన్
లోఁగక యున్మాలించిన, నోఁగలుగు నఖండమయినసుఖ మెవ్వరికిన్. 376

క. నీవెఱుఁగవు నేనెఱుఁగుదు, పైవచ్చెం జెలిమికోలఁది వడఁదెచ్చెన్సం
జీవకుఁ డతనికిరాజ్యం, బీవిచ్చెదొ బలిమి నాతఁడే కయికొనునో. 377

క. సంజీవకసాచివ్యము, నం జేటగునీకు నీమనసు చెప్పఁగల
ట్లుంజెప్పితి మానుట నా, కుంజూడ శుభంబు మెలోకో చెడుతెరువుల్. 378

వ. అని బోధించుదమనకునకుం బింగళకుం డిట్లనియె. 379

ఉ. నీవచనంబు లుత్తమము నిక్కువము ల్వీను మట్లులైన సం
జీవకుపైన విశ్వసనచిత్తముపుట్టె దళీకవృత్తియౌఁ
గావుత దోషదుష్టములుగావె శరీరము లేరికిం గళా
కోవిద వాని వీడ్కొనుటకు న్మతిపుట్టునె నాకుఁ జెప్పుమా. 380

క. నావిని దమనకుఁ డతిరో, షావిలచేతస్కుఁ డగుచు నను నట్లయినన్
సేవకులతోడఁగూడం, బోవిడునీకేమిటికిఁ బ్రభుత్వశ్లాఘల్. 381

క. తనువు భరంబని వీడ్కొని, తనలోఁ దలపోయుమూఢతరుచందమునన్

జనపతి చోదకొర్వక, చని రాజ్యము మంత్రికైవసముఁ గావించున్. 382

క. సిరిఁ బరిహరించునరులె, వ్వరు చెప్పుమా పిచ్చుకుంటువాడుం బలె హో
దరుఁ డాదిగ నృపసంశ్రయ, గరిమ న్సంపదలఁ బొదలఁ గాంక్షింతు రిలన్. 383

వ. సత్పురుషులమతి నతిక్రమించి యసత్పురుషుల బుద్ధిం బ్రవర్తించు రాజు వినుమప థ్యానురాగియగు రోగియుంబోలెఁ బ్రాణభరణసమర్థుండు గాఁడు స్వబుద్ధి రాజులకు విశేషించి వలయు బుద్ధిరాహిత్యంబునగు మంత్రివశుండై తిరిగెనేని యారాజు విరోధినిరోధితుం డగునట్లగుట హితతంత్రియగు మంత్రివాక్యంబులు రాజునకు నవ శ్యకర్తవ్యంబులు వినునప్పుడప్రియంబులు పరిణామంబునం బ్రియంబులునగు వానినుపదేశించు మంత్రియు నవ్వాక్యంబు లాదరించు రాజునుం గలుగఁడు కలిగె నేని యద్దిక్కునఁ బెక్కువచెడక సిరులు పెరుగుచుండు. 384

క. ఘనుఁ డాప్తుఁడునగుసచివుఁడు, వినిపించినరాజనీతి వేయేటికి రు
గ్ణునకుఁ జికిత్సాక్రియవలె, మునువెగటుం బిదపహృద్యమును నైయుండున్. 385

క. నరపతి మూలబలంబుల, తెరువొల్లక నడుమ నరుగుదెంచినవారిం
బరిపాలించుటకంటెను, గరివైరీ యొండుచేటు గలదే పుడమిన్. 386

క. మూలబలంబులుగల భూ, పాలునకు నరాతిజాతిభయపడు లక్ష్మీ
భూలావణ్యవతుల్ హరిఁ, బోలె న్బెడఁబాయ రవ్విభుని ననుదినమున్. 387

క. తానెంతశూరుఁ డయినను, భూనాథుఁడు మూలబలము పొందొల్లక ని
ర్మానపరిపంథినరవర, సేనాపారంపరీవిజేత యగునో కో. 388

ఉ. జీవితమిచ్చి యాదరముఁ జేసి జలౌదనసంవిభాగసం
భావనకల్మి నేధరణిపాలుఁడు భృత్యులఁ బ్రోచు నద్ధరి
త్రీవిభు ప్రస్తుతంబున శరీర మలక్ష్యముఁగా దలంచుచున్
జీవితమిచ్చు గాయములచేఁ బడునొండె భటుం డుదగ్రతన్. 389

క. పరిజనగౌరవము ధరా, వరునకు నత్యంతగౌరవము వెండియు న
ప్పరిజనలాఘవము ధరా, వరునకు నత్యంతలాఘవము సుమ్మెందున్. 390

వ. నీవు మూలబలంబులం దిరస్కరించి యభినవాగతులం బురస్కరించుకొన్నాఁడవు.

క. సేవకుఁ డని చూడకు సం, జీవకుని న్నతఁడు సరకుసేయఁడు రాజ్యం
బేవేళ నతనిపాలయి, పోవునొ తుది నెంతకొఱఁతవుట్టునొ నీకున్. 392

క. నావిని పింగళకుఁ డనయా, కోవిదు దమనకునిఁ బలికెఁ గూరిమి నభయం
బీవిప్పింపఁగ నిచ్చితి, నావిధ మతఁ డేలమఱచు నది యొట్టులగున్. 393

వ. అనిన దమనకుండు. 394

క. కొనియాడినఁ గొలిచిన దుర్జనుఁ డాత్మప్రకృతివిడిచి చరియింపఁడు ది
ద్దిన చమురుఁబెట్టితోమినఁ, దనకుటిలతఁ గుక్కతోఁక దా విడుచునొకో. 395

క. కొలిచిన నవధీరితుఁగాఁ, దలఁచిన జేయును బరోపతాపము ఖలుఁడా
దలనిడుకొన్నం ద్రొక్కిన, బలితంపుంబాము బడలుపడఁగ ఱచుఁగదా. 396

క. సారఘనసారముఖసం, స్కారంబుల లశున మశుభగంధముఁబోలెం
గ్రూరుఁడు ప్రతివాసరరచి, తారాధన విధుల విడువఁ డాత్మప్రకృతిన్. 397

క. హితకార్యము నన్నడుగఁడు, పతినాకేమిటికిఁ బృచ్ఛపరిభాషణమం
చతిమానముద్ర నుండుట, మతమనరు సునీతివిదులు మంత్రుల కెందున్. 398

క. సంజీవకుదుర్భాషా, పుంజము వీనులవహించి పోల్పొలములి
చ్చం జింతింపవు దుర్ణయ, గంజాశరణంబుసారవుగద మృగరాజా 399

చ. అవనివిభుం డనీతివశుఁడయి మద మెత్తినదంతివోలె ని
చ్చవలసినట్లు గ్రుమ్మఱుచు సైరణ భృత్యజనాపరాధముల్
చనవునఁగప్పిపుచ్చుచు నజస్రము దుర్వినయత్వ సత్వభై
రవవిపదంబురాశిఁబడి క్రాఁగు దురంత విషాదవేదనన్. 400

క. ఏజాడవాఁడు రాజగు, నాజాడనె ప్రజయుఁ దిరుగు ననుదినము 'యథా
రాజాత థాప్రజా' యను, నీజనవాదంబు వింతయే యిపు డనుడున్. 401

క. చిరబోధబాధచే వే, సరి కేసరివలికె నంతచపలాత్ముఁడౌ కో
పరమసఖా సంజీవకుఁ, డరుదేరం దెలిసిచూత మాయమ్మేటికిన్. 402

క. పిలిపింపుమనిన దమనకుఁ, డులుకున నను నేటికార్య మూహించితిపిం
గళకా నీవెవ్వనిఁగాఁ, దలఁచితి వానిర్భరప్రతాపప్రబలున్. 403

క. మొదలింపవచ్చు నెటు ది, గ్విదితప్రభు నతనివాని వీనిన్బలెని
ట్టిదియైన మంత్రమేక్రియఁ, దుదిముట్టుం జెప్పుమా యతులనీతినిధీ. 404

క. పరిపక్వమంత్రబీజము, నిరతిశయారంభిపాలనీయము దానిం
బరిభిన్నముఁజేసిన నం, కురదర్శన మగునె నీతికోవిద చెపుమా. 405

వ. ఇందులకుఁ బ్రథమోదాహరణం బగు నొక్కయితిహాసంబుగలదు దాని నాకర్ణిం
పుము. 406

క. కల దుత్తరమున నతిని, స్తులవస్తువిశేషమహిమధుర మధురధరా
వలయపుర మధుర తేజో, బలసారసబంధుఁ డది సుబంధుం డేలున్. 407

క. అలఘుకళావిలసితుఁ డగు, నలరాజానుబంధుఁడయ్యు ననుబంధుండై
జలధిపరీతాఖిలభూ, తలవిహాజ్జనుల సంతతము పాలించున్. 408

క. జనలోకపారిజాతుం, డనదనరి యపారిజాతుఁ డగునమ్మహిభృ
త్తనయు నిజాస్తరణంబున, ననఘా యొకయూక మహారహము వర్తించున్. 409

క. అది మది వేగిర మెఱుఁగక, యదనారసి సురతఖిన్నుఁడై రాజెంతే
నిదురింపఁ గదిసి త్రావుం, దదుదయశోణితముఁ గడుపు దనివిసనంగన్. 410

క. మఱియుఁ బ్రమాదాదులఁ జే, టెఱుఁగక పైపాటునులేక నెక్కటికయ్యం
గఱచుకొని తనకు నేయ, క్కఱపాటునులేక కొంతకాలముఁ గడపెన్. 411

క. మారుతవశమున నపు డా, భూరమణావతంసుపానుపునఁ జందతరా
కారము డుండుభుకం బను, దారుణమత్కుణ ముపస్థితంబై నిలిచెన్. 412

క. నిలిచిన మందవిసర్పిణి, యల మత్కుణముం బ్రకల్పితాతిథ్యముచె
న్నలరించి చాలు నిఁకనీ, నెలవునఁ గాలూఁదవలదు నీ వేగుమనన్. 413

క. నిరవధితృష్ణావిరచిత, వరదంశనగుణము మత్కుణము దీనంబై
శరణని మందవిసర్పిణి, చరణంబులవ్రాలి దీమసంబునఁ బలికెన్. 414

క. దైవాధీనంబున నిట, కైవచ్చితి నొండుకడకు నరుగ న్దిరుగన్
సావసమె యిందు నెలకొని, త్రావెదరాజన్యశోణితము నీకరుణన్. 415

క. నావిని మందవిసర్పిణి, దావంతంగుంది తీక్ష్ణదంష్ట్రుండవు దూ
రావసథుండవు డుండుభు, కావారక కడుపుచిచ్చొగసినపుడెల్లన్. 416

క. ఒడలు బడల్పడఁగఱచినఁ, గడునెవ్వడి నదరి లేచి కంకటిపడి న
ల్గడలు వెదకించి కానం, బడ నరపతి నిన్ను నన్నుఁ బరిమార్పించున్. 417

క. తులువా నీకతనమునఁ జెడ, వలెనటుజాగుడిగి యిచ్చవచ్చినదెసకున్
వెలువడుమిపు డనఁ జరణం, బులమీఁద న్వ్రాలి డుండుభుక మిట్లనియెన్. 418

క. నీవిందు నిలిపితచోఁ, దావై కాలూఁదియుండెదం బొట్టకు నీ
వేవేళఁ దయఁదలంచితి, వా వేళ నె రాజరక్త మాహారింతున్. 419

క. విడనాడకుమని దైన్యం, బడర న్మత్కుణము ప్రార్థనాలాపములన్
గడుఁగరఁగించిన నాదృతి, గడలుకొన న్యూక మట్లుగా కని పలికెన్. 420

సీ. ఒండుదిక్కునకుఁ బోనోపలేనని కదా యర్థిఁ బ్రార్థించె దట్లయిన నుండు
పతిరతిశ్రాంతిఁ దల్పమున నిద్రితుడైనతఱిఁ జేరి నెత్తురుద్రావి బ్రదుకు
మిదినీకుసమయమంచదియూరకుండిన నాఁ డప్రదోషంబున న్వినీచ
గుణము మత్కుణ మతితృష్ణపడకయోర్వ్యాపవేశుఁడౌ నమ్మర్త్యవిభునిఁ గఱచెఁ
తే. గఱవ నరవరుఁ డదరి మేల్కాంచి పనుల, జనుల సజ్జనిరూపింపఁ బనుప వారు
దివియ లవ్వేళఁ గొనుచు చేతేరనరిగి, నికటరంధ్రాంతరము డుండుభుకము సొచ్చె.

క. కాలవడిలేమిఁ గాచ్పడి, పోలేకున్నెడ నెయ్యుండఁ బొడగన వ్రేళ్లన్
గీలిచి మందవిసర్పిణి, నాలోనం బులిమివైచి రసువులు వెడలన్. 422

వ. దుందుభుకమ్ముం జేర్చుకొని భిన్నమంత్రంబై యూకచచ్చె మంత్రంబు వెలిఁబుచ్చ
రాదని దమనకుం డాడినఁ బింగళకుం డవ్వాక్యంబులు చిత్తంబున కెక్కి నిక్కువం
బుగా వగచి యమ్మంత్రికుమారున కిట్లనియె. 423

క. నాపై సంజీవకుఁ డతి, కోపంబున రాక కెద్దిగుఱుతు సునీతి
వ్యాపారశీల చెప్పుమా, గోపనగతి ననిన దమనకుం డిట్లనియెన్. 424

క. వానతటినోరబాగై, యూననమునురంగఁ గొమ్ములవనమ్రంబుల్
గానిటకువచ్చు నతఁ డది, గో నిన్ను వధింపవచ్చుగుఱు తెప్పటికిన్. 425

వ. అని యభిజ్ఞానంబుఁ జెప్పి యప్పంచాస్యంబున కుపాస్యంబై యాస్యం బలర నవ్వం
చకంబచ్చోటువాసి మందగమనంబున సంజీవకు డాయంబోయి వెడవెడఁ దల
యూఁచి నిట్టూర్పు నిగిడించుటయు నతండు దమనకుం బరికించి సఖా సుఖంబునం
బొదలుదే భద్రమే యనిన నమ్మంత్రితనయుండు. 426

ఉ. చిత్తము నిర్వృతంబు దృఢసేవఘటించిన విత్తము ల్వరా
యత్తము లాశజీవితములం దొకయప్పుడు లేదు వృత్తులా
పత్తివిధాయినుల్ చ్యవనపాటవమెక్కడి భద్రమేఁత మే
ల్గొత్తలె రాజసంశ్రితులకుం బలుమాటలు వేయునేటికిన్. 427

చ. కనలువహించి యాపదల గాసిలఁ డెవ్వఁడు బోంట్లచేత నే
ఘనునిమనంబు ఖండితము గా దిల నెవ్వఁడు నేర్చు కాలము
న్గనుఁగొన నేవనీపకుఁడు గౌరవమొందఁ ఖలాప్తిసౌఖ్యమే
జనుఁడు వహించె రాజులకు సత్ప్రియుఁ డెవ్వఁడు నాకుఁ జెప్పుమా. 428

చ. వలఁకుపఁజూచి యీఁడడిగినం గసరుం గృశియించి యున్నచో
నలరుఁ బ్రపూర్ణుఁ డైన నెరయం బరికింపఁగఁ లేదు నాకు నీ
కొలువిక జాలు నన్నుఁ గుసిగుంపులఁ బెట్టు వధింపఁజూఁచు గే
వలనరకంబుగా కొలుచువారికి నృపప్రభుసంశ్రయం బిసీ. 429

ఆ. తనువుఁబొదలనీఁడు తాపంబుబుట్టించుఁ, బస్తుఁబెట్టు మూలఁబాఱవైచుఁ
గొలుచు సజ్జనులకుఁ గుత్సితవసుమతీ, వల్లభుండు వేఁకిపంటివాఁడు. 430

చ. నగవులకుం బ్రసాదవచనం బొక టాడఁడు ప్రోలనిల్చినన్
మొగమటుపెట్టు గేల్మోగిచి మ్రొక్కినఁ జేమెదలింపఁ డాజిలోఁ
బగఱవడంచి కోల్పడినపాటును గెల్చిన గెల్పు నెంతయుం
గగనకుసుమంబొనర్చు నొసఁగం బడునో యని దుష్ప్రభుం డిలన్. 431

ఉ. కాననవాసియైనను సుఖంబు విశిష్టగృహాన్నభిక్షుం
డైనవరంబు లూఖలకణాశనుఁడైన శుభంబు కర్షకుం
డైనను మేలు నీటజఠరానలమార్చుట లెస్సచూవె స
న్మానకరుండుగాని నరనాథు భజించుటకన్న నేరికిన్. 432

చ. మడఁగిపడుండఁ బ్రాణులకు మంచపుఁగుక్కకి నిల్వ నెల్లుపు
ల్గుడిసెకు నొండు రెండెనుపగొడ్లకు నోరికిఁ బోఁక ప్రక్కనన్
గుడువఁగఁ గూటికి న్మాలకుఁగోకకు నీదిరమెంతరోఁత యే
వడువున దుష్ప్రభుం గొలువవచ్చు నిసీ యను జీవికోటికిన్. 433

చ. పలికినమాటనిల్వఁ డెడపందడపం జెడనాడు నచ్చు మె
చ్చులదిగమ్రింగుఁ దొల్దొలుతఁజూచినచూపులఁ జూడఁ డేర్పడం
జాలుకదనంబొనర్చు నెరసుల్ఘటియించు లదల్చివైచుఁ గే
వలనృపసంశ్రయంబు పగవారలకు న్వల దిన్వసుంధరన్. 434

మ. హతదాక్షిణ్యు లనర్థకారు లభిమానాధ్యాత్ము లవ్యంజన
ప్రతిపత్తు ల్గుజనప్రియంవదులు సంపత్సన్నిపాతస్మృతి
క్షతికు ల్సత్యపరాఙ్ముఖు ల్ధనపిశాచగ్రస్తు లాద్యావన
చ్యుతు లక్షాంతు లనాంతరంగికులు రాజుల్ గారె యూహింపఁగాన్. 435

క. చుట్టము లెవ్వరు దేశం, బెట్టిది యాయువ్రజంబు లెట్టివి కాలం
బెట్టిది యేనెట్టిఁడబల, మెట్టిది నాకని తలంపుమీ నీ పనినన్. 436

వ. దమనకు నాలోకించి సంజీవకుం డను ననుజీవులకు దుష్ప్రభు సంశ్రయంబుగాదని
యును దేశకాలంబులు విచారింపవలయుననియును నన్యాపదేశవర్ణ నాసందర్భం
బుగా నంటి విమ్మాటలకు నిమిత్త మేమియొకో యని యూరకుండిన వెండియు
దమనకుం డిట్లనియె. 437

ఉ. నావచనం బమోఘమని నమ్మి దురూహలఁ త్రోవఁబోకసం
జీవక యేగుదెంచితివి సింహముఖంబున కెట్లు భద్రసం
భావనసేయుదుం గద విపద్దశలొత్తినచోటనోర్వనా
హా విభుఁ డీరసించెనుగదయ్య నిమిత్తము లేమి నీపయిన్. 438

క. సరసవినీతరసానీ, తరసము విరసతనగల్చి తనసుభటపరం
పరకిత్తుననియె బలియొ,వ్వరుదిక్కఁక నీతులున్నవా రాజులకున్. 439

క. పరివారముదూర ఖసుం, ధరనిడివడిఁ దెల్పె నేకతంబున నన్నున్
ద్విరదారిచీరి చిత్తం, బెరియంగాఁ బిడుగుపంటి యీదుర్వార్తన్. 440

వ. ప్రాణసమానుఁడవగు నీకుఁ గప్పిపుచ్చరామిం జెప్పితి నిది నీమనమ్మున నె య్యుండవనిమ్ము
నావిని సంజీవకుండు విషాదవిహ్వలుండై. 441

క. ధరనిరవధిచింతాసం, భరమున వడె శిరము వంచి పరికించు గుణా
కరు సంజీవకుఁ గనుఁగొని, గురుమాయాశాలి దమనకుం డిట్లనియెన్. 442

క. చింతానలమునఁ జేతః, కాంతారము గుమిలెఁ బ్రాప్తకాలము నారా
ధింతువుగా కన నతఁ డ, త్యంతధృతిస్ఫురితచిత్తుఁడై తనలోనన్. 443

చ. కరిగమన ల్దురాత్మకులఁ గాని రమింపరు హీనజాతికా
పురుషులఁ గాని భూభుజులు ప్రోవరు కానలఁ గాని మేఘము
ల్గురియవు సత్యశౌచములకుం బెడఁబాసినవానిఁ గాని యిం
దిరవరియింప దుర్వ్యయనీతులఁ గాని భరింప దెంతయున్. 444

క. పలుగూఁత లఱచువానిన్, గలు ద్రావెడువానిఁ జెవులుగతిచెడువానిన్
బాలఁతులఁ దెచ్చెడువానిన్, దొలఁగింపక సంతరింపుదురు రాజన్యుల్. 445

క. ఏకగ్రీవముగా నా, లోకన మొనరించి నిచ్చలుం గొలిచి తుదిం
గా కెడసితిఁ గద కలవే, మో కటకట సత్యశౌచములు రాజులకున్. 446

చ. నలినములందు రేలు కొలనం గలహంసములందు రిక్కనీ
డలఁ గబళించి కాంక్ష మగుడం గడకేగి మనోజ్ఞగంధము
ల్బొలికెడు తమ్ములం బగలు చేరనిచాడ్పున మోసపోయి చం
చలులగువారి కెక్కుడివి సత్యపదార్థములందు నమ్మికల్. 447

ఉ. దోషగుణంబుఁ గూర్చికుపితుండగు నాతఁడు ప్రార్థనావిధిం
దూషితుఁడై యభీష్టఫలదుండగు దోషములేక కారణ
ద్వేషముఁ బూనియున్న నృపతిం బ్రకృతిస్థునిఁ జేయఁ బ్రార్థనా
భాషలఁ గాదు సంశ్రయణభంగులఁ గాదు ఘటింప దీఁగులన్. 448

చ. ఫలితచికిత్స్యరోగములఁ బాపను సత్క్రియల న్మహోఘము
ల్వొలుపఱఁ జేయ నీతిఘనముల్ బహుభంగులఁ గూడఁబెట్టఁ
గేవల పరతంత్రులై మెఱయు వైద్యవిపశ్చిదమాత్యులుం ధరా
తలపతిఁ బాసిపోవుదు రతండు కృతజ్ఞుఁడు గాక యుండినన్. 449

చ. లవణపయోనిధానసలిలంబు ఘనాఘనదేశసంగతం
బవుచు మనోజ్ఞతం బొరయు నమ్మధురాంబువు వార్ధిఁ జేరి యు
ప్పవుగతిఁ గుత్సితం బమలమా విమలం బతికుత్సితం బవుం
దవిలి మహోత్తమాశ్రయమున న్నతితుచ్ఛసమాశ్రయంబునన్. 450

చ. లలితపటీరపాదపములం జిలువల్గ మలోజ్వలజ్జల
స్థలములగ్రాహము ల్గుణులచక్కిఁ బగప్రతికూలదుర్జనుల్
పొలుచు నిధానజాతముల భూతములుం గమనీయమౌక్తికా
వళి సగఘుల్సుఖంబులకు వారనివిఘ్నము లేర్పడుంగదా. 451

క. కేతసు లురుకంటకసం, ఘాతులు జంబాలజములు గంజాతంబుల్
నాఁతులు కుటి స్వాంతలు, భాతుందిలమణులు దోషపటలావృతముల్. 452

క. అను సంజీవకుపలుకులు, విని దమనకుఁ డనియె నెట్లు విశ్వసనీయుం
డనవచ్చు మానసంబునఁ, గనులు న్వ్రేలిఁ గనికరంబుగల నీరాజున్. 453

మ. పురతః ప్రాంజలిసాశ్రుదృగ్విజుఁ డుత్ఫుల్లాస్యుఁ డాశ్లేషణా
చరణారంభణకేళి సత్ప్రియకథాసంప్రశ్నదత్తాధికా
దరుఁ డున్నాయి బహిర్మహామధురుఁ డంత స్గాఢహాలాహలుం
డరుదే దుర్జనుఁ డెంత శిక్షితుఁ డపూర్వాఖర్వనాట్యోచితిన్. 454

క. ఇతరోత్కర్షణమాన, వ్రతుఁడు నిజశ్లాఘనప్రసక్తసుసాధు
ప్రతిపక్షీదుష్టరక్షా, రతుఁడు సుమిానుజనుఁ డైనరా జూహింపన్. 455

సీ. కరుణావిలాస మేగతిఁ గప్పిపుచ్చునో కోపంబు కన్నులఁ గురియుచుండు
సత్యభాషణము లెచ్చటఁ గట్టిపెట్టునో బోయబొంకులె నోరఁ బొదలుచుండు
నుపకారకరణ మెట్లుపసంహరించునో పరిపీడహృదయంబుఁ బట్టుకుండు
నౌదార్య మెట్లదృశ్యముగా నొనర్చునో పరమలోభము బుద్ధిఁ బాయకుండు
తే. నీతి యేమూలఁ ద్రోయునో నెరయు శుద్ధ, ముప్కరత్వంబు నేఁతలమోసు లెత్తు
మేలు డిగఁ ద్రావి కీడుద్గమింపఁజేయు పాపకర్ముండు రాజైన బ్రదుకుగలదే. 456

చ. అవనిపుఁ డెట్లు భాషితములాడు నరాధిపుఁ డెట్లు దృష్టిపా
టవమునహించు రా జెటులొడంబడు కోరి వివర్ధభూరతో
త్సవవిముఖుండు శంభువరదాననియుక్తుఁడు నోరఁగన్నులం
జెవులను బంచమేధుఁ డెడసేయక శిక్షము లూఁదియుండుటన్. 457

చ తిమిరనివారణక్రియకు దీపము వారిధిని స్తరింపఁబో
తము చవిఁ బాపవహ్నిరవితాపభరం బడఁగింప నాతప
త్రము కలుషంబులం జెఱుప ధర్మము బొల్పడియుండుఁగాని య
క్రమములఁ జొఁడు న్సుఖోద్యముఁడు గాఁడు దురాత్ము నిజక్కఁ జేయఁగన్. 458

వ. దమనకునకు సంజీవకుం డిట్లనియె. 459

ఉ. సాధుమధుస్పృహందివససాతిగమంబురుహాంతరాళసం
రోధము చంచరీకనికురుంబ మెఱుంగక పోవునట్లు తృ

ష్ఠాధృతి నానుకొన్న మనుజప్రసరం బనుజీవి తేచ్ఛవచ్ఛా
ధము డైన భూవిభుని నంటుఁ దదాగతిబాధఁ గానమిన్. 460

చ. సరసులతోడి నెయ్యములు జాఱ మదాళికఠోరదుర్గమ
ద్విరదశిరస్స్ఫురత్కటకదేశముల న్వసియించి తచ్ఛల
త్పరుషతరశ్రవోనిహతిభగ్న నిజాంగకమై పొరింబొరిం
ధరఁబడి తేఱె నెమ్మనమునం దలఁచ న్బిసినీవిహారముల్. 461

వ. నాకథ యట్టిద. 462

క. కడుఁగఠినుం డగుభూపతి, కడఁజేరిన నిలువనీడగలదా చెడదా
పుడమి నొకశశము వేసవి, యెడ దాపనిరాతి నాశ్రయించిన కతనన్. 463

క. నావిని దమనకుఁ డలసం, జీవకు నీక్షించి నీతిశీలాయేలా
గీవిధముఁ దేటపడఁ జెపు, మా వినియెద ననిన నతని కతఁ డిట్లనియెన్. 464

చ. మడువుల నున్ననీరిపుర మందవిహారము మానె వాయువు
ల్పడమరసాగఁ బర్వతములందవము ల్దలలెత్తె నెండలం
బడుకలు వ్రస్సెఁ గూలె మృగపంక్తికిఁ బాంథులకు న్ధరిత్రిపై
వడుగిడఁ బ్రాణసంకటము నైన యొకానొకమందు వేసవిన్. 465

క. వనయవసవిరహితంబగు, వనసంచారంబు బారి వారనిజాలిం
దనువెఱియం దీవ్రచరుం, డనుశశరా జొక్కనాఁ డుదాత్తత్వరతోన్. 466

చ. నిలువక వచ్చివచ్చి ధరణిం జెఱువెంచికలు న్వసుంధరం
గలసినగోడలుం జివికి గంపలఁ గాచిన వెట్టిసోఱ్ఱతీ
వలు చిగిరెంత గంటగమివాతులు గప్పినపూడుపాఁతఱ
ల్గలయొకయూరిపాడు పొడకట్టినఁ జేరఁగఁ బోయి యక్కడన్. 467

క. నేలంగలసిన యొకదే, వాలయనికటమున నారయం బొడవై హిం
తాలము గతి మెఱయుశిల, నొబ్బలఁగ నలశశకులాధిపుఁడు గని వేడ్కన్. 468

వ. చేరువంబోవ దూరంబుగాఁ బరపంజూకొని యున్నతచ్ఛాయం గాల్కొనంగోరి తదగ్రంబున నిల్చియుండెఁ బ్రొద్దునుం బెరుగుచుండ నీడయుం దఱుగుచువచ్చె నట్లు మధ్యాహ్నంబునకు ఛాయానుసారియై మూలంబునకు నచ్చె. 469

చ. అనలమువంటి యెండ నొడలారట మందఁగ నాత్మలోన ని
ట్లని తలఁచె న్శశం బతులితాకృతిసంపదఁ జూచి దీనిడాఁ
పున వసియించి యిట్లయితిఁ బ్రొద్దొకచాయ వసించె బంటఁజే
రిన దురవస్థలం బొరయరే జనులం చదివోయి నెవ్వగన్. 470

ఉ. మత్సితరాజసంశ్రితుండ నగుట నేనాశకంబునకుం దోడువోయినవాఁడ మృత్యు
ముఖప్రవిష్టులకు బ్రతుకులేదు. 471

క. పలువురుక్షుద్రులు మాయా,వులు పామరపసుమతీధవునికడనున్నం
బొలియింతు రుత్తములఁ గే,వల ముష్ట్రియుఁ జంపి మెసవవా కాకాదుల్. 472

క. నావిని దమనకుఁ డలసం, జీవకు నీక్షించి నీతిశీలా యేలా
గీవిధము తేటపడఁ జెపు, మా వినియెద ననిన నతని కతఁ డిట్లనియెన్. 473

చ. విటపసమృద్ధిఁ బత్రములఁ బ్రేఁగునఁ బందిలిగొన్న కానుగుం
దుటుములు గట్టి రొంద పొదదూఱక ఘోరకఠోరజంతుప
ర్యటనగురాప మొక్కభయదాటవి రాజిలు నచ్చట న్మదో
త్కట మనుసింహ మప్రతిమగర్వధురంధర మొప్పు దానికిన్. 474

క. పులియును నక్కయుఁ గాకియు, నలయక పరిచర్య సేయునవి యొకనాఁ డ
ప్పొలమునఁ దిరుగుచు నొకచో, నులుగంపలు మెసవునుష్ట్రము గని తమలోన్.

క. ఎక్కడిమొగ మెక్కడిపొడ, వెక్కడిమూ పేదగమన మెక్కడికంఠం
బెక్కడవినము కనుంగొన, మిక్కొంకరమెకము ననుచు నేడ్తెఱ దానిన్. 476

క. బలిభుక్ఖరువ్యాఘ్రం, బులు డాయంబోయి పలికె మున్నెన్నఁడు నీ
పొలమున మెలఁగవు చెపుమా, తెలియఁగ నెందుండివచ్చితివి మృగముఖ్యా. 477

క. కాననసత్వంబులలోఁ, గానము నీవంటిరూపు కడువెఱఁగయ్యెన్
మానిబిడాద్భుత మఱఁ జెపు, మా నీవిధ మనిన నది యుమర నిట్లనియెన్. 478

చ. నను విను చోళమండలమున న్వసుమంతుఁడునాఁ బ్రసిద్ధిఁగాం
చినయొకసెట్టియుండు నలసెట్టిన మారువిలాఁతి కేగుచుం
దనఘనరాశి పైనిడినఁ దాల్చి హుటాహుటి నేను భానుమం
తుని కిరణాంకురంబులును దూఱనియొండొకకానఁ బోవఁగన్. 479

మ. సుషిరాస్యస్థలజాతఝాంకరణకక్షుణ్ణాశ మభ్రోచ్చల
ద్దృషదాస్ఫోటనపాతిభంబుకరజోతిగ్రస్త కూలంకషా
విష మున్మూలితమూఢమూల వివిధోగ్రజంబుబాహ్యాకీర
ఝషకస్థానజలంబువీచె నొకజంఝామారుతం బుద్ధతిన్. 480

క. పినపిన మెఱుపులు పొటిపొటి, చినుకులు మసమసక లెసఁగు చీఁకట్లుం దోఁ
చిన నొకరినొకరు గానక, చని రాలోఁ బసియుఁ గన్నచాయలఁ బఱచెన్. 481

క. అనిశిఁ బసియును నొండొక, మానిసియుం బడఁడు దృష్టిమార్గంబున క

ళ్లనను గాఢ్పాటునఁ జనఁ,గా నొకచో నుపరిభరముకంపలఁ దవిలెన్. 482

క. తూరుపు తెలతెలనై రాఁ,గా రువ్వున విసరునీఁదగాడ్పులు నయ్యా
సారమును ముట్టుకొనె నేమైరో నే నెఱుఁగ నిచట నాఁగితిఁ బదముల్. 483

వ. నాపే రుష్ట్రంబు. 484

క. అని తనకథ నెఱిగించిన,విని వాయసముఖులు గారవించి సుహృత్త్వం
బనఘా పాయక మాతో, నొనరింపుము నెమ్మిఁ గలసియుండుద మనుచున్. 485

వ. ప్రత్యయపూర్వకంబుగా నతని నాదరించి కథనకుండనునామం బిడి తెచ్చి మహో
త్కటంబుం గానుపించి యుభయదానంబుఁ బెంపుసేయించినఁ గాకవ్యాఘ్రగో
మాయువులం గలసి కొంతకాలంబు ప్రవర్తించె. 486

చ. అటఁ జటులప్రతాపభయదాశువిశంకట మమ్మహోమదో
త్కటము విదాహమోహకటకశ్రమశోకపురోగరోగసం
కటమున డస్సి వేఁట లరుగం దిరుగ న్వరగంధసింధుర
చ్ఛటనము నొంప వంప వడి చాలక నేలకు వ్రాలియుండఁగన్. 487

క. చరణములవ్రాలెఁ బులి యు,క్కఱ డగ్గరి మ్రొక్కి వంచకము ప్రణమిల్లెన్
గరటము భద్రమె శుభమే, పరిణామమె యనుచు వినయపాటవ మమరన్. 488

క. నతిఁజేసి నిలిచి దంతి, ప్రతిపక్షికుక్షిదావపావకుఁ డేర్చెన్
గతిచెపుమా యాహార,స్థితి కీవని ఱంతుసేయ సింహం బనియెన్. 489

చ. శితనఖరాంకుశాగ్రములచేఁ బ్రతివాసరము న్మదావళ
క్షితిపులవ్రచ్చి మజ్జము భుజింతు మదంచితభుక్తశేష మా
శ్రితులకుఁ బెట్టుదుం దగభుజింతురు మీరు శరీరపాటవం
బతిశయితంబుకాదు గమనాగమనంబుల కేమిసేయుదున్. 490

క. వ్యవహారయోగ్యములు గా,వవయవములు గలుగుబెట్టు లాహారము మీ
రవహితమతులయి కతిపయ, దివసంబులు ప్రోచికొనుఁడు దేహత్రయమున్. 491

క. తనువునకు నుసుఱువచ్చిన, దనుకం దనకామిషం బుదాత్తప్రీతిం
గొనితెండు పొందు మీరన, ఘనతృష్ణం గాకజంబుకవ్యాఘ్రంబుల్. 492

ఉ. తీరక పోయిపోయి బలుదెంపలఁ గంపల నేళ్ళ బీళ్ళఁ బ్రాఁ
బూరుల దారులం గడిదిపుట్టలఁ దిట్టల బోళ్ళ రాళ్ళ నీ
వారకరీరము ల్గలుగుత్రుంతలఁ గ్రంతలఁ జెట్ల గట్ల నా
హారమతిం జరించి జఠరానల మాఱకవచ్చి క్రమ్మఱన్. 493

క. తమలోనఁ బొదరుకొని యుష్ట్రము వాకిట నిల్వఁబనిచి రహి నమ్మూఁడుల్
సముఖమున కరిగె నందుదరముఁ జూపి యిభారితోఁ గరట మిట్లనియెన్. 494

క. తిరుగఁగలదిక్కులన్నియుఁ దిరిగితి మిఁకనేమి యలసితిమి మాపల్కు
త్తర వాహాయాహారము, దొరకదు నిప్పస్తులుండుదుమె నీమ్రోలన్. 495

ఉ. లావరి యొప్పు డంగవికలత్వము వాటిలి క్రుస్సి యిమ్మహా
గ్రావగుహానివేశమునఁ గాల్కొని దేవరయుండ నెవ్విధిం
జీవితముండు భోజనముసేయుకయే మును నిస్తరించునె
ట్లావిధ మానతిమ్ము సుగుణార్ణవ యూరకయుండుటొప్పునే. 496

ఉ. ఊరకయున్న నెట్లగు నిజోదరపూరణ మేటిజోలి యా
హారము లేదు మావలన నక్కట యే నొకమాటఁ జెప్పెదం
గోరికమీఱ నక్కధనకుం బొరివుచ్చి తదంగమాంసము
జ్జారణసేవ దేవజఠరానల మార్పుము తేర్పు మాకృతిన్. 497

వ. అనిచెప్పిన నప్పనికొప్పనియదిగ్గొని మదోత్కటంబు కరటంబున కిట్లనియె. 498

ఉ. ఇట్టిదిగాదె నీకుఁ దుదినేటికిఁ జెప్పెదు ధర్మతత్త్వముల్
చెట్టులఁగట్టి నమ్మమని చేతడియాఱదు చంపుటెట్లు బా
సెట్లు సహించు దైవ మిల నెవ్విధిమోయు ధరిత్రి యక్కటా
పొట్టకుగాఁగ నిచ్చెనఁటిపోకలఁ బోవ మదిం దలంచినన్. 499

క. ఉడుగుమిఁకను నట్లయినం, జెడితిమి నీసత్యమింతచేసె నయం బె
క్కడబోధించినదానిం, గడచెవులం గూర్పనుచుఁ గరటము మఱియున్. 500

క. నిలుపోపరానియాఁకటఁ, బులిపిల్లల భుజగమండముల భక్షించున్
గలుషమునకు రోయునె నీ, తులు దలపోయునె బుభుక్షితుఁడు చిత్తమునన్.

ఉ. ఏవిధి నీతిపద్ధతికి నేగుదయాపరతంత్రచిత్తుఁడై
కైవడినా మహాదురితకర్తుఁడుగా కెటులుండుధర్మసం
భావితుఁ డెట్లగు న్వినయపాటవ మేక్రియ నేర్చు గౌరవం
బేవలన న్భజించుసుఖ మేగతిఁ గాంచు బుభుక్షితుం డిలన్. 502

క. కుక్షిదరికొన్నపట్టున, వీక్షించునె దేహిరుచులు వేళలు మునిహ
ర్యక్షుఁడు విశ్వామిత్రుఁడు, భక్షింపఁడె సారమేయపలలముఁ దొలుతన్. 503

గీ. కలశజుఁడు చూడ నొకరాజు కానలోన, దండియాఁకటఁ దనమేను దానె తినఁడె
పలుపుతతిఁ బుణ్యధనులు గీర్వాణమునులు, చేరి పీనుఁగుఁ గఱచి భక్షింపరొటు.

గీ. కఱవునకుఁగాక మున్నొక్క కాఁపుకొడుకు, దారపుత్త్రాదులవధించి తానె తినఁడె
యాపదలచోట నియమకార్యము హుళిక్కి, శాస్త్రమతమిదివలదుదుస్సంశయంబు.

క. పోషించి చంప నోహో, దోషంబని బుద్ధిదలఁచెదో సస్యములం
బోషించికాదె కోయుదు, రీషత్కల్మషము గలిగెనే యచ్చోటన్. 506

చ అమితవిరోధి వీవు నిమిషార్థము నీకు శరీరపాటవం
బమరకయున్నరాజ్య మభియాతులపాలగునట్లుగాన నా
శమునకు మూలమిచ్చెడువిచారము దూరముఁజేసి చంపుము
ష్టమము జఠరాగ్నినార్పుతరసంబిడు మాకు దయామయుండవై. 507

చ. మొఱయిడు'స్వాశ్రితావనసమానహిధర్మ'మటంచు వేదముల్
పరిజనరక్షమేని కనపాయిని దానిఁ దృజించి సూనృతా
చరణముఁ బూనియుండెదవు చాఁగు రె జీవితవిత్తమానభూ
సురహరణాదికార్యములఁ బో గణియింప రసత్యదోషముల్. 508

క. బలసంపదవలెనో కే, వలసూనృతభాషణంబువలెనో నీలోఁ
గలతలఁపుఁ జెప్పుమని గా, సిలియేడ్చినఁ గాకిఁజూచి సింగంబనియెన్. 509

క. మతిమీఱ మీరు నాచే, నితనికి నిర్భీతి దాన మిప్పించితి రుం
చితి రానొల్లనె నేఁ డు, ద్ధతులై వధియింపు మనియెదరు కథనకునిన్. 510

క. మతిఁజూచునె శరణాగతు, హతుఁగా నెటువంటికుటిలుఁడైనను బుణ్య
శ్రుతులు పనిగొనుమదీయు, శ్రుతు లాకర్ణింపనేరుచునె మీకాఱుల్. 511

క. శరణాగతరక్షణమునఁ, దురగక్రతుఫలము దొరకు దొరకుయశోలం
కరణభృతి గలుగుఁ దొలఁగు, న్దురితంబులు చేర వొందుదుఃఖౌఘంబుల్. 512

ఉ. చేరదు కీర్తి గౌరవము చిక్కదు రాదు శుభంబు పుణ్యముల్
నీఱగుఁ బాప మంటుఁ బ్రజ నిల్వదు కొల్వదు కష్టకట్టు వీ
రారులు లెక్కగాఁగొన రహర్దివసంబు విపత్పరంపరా
భారము కొండలై పెరుగు బాపురె సత్యములేనిపట్టునన్. 513

క. కృపఁ గట్టిపెట్టి మీపా, పపుబుద్ధులఁ బట్టిపట్టి పగవుట్టి విని
ష్కృపటుఁ గథనకునిఁ బొరిగొని, నెపపడి పడియుండువాఁడనే నే నకటా. 514

వ. అని మిగియంబలికిన హృదయనిర్భిన్నకాలాయసం బవ్వాయసంబు మృగపతి కిట్ల
నియె. 515

చ. చెవిఁ జొర వేనువిన్నపము జేసినమాట లొకించుకేనియున్
శివశివ యెంతవేడ్క యనుజీవులచావులఁ జూడ నిన్నురే

పసులను గొల్చి టీయిడుమపాటునకా యిటులౌ పెఱుఁగ నె
ట్టవునిఁక సత్యమా నెచటికైనను బోయెద నేను వీరలున్. 516

క. అనఁజనదు తగులుతగులని, తనువుం బ్రాణంబుకంటెఁ దగులెద్దియొకో
చనుతనువు విడిచిప్రాణము, చనఁబోలనివారు గలరె సమయంబైనన్. 517

క. పాటించి విడువ ముడువ, న్నీటబ్బకయున్నఁ బోవ నీక య్యామునన్
బోటరిమగలకు శాటికి, గూటికి నీదిరమె రాచకొలువేమిటికిన్. 518

క. నుడువులన బంగాలుఁ బందిలి, యిడి హస్తము బలుసుముంటికెనయై దినముల్
గడపుచుఁ బొమ్మను నయ్యా, గడపున్నృపుంబాయుఁ జేగగలసైన్యంబుల్. 519

క. తనకొఱకుఁ గలరిపులం, గని యని మొదలించి పొలియుఁ గన నశ్రద్ధం
గనుఁగొనక మనుజపతికిం, దనమేనిం బోలెఁ బ్రోవఁదగు భటపఙ్క్తిన్. 520

క. నీ కెవ్వరు నేఁటికిఁ గట్టా కడపట నుష్ట్రిమొక్కఁడసహాయముగా
భీకరపరిపంథిజయో, త్సేకివి గమ్మని విషాదశిఖిలోమండన్. 521

వ. కాక వ్యాఘ్రగోమాయువులు స్థలాంతరంబున కరుగ నుద్యోగించిన. 522

క. బలహానికిఁ జిత్తమునం, గలఁగంబడి మాటపట్టు గలరాజయ్యుం
దలవంచియుండెఁ గేసరి, ఖలుల కసాధ్యములు లేవుగద లోకమునన్. 523

వ. అటులబ్ధావకాశంబై కాకవ్యాఘ్రగోమాయువులతో నేకాంతంబుచేసి కథనకుం
బిలుచుకొని లోపలి కరిగి నిలువంబడియె నందు వ్యాఘ్రంబు మ్రొక్కి నిలువం
బడి కేసరి కిట్లనియె. 524

మ. సటులంకించుట యెప్పు డత్యవనతాస్యంబెత్తి నానాహరి
త్కటకంబు ల్వరికించుటెప్పుడు దృఢస్కంధంబునం బొందుగా
దిట మావాసముఁ జేయుటెప్పు డకటా దేహంబు సామయ్యె నాఁ
కటి కడ్డంబుగ నారగింపు మివె కాకవ్యాఘ్రగోమాయువుల్. 525

క. ఏవెంటఁ గడమపఱుపక, దేవా మము సంతరించితివి నీపాలం
జావగుట దమకుఁ దగునటు, గావున భక్షింపు వనరఁగా నేమిటికిన్. 526

క. అనిపలికి తొలఁగె బెబ్బులి, చనవున వంచకము వాయసము దోడ్తోన
ట్లనపలికె నపుడు కథనకుఁ, డనఘుం డప్పుడరు లారయక తా ననియెన్. 527

క. మృగవల్లభ యాఁకటిచే, సుగమైతివి నీకుఁ గైవసముగా నన్నుం
దగదె కనుంగొన నీపా, లగుఁ గథనకుఁ డారగింపుమా చేసేఁతన్. 528

క. అనువచనము లోవెలిగాఁ, బెనురొదతోఁ గఱచి వ్రచ్చె బెబ్బులి సింహ

బున కొసఁగెఁ గథనకామిష,మునఁ దృప్తింబొంది కాకముఖులకు నొసఁగెన్.

వ. ఇట్టి మాయావు లున్నచోట సత్యంబు మాఁబడి కల్ల వెల్లివిరియుఁ బింగళకుం
డును మహోత్కటంబునడువునఁ గుమంత్రి కుమంత్రయంత్రంబునం దగులువాఁడు
గాఁడె యనవిని దమనకుండు క్షుద్రపరివారుం డగుట భూరమణున కొప్పఁజే
యుదోశో చెప్పుమన సంజీవకుం డతని కిట్లనియె. 530

చ. అమరుసురాళిసంవలితమై సితగృధ్రము హంసమట్లు హం
సము పరుషశ్మశానఖగసంవృతమై కనుపట్టు గృధ్రమ
ట్లమలమతు ల్దురాత్ము విమలాత్మునిఁ జేయుదు రల్పు లుత్తముం
దమువలె నుండఁజేయుదురు తద్ద్వయి నెయ్యది మేలు చెప్పుమా. 531

క. కీడెఱుఁగరు మేలెఱుఁగరు, చాడికి జెవిజేత్తు రుఱక జనలోకవిభుల్
పాడియుఁ బంతము గలదో, కోడ దొరకుఁ గొలువ నిలువ నెవ్వారలకున్. 532

క. న్యాయం బన్యాయంబని, కూయిడి చెవి నిల్లుగట్టుకొని చెప్పంగా
నేయోజ న్వినకుండున్, మాయావులమాట లెట్టిమహిపతి గైనన్. 533

క. ఏకరణి వికలితాత్ముఁడు, గాకుండుం బతి పరోపఘాతనకరణా
స్తోకన్యాయామార్ద్రికి, జీకృతముఖదుర్జనావినీతుల చేతన్. 534

వ. అవశ్యంబు రాజులు చెవి పేదలని పలికి వెండియు సంజీవకుండు. 535

క. కులిశమును రాజతేజముఁ, దలపోయ మహాసురాసదములచలములం
గులిశమునకు నృపతేజము, పలుకులు వేయేల తునియఁబడు నెల్లెడలన్. 536

ఉ. కావున రాజు నాదెస నకారణవైరముఁ బూని ద్రోహచిం
తావశుఁ డయ్యెఁ జాలు నిఁకఁ దద్భుజనంబు మహాపరాక్రమ
శ్రీవిలసిల్ల గయ్య మొనరించెద గెల్చెద గెల్పుదక్కినం
జా వమరు ద్దిగంతపరిపుష్ప్రిథచేసులు శంకయేటికిన్. 537

చ. సవనము లాచరించి కనుశక్రనికేతము భూరిదానధ
ర్మవిధు లొనర్చి కాంచుసురసుందరముగ్రతపస్సమాధులం
దవులు మరుత్పథం బతులితత్వర శూరుఁడు గాంచుఁ బ్రాణముల్
తవతన లేకనిల్చి జగడంబున నేడ్తెఱ నూడ్చి పుచ్చినన్. 538

క. గెలిచినసిరి దొరుకునని, బొలిసినవరంభాదియువతిభోగము దొరుకున్
దలగడ యదిగద మృత్యువు, కలనికిఁ జావునకు నేలకళవళమందన్. 539

చ. బలము యశంబుఁ బ్రాభవముఁ బ్రాణము రాజ్యము మాలవిత్తమున్
గలన నరక్షణీయములుగావె మహామహులైనవారికిన్

గలదొకచిత్ర మాజియుఁడుగ న్మృతి నిక్కువ మాహవార్థియై
మలసినచోట మృత్యు వవమానము మాటలు వేయునేటికిన్. 540

క. పింగళకునితో మాఱ్కొని, సంగర మొనరింతు నొంతుఁ జంపుదుఁ జత్తున్
భంగమున కోర్వననుచుం, దం గటకట మిడికిపలికె దమనకుఁ డతనిన్. 541

క. విమతునిబల మరయక నై, రముఁ గొనుజనుఁ డేర్పడం బరాభవమందున్
సమధికబల మగుటిట్టిభ, కముతోఁ బగఁబూని చెడినకంధియుఁ బోలెన్. 542

క. నావిని దమనకునకుసం, జీవకుఁ డిట్లనియె నీతిశీలా యేలా
గీవిధముఁ దేటపడఁ జెపు, మా వినియెద ననిన నతని కతఁ డిట్లనియెన్. 543

చ. త్రిభువనకీర్తితాంబునిధితీరమున న్మనుగల్గియుండుఁ డి
ట్టిభమిథునంబు దైవగతిఁ డిట్టిభి దోహదలాలసాంగియై
శుభమతి ప్రాణవల్లభునిఁ జూచి ప్రసూతికి వేళయయ్యె దీ
విభవ మెఱుంగఁజెప్పఁగదవే స్థలమెయ్యది నాకు నావుడున్. 544

క. టిట్టిభ మిట్లను నీకుం, గట్టనినీడములు గావె కంధితటంబుల్
పట్టయినచోట గ్రుడ్లం, బెట్టుము నీవనినఁ డిట్టిభిక నలెసఁగన్. 545

క. మగనిఁ గని పలికె నేలా, తగుఁ దగదన కిట్లుపలికెదవు వనధితటీ
జగతిని గట్టనిగూఁడె, ట్లగు నీకిది యంతకొంచెమా కనుఁగొనగన్. 546

ఉ. పిట్టవు నీవు వారినిధిపెద్దలకల్లను బెద్దవెల్లిగాఁ
దొట్టునొకానొకప్పు డతిదూరము తుంగతరంగసంఘముల్
బెట్టడఁచున్ హరించునతిభీమభుజంగములీల నెట్టుగాఁ
బెట్టుదు నూతికట్టఁ బసిబిడ్డలుగావె మదండపిండముల్. 547

క. కానక కాంచిన యీసం, తానము మనవలయు నార్ధి దరియేటికి నె
చ్చోనైన నిపుడ యొండొక, తానక మెఱఁగింపు పెట్టెదం గ్రుడ్లచటన్. 548

క. నావిని యెఱచెలువు కనుం, గ్రేవలఁ గేవలము తేరఁ గెరలి కనోరా
రావమునఁ దనయనుంగుం, బావని నీక్షించి టిట్టిభం బిట్లనియెన్. 549

ఉ. ఎక్కువవానికిం గుఱుచయేనుఁగు నీకసదైనవై తిఁగా
కెక్కువగానె నన్నెఱుఁగు నీసరిదీశుఁడు నాకు వార్థికిన్
దిక్కరి మత్తికాంతరము దెల్పఁగ నేటికి గ్రుడ్లఁబెట్టు మే
దిక్కున నైన వానిదెసఁ దేఱికనుంగొనఁ దీఱదేరికిన్. 550

వ. అనువచనంబు లాకర్ణింపంగూడక ప్రాణేశ్వరి ప్రాణేశ్వరున కిట్లనియె. 551

క. ఇష్టజనోక్తులు వినక వి, నష్టదశం బొందుదుర్వినయుఁడు మరాళో
త్కృష్టోక్తిఁ జనక కాష్ఠ, భ్రష్టంబై తెగినకచ్ఛపముచందమునన్. 552

క. అనుమాటలు విని టిట్టిభిఁ, గనుఁగొని టిట్టిభమువల్కెఁ గల్యాణీ యే
మినిమిత్తము హంసోక్తుల, వినకొల్లక కమఠ మీల్గె వివరింపఁగదే. 553

క. నినుఁ గ్లతిలకాచియునిపే, ర్కొనునావచనంబు నిజముగ న్నగువా నా
కనురాగంబున నీకథ, వినియెదఁ జెపు మనిన నయ్యువిద యిట్లనియెన్. 554

ఉ. కుంజకుటీవిహారములకుం జనఁ జెంచులు నిర్ఝరంబులం
గుంజరము ల్నటింప బలుగూడెపుబోయలు చాలు వేఁటసాఁ
గం జెలరేఁగి సాళువపుగ్రద్దలుగూండ్లకుఁ బుల్లుమోవనిం
కం జెఱువు ల్భయంకరముగా నొకవేసవి దోఁచె తోఁచినన్. 555

క. కేలెత్తి యిసుముఁజల్లిన, రాలనియొకకానలో మరాళీవికస
న్నాళీకమధూళీమ, త్తాళీనాళీఖురాళియగుకొలనొప్పన్. 556

వ. అది సమగ్రశరంబును సమదసారంగభాసురంబును స్వర్ణపత్రరుచిరంబును నై సంగ్రామంబును ననిమిషకులాధారంబును నమృతరసపూరసంభారంబును ననవద్యతరువిస్ఫారంబును నై సురగ్రామంబును నిర్వియుక్తరథాంగంబును నిత్యకమలానుషంగంబును నిసర్గమధురగణచందంబును నై వైకుంఠధామంబును బరివేష్టితద్విజాతంబును బావనశిఖిసమేతంబును బరమనిగమపూతంబును నై హోమంబునుం బురుడించు. 557

క. అకొలను నాఁడునాఁటికి, నెక్కసమై క్రాఁచువెట్ట వేసవుల నసల్
చిక్కజలమి విరిపోయినఁ, గొక్కెరలకు జయము మీలకు న్భయమయ్యెన్. 558

క. ఆవిపినసరసిఁ గంబు, గ్రీవుం డనుకచ్ఛపము చరించు నతని క
చ్చో వికటసంకటము లనఁ, గా పరహంసములు రెండుగల వనుఁగుఁజెలుల్. 559

ఉ. జాలిఁ దలంకి యవ్వికటసంకటకంబు లపారదూరయా
త్రాలసదీనతానతనిజాస్యు వయస్యుగుఱించి యిట్లనున్
రాలును నాఁచు జిక్కనిపురంబడియెం గొలనెట్టు నిల్వఁగాఁ
జాలుదు మెందుకేనియును జాలుదుమే నినుబాసి కచ్ఛపా. 560

క. ఈయిరవున నఖమాంస, న్యాయంబున నున్నమనల నయ్యోచెడుగో
ట్టయి యాఱడి విధికుటిలో, పాయంబునఁ జేసెఁ గంటె పాయంద్రోవన్. 561

క. కావున నన్యసరోవర, సేవారతిఁ బోదుమా రసికవర్యా యిం
దీవుండు మనినఁ గంబు, గ్రీవుం డిట్లనియె వారికిం బ్రియ మెసఁగన్. 562

క. లావును గలిగినవారలు, గావున మీతలఁపు లొప్పుఁగద నేనన్న
న్నీయంటివాఁడఁ గాఁగద, యేవిధమున నిలుచువాఁడ నెక్కటినిచటన్. 563

క. అతివిమలపుణ్యమానస, యుతు లమలాకృతులు సుగతియోగ్యులు మఱియా
శ్రితపక్షపాతు లకటా, హతమోహులభంగి నరుగనగునే మీకున్. 564

వ. నాకెద్ది త్రోవ యని విన్నంబోయి యున్నగడుపునఁ జేయిడి కలంచిన ట్లగుటయు
మరాళంబులు గంబుగ్రీవు నూఱడించి. 565

క. జడియకు మనఘా నీకుం, గడవారమె నిన్నుఁ బాయఁగా మాచిత్తం
బొడఁబడునె యొండుమాటలు, తడయక మాపనుపుఁ జేసెదవె యట్లయినన్. 566

క. తరలక యేతత్కాష్ఠాం, తర మిఱియంబట్టు నిశితదంష్ట్రల నదిమే
మిరుగడలఁ గఱచుకొని సత్వర నాకాశమునఁ బఱచెదము నేఁ డొప్పన్. 567

చ. అనఘసరోవరాంతరమునం దిడునంతకు మౌనముద్రఁ దై
కొనవలయుం జుమీ యని సఖుం గమఠాగ్రణి నవ్విధంబునం
గొని యలవానజాలిపులుఁగు ల్గగనంబునఁ బోవ ద్రోషఘో
చనమహామాచరించె విదిశానగరంబు సమగ్రసంపదన్. 568

క. పరిఘులు గోటలు మేడలు, కరులు శతాంగములు హరులు కాల్బలములు భూ
సురులు భుజభవులు వైశ్యులు, చరణజులుం గలిగి యొప్పెసఁగు నవ్వీటన్. 569

క. కరిబృంహితంబు లూథ, త్వరపారశికాశ్వహేషితంబులు రథ్యా
చరదఖిలజనరవంబులు, శరనిధి ఘోషించినట్లెసఁగ విని మింటన్. 570

వ. కంబుగ్రీవుండు వికటసంకటంబులం జూచి. 571

క. ఇల వినవయ్యెడు నేతత్కలకల మెఱిఁగింపుఁ డనినఁ గఱచినదంష్ట్రల్
వెలువడినకాష్ఠకాండో, ద్గళితంబై నేలఁ గూలి కమఠము పొలిసెన్. 572

క. నీవును గంబుగ్రీవుని, కైవడి సుహృదుక్తియందు గాఢాదరముం
గావింపక చెడుద్రోవం, బోవుదు వని పలికి వల్లభున కది మఱియున్. 573

క. పలికె నొకమడుఁగులోనం, గలదు ఝషత్రితయమందు ఘననీతికళా
కలితములు రెండు తక్కిన, జలచర మతిమూఢతావశంగత మరయన్. 574

క. నావిని టిట్టిభకము దన, దేవి నిరీక్షించి గుణవతీమణి చెపుమా
యావిధమంతయు వివరము, గావేడుక ననిన నది మగని కిట్లనియెన్. 575

క. మున్నొకమడుఁగునఁ బ్రత్యు, త్పన్నప్రజ్ఞుం డనాగతవిధాతయు న
శ్యన్నీతి యద్భవిష్యుఁ డ, నన్నెగడు న్మూఁడు మీలవఘనతరముల్. 576

సీ. ఘనశిలాయుతమరుత్కపిలవిద్యుల్లేఖచండదావహుతాశసామిధేని
సమజమస్తకనగస్వరుపాతమహిమరుద్గలజరాగమహోదళాణచక్ర

మధ్వన్యచరణలగ్నాందుబహుసింధుపాథోరసగ్రాహిబాడబంబు
ప్రేంఖదాతపశిఖిన్యూంఖంబుదశదిశావృతమృగతృష్ణాతివృష్టిఘనము
తే. చించికాఫలహృష్టఘృష్టిప్రచండ, ఖురచతుష్కక్షురతోక్కష్ణపరిణతాజ్య
పాకసురభితగిరిదృషత్ప్రసవకంబు, కటికివేసవి దోఁచె నకాక్కయమునను. 577

క. వెలిఁబొరలు నీటఁ గొండొని, నలఁగినయాఁతీగమడుఁగునను నొండొకనాఁ
డలసేతరగతివలగొని, వలఁగొని యొకవేటకాఁడు వచ్చెం జొచ్చెన్. 578

క. చొచ్చి యగాధజలంబగు, టిచ్చం దలపోసి వేఁట కిది సమయముగా
దచ్చపుటెండలలోఁ బడి, వచ్చినతరువాతఁ దిరిగి వచ్చెద ననుచున్. 579

క. అన్నిచుఁ డరుగుటయు ను, ద్యన్నీతిధనుం డనాగతవిధాత సము
త్పన్నమతి యద్భవిష్యుల, సన్నిధికేంబోయి ధీమసంబున పలికెన్. 580

క. తెలతెలవారఁగఁ దొరపు, వలఁగొని యొకవేఁటకాఁడు వచ్చెం జొచ్చెం
జల మివిరినఁ జుట్టలతో, నలయుకమరి మరలివత్తు ననిరయ నన్నియెన్. 581

క. జలమివిరిన జాలరులీ, తలమునకద నరసివచ్చెదరు వారిచర
ప్రళయమగు నిలువవల దీ, నెలవున నొండెడకుఁబోయి నిలుతమె బుద్ధిన్. 582

వ. అనువాక్యంబు లాకర్ణించి ప్రత్యుత్పన్నమతి యనాగతవిధాత కిట్లను సఖా దూరంబున నేమికార్యం బుత్పన్నం బైనప్పటికిఁ బోలినతెఱంగుఁ జూచికొందము.

క. నెట్టన నొండొకకార్యము, వుట్టిన నెవ్వనికి నిశితబుద్ధిగలుగు నా
దిట్టం డాకార్యముఁ గొను, గుట్టున జారద్వయమున గొల్లెతవోలెన్. 584

క. నావిని యతిధీరతమే, ధావననిధి యల యనాగతవిధాత యనున్
బావనమానస యిదిచెప్పు,మా వినియెద ననిన నతని కతఁ డిట్లనియెన్. 585

చ. గొటియలమంద యాఁబసులగుంపు కృషిక్రియదుక్కిటెడ్లదొ
డ్డిటికిటిపెళ్ళుకంప బలియించిన లోఁగిలిముల్లుపెండెముల్
తఱుపులగాడికోడి యల దామెనగాదెలఁ గొల్చుగల్గి యే
కొఱఁతయు లేకయుండు నొకగొల్లత యొండొకపట్టణంబునన్. 586

చ. వన్నెలఁ బెట్టుఁగట్టుఁజలువ ల్చలువ ల్వెదచల్లుచన్నులన్
గన్నులకల్కిపూయుసిరిగందము మందమరుత్కిశోరముల్
జున్నులు రేఁప మెచ్చుముడుచు న్నడుఁజొక్కపుఁ గ్రొవ్విరు ల్సరుల్
పన్నశిరోధివీథిఁ గనుపట్టు నయారె యొయారమేర్పడన్. 587

ఉ. పాయనిమందనుండి యడపాదడపా చనుదెంచుబోయనిన్
బోయినఁ జీరజిక్కఁ దఁట పుణ్యములేదని మానసంబునం

దో్రియ కహోపరస్థలముఁ ద్రొక్కియుఁ జూచినయేని నాలుగేన్
గాయలు గాయ వచ్చెలువగర్భమునం దెటువంటిపాపమో. 588

క. కని పెంచని గొడ్రాలది, గననొడలు న్దొడలు నడలు కటి నెన్నడుమున్
జనుదోయి మెఱుఁగుజిగిబిగి, యనయంబుం ద్రచ్చివేసిన ట్లొప్పెసఁగున్. 589

ఉ. వేవిన నిద్రమేలుకని వేఱొకబానకు నేర్పుతోడఁ బై
మీవడఁ బుచ్చి కవ్వమిడి మిట్టచనుంగవ రాయడింప మేఁ
దీవ నటింప నెన్నడుము దీలుపడం గటిగుల్కఁ గాచముల్
జోవలఁ బాడజల్లఁదరుచు న్వడిఁ దర్షిణిరజ్జుపాణియై. 590

చ. వెడవెడ వేడివెన్నొరయు వేనలి మస్తకసీమఁ దక్రపుం
గడవ యొకింత పయ్యెదకుఁ గాకరదోఁచును రోజమాజ్యపుం
బిడుతపికొంగనొక్కి వలపించు నెలుంగమరంగ వీటన
ప్పడఁతుక చల్లవిల్చుఁ గనుపండువు జారుల కాచరింపుచున్. 591

క. అది దండపాలకుం డను, మొదలితలారి రహస్యమునఁ బిలుచున్నాఁ
డెద నెఱుఁగకుండ నొండొక, కొదవయు రాకుండ వానికొడుకు న్బిలుచున్ 592

క. ఈలీలఁ దిరుగఁ నొండొక, కాల మరిగె నరుగుటయు నొకానొకనాఁ డ
య్యాలరి గొల్లెతపట్టణ, పాలతనూభవునిఁ గూడి బహురతిగతులన్. 593

క. చొక్కెడ దండపాలకు, డక్కడి కేతెంచె నవ్వ డాతనిఁ గని తా
స్రుక్కక తర్షణి తత్సుతు, నొక్కకుసూలమున దాఁచె నుచితం బెసఁగన్. 594

గీ. దాఁచి యెదురువోయి దక్కినగతి నవ్వ, నివ్వటిల్ల వదననీరజమునఁ
గూర్చి చెట్టఁబట్టుకొని తెచ్చె లోపలి, కవద గారినారి యత్తలారి. 595

క. తెచ్చి కుసూలములోపలఁ, జొచ్చినబాఱుఁ గెగసి యొగసి చూడఁగ నపుడా
దిచ్చరి హెచ్చరికఁ బ్రియుం, గుచ్చిరతిక్రియలసొంపు గులుకుచు నుండెన్ 596

వ. ఆసమయంబున. 597

సీ. అట్టలెత్తినప్రాఁతమెట్టులు కడుగుటంబటిచాటికలతోడి పరువకొళ్ళు
నడిప్రాఁత ముతకగోణము మించుదులకించు ములుగత్తి యాలిమిడి మూలికలును
కొడిదిపూసల నంటుకొలిపిన మొలత్రాడు తలదుడ్డు చీరంబులపొదిగొను
నొడిసెలపాలకావడి నుచ్చుప్రాతలగుది మూఁపుపై వ్రేలుగోర్పడంబు

తే. తూఁతకొమ్ము చంకదోఁపినయొడమెట్టి తోర్లగోవిధూళిధూసరితము
లైనకురులు నమర నాకస్మికంబుగా, మందనుండి యింటిమగఁడు వచ్చె. 598

క. వచ్చిన జడియక కౌఁగిటఁ, గ్రుచ్చిన యలదండపాలకున కనునపు డా

దిచ్చరికంబే కావడిఁ, దెచ్చెను బతిచేయు మొక్క తెఱఁ గెఱిఁగింతున్. 599

క. కసరెత్తి ముక్కుడుస్సిన, పసరమువలె రేఁగి పరుషభాషల నన్నున్
విసువక పగఁజాటుచుఁ బో,మ్మసమున నన దండపాలుఁ డట్లొనరించెన్. 600

క. అరెకుఁ డట్లరుగుటయుఁ జ,కోరేక్షణఁ జూచి గోపకుం డనుమహిళా
కారణ మేమీ తలవరి, కీరూపున వచ్చె మెఱసి యిం దరుదేరన్. 601

క. వచ్చుటయుఁ గాక నోరికి, వచ్చిన యిట్లెపు రేఁగి పదరుచుఁ జూడ్కిన్
గ్రచ్చెగయుఁ బోవుచున్నాఁ, డచ్చెరువిది తెలియఁ జెప్పవమ్మా నాకనుడున్. 602

వ. తత్తరుణి మగని కిట్లనియె. 603

క. వెడవెడ నార్చుచుఁ బెఱికిన, పిడిబాకు వలకేలఁ గ్రాలు బిఱబిఱవెంటం
బడి యాహోయని డుర్ధుం, గొడుకుం డెగఁజూచె నెందుకో నే నెఱుఁగన్. 604

క. తఱుముడువడి మేన్వడకం, బఱిపఱి యగుతాల్మిఁ జావు పఱుపెత్తి యహో
వెఱపున నిలుసొచ్చినఁ గడు, పఱిముఱిఁ జేపెట్టి కలఁచినట్లయ్యెఁ బతీ. 605

వ. అట్లు భయాతురుండై యిలుసొచ్చి వచ్చిన నచ్చిఱుతవాని నతిస్థూలం బగు కుసూలంబున దాఁచితి. 606

క. అప్పుడు కన్నులనిప్పులు, గుప్పతిలఁగఁ గెరలిపండ్లుగొఱుకుచువాఁడా
చొప్పున నవచ్చి నన్నిటుఁ, దప్పక వీక్షించి ప్రల్లదంబునఁబలికెన్. 607

క. ఎచ్చరిక సెఱిఁగి వెంటన, వచ్చితి నీయిల్లుసొచ్చె వాఁడులుకున నేఁ
డిచ్చట లేఁ డెందరికెన్, దిచ్చట నిక్కువముఁ జెప్పితే మేల్గాదే. 608

క. అనియాదరవైచి నన్నడిగినవానిం జూచి మెత్తిగిలఁ బడకంటిన్
నిను నెవ్వఁ డెఱుఁగు నెటుపో, యినవాఁడో నీసుమారు నెవ్వం డెఱుఁగున్. 609

క. తలవరివి గావె యూరం, గలకొంపలఁ జొచ్చి చూచి కనుగొందువు నీ
కుల ముద్ధరించుకొడుకుం, దలయొవ్వరిమీఁద నొత్తిగెదవు నీవనినన్. 610

వ. ఇప్పు డప్పరుషభాషణంబులం బలుకుచుం బోవుచున్నాఁ డనిగాదె వెలువరించిన.

క. నిరవధికరాహుముఖగ, హ్వారనిర్గతశీతభాను, డనఁ గట్టెదురన్
బురరక్షకసుతుఁడుండన్, హరిణేక్షణ నెంతదానవని పతిపొగడెన్. 612

వ. కార్యం బుత్పన్నంబైనఁ దక్షణినలెఁ బోలినతెఱంగుఁ జూచికొందమని ప్రత్యుత్పన్నమతి పలికిన యద్భవిష్యం డమ్మాట లాదరింపక యూరకుండె. ననాగతవిభాతయు నందు నిల్వ వెఱచి యల్పసలిలసరణంబున నొండొకసరసిజశరణంబునకుం బోయె నాయెడ 613

సీ. కాలు మొసళ్ళవాకట్టుమందులు చరణాంగుళంబులఁ దాఁకుటుంగరములు
కడలేనినడగట్టి పడినపిక్కలు చుట్టి చెక్కినమొలత్రాళ్ళు చిక్కములును

జొంగులల్లాడుగోఁచులు తెండుగోలల నెట్టుకొల్పినమీలపుట్టికలును
బ్రతిదినాందోళికాభృతినల్పులై వెండ్రుకలు నిండి కాయలు గలభుజములు
గీ. చెవులవెలుములుకుఱుబ్రాత చెవులనాగు, పడిగపోగులు మెలిగొన్నపచ్చడములు
నమరగుమిగూడి జాలరు లరుగుదెంచి, దలరుమొగములతోఁ ద్రాటివలలు గొనుచు.

ఉత్సాహ. వచ్చి తజ్జలస్థలం బవారణం గలంగి రాఁ
జొచ్చి జాలముల్వైదుర్చుచోట యద్భవిష్యుఁడు
లిక్కచ్చలోనఁ గందళింపఁ నెందుఁ జొత్తునంచు మేఁ
టిచ్చపాటునొంద నత్తఱిం జరించె నల్గడన్. 615

క. మున్నాడి యొడలు డాఁపక, యన్నీటను జచ్చి తేలినటువలెఁ బ్రత్యు
త్పన్నమతినీతిరతియుం, డెన్నిరుపమధీరతాపటిష్ఠుం డగుటన్. 616

క. జాలరులు దానిఁ జచ్చిన, వాలువగా నిశ్చయించి వలెననక సరి
త్కూలమునకుఁ ద్రోచి సము, ద్వేలగతిం దిక్కులంబు ప్రీలఱలీలన్. 617

క. దుముకులు వైచుచు నాయూ, సమయంబుల జలము లెత్తి చల్లుచు వలల
శ్రమలీలవైవ నయగుణ, విముఖుఁడు దొలుదొలుత యద్భవిష్యుఁడు చిక్కెన్.

క. చిక్కిన లగుడంబునఁ దల, వ్రక్కలుగా మోఁది చంపి వైచిరి మఱియుం
బెక్కుఝషంబులఁ బట్టిరి, యక్కొలసము మాని తనిసిరది సందగుటన్. 619

సీ. కైవర్తకశ్రేణి కనుబ్రాఁగి యొకదొడ్డమనికి ప్రత్యుత్పన్నమతి వసించె
మతిబలంబున ననాగవిధాతయు నొండుకడకు బోవుటఁ జేటుఁ గానఁడయ్యె
విమతి గావున యద్భవిష్యుఁ డేమియు లేక పొలిసి జాలరులకు భుక్తియయ్యె
నతిమూర్ఖునకు నపాయము రాదె యిట్లని వరునకుఁ జెప్పి తొవలము లేమి
గీ. నంబునిధితీరమునఁ గులాయం బమర్చి, కొని కలంగుచుఁ డిట్టిభి గ్రుడ్లఁ బెట్టె
పొదిగె నేమఱుపాటు లేకదనఁబడన, కలుచపడకుండ నొండొంటిఁ గలపికొనుచు.

క. టిట్టిభకాహంకృతికిం, గట్టల్క జనించి కడలికడ నొండొకచోఁ
బెట్టినగ్రుడ్ల హరించెం, బిట్టటఁ వీక్షించి టిట్టిభిక గాఢార్తిన్. 621

చ. కనుఁగవ బాష్పవారి దొరుగ న్వరుఁ గన్గొని దూరి యప్పుడి
ట్లనియెఁ బయోధితోఁ గలహ మావిహగంబున కెంతలేదు పొ
మ్మనక చెనంటివై భవదహంకృతినమ్మి ప్రసూతినైతి ని
వ్వననిధితీరభూమిని దె వాఁడె హరించె మదండపిండముల్. 622

క. జలనిధి యుత్కృష్టంబని, తెలిసియు నీ వలఁతి వగుటఁ దెలిసియు బ్రజ్ఞా
బలముఁ దుదఁ జిదిమి యకటా, వలవంతంగంటి గౌరవము వీడ్కొంటిన్. 623

క. నీకతనఁ దనకు వాటిలె, నీకాఁటియ యనుచుఁ జిత్తమెరియంగా శో
కాకులమతిఁ బతిదూఱిన, నాకంఠక్రోధవివశమై ఖగమనియెన్. 624

ఉ. ఇంతగ రంతచింతదగునే నను నెవ్వనిఁగాఁ దలంచితో
యింతి మదీయశక్తియసురేశసురేశదురాసదంబు నేఁ
డింతకుఁ జొచ్చి వారినిధి యేపున మ్రుచ్చిలిగొన్న గ్రుడ్ల గ్ర
క్కింతు భవద్ఘనార్తిఁ దొలగింతు ధరింతు యశఃపరిష్క్రియన్. 625

చ. అని నిజదార నూఱడిలునట్లుగఁ బల్కి వయోవయోముఖు
ల్దనుఁ గనుగల్గి కొల్వఁ జని తత్పతగాగ్రణి గాంచె ముందఱన్
ఘనబలఘాతిహేతిభయకంపసమాగతమేనకాసుతా
వనకరణప్రహృష్టహిమవన్నగముద్రుఁ బయస్సముద్రునిన్. 626

వ. కని తత్పారావారతీరంబున. 627

సీ. తనతల్లి కగ్గొనర్చినపాప రామాత కడుపునఁ గడిఁది చిచ్చిడినవాని
గజకచ్ఛపాహృతిగ్రాసచర్వణతృప్తి వెలుఁగొందుజాఠరానలమువాని
ముఖసరిద్విటమధ్యమున నసాధు నిషాదఘోరవాహిని నుంచుకొన్నవాని
లావు పెంపునఁ గులగ్రావపక్షచ్ఛేదినిశితాసివేఁడి మానిచినవాని

గీ. నెల్లజగములు దనలోన నిముడుకొనిన, నిశిచరారంభసంరోధినిజశిరోధి
దివ్యమణిబోలెఁ దాల్చి వర్తించువానిఁ, బరమకారుణపూర్ణు సుపర్ణుఁ గనియె 628

క. కని మ్రొక్కి నిలచి వినతా, తనితాసమ్మదవిధాయి వచ్చినకార్యం
బనుచరముఖ్యా నాతో, ననురాగం బొప్పఁజెప్పుమా నా కనుడున్. 629

మ. పలికెం డిట్టిభమోవిహంగకులదీపా కోప మేపార న
జ్జలధిగ్రామణి నీకుటుండనని నిచ్చ ల్శ్వే ప్రశంసింపఁగా
సిలుగు ల్పెసగణింప కేడ్తెఱ హరించె న్మత్ప్రియాండంబు ల
గ్గలమే దేవర కన్నసాగర మెఱుంగంజెప్పఁడాలావునన్. 630

క. కాకున్న నింతగర్వం, బాకడలికి నెట్లుకలుగు నని టిట్టిభము
త్సేకత వినిపించిన రోఁ, షాకులితస్వాంతుఁడై ఖగాధిపుఁ డనియెన్. 631

క. ఏమేమీ నాసుభట, గ్రామణివని నీవు పల్కఁగాఁ డిట్టిభశం
కామగ్నుఁడు గా కబ్ధి, స్వామి మహాహమిక నిట్టివాఁ డయ్యెగదా. 632

ఉ. ధీరగరుత్సమీరణహతి న్సలిలంబులఁ జల్లి దృష్టదు
ష్టోరగకోటిజీవితము లూడ్చి తిమింగిలతద్గిలాదివా
శ్చారములం ఘనజ్ఞఠరజజ్వలనార్చులవ్రేల్చి వార్ధిని
స్సారముఁ జేసి గ్రమ్మఱ నొసంగుదుఁ ద్వద్వనితాండపిండముల్. 633

క. కులిశాయుధభీషణమై, వెలసిననాలావుఁ గనడో వినడో నన్నుం
గొలిచినవాఁడని నిన్నుం, దెలియఁడొ సాగరుఁడు చూచితే తలక్రొవ్వెన్. 634

క. అనియలుక మొలకలెత్త, న్వనరాశి న్గాసి సేయువాఁడై వినతా
తనుతాపహర్త చనఁగాఁ, గనుసన్న న్నాన్చి దైత్యఘస్మరుఁ డనియెన్. 635

క. మామహిళాజనకుఁ డు మా, మమ దుల్లసితకేళిమందిర మాప్త
గ్రామణిమణి నీరాకరుఁ, డామేటిం జెఱుప నుచితమా నీకరయగన్. 636

క. పలుకులనె చక్కఁజేయుం, గలఁగఁజుహాం బేలకడలి కడవాఁ డాగొ
డ్డలిగోరఁ బోవుదానికి, వలె నా కన లుడుమనునిన వడి నమ్రుండై. 637

క. ఉరగాంతకుఁ డనియె మహా, పురుషా నను గౌరవమునఁ బొందింపం దే
వరకుఁ దలఁపున్న మక్కుం, ధర నెక్క పయోధి కరుగుతడ వేమిటికిన్. 638

చ. కడుపునకా మహామహులఁ గాచుట గొల్చుట గౌరవంబునం
గడుఁబొడవై సుఖించుటకుఁగాక సముద్రునిచే లఘుత్వముం
బడసితి వ్యర్థమయ్యెఁ దలఁప న్దనజన్మము దేవ యెట్టియె
క్కుడు తనమేడలావు దనకు న్దలపంచుకొనంగ నోఁచితిన్. 639

మ. అదరంగాదు సముద్రుఁ డిందిరకులాయంబంచు వారించి తు
క్కడఁగం దేవర కేనుగానె తగులాయం బస్మదీయేప్సితం
బడుగం జెప్పితి సంఘటింపుము మదీయస్కంధసంవాసివై
వడి విచ్చేయుము మఖర్వనిర్వహణగర్వగ్రంధికి న్గంధికిన్. 640

క. అని విన్నవించి వినతా, తనయుఁడు నికటమున నిలువ దనుజారి కన
త్కనకగిరిహేళిపోలెన్, ఘనతం దత్కంఠమెక్క ఖచరులు మ్రొక్కన్. 641

వ. ఇట్లు గరుడారూఢుండై గగనంబున కుద్గమించి నిలింపులు గుంపులై కొలువ సుర
స్వద్మంబునం బద్మయొప్ప నప్పరంధాముం డేతెంచి. 642

మహాస్రగ్ధర. కలితాతిప్రీతిరీతిం గనియె బహుజలగ్రాహనిర్గాహధాటీ
చలపాతోత్పాతమీనాచరితపితమహాశ్చామరగ్రామపూజా
ఫలరేఖాపట్టభద్రుం బలరిపునగరప్రాంతవిశ్రాంతగంగా
లలనాసంశ్లేషభంగాలఘుకరనికరోల్లాసముద్రు న్సముద్రున్ 643

క. కని కదియఁబోవుటయు న, వ్వనరాశి మహాపతంగవల్లభకంతా
సనవర్తి నాదిమూర్తిన్, ఘనకీర్తి హృతాశ్రితార్తిఁ గని ముద మొదవన్. 644

క. అకలంకరత్నములుగా, నకలుగ జగదేకమోహినులు వాహినులు
త్సుకలీల వెంటరాఁగా, మకరారిం జేరి సంభ్రమంబున మ్రొక్కన్. 645

వ. మ్రొక్కి నిలువంబడి కరంబులు మోడ్చి యిట్లని స్తుతియించె. 646

దండకము. శ్రీవారిజాతాలయానర్తకీపూర్వరంగస్థలత్వాత్కౌస్తుభద్యోతముక్తామణీదామ
కస్తూరికాసౌరభోదార పాటీరచర్చోల్లసద్వక్షు, దేవాంబుజోన్మూలనాభీల నిర్గ్లాన
దానజ్వలద్దానవానేకపధ్వంసనావార్యహర్యక్షు, ధాత్ర్యంబరాక స్స్వర్రథ్యక్షువై
శ్వానరార్క క్షపాణ్ణోనిలాత్మేశ మౌళిస్ఫురత్పాదుకాధ్యాసి నిస్పృష్టసంసార
గంధప్రబోధ ప్రకాశార్యచేతస్సరోనిత్య సత్యాధినాథాపచిత్యుజ్జ్వల స్వర్ణదీవా
ర్ఘరందప్రభాభాసుర స్వర్ణమంజీర హంసస్వనత్పాదకంజాత, ధాత్రీధరారాధ
నాహం క్రియామర్షదేవర్షభ స్పృష్టనిర్దిష్టదుష్టోపలాసార సంరోధిగోవర్ధన చ్ఛత్ర
నిర్భీక గోగోపసంజాత, గోపాంగనాపాంగకాంతిచ్ఛటాచంద్రికాధౌతసద్విభ్ర
మభ్రూలతా కల్పకల్హారనీకాశనేత్రస్ఫుర చ్చంపకోల్లాసనాసారుణోష్ఠాలకాలం
కృతప్రస్తకస్తూరికాబిందుసౌరభ్య విభ్రాజిరాజాస్య, తాపత్రయారాతిషడ్వ
ర్గపంచేంద్రియాశా మృషాదోషసంసార దూరాదిమోహాస్య, వాచాలకేయూర
పారంపరీరమ్యసమ్యక్క్రమాపాణి సంస్థాపనంబుల్మహాయోగయుగ్ధ్యాన సాంతస్థ్తీ
ఖేలనంబుల్సదానర్ధితప్రాణిసంమోదముల్ఖేదవిచ్ఛేదముల్భక్తిముక్తిద్వికశ్రీ
దముల్గల్గుషత్రాసనిర్భేదముల్శ్రీమహాపాదముల్మౌళిఁ గీలింతు-భార్యాసుతభ్రాతృ
మిత్రప్రియప్రేష్య దృగ్భీషణగ్రాహ సందోహదుర్గాహ సంసారనీరాకరభ్రంశితా
లంబ సంతారకల్దుఃఖనిస్తారకల్లంబరారిస్ఫురత్కామకాకారకల్భాభరుద్భవ
స్వస్త్రియాధారకల్రక్షితప్రాణిసంఘల్భవజ్జంఘ లర్చింతు, సౌన్దర్యలక్ష్మీవిహారా
లయద్వార్బహిర్లగ్నరంభాధరాజాతముల్ దానవధ్వంస నారంభకేళీకళాన్వితముల్
గాంచనాచ్ఛాదనాచ్ఛాదితంబుల్ప్రభాపాదితంబుల్మనోజ్ఞప్రభాచారువుల్
దావకీనోరువుల్గొల్తు, సంవర్తవేళావినిక్షిప్తవిశ్వప్రపంచస్థితి న్భాసురస్వాకృతి
చ్ఛిన్నమారాభిచార జ్వలత్కుండకాండాయతి న్నాభిశోభాసనాభిం ద్వదీయం
ప్రశంసింతు, నస్మత్సుతాక్రీడనాగారము న్గౌస్తుభశ్రీపరిస్ఫారసందీప్తరాజన్మణీ
నీలభూభృత్తటీతుల్యవిస్తారము న్సారకస్తూరికాసౌరభోదారము న్హేమవస్త్రో
త్తరీయద్యుతిస్మేరము న్దావకశ్రీమహావక్షము న్భామినీశాపరీరంభసంభావనాద
క్షము న్సంస్తుతింతు-న్సరోజాతచక్రాసి కౌమోదకీధుర్యము ల్దుష్టశిక్షావిశిష్టావనస్థై
ర్యము ల్బాధకోరోజమాద్యద్రథాంగద్వయీనీడము ల్రత్నకేయూరసంపీడము
ల్దీననిర్భీతిదానక్రియాశస్తము ల్దివ్యచ్చతుర్హస్తము ల్సంస్తుతింతు, న్సుధాంశూద్గ
తజ్యోత్స్నికావిభ్రమభ్రాంతికృన్మందహాసద్యుతిశ్రీకము న్గుందబృందప్రతి
స్పర్ధిదంతాంకురోత్సేకము న్జంపకాకారనాసామణీకుండలాలంకృత శ్రోత్రకం
దర్ప సందర్పణభ్రాజిగండస్థలాన్వీతము న్నిర్నిరుద్ధానుకంపామృతస్నిగ్ధచక్షుస్సరో

జాతము న్నీతరోచిస్సుఖంబు న్సుఖంబుం ద్వదీయంబు వర్ణింతు, నభ్రంకషప్రాంజవ
గ్రావ శృంగాగ్రజాగ్రన్మహోగ్రాంశు ధిక్కృన్మహారత్న కోటీరముం దుందిలేందిం
దిరాఖర్వగర్వాతిపర్వాపణవ్యగ్రమందారగుచ్ఛస్రగామోది కేశాళివిస్ఫారము న్రత్న
రశ్మాపరగ్రస్తము న్బావక శ్రీమహామస్తముం బ్రస్తుతింతు, న్జగన్నాథ యాలోలక
ల్లోలమై తోలుమూలాయతశ్వభ్రమార్గంబునం బల్మి జిమ్మించి యొక్కమ్మడిం గవ్వ
వేళోరుమద్వారపూరంబు వారంధుపాకార తన్వేదహృద్రాక్షసు న్రోయు నీవాయ
తాక్షేప మేపారగా దంష్ట్రికావైఖరిం జాపరీతి న్మహాసీగభాతిం బ్రకాశించువాక్లే
ఖభావిక్షమాధార రామత్రయప్రక్రియం దెల్పగా, హవ్యభుక్కివ్యభుక్కూట
రక్షు ల్మదీయాజ్ఞ నస్మన్మణు ల్కిగ్గుగాఁజేయువాతౌశరజ్జుభ్రమ న్మందరగ్రావశాణం
బువన్నం దదాధారభూతౌశ్మరూపంబునం గచ్ఛపచ్ఛద్మత న్మన్న నాలో ప్రవ
ర్తింపవే, దేవ చక్షుర్భయోత్పాది తేజోహిరణ్యాక్ష సాక్షాత్కృతిప్రోథ నిర్ఘోష
రోషానలోద్దామ రోమాగ్రటంకంబులం దారకావ్యక్త ముక్తాఫలంబు ల్దొలు
లోవ ధావక్షుగాంతర్గతగ్రావము ల్జజ్జలో దారలీల న్రొదాలింప ఘోణాగ్రసంకల్పిత
శ్వభ్రమేకీభవన్మజ్జఁ బొక్కటం గ్రుక్కఁగాఁబట్ట నాయామదంష్ట్రాసురంగంబు
న్సర్వదిక్కుడ్యము ల్వ్రిమ్మ్యదీపించు నయ్యాదిఘోణిం బ్రశంసింతు యుష్మద్విష
ద్దైత్యధారాధరప్రస్తని స్సంద్రవిస్రావ్రవార్వ్యాప్తికి న్మత్యకంఠీరవాభైరవారావము
న్ప్రిపరాగాయితప్రోక్షణాక్షీణదీప్త ల్భవద్ఘోరనాసాపుటీనిర్గతశ్వాసముల్లగ్జలు న్మిం
చులు న్గాడ్పులుంగా, సపత్న్యాస్థలిన్ విశ్వదాస్థానిలీలన్ బలీంద్రేంద్రజాలైకదా
నాంబుధారాప్లుతిం ద్వత్కృశాతేజ మావామనాకారబీజం బహో దివ్యధాత్రీజతం
బొంది యత్యద్భుతస్థూలపాదత్రయి న్విష్టపత్రితయముం గప్పవే, చండవేదండశుం
డాసముద్దండ దోర్దండఖండేందు విస్ఫారపారశ్వధక్రూరధారాహతా శేషరాజన్యగా
త్రస్రవద్రక్తరోదస్విని న్ద్వత్పదాంభోజసంభూతకున్మగ్గ్రహోన్వీతకు న్శంభుజూ
టాటవీసంగకుం గంగకు న్నిత్యసాపత్న్యవాదంబు గల్పింపవే జామదగ్న్యుండవై,
మైథిలీశుల్కరూపాత్త బాణాసనద్రోహిగాధేయసంకల్పసంపాదనోత్సాహిని న్వా
హిని న్నింపు దెంపారఁగా నింపనూహించుశంభున్మహారోషసంరంభుజ్యాకృష్ట
నిర్భిన్నతత్కార్ముకోద్భూతకల్పాంతగర్జాసముజ్జృంభితధ్వానసంత్రాసయుక్తాగజా
శ్లేషసంపత్తిచేఁ దేర్పవే రామ రాజాన్యసుత్రామ శేషాయుతేషామిళల్లాంఛలతోటి
కోటీసముత్పాటవత్రాసితం జేసి దుర్దాంతకాంతారనీపద్రుమధ్యక్షమాధావదుష్టాంశు
జాతన్మణీబంధవై దుర్యనాళీస్ఫురద్వారిజాతం గలంగింపవే సీరివై, కంజనూతి
ప్రసాదప్రభావంబునం గావరం బెత్తి ముల్లోకము ల్హల్లకల్లోలము న్సేయు పూర్వా

నవవ్రాతము న్నిగ్గయాన్వితము న్భూరిమాయాకళాన్వితమున్ శౌర్యసంవీతముం జంప
నానామరశ్రేణి బాలింపనై లింప విద్విట్పురస్థాంగనామానభంగంబు గావించి తట్ల
యున సర్వజ్ఞతాభూతియు న్స్వారజిత్త్వంబు నిద్ధర్మరాజత్వముం బొందునే, ఘోర
రుద్వీకరభూరికుటీమాత్రదూరీభవల్లోకము న్సర్వదుర్లోకమున్ శార్వరానీకమున్ శా
తధారాకఠోరక్షురప్రప్రతీకాశపాదాగ్రసంక్షుణ్ణముంజేసి గంధర్వవిఖ్యాతి దీపిం
పవే, విశ్వరూపా జగద్దీప నీమస్తకం బంతరిక్షంబు నీ నేత్రము ల్సోమసూర్యాంశు
వుల్ దావకశ్రోత్రము ల్దిక్కు లుర్వీసురక్షత్రవిట్శూద్రజన్మస్థలంబు ల్భవదీ
యాస్యబాహూరుపాదాబ్జము ల్నీవు విష్ణుండ వంభోజగర్భుండవు న్నీవ నీవే కదా
శూలి విం ద్రాదిగీర్వాణులు న్నీవ సర్గస్థితిచ్ఛేదనాదిక్రియ ల్నీవ నీకుక్షిలో నుండు
విశ్వంబు నీవిత్తు విస్తారము ల్నీ న్బ్రశంసింపలే వాగమంబు ల్త్రిలోకైకరక్షా
శరన్నీరజాక్షా కృపాసాంద్రవీక్షా హృతిస్వర్గిసాపక్షా పరబ్రహ్మమూర్తీ విధూతార్తి
తార్థీ మునిస్వాంతవర్తీ జగత్పూర్ణకీర్తీ విపత్కాలమిత్రా నతాంభోజమిత్రా సము
ద్యచ్చరిత్రా సురస్తోత్రపాత్రా నమస్తే నమస్తే నమస్తే నమః. 647

క. అనిపొగడి మగుడమగుడ, న్వనరాశిపలాశిశాసివరచరణముల
న్దనశిరము మోపి వినయం, బున నిలిచి కరాంబుజములు మోడ్చి సభక్తిన్. 648

క. విన్నవించె వేదవిద్యోయతానకా, గమనకార్య మెద్దిగారవమున
నానతీవె యనిన నాపగావల్లభు, దిక్కుఁజూచి వాసుదేవుఁ డపుడు. 649

క. నారాకకుఁ బనివిను మో, నీరాకర వైనతేయునికి నీవెఱుఁగం
బోరానిభటుఁడు టిట్టిభుఁ, డీరస మిప్పక్షితోడ నెవ్వరి కమరున్. 650

క. చన దండపిండములఁ దె, మ్మనుడుఁ బ్రణామంబుఁజేసి యబ్రావిపెసం
గొనితెచ్చి యిచ్చెనాలో, వనరాశిం బాసి భక్తవత్సలుఁ డరిగెన్. 651

క. విమతుని లావకయకవై, రముఁ బూనినవాఁడు వారిరాశిక్రియఁ దై
న్యముఁ గాంచుననుచు శాత్రవ, దమనకుఁ డగుదమనకుం డతని కెఱిఁగించెన్.

వ. ఎఱిఁగించిన నప్పలుకు లాదరింపక సంజీవకుండు దమనకున కిట్లనియె. 653

క. కలనికిఁ బింగళకుం డెటు, వలె నుండఁగఁబోదు ననిన వాఁడురుదంష్ట్రల్
వెలువడినవదనముం బెడ, తలవాలమునుండ వానతిఱఁ జొమ్మనియెన్. 654

క. అని గుఱుతుఁ జెప్పి యద్దిక్కున నిలువక వచ్చి కరటకునిఁ గదిసి యుపా
యనములను మిత్రభేదము, నొనరించితి ననుచు నాతఁ డుబ్బుచుఁ జెప్పెన్ 655

క. అప్పుడు గగనమున మొగు, ల్గప్పి మహిం జఱచి విసరు గాడ్పులు బోప్పం
గప్పలు వడిగం డ్లురిలెం, గుప్పలుగొన సోనవాన గురియం దొడఁగెన్. 656

వ. అయ్యవసరంబున. 657

ఉ. జేవుఱుసోఁబకన్గొనలఁ జిప్పిల నూర్పులవెంట నుజ్జ్వల
త్పావకకీలలోలిఁ గనుపట్టఁగఁ గొమ్ములు వంచి కానన
గ్రామములం బ్రతిధ్వనులు గ్రాల ఖణిల్లన ఱంకెవైచి సం
జీవకుఁ డాగ్రహం బడర సింహము పైఁబడియెన్ మహోద్ధతిన్. 658

క. సంజీవకపింగళకుల, ఖంజపరాక్రమము లడరఁగాఁ గయ్యము సే
యం జొచ్చి రపుడు మహీభృ, త్కుంజరఫణిఘోణికూర్మకులపతు లదరన్. 659

క. తొలఁగకఁ గలఁగక వృషపిం, గళకము లవ్వాటఁ బోరఁగాఁ జిత్తమునం
గలఁగి వెలవెలని మొగమునఁ, దలఁ గదలిచి కరటకుండు దమనకుఁ బలికెన్. 660

క. అతిహీనమానసా నీ, కతమునఁ జేటయ్యె నేలికకు నీ వేదు
ర్గతి కేఁగెదవో యెఱుఁగ, న్మతిమంతుం డండ్రు నిన్ను మతు లేవియొకో. 661

సీ. సాంత్వనం బుచితంబు సాంత్వనత్యాగికిఁ బరసుదుర్భరపరాభవము గలుగు
వరుసఁ దక్కటివి యెన్నిరిగాని సామంబు ముఖ్యంబు దక్కినమూఁడు బుద్ధిఁ
దలఁప సంఖ్యామాత్రఫలములు నూనె దీపమున నాతపమునఁ బ్రచురరత్న
దీప్తిఁ జీఁకటివోలెఁ దీవ్రారితిమిరంబు సిద్ధసామజ్యోతిచేత విరియు
తే. నట్లుగావున నగ్రాహ్యమైనదండ, మధిపతికి గ్రాహ్యముగఁ జేసి యనియొనర్చి
తకట నీబుద్ధిగాల నీయభినయంబు, గూల నీనేర్పు నీతీర్పు నేలఁగలియ. 662

చ. శ్రవణయుగాంతరావరణచక్రము లగ్గలఁబట్టుఁ దోరపుం
జెవుడు కనీనికావసథసీమకు నుమ్మలికాడు దృష్టిపా
టవము గురుక్తి నాలుకకు డాసినచుట్టము పారుషత్యపుం
దెవులున నైద్యసాధ్య మెడద్రెవ్వక యెవ్వనినాశ్రయించినన్. 663

చ. తఱుచొకయించుకేని పరిధానమిషం బతిలాభకార్యముల్
చెఱుచు నరాతిజాతి కెడసేయక వాకొనుమర్మకర్మముల్
గుఱుచలఁ బట్టఁజూచు విభు కూర్చినచోటన కీడు సేయు మే
ల్మఱచునయారె రాజుఁ జెడు మంత్రి విపజ్జలరాశి ముంపఁడే. 664

చ. కలహము నిత్యకృత్య మపకారము పెట్టనిసొమ్మసత్యపుం
బలుకు జపం బకార్యవిధి ప్రజ్ఞ యనాదరణంబు సద్వ్రతం
బలుక కులాగతక్రియ యహంకృతి కీర్తి సుహృత్తిరస్క్రియా
బలము బలంబు నీతి కెడఁబాసి నినుం బురుడించుమంత్రికిన్. 665

చ. వడిచెడి యూఁగుపల్వ్రతికి వైచినఁ గూర్మివిషప్లుతాన్నముం
గడుపునఁ జేరనీక మహిఁ గ్రక్కినగాడిన ముల్లువుచ్చినం

గడుసుఖ మిచ్చినట్లు కొలఁగానియమాత్యనియోగిపెన్నవ
ల్విడిచి సుఖించుభంగిఁ బృథివీపతి వీడ్కొని మేల్గొనందగున్. 666

వ. ఆత్మభూత్యర్థంబు రాజు వివిక్తుంగాఁజేసి యొక్కరుండవయుండం బ్రారంభించి
నాఁడవు రాజు లాకీర్ణవిరాజులగుచెలువుంగవే సహాయసంపత్తివేసియాలేని నభి
యాతిజాతి విభీతిరీతిం జెప్పఁబడుచుఁగాదే యని కినిసి పలికి మఱియుఁ గరట
కుండు. 667

క. తనబ్రదుకుకొఱకుఁగా దుర్జనుఁడు నృపాలునకనీతిచాటు శతంబుల్
పనిఁబూని కఱపుఁ బిమ్మటఁ, దనకీడెఱుకపడఁ బతికిఁ దాఁ బగతుఁడగున్ 668

గీ. పతికి నభివృద్ధి దనకు శోభనము నైన, బుద్ధి బోధించువాఁడు వో సుమంత్రి
పతికిఁ జెట్టయు దనకు నాపదయుఁ జేయు, బుద్ధి బోధించువాఁడు వోకుమంత్రి.

క అతిరోషుండయి శాంత, స్థితికి మతిం గపటమూఁది చెలిమికి సుఖసం
గతుఁడై విద్యకుఁ బరుష, వ్రతుఁడయి యంగనకు నాసపడఁ జనదెందున్. 670

క. కడుఁదేజ మొసఁగి దయతో, నొడయఁడు దనఁ బెంపుఁజేయ నుబ్బున భీతిన్
నడచుట శోభనకారణ, మడఁకువ భూషణము గాదె యనుజీవులకున్. 671

వ. నీయనుష్ఠానంబున నీతండ్రియు నిట్టివాఁడని యూహింపంబడుచున్నాఁడు. 672

క. జనకాచార మవశ్యము, తనయుం బ్రాపించుననుట తథ్యము ధరలో
ఘనకైతకకంటకములు, దనరం దత్ఫలకులంబు దాల్చుటలేదో. 673

క. ఇంగిత మెఱుఁగనినీకు న, యాంగము బోధింపఁ బ్రాస మయ్యెడు మును దు
స్సంగతి నూచి ముఖాఖ్యప, తంగము కపిచేతఁ బోవదాదురోబ్ఫెన్. 674

క. నావిని దమనకుఁ డినసం, భావితుఁ గరటకునిఁ జూచి పలికెం జెపుమా
యీవృత్తాంతం బన నయ, కోవిదుఁ డాయనకుఁ గరటకుం డిట్లనియెన్. 675

ఉ. అంతనితాంతశైత్యకరమై కరమొప్పవహించి మించు హే
మంతము సేవమానలసమానబకౌఘునిరీక్షితాఖిలా
శాంత ముపాంతకాంతమిహికార్తజగజ్జనవర్ధితస్వథా
కాంతము కృష్ణసారమదగంధనృపాలనిశాంత మెంతయున్. 676

సీ. స్వవసువిశ్రాణనస్వపితవాసరముల కాయామమదవీయమై చనుటనో
హీరానుషక్తిఁ జెన్నారుతమ్ముల కతిశ్రాంతి గాఁ గలదని చింతిలుటనో
తనరాక మనులోకమునకుఁ బాటిలినశీతార్తి యనుక్షణం బణఁచుటకునో
సకలసస్యాభివృద్ధికి గభస్తిస్థాత్మజీవనం బవనిపైఁ జినుకుటకునో

తే. పగలురుచివాసి యొకమూలఁబడి సమస్త, నత్రములఁ జేరి యాత్మతేజమువ రేలు

వెలుఁగు శిఖియున్నకడ కేఁగవలసెననియు, భానుఁడకాల్యమునమందభానుఁడయ్యె.

చ. సదవనవైభవంబు పరచక్రవధోద్యతనంబు నిస్తులా
భ్యుదయ మనూనదానవిధియుం బరిపూర్ణకళావిలాససం
పదయును గల్గిరాజు గనుపట్టె ననంతపవప్రవిష్టుఁడై
యధిగత మూర్జితప్రసవమై కొమరొందె ధరిత్రి యెంతయున్. 678

మ. ప్రతిదిగ్దళప్తతమస్సమగ్రరుచిదూర్వ్యావర్వణాఖర్వముల్
హితగంధామృతముక్తతల్పములు భూయిష్ఠస్వమర్త్యాశ్రయన
వ్రతము ల్పొండె నఖండపాండురతుషారక్షీరపూరంబు లు
ద్ధతహేమంతగవాధిహోద్యమముచేత న్రాజగోజాలముల్. 679

క. అతిశీతలవిమలవిధూ, న్నతపాదాక్రాంతిర్ణ నరలోకారా
ధితగాక యునికి చిత్రము, ఖతిలాగతయతితుషారగంగ దగంగన్. 680

చ. ఒకత్రుటికాలమేనిఁ బనికొగ్గక మీఁగులు చూచుచుక్కఁబం
ట్రకు మడిఁ జేనఁగల్పుల కొడంబడ ఘాసము లూడ్చుకాలికాం
డ్రకు నెడసేద్యపుంబనుల డస్సిపడుండఁదలంచు పెద్దయె
డ్లకుఁ గలిగించె దైర్ఘ్యవికలస్థితి వాసరపంక్తు లూఁజటన్. 681

సీ. అహరాస్యజటిలనీహారధారాసారశైత్యాపనోదనోత్సాహముననొ
మలయశైలాగతానిలఖాద్యమాద్యదర్వాఖర్వగతిరేఖ నరయుటకునొ
బహుధర్మయుతసుతప్రణిపాతపూజనస్వీకారసంభ్రమోత్సేకముననొ
మందేహదేహసంబంధకోశత్రాణరాక్షసత్రాసదారంభముననొ

తే. మారుతప్రియుఁడాసి పటీరవనము, దాసి శమనుసముల్లాసిఁ జేసి పలవి
కాసి పుణ్యవతీడాసి రోసి వాసిఁ, దిమిరకులశాసి వర్తించె దినకరుండు. 682

ఉ. తోషణకారణైకవసతు ల్వసతు లత్తటి భగ్నసైంధవ
ద్వేషివిషాణగర్భరుచివిస్ఫురితాగురుదారుఖండసం
పేషితనూతనైణమదమిశ్రఘనస్తనదత్తనిర్భరా
శ్లేషణలీలఁ దేలుతురు శీతభయార్తులఁ బ్రాణభర్తలన్. 683

ఉ. భోగులు వుచ్చిరద్దివసముల్ పృథువహ్నిహసంతికాదిదృ
ష్టాగతులం గురంగమదసమ్మిళితప్రతినవ్యదివ్యకా
లాగురుచందనంబుల మహోయమళీభవదంశుకంబులన్
రాగరసైకవీటికల రాజముఖీపరిరంభణంబులన్. 684

సీ. నిర్ణిద్రదోషఘూర్ణితమనస్కులభంగి దృఢరవంబుగనొండ్లు దీడితీడి
ధృతిబలోద్ధతవిరోధిత్రాసితులలీల వారక వడవడ వణఁకివణఁకి

యువనిష్ఫన్నికటపత్త్యనుజీవులో యనఁ జేతు లంసములపైఁ జేర్చిచేర్చి
యాభీరవల్లభు లన దలవాకిళ్ల నొకట యావులగుంపు లొత్తియొత్తి
తే. సాగుబడినాటికమ్మరజాతివోలెఁ, గటికినిప్పులకుప్పలఁ గదిసి కదిసి
పొలిచి రప్పుండు వోలినచలికతమున, నాకులత నొంది రిలలోనిలోకులెల్ల. 685

క. శాకపుసరకులుఁ బోకలు, నాకులు గొంగళ్లు గుడుపుటంబరములు కుం
శీకాలాగురువు ల్గొనఁ, గైకొనఁ బ్రియమయ్యె శీతకాలమునందున్. 686

ఉ. ఆరికకూడు పుచ్చెఱు గావులవెన్నయు దోసగింజ సం
బారపుటాంబురంబు తనిమజ్జిగ మాకొనకంపుతోడఁ దం
డారగఁ బట్టి రడ్డిమడియా ల్సులుగోలలఁ బూని యొడ్లకో
పేరులు వైచి దున్నుటకు నేగిరి కోండ్రకు సాలివచ్చినన్. 687

సీ. చవులవేడబములు చాలించి తలసారె దఱలక చప్పిళ్లు ద్రావువారు
కాయసంధుల మహోగ్రగ్రంథు లొదవినఁ బెట్టిదంబుగ నూలఁ బెట్టువారు
రసధూమ మఖిలగాత్రచ్ఛిద్రములఁ బ్రాఁక నుబ్బలఁ బడి మూల్గుచుండువారు
ఛీసిగ్గు గాదొకో చేరమాకాటది యన్నఁ జెల్లెలి వావి యనెడువారు
తే. కోరి వాలుదుత్తైలంబుఁ గ్రోలువారు, కుములుసంపటిశాకముల్ గోరువారు
నైరి యొకకొంద ఱచ్చలినలసవాఙ్, వానిధాటివిహారంబుఁ బూనుటయును. 688

వ. ఇట్లాభీలంబైన చలికాలంబున. 589

క. ఒకగహనంబున నొకచో, నొకశీతార్తప్లవంగయూథము ఖద్యో
తకముల శిఖియని కావఁగఁ, బకపకసూచీముఖాఖ్యపతగము నగుచున్. 690

క. ప్రతికీశశ్రుతిపుటసం, గతమై యటసహజసహ్నిగా దిది శీత
చ్యుతిదీన నగునె యని వి, శ్రుతవాచారభటిఁ జెప్పుచుఁ న్వలదిరుగున్. 691

క. ఈరీతి పులుఁగు పిలుని, పేరఁట మేతెంచి చెవులు బీఱువడ నేఁ
సారక చెప్పఁగ నందొక, కూర్మిరప్లవగంబు పండ్లుగొఱుకుచుఁ గినుకన్. 692

క. పడి నొడిసిపట్టికొని కూ, యిడ నుప్పర మెత్తియొమ్ము విరియఁగ శిలతో
నడిచిన నెపుడో ప్రాణము, విడిచె న్బృథాబోధకుండు వీఱిఁడిగాఁడే. 693

వ. ఇట్టికథ యయ్యెడునని నినుబోధింప వెఱచెద నైనవినుము. 694

క. అలఘుతరప్రజ్ఞాఘన, బలముల నెవ్వాఁడు గోత్రభరము వహించుం
బలుకులు వేయేలనిజం, బలయుత్తము నోఁచి కాంచినది తల్లిగదా. 695

గీ. దేశకాలాంతరంబులఁ దీలుపడని, బుద్ధిసౌందర్య మొక్కఁడె యద్భుతముగాక
గాత్రసౌందర్య మేరికిఁ గలుగదనిన, దానివిని విన్నసై యుండె దమనకుండు.

ఉ. వేసటతోడిపల్కు తనువేపనభావము సోష్ణదీర్ఘని
శ్వాసము గద్గదస్వరము శంకితదృష్టికపోలహస్తవి
న్యాసము వాడుదేఱుపదనంబు స్వయంకృతఘోరకల్మష
త్రాసితలక్షణంబు లని తత్త్వవిధిజ్ఞులు సెప్పిరేర్పడన్. 697

క. ఈరీతి నుండ నేల మ,హీరమణున కిట్లొనర్ప నేల విచారం
కూరముఁదుదఁ జిదిమితివని, రారాపున వాని నక్కరటకుఁడు మఱియున్. 698

క. అనయపరుం డగుమనుజుఁడు, తనవారిం జెఱచి పిదపఁ దానుం జెడుఁబో
మును దుష్టబుద్ధిమాటలు, విని తజ్జనకుండు ధూమవేదనఁ దెగఁడే. 669

క. అనిపలికిన నీతికథా, ధనుఁ గరటకుఁ జూచి పలికె దమనకుఁ డో స
ద్వినయాఢ్య యెట్టికథ, విననిష్టం బయ్యెఁ దెలుపవే నాకనుడున్. 700

క. కరటకుఁ డిట్లను నొండొక, పురమున వర్తించు ధర్మబుద్ధి యనంగాఁ
బరఁగు నొకసెట్టివానికి, సరిచుట్టము దుష్టబుద్ధి సఖుఁడై తిరుగున్. 701

క. వానికి వానికి బ్రాఁకస, మానమహామైత్రి పెరుగ మఱి యందు మనీ
షానిధికి ధర్మబుద్ధికి, దీనారసహస్ర మొక్కచోసఁ గనవయ్యెన్. 702

క. కానంగనైన సొంపు ని,జాననమున మొలకలొత్త నవ్వార్త సుహృ
న్మానసమున డాఁపనేరక, పూని సఖుండనుచు దుష్టబుద్ధికిఁ జెప్పెన్. 703

ఉ. చెప్పిన నద్దురాత్ముఁడు శంకఁదు బూరఁడునై సుహృత్తముం
దప్పక చూచి పూర్వసుకృతంబున గాంచినసొమ్ము నెమ్మినె
నిప్పొలిమేర కేసరమహీరుహమూలమునందు డాఁచిపో
నొప్పునొగుల్లనుంగొనరె యూరికయోకొనిపోవఁజూచినన్. 704

గీ. ఇతరు లెఱుఁగ నేల యింటికిఁ గొనిపోవ, నేల నేల యదసి యొఱుఁగకుండఁ
గుండబాఁతి యింతకుండనె చనుటొప్పుఁ, దగ నొనర్పు మనల ధర్మబుద్ధి. 705

ఉ. వంచనసొమ్ముఁ బుచ్చుకొనువాఁడయి వీఁడిటులాడుచున్నవాఁ
డంచు మనంబునం దెలియ కాతని నిక్కము నెయ్యుఁగా విచా
రించి యొకొన్ని పుచ్చుకొని వృక్షసముజ్జ్వలమూలమందు న
క్కాంచినసొమ్ముఁ బాఁతి చెలికాఁడును దానును బోయి రిండ్లకున్. 706

ఉ. పోయి నిశీథమైనఁ జెడుపోకలకోమటి దుష్టబుద్ధి యా
రేయి గృహంబుఁ బాసి నగరీజనులం గనుబ్రామి యొంటి నా
చాయకు నేగి కూడుబలిఁ బల్లి పెకల్చి ధనంబుఁ గొంచుఁ బే
రాయపుసొంపునం జనియె నచ్చతరత్వర నొంటి నింటికిన్. 707

గీ. అతఁడు గొన్నిపూఁట లరిగిన నింటికిఁ, బోయి తాను ధర్మబుద్ధి కనియె
దిరుగఁ జూడవలదె దీనారభాండంబు, సురిగనేమొ దిగులుసొచ్చె నాకు. 708

క. అని వెరవుఁజూపి పిలిచిన, ననుమానము పుట్టి తాను నాతఁడు జోడై
చని ధర్మబుద్ధి వినిహిత, ధనభాండముఁ గానఁడయ్యెఁ దరుమూలమునన్. 709

ఉ. కానక మానసంబు కలఁగంబడ నిట్లను ధర్మబుద్ధి య
య్యో నిను సద్వయస్యుఁడని యెండొకచిత్తములేక నమ్మియి
చ్చో నిడి చన్న నాధనముఁ జోరునిచాడ్పునఁ బుచ్చుకొంటి వి
స్సీ నరభోజనుండయినఁ జెట్టఁదలంచునె విశ్వసించినన్. 710

ఉ. పూని మదీయవిత్త మిటఁ బూడ్చుతఱిం బరికింప నక్కటా
యేనును నీవకాని యెరులెవ్వరెఱుంగరు నీవుదక్క నొ
ప్పా నిజమాఁ బరులొప్పరయ రర్థముఁ గ్రమ్మఱఁ దెమ్ము దొంగవే
రానకుఁ బాలుపడ్డ నగరా నగరాలుదురాత్మ నావుడున్. 711

క. విని దుష్టబుద్ధి బుద్ధిం, గనలుచు నద్ధర్మబుద్ధి గనుఁగొని పలికెం
గనినాఁడవో వినినాఁడవో, చనునే నామీఁద నిట్టిపడి మోపంగన్. 712

క. నీసఖ్యమునఁ జరించిన, దోసము మోసమున నేఁడె తోడనకలిగెం
బోసరమొ నోరిక్రొవ్వో, చెపో యిట్లాడ నెవ్వరికి నీడేరున్. 713

ఉ. ముచ్చుదనంబు నాపయిన మోపకయుండిన సెట్టిబిడ్డవే
ఇచ్చునె నీకుఁ గూడుఁగుడునం గులకామిని ప్రక్కఁబండెదే
క్రచ్చఱఁ గన్నసొమ్ము తిరుగంబడినం గొనకున్న సెట్టిరా
రచ్చకునంచు నీడ్చి పదరంబడి వాఁడు సుహృచ్ఛిఖామణిన్. 714

వ. ఇట్లు ధర్మబుద్ధి నీడ్చుకొని చని నగరంబడి ధర్మంబున కొప్పి పిన్నపెద్దలం గూడ బెట్టిన ధర్మవేదు లుభయవాదుల నాలోకించి తమకింపక అంతు సేయ కడ్డంబుసారక యిరువురు గలసి పలుకక యొకరొకరిపూర్వోత్తరంబులు తెలియునట్లుగా మీమీసుద్దు లుగ్గడింపుఁడనుటయు నందు ధర్మబుద్ధి కృతాంజలియై సభవారి కిట్లనియె. 715

క. ఈతఁడు నాతోఁ జెలికాఁడై తిరుగం బెద్దకాల మరిగె న్వనుఁడీ
భూతలమున దీనారస, మేతవినిష్టంపభాండ మేఁ గనుఁగొంటిన్. 716

క. కనుఁగొని నిక్కము చెలికాఁ, డని పెద్దయు విశ్వసించి యీకథయే నీ
తనికి నతిగోపనంబుగ, వినిపించితి నావివిక్తి వీటింబోవన్. 717

క. వినిపించిన నాతఁడు నా, కనుతత్తనిపగిది ననియె వనభూ యేత
ద్ధన మూరియొద్ద నేటికి, సినువేఁడెద నల్లయు నిచట నిక్షేపింపన్. 718

క. అని తరుమూలముఁ జూపిన, మనమున నద్దుష్టబుద్ధిమత మెఱుఁగక చె
ప్పినయట్ల సేసిపోయితి, తనయింటికి నీతఁ డంతఁ దానుంబోయెన్. 719

క. కతిపయదివసము లరుఁగఁగ, నితఁడు నను బిలిచి పలికె నిష్టసఖా నా
మతినతితాపము వొడమెడు, నతులగతిం జూడఁబోత మావిత్తంబున్. 720

క. అనపలికి నన్నుఁ దోడ్కొని, చని తరుమూలమునఁ జూడ సంగుప్తధనం
బునిచినచో లేదయ్యె, న్మనసెరియం జొచ్చె దైన్యమగ్నుఁడ నైతిన్. 721

క. సొమ్మున్నది నీయొద్దం, దమ్మని నే నదరనై చితే నీతఁడు న
న్నమ్మాటలాడి త్రిప్పెం, దిమ్ములకుం జొచ్చి యీడ్చితెచ్చె న్సభకున్. 722

వ. ఇంతియ యని ధర్మబుద్ధి యూరకుండె నప్పుడు దుష్టబుద్ధి ధర్మాసనస్థులకుఁ బ్రణా
మంబు లాచరించి యిట్లనియె. 723

చ. ఎనసినచెల్మి నుండుటయు నెక్కటిపాటఁ దదర్థభాండముం
గనుటయు నాకుఁ జెప్పుటయుఁ గప్పుటయుం గల దంతనింతకుం
జనియెక నాలుగేనుదివసంబులు వోవఁగ వచ్చిచూడఁ బోఁ
తినకడ సొమ్ములేదు కనితీసికొన న్మహిజంబుసాక్షిగాన్. 724

క. నావిని ధర్మాధికృతుల్, వావాదంబేల యేనువారము లెడ మీ
రేవివరము నాఅవనాఁ, డావిస్మృతబుద్ధిఁ దెలుపుఁ డరుగుఁడు మగుడన్. 725

వ. అనువచనంబులు విని దుష్టబుద్ధి. 726

క. అవకాశ మేమిటికి వట్టివివాదం బింక నేమిటికి శుద్ధాత్ముం
డవు నితఁడని నన్నందఱు, దగఁ బొగడఁగ సాక్షిఁ దెలిపెదనుమీపాలన్. 727

క. నా విని ధర్మువారలు, నీ వెవ్వరి సాక్షిఁ దెలుపనేర్తువు చెపుమా
వావాద ముడిగె నన మా, యావాదనశాలి వారి కతఁ డిట్లనియెన్. 728

క. ఏపాదపమూలంబున, బాపురె దీనారపూర్ణభాండ మహోని
క్షేపింపఁబడియెఁ దెలియఁగ, నాపాపవిభుఁడు సాక్షి యగు మీ కడుగన్. 729

క. అనదుష్టబుద్ధిపలుకులు, విని యచ్చెరుపాటు గదుర విద్వజ్జను లే
దినమునకు నేమిప్రొద్దునఁ, జనుదె మ్మరసెదము గాక సకలం బనుచున్. 730

క. చని రంతధర్మబుద్ధియుఁ, జనియె గృహంబునకు వానిజాడనె తోడ్తో
జనియెఁ బ్రతివాది యాలో, దినకరుఁ డపరాబ్ధి వారిఁ దెప్పలఁదేలెన్. 731

గీ సంజచివురించెఁ జీకట్లు సందడించెఁ, గలువ సొంపెక్కెఁ జక్రవాకములు స్రుక్కె
జలజములు వాడె దిశలఁ దేజంబు వీడె, ఘూకము ల్మెఱె విహగముల్గూండ్లుసేరె.

వ. అప్పుడు దుష్టబుద్ధి యేకాంతంబునఁ దనతండ్రియడుగులంబడి యిట్లనియె. 733

29420
17-9-87

ఉ. చోరుఁడె దుష్టబుద్ధి యతిశుద్ధుఁడు గాకని భూరుహంబుచేఁ
జోరులు గుంపులై విన సభం బలికించెదనంటి వచ్చితిన్
జేరెడుమాటమాత్రమునఁ జేకొను మస్మదభీప్సితంపుదీ
నారసహస్ర మెప్పటికి నందనులాభముతండ్రిఁ బొందదే. 734

క. తరుకోటరమున నీ వొక్కరుఁడవ వసియింపు మొరులు కను...దం
బరిషజ్జనము భయంబున, నరుదెంచినఁ బలుకుసభ్యుఁ డని నిన్నడుగన్. 735

వ. అనినం గొడుకునకుఁ దండ్రి యిట్లనియె. 736

క. చెడుబుద్ధి నీకుఁ బుట్టెం. జెడితివి నన్నుం గృతఘ్న జెఱిచెదె యూఁకో
నొడఁబాటుగాదు చిత్తము, వెడఁగులపని పంపుసేయవిటిఁడి గలఁడే. 737

క. మొదల నపాయం బెన్నుట, పిదప నుపాయంబు లెక్కఁబెట్టుట తగునీ
చిద గొదలఁ గాదె మున్నొక, మదికొక్కెర యనఁగునుతుల ముంగిస కిచ్చెన్.

గీ. అనిన దుష్టబుద్ధి జనకు నిరీక్షించి, యిట్టు లనియె నకుల మేకతమున
బకపికార్భకముల భక్షించె నొకవేమి, నేనె నంతవట్టుఁ జెప్పవలయు. 739

వ. అని యడిగినఁ దండ్రి కొడుకున కిట్లనియె. 740

మ. కలదభ్రంకషభూజరాజిశుకపాకగ్రస్తశస్యస్వరు
త్వేదృగ్వాక్యము కూలముద్రుజఝురీభంగాంగసంఘర్షజా
నిలఘోషప్రతిఘోషితద్విరదవిద్విట్క్షోభమ ముగ్రద్వీపి
స్థలకృత్కీలదరీనికాయ మొకకాంతారంబు దుర్వారమై. 741

ఉ. ఆవిపినంబునం దొకమహామహిజంబున నగ్రశాఖపైఁ
దా వసియించి యొక్కబకదంపతి పిల్లలఁ జేయుఁ జేయు నా
కీవిష మాసమీపబిలసీమమున న్వసియించియుండి వా
పోవఁగ నన్నిటి న్నసవిపోవు సమాసమ నివ్విధంబునన్. 742

క. ప్రతిసంవత్సరమును నీ, గతిఁబిల్లలఁ బాముపాలుగావించి మనో
గతి బకమిథునము పొగులం, బ్రతిక్రియఁ గానక యలంతఁ బగలు నేర్పులన్. 743

వ. అట్లుండఁ గొండొకకాలంబునకుఁ దననాతికిఁ బ్రసూతిసమయం బగుటయు భుజ
గభయానకం బగుబకంబు తికమకంబై సంతతిసంభరణంబునకు విరోధిసంహారణం
బునకు నుపాయంబుఁ గానక తానకంబుఁ బాసి ప్రియసఖుండు నాసజ్జయాభి
ముఖుండును నగుకర్కటపాణినామకుళీరకుం జేరంబోయి కాయం బడచిపడ బుడి
బుడికన్నీరు గ్రుక్కుచుఁ జిక్కుకొన్నకంఠంబునఁ దనకుఁ బాటిలినచేటువాటు
ప్రకటించి శోకించి పుత్రత్రాణవిధేయం బగునుపాయంబుఁ జెప్పి యాశత్వారా

వారతీరంబుఁ దప్పవై చేర్పుము నన్నీడేర్పుము నీవని కనికరం బొలయఁ బ్రార్థించిన
బకంబునకుఁ గుళీరం బిట్లనియె. 744

క. భువనవిహారివి నవలా, ఘవమును లావును గొలంతగా దన్నటికిన్
దివిరిపథియింతు వనిమిష, నివహము నీయంతవాఁడు నెగు లెట్లొందెన్. 745

క. శోకార్తులకు నుపాయము, లేకరణిం దోఁచు ధైర్య మెవ్విధిఁ గలుగున్
రాకడపోకడలకు జవ, మేకొమరున దొరకుఁ గడఁక లెటువలె నొదవున్. 746

క. ఐనను దీనికిఁ దగు తెఱఁ, గే నీకెఱిగింతుఁ జేయు మిది భవదీయ
స్థానతరునికటగతకా, దే నబింబునకు నకులదృఢబిలమునకున్. 747

క. ఎడత్రెవ్వకుండ మీలం, దడవైవుము వాని నెల్ల భక్షింపుచు నె
వ్వడి నేఁగి ముంగిపాముం, బడలుపడం గఱచిచంపుఁ బగ నీ కణఁగున్. 748

క. చనుమని యాహారంబిడి, పనిచిన నప్పులుఁగు చనియెఁ బయనం బైత
ద్వనిత యొకకొన్ని నాళ్ళకు, గొనబై యప్పోట గూఁట గ్రుడ్లం బెట్టెన్. 749

గీ. పెట్టి ముదిగుడ్లునవకుండఁ గట్టుగాచి, పొదుగుటయు నైతకొని కొన్ని పూఁటలకును
బికిలడింభంబు లాలోన బకవిభుండు, యెండ్రి చెప్పినగతి మీలనిండవైచె. 750

గీ. కవుచుగాలివారఁ గవిఁ బాసి వెలువడి, వరుసమీల దినుచు వచ్చివచ్చి
పాము జంపి పాదపముఁ బ్రాకి బకశిశు, ప్రకరభుక్తిఁ దనిసి నకుల మరిగె. 751

ఆ. ఒకఁడు సేయఁబోవ నొకఁడగు నీబుద్ధి, గూల నన్నుఁ జెఱుపకుము దురాత్మ
చెడిన నీవ చెడుము చెప్పకు మీమాట, యర్థభాండ మొల్ల నన్య మొల్ల. 752

క. అని ముగియుంబలికిన నా, ననమున దైన్యంబు దేఱ నందనుఁ డాసె
ట్టనకాళ్లమీఁదఁబడి యిఁక, వినునావచనంబటంచు వేఁడుకొనంగన్. 753

తే. మోసపోవనివాఁడయ్యుఁ ముదుకఁడయ్యు, విధివశంబునఁ జెవివేఱఁ వేసి సెట్టి
యర్థరాత్రంబునం దేగి యడగియుండె, గూబచందాన నలవృక్షకోటరమున. 754

వ. అంతఁ గొంతప్రొద్దునకుం బద్మబాంధవుండు పూర్వపర్వతశిఖరసింహాసనం బెక్క
నప్పుడు పిన్నపెద్ద లుభయవాదుల రావించి వృక్షసమీపంబునకు వచ్చి యర్చించి
యయ్యిరువురిలోన వంచకుం డెవ్వఁడు చెప్పుమని ప్రాంజలులై నిలిచిన. 755

క. ఎలుగొందఁగఁ దరుకోటర, తలమున నద్దుష్టబుద్ధితండ్రి మహోని
ర్మలధర్మబుద్ధి సుగుణో, జ్వలుఁ వంచకుఁ డనియె నెల్లవారు వినంగన్. 756

క. అందఱు నమ్మాటకు వెఱఁ, గందిరి యలదుష్టబుద్ధి యానందమునం
జెందినటియించెఁ బౌరుల, ముందరఁగరతాళగతులు మొరయ స్వైరయన్. 757

ఆ. ధర్మబుద్ధి వగచి తలయూఁచి తనలోన, ననియె నేఁడు సత్యమణఁగె ధర్మ
మునని వెల్లివిరిసె ననృతంబు చూచితే, నిర్నిమిత్త మిట్టినిందపుట్టె. 758

క. తరువులు సాక్షులు పలుకునె, నరులడిగిన మనుజభాషణంబుల నిదిపో
యరుదు పరామర్శింపం, గరము ప్రయత్నంబు తోడఁ గల దిందనుచున్. 759

క. ఆకుజఘనకోటరమున, నాకలములు వైచి యనలమంటించిన న
స్తోకతరకీలసంయుత,మై కీలలు ప్రబ్బికొనియె నభ్యంతరమున్. 760

క. పొగ నుడ్డుకుడిచి మంట, న్నగమరుగం గాలి యేడ్వఁగ నన్నగమున్
డిగనుఱికి దుష్టబుద్ధిం, దెగిలిట్టుచు బిడుగుబడఁగ దేహము విడిచెన్. 761

వ. అప్పుడు రాజపురుషు లదుష్టబుద్ధి నిరీక్షించి. 762

సీ. చెల్లుసెల్లముల నీక్షింప నిచ్చినసొమ్ము మగుడ నీ లేనికోమటి గులాము
చేసేత విశ్వసించినవారివెచ్చసచ్చములఁ గీడ్పఱచు నై జాతితోండ
తెగిగంటిలేనిపోటుగ నొడ్లయద్దల గిద్దెఁ బొడచు వేగినబిగాది ధూర్త
బూసంబుదరిపి నేర్పున నమ్మికొనుటకుఁ గరవుఁగో రదుదోసకారిబుడుఁగ

తే. యప్పనెపమున నూఱాలు లడిగి పుచ్చు, కొని నయంబునఁ దీర్పక కోఁకపోఁక
సరకుసప్పట సరిచెప్పి యరగఱాచు, చెడగరపుదొక్క యోరోరిసెట్టికుక్క. 763

వ. అనితిట్టి సొమ్ము ధర్మబుద్ధి కిప్పించి దుష్టబుద్ధిం గొఱఁతఁబెట్టిరి దుష్టబుద్ధి యగు వాఁడు తనవారినిం జెఱచు తానుం జెడు నిల్లు రాజునుం జెఱచి తరువాత నీవునుం జేటునొందెద వనిపతికి కరటకుండు వెండియు. 764

చ. కడుఁ జెడుకార్యము ల్దమనకా మనకా భయమయ్యె నేఁడు నీ
నడపడిఁ జూచి నమ్మదగునా నినుఁ జిల్వకుఁ బాలుఁబోసి ముం
గడపసియింపఁజేసి చిరకాలము పెంచిన మేలెఱుంగునే
కడఁగి బడల్పడం గఱచుఁగాక కృతఘ్నులె దుష్టమానసుల్. 765

క. తెలియనివారిఁ దెలుపఁగనగుఁ, దెలిసినమానవుని నలదు తెలుపఁగ మదిలోఁ
దెలిసియుఁ దెలియనికఱటికిఁ, గలితన మెఱిఁగింపఁ గమలగర్భునివశమే. 766

క. పతి కిట్లొనరించిననీ, కితరు లనం దృణకణంబు లెలుకలచే భ
క్షితమయ్యె ననుపత్రసను, కతవినవే మున్ను దమనకా నీ వనుడున్. 767

క. దమనకుఁ డలకరటకుఁ డి,క్కు మొగంబై యెట్లు నీతికోవిద యిది స
ర్వముఁ జెప్పుమనిన నక్కథ, యమలమతిం జెప్పఁదొణఁగె నతఁ డాతనికిన్. 768

చ. వనిచి కి వేరజాతటమున న్మహిసారపురంబునం గృత
ఘ్నునిచెలి మందభాగ్యుఁడను కోమటి వర్తిలు విక్రయింపనుం
గొనఁ దిన లేమిఁ గూటికిని గోఁకకు నీదిరమై కృశింపుచుం
గనుఁగవఁ బ్రాణము ల్నిలిపి కాఱియగాఁగ నతండు నిచ్చలున్. 769

ఉత్సాహ. కోరి మ్రొక్కఁ గ్రొత్తపెండ్లికూతుఁ గృష్ణఁ జూచి యో
వారిజాయతాక్షి భాగ్యవంతుఁ గాంతుఁ గాని వి
ద్యారణప్రవీణుఁ గాంచ కట్టిమత్సుతుల్వని
చారులైరి చూడుమంచు సాధ్వికుంతి పల్కదే. 770

వ. అని తలంచి. 771

క. అతఁ డొకనాఁడు ధనార్జన, మతిఁ జనుచుం గఠినలోహమయతులసుహృదా
యతనమునఁ బెట్టితిరిగెం, గతిగలిగెడుననుచుఁ దిరుగగలచోట్లనెల్లన్. 772

చ. సరకులకేఁగి వేసరఁ బసారముఁ బెట్టిన సెట్లఁ గూడి వే
సర నడుగానఁ గానక యజస్రము గూలికిమూటమోసి వే
సర మఱియుప్పుఁ గూరయును సంగులగొందుల విల్చివిల్చి వే
సరె నొకత్రోవయు న్ఫలమొసంగదు సెట్టిన భాగ్య మెట్టిదో. 773

ఉ. అల్లన మందభాగ్యుఁ డగునాతఁడు వేవిధులం గృశించియున్
పల్లముపచ్చగాక పనివాడినమోమునఁ దా నివృత్తుఁడై
తెల్లముగా సుహృత్తుల దెమ్మనివేఁడిన పంచనామతి
గల్లలఁ బల్కె నాతఁ డెలుకల్దినెఁ ద్రాసనియాసపెంపునన్. 774

క. ఆమాట కలకిరాట, గ్రామణి దలయూఁచి యట్లగాకున్న సఖా
యీమాడ్కి నాకుఁ జెప్పదువే మిగుల నపూర్వమిదిసుమీ యేమాయెన్. 775

క. అని వెగటుదోఁపకుండ, న్మనుపటిపలెఁ దన్నివేశమున వర్తిలుచున్
దనలోఁ గోయుచుఁ గతిపయ, దినములు క్రమియించి కలఁకదీఱినపిదపన్. 776

క. బడుగుం గోపటి తుకతుక, నుడుకుచుఁ దులదక్క ననుచు నున్నాఁడొయిసీ
గుడిఁ ద్రిప్పినకపటాత్మునిఁ, దడయక గుట్టయినఁ ద్రిప్పెదం జేసేతన్. 777

క. అనితలఁచి యాకృతఘ్నుని, తనయునిచే నొక్కనాఁ డతఁడు నూనియను
న్నను కగునుసిరికపిండియు, జనవునఁ బట్టించుకొని ప్రజల్వీక్షింపన్. 778

క. స్నానవ్యాజంబునఁ జని, వాని నొకానొకసుహృన్నివాసంబున నా
లోనిడి క్రమ్మఱుటయుఁ జిం, తానతుఁడై వాని కాకృతఘ్నుండనియెన్. 779

శా. అయ్యా లెవ్వచ్చెఁ గదయ్య నీపిఱుఁద రాఁడాయె న్మహాసాధ్వసం
బయ్యెం జెప్పఁగదయ్య నావు డతఁ డత్యార్తుంబలెం బల్కె నే
నయ్యేట న్సలిలంబులాడఁగఁ దటన్యస్తాంఘ్రి నాహూద్ధతం
బయ్యా నీసుతుఁ గ్రద్దదన్నుకొనిపోయెన్ భీతివాపోవఁగన్. 780

క. ఏను వితాకుఁడనై నీ, తో నీచెడువార్తఁ జెప్పుదుం గాకనుచు
న్నే నిలువక వచ్చితి నన, వాననమువాడ నాతఁ డాతని కనియెన్. 781

ఆ. చేఁపజెల్ల గాదు చిట్టెల్కయును గాదు, పిట్ట గాదు కోడిపిల్ల గాదు
కొట్టి జుట్టుఁబట్టుకొనిపోవఁ బసిబిడ్డ, లేఁడ నీల గ్రద్దలేఁడఁ జెపుమా. 782

క. వినసంగతిగాదు సుతుం, గొనితెమ్మన నతఁడు గ్రద్దగొనిపోయిన బా
లునిఁ దేనగు మూషకములు, దినిపోయిన యినుపత్రాసుఁ దేబాగైనన్. 783

క. ఇనుపతుల నెలుకదినఁగాఁ, గొనిపోవఁగరాదె గ్రద్దకు న్సఖ యుష్మ
త్తనయుని నీమాటలకుం, గెను వింతలె తెలియనెప్పటికి నామాటల్. 784

క అని మాటమాట సరిపుచ్చిన వంచకుఁ డెఱిఁగి యతనిచేతికిఁ దుల ని
చ్చె నతండును దాఁచినత, త్తనయుఁ గృతఘ్నునకు సమ్మదమ్మున నిచ్చెన్. 785

క. ఇదినీకు నిదర్శనమగుఁ, గద నినుమది నమ్మరానుగద యేమనిచె
ప్పెద వొప్పుగులుక నయగుణ, మదిలే దొట్టయిన సత్యమైనన నీకున్. 786

ఉ. ఆదరమొప్ప నుత్తపరుఁడై మనువాఁ డుపదేశికిం దృఢా
హ్లాదము సంఘటించుఁ బరమాదరణశ్రవణంబు పెంపునన్
ధీదశలేమి నస్మదుపదేశ మృదూక్తిశతంబు లక్కటా
సూదులువోలు నీచెవులుసోఁకిన నొచ్చుసహింపకుండుటన్. 787

క. ఘనగుణములఁ దనుగుణముల, జనుఁ డమరు న్సాధ్వసాధుసంపర్కముచే
వనజనపదపథికుం డగు, ననిలుఁడు పోలెన్ శుభాశుభామోదములన్. 788

వ. కార్యాకార్యవిచారంబు చాలనిగురునయినఁ బరిహరింపవలయునని పలుకుచు దమ
నకుం బరిహరించుకొని కరటకుండు రాజనికటంబున కరిగె దమనకుండును దోడన
జనియె నంతఁ బింగళకుండు సంజీవకుం జంపి విన్ననైన మొగంబున దమనకు నాలో
కించి. 789

చ. ఇలఁగల తేని కేమిగడియింపఁగరాదు హితత్వసత్యని
శ్చలగుణశాలి యైనభటసత్తము నొక్కనిఁ గూర్పరాదు గా
కలవున నిట్టిబంటు దెగటార్చె వృథా మతిలేక నీదురు
క్తులు విని చంపితి న్విగతదోషుని నమ్మహనీయభాషునిన్. 790

వ. అనినఁ బింగళకునకు దమనకుం డిట్లనియె. 791

ఉ. వంచకులం బడల్పఁజిచివైచుట సత్పురుషవ్రజంబు ర
క్షించుట విత్తమాశ్రితులఁ జేర్చుట భూప్రజపై దయాగుణం
బుంచుట రాజచిహ్నములువో యభిషేకముఁ బట్ట బంధముం
గుంచెయు మంత్రతంత్రబలగుప్తియు నుంటికి లేకపోయె నే. 792

క. అరిమరణంబునకేలా, పరితాపము నొంద విరసభావముగలవోఁ
బరులేల యగ్రజానో, దరునైనను జంపుదురు మొదల్ రాజన్యుల్. 793

క. వైరముపుట్టినఁ బోరక, శూరులు నిర్జరులు రాక్షసులఁ జంపరె యె
వ్వారికి నిది వింతయె బృం, దారకులును వారు నన్నదమ్ములు గారే. 794

క. విరసించినచో రాజులు, దురమున నెవ్వారి నైనఁ దునుముదు రలుకన్
గురు నగ్రజు ననుజు న్నో, పోరమున వధియింపఁ డో టుహరిసుతుఁ డరయన్ 795

చ. పరుషసముల్లసన్మధురభాషిణి హింసయు ఖండసత్కృపా
నిరతవసువ్యయవ్యసన నిత్యధనాగమకోపసుప్రసా
దరనయ సత్యసత్యపరితాపదసౌఖ్యదవారకామినీ
స్ఫురణ నసత్యదాప్తిఁ బోలుచు నృపనీతి యనేకరూపమై. 796

వ. అని యిట్లు దమనకుండు బోధించినఁ బశ్చాత్తాపంబు మాని మృగరాజు ప్రాజ్యరాజ్య
సుఖంబు లనుభవించుచుండె. 797

క. అని వినిపించినగురునిం, గనుఁగొని నృపపుత్త్రు లనిరి కమనీయగుణాం
బునిధీ రెండవతంత్త్రం, బనురక్తిం దేటపఱుపుమని యనుకుటయున్. 798

మ. ప్రతిబాధీకృతకామకాముకజభుక్పరిగ్వంసనారంభణ
వ్యతిషంగవ్రతసత్వసత్వరనరవ్యాపారపూర్ణీభవ
న్నతసంకల్పవిశేషశేషరచితామ్నాయోక్తిపద్యత్రుతో
ద్గతరోమాంచవితానతానవరుజాధాటీభిషక్పుంగవా. 799

క. వనజభవతనయమేధా, వినుతవినీతైకదివ్యవృషభజగత్పా
వనపంచతత్త్వమయ వి, ధ్వనలోచన సర్వభూతహితసంచారా. 800

మాలిని. అనవలయకగాత్రా హారిముక్తిత్రిపాత్రా
వివిధనిగమవేద్యా విశ్వసర్గోపపాద్యా
భవతిమిరపతంగా పర్వచంద్రోపమాంగా
హవిరశనబలిష్ఠా హార్యకల్పాజినిష్ఠా. 801

గద్యము ఇది శ్రీవేంకటనాథకరుణాలబ్ధసరససాహిత్యనిత్య కవితావిలాస సకలసుకవి
ప్రశంసాభాషణోల్లాస రాజమలపారావారపర్వశర్వరీరమణ నీతిశాస్త్రమార్గ పరి
శ్రమణధైర్యపర్యాయధిక్కృతనీహారపర్వతపర్వరాజకుమార నిస్సహాయప్రబంధ
నిర్మాణభోజభూదారసుధామధురభారతీసనాథ వేంకటనాథప్రణీతం బయినపంచ
తంత్త్రంబున మిత్త్రభేదం బనునది ప్రథమాశ్వాసము.

శ్రీరస్తు.

# పంచతంత్రము.

## ద్వితీయాశ్వాసము.

గౌరీపత్త్రసను
భాగాభిజ్ఞాననిశ్చలచపలాసం
భాగభ్రరవ్యపత్యస
మాగమసురసింధురూపహరిహరనాథా. 1

వ. దేవా సుహృల్లాభాభిధాన ద్వితీయతంత్ర మాకర్ణింపు మధీతనీతిశాస్త్రి మర్త్యం
డవ్విష్ణుశర్ముండు సుదర్శనకుమారుల కిట్లనియె. 2

క. సాధించెఁ గార్యముల ధన, సాధనములు లేక సారసౌహార్ద సమా
రాధనమున మున్నార్జిత, మేధాశ్రుతిఁ గాక కూర్మమృగమూషకముల్. 3

క. నా విని రాజకుమారకు, లావిప్రునిఁ జూచి పలికి రదియెట్లు నయ
శ్రీవిభవ తెలుపు మన వి, ద్యావారిధి వారికద్ధరామరుఁ డనియెన్. 4

క. శతమఖవనసఖవిటప, స్థితిమహిళారోప్యనగరిచేరువఁ గలద
ప్రతిమం బొకబూరుగు లఘు,పతనకుఁ డనుకాకి దానిపై వర్తించున్. 5

సీ. వసుధ నెవ్వనిసదన్వయకర్త జేజేలకొనికిఁ గుల ముద్ధరించుకొడుకు
పితృకార్యములు సమర్పింతు రెవ్వానికి నాదిత్యరుద్రవస్వగ్రభుక్తిఁ
బొదలు నెవ్వనిగృహంబున మనోహరభారతీభారవహముఖద్విజకులంబు
పథికసంతతి కేరుపఱుచు నెవ్వనికంఠమిశ్రితారావంబు మేలుగీల్లు
తే. ప్రజ్ఞ పెంపున నెవ్వానిబలమువకును, బ్రహ్మకొడుకైన లెక్కఁ జెప్పంగఁజాలఁ
డతఁడు నగరోపకంఠచైత్రాగ్రవర్తి, పక్షిమాత్రుండె వాయసపరివృఢుండు. 6

క. ఆకాకి నాకపథమున, నేకాకిత మేఁతలాడ నీరము గములం
గీకామండల మగుసర, యూకాననమునకుఁ బోవనున్నెఁడ నటకున్. 7

చ. వెడవెడఁ జంకఁ జిక్కమున వ్రేలెడుచద్దియు సందిలోహపుం
గడియము క్రూరదృష్టిగలకన్నులు నల్లనిమేను మాఁపునం

బడిశము జుంజుఱుందల తపారము జేగురుబొట్టు మేఖలం
గొడవలి గల్గివచ్చె నొకక్రూరకిరాతుఁ డమంధరత్వరన్. 8

క. వచ్చిన వాయసపతి దన,యిచ్చ న్వెఱబొమ్మవంటియిత్తఁ డెందులకై
యిచ్చటి కేతెంచెనొకో, యచ్చెరు వనుచుండ నద్దురాత్ముం డచటన్. 9

క. పులుగుడిసెఁ బన్ని వల శా,ద్వలధరణిం బాఁదుపఱిచి ప్రసన్నకన్ను
ల్గలపులుఁగు దీము మిడి యు,గ్గలపుఁదమి న్గాచియుండఁగా దైవగతిన్. 10

శా. చిత్రగ్రీవుఁ డనంగ నొక్క విహగశ్రేష్ఠుండు సత్కృత్యకృ
త్పత్త్రివ్రాతము వెంట గుంపుగొనిరాఁ బైఁబోవుచున్ శాద్వల
క్షేత్రస్థేమము దీమము న్గని నగః క్రీడాపరిత్యాగియై
ధాత్రి న్వ్రాలె ననాయ మధ్యమునఁ బత్త్రధ్వానము ల్భోరవన్. 11

క. పులుఁగులఁ బినుఁగు కిరాతుఁడు, వలఁదవులఁగఁ దిగిచి తగ్గ వగ్గరపగ్గం
బలఘుతరకీలమున సం,వలనముఁ గావింపుచుండె వలసినభంగిన్. 12

వ. అంతఁ బత్త్రిసుత్రాముం డనుజీవులఁ గేవలయత్నంబునం బిలిచి దుష్కర్మానుకూలంబున నిందఱ మిజ్జాలంబునం జిక్కితి మీయుపాయంబున కొండొకయుపాయం బూహించితి యోగపద్యాభిమానంబున నిందఱ మిజ్జాలంబుం బత్త్రజాలంబునం బెట్టుకొని దూరం బరుగుద మప్పటికి నొకగతిలేకపోయెడునోటు నిర్విలంబంబున లెం డని చెప్పిన నొప్పుకొని యప్పులుఁగు లొక్కయూఁకున దెప్పరంబుగా నుప్పరంబున కెగసిన వన్మాలితకీలంబై జాలంబు వెంటరాఁగొని యాయుచ్చలంబున గగనమార్గంబునం బఱచుచుండె. 13

క. ఆవిధి విధియూఁడక పడిఁ, బోఁవఁగ నిది యననుభూతపూర్వం బనుచున్
ధావనమున వనమునఁబడుఁ,బో విహగములనుచు బోయ వోయె న్బిఱుఁదన్. 14

ఉ. ఎప్పుడు నేలవ్రాలు శ్రమ మేర్పడ టెక్కలునొచ్చి పెచ్చుగా
నప్పుడ చిక్కు నిప్పులుఁగు లన్నియు నా కని నిశ్చయించి వాఁ
డెప్పటిభంగి వెన్దగిలి యేఁగుచునుండ విహంగమంబు లా
చొప్పున జాల మెత్తుకొని చూడఁగఁ జూడ నదృశ్యమాటయున్. 15

క. అతిలాఘవమున నల లఘు,పతనకుఁడు న్దక్కపోతపతి వెంబడి న
భ్రతలంబునఁ బఱచెం బ,త్త్రిఝుంకృతు లఖిలదిశలఁ గ్రమ్ముకొనంగన్. 16

క. జాలగ్రాహి విహంగము, జాలముఁ బరికింపలేక జాలిని జాలిం
దూలుచుఁ గ్రూరకిరాతుఁడు, ప్రీలినచరణములతో నివృత్తుం డయ్యెన్. 17

క. అవడువున నలచిత్ర,గ్రీవుఁడు దూరంబు నరిగి భృత్యుల నటుసం

భావించి పలికె నోహో, భావన మఱియుచట వ్రాలుద మి యిందఱమున్. 18

చ. సకలపథీనమానసుఁడు శాంతిసమగ్రుఁ డజాతశత్రుఁ డం
తకనిభపత్యుఁ డిష్టజనతాఘనతాపవిఘాతి సర్వమూ
షకములసార్వభౌముఁడు రసజ్ఞుఁడు ప్రాణముప్రాణ మాహిర
ణ్యకుఁ డిటనుండు నాయనదయామతి *నివ్వలవంతఁ బాయుదున్. 19

చ. నిలువుఁడు నా విహంగములు నిల్చె బిలస్థలభూమి నంత న
క్కలకల మాలకించి పొడకట్టి యనాయగుణాస్పదాంగుఁ గే
వలసఖు జీవితప్రతిము వారితమత్సరు వీతరాగుని
ర్మలుఁ బతగాగ్రణిం గని హిరణ్యకుఁ డశ్రువిమిశ్రితాక్షుఁడై. 20

చ. పలికె సఖా యఖండనయపారగతుండవు దీర్ఘదర్శివే
వలన విపత్తిఁ జేట్పడనివాఁడవు నిత్యసుఖానుయాయి వి
య్యలమట నీకు నెట్లొదవెనయ్య విధాతకుఁ బాఁడిలేదుగా
వలయుఁ గదయ్య కర్మమెటువంటిది చూడఁగదయ్య యక్కటా. 21

క. అనివిగ మహిరణ్యకుఁ గనుఁ, గొని చిత్రగ్రీవుఁడనియె గూర్మిసఖా నా
యనుజీవు లలసి రేను, న్వనటం బెగ్గిలితి నలుకు వలఁ గేవలమున్. 22

క. ఏవాసరమున నెద్దెస, నేవయసున నెట్టికర్మ మేమఱఁ డెవ్వాఁ
డావాసరమున నద్దెస, నావయసున నట్టికర్మ మతఁడు భుజించున్. 23

క. కలకాలము లేదలమట, కలకాలము లేదు సుఖము కాయము మోసం
గలిగినవటు గొన్నాళ్ళ్, యిల నిటు గొన్నాళ్లు దీనికేలా వగవన్. 24

క. దైవికములైనపనులకు, వావిడువఁ డవార్యధైర్యవంతుఁడు నయరే
ఖావిభవయెప్పుడటువలెఁ, గావలెనటు కాకపోదుగా యనితెలివిన్. 25

వ. అనుచిత్రగ్రీవునకు హిరణ్యకుం డిట్లనియె. 26

క. వేసటనొందక లఘువి, న్యాసంబున నూఱుయోజనము లరిగి సుఖ
గ్రాసమునఁ బొదలివత్తు వ, యో సఖ నీకెట్లు మోస మొదవెం జెపుమా. 27

క. అక్కట యాపల్లతలం, జిక్కక నయసరణిఁ ద్రొక్కుచిత్రగ్రీవుం
డెక్కడ యీనిర్బంధన, మెక్కడఁ గాలముఁ దరింప నెవ్వరునలఁతుల్. 28

క. ఆపత్సంపద లలఁతులఁ, బ్రాపింపవు ఘనులగాని ప్రజ్ఞంబొడవై
చూపట్టుచంద్రుఁ †డారెం, డోపతగాధ్యక్ష కలవె యుడుసంహతికిన్. 29

---

* వల్లవంత=వలవలని బాధ. † ఆరెండు=ఆపత్సంపదలు రెండు.

చ. ఉరివిహగవ్రజంబునకు* నోదము దంతికి ముందు చిల్వకుం
బరుషతమోగ్రహాగ్రహణబాధ సుధాంశున కంశుమాలికిం
బరమదరిద్రతాప్తి మతిమంతులకుం గలుగంగఁ జేసె నె
వ్వరు నవ లిందునందు బలవంతుఁడు పో విధి నాకుఁ జూడఁగాన్. 30

ఉ. గగనమునం జరించు పతగంబు లగాధసముద్రవారిలోఁ
దగ విహరించు మీలు వలతంపములం బడి చచ్చు నవ్విధిన్
దెగి చనస్థానశక్తి గలదే యల దేర్పడఁ జింత దీనికై
తెగునెడ కెంత దవ్వయినఁ దెచ్చుఁ గదా విధి దేహధారులన్. 31

వ. అని †యాఖులేఖపతి నెమ్మనమున నస్తోకశోకమగ్నుండై వ
చ్చిన యచ్చెలికానిఁ దగు, లోకానినయనాయాంశ మెచ్చి కొలుకుచునుండెన్.

వ. అప్పుడవార్యధుర్యతుహినగ్రావుండగు చిత్రగ్రీవుండు సుహృల్లోకశరణ్యుండగు
హిరణ్యకున కిట్లనియె. 33

క. పరహితచరితాయస్త, త్పరివృతబంధములఁ బోలెఁ బరిచరబంధో
త్కర మేలనయుక విప్పుము, పరివారము లేని భూమిపతి పూజ్యుండే. 34

క. సిరి గూడదు కూడినఁ బదు, గురుగలవాఁ డడఁచిపుచ్చుకొనుఁ బరవీరుల్
సరకుగొనరు సిరిదక్కుడు, పరివారము లేని రాజు బ్రతుకునె పొడవై. 35

వ. అను నప్పలుకుల కలరి హిరణ్యకుండు. 36

క. హితభృత్యులతో నేభూ, పతిక లఘుస్నేహసంవిభాగము లమరన్
బ్రతివాసర ముతఁడు బలోద్ధతుఁడై పాలించుఁ జువ్వె త్రైలోక్యంబున్. 37

క. పరివారము పట్టునన్నా, దర లేశము లేని భూమిగవుఁ డభివృద్ధిం
బొరయఁడు సంతతి కెడసిన, పురుషుని వంశంబు నష్టిఁ బొందిన భంగిన్. 38

చ. అదనను జీవితంబిడమి యారజ మాడుట లేని నేరము
ల్వెదకుట నిచ్చలున్ బరిభవించుట కింకరసంకులంబు నె
మ్మదికి నసహ్యమౌట దయమానుట ‡పిమ్మటనాడికోల్మ హా
పదవికిఁ బాసి యుంటి పసుపాటులఁ బొందు నృపాలచిహ్నముల్. 39

ఆ. సైన్యధాన్యబంధుసమృద్ధముల నెవ్వఁ, డోర్పు గలిగి పుడమి నుల్లసిల్లు
నతఁడు సూవె నీదజాధీశ వసుమతీ, హిమమయూఖపదన కింటిమగఁడు. 40

క. అని పలికి జాలగుణము, ల్దునియలుగాఁ జేసి ఖగపతుల వెడలించెన్

---

* ఓదము=ఏన్గులు కూలుటకై మఱుఁగు పుచ్చిన గొయ్యి. † ఆఖులేఖపతి=మూషకేంద్రుఁడు. ‡ పిమ్మటనాడికోలు=నున్నమొగము చాలైన తర్వాత మాషించుట.

జనితాదృతి మూషకపతి, ఘను లాప్తులసేగి శౌర్యఁగాఁ దేరుగదా. 41

శా. చిత్రగ్రీవునిఁ గౌఁగిలించుకొని తత్సేనందురంతాదృతి
చ్ఛత్రచ్ఛాయఁ బ్రహృష్టుఁ జేసి యభివృద్ధి న్విందుఁ గావించి యో
పత్రిగ్రామణి పోయిరమ్మనిన బాష్పచ్ఛన్నవక్త్రంబుతో
నత్త్రాతం దనుఁ దానవీడుకొనిపోయెం బక్షియాలోపలన్. 42

క. జాలమునజిక్కి విహంగమ, జాలము బ్రతికించి కొలముసాముల హేలా
లీలం గలపుటఁ గనుఁగొని, యాలఘుపతనకుఁడు మూషకాగ్రణికనియెన్. 43

సీ. పదధరాధిపభేద కరము నీకరము నీవివరంబు బహుమార్గవిశ్రుతంబు
రాజశేఖరకుమారకమనోహరము నీచర్య నీసన్మానసం బుదాత్త
మవిరళసుగతిహేతువు నీవినీతత్వ మలరునీగుణము ధర్మానుకూల
మతివృద్ధిమహిమఁ జెన్నారునీయాకార మిష్టకార్యముల నీయోగి వెరుగు
తే. నీకరుణ లక్ష్మివాటిల్లు నీరసజ్ఞ, సత్యభారతి నిలుచు నీసన్నిధాన
మభిమతార్థంబు లొసఁగు ని న్నభినుతింప, శక్యమే నాకు మూషకక్ష్మాకళత్ర. 44

క. ప్రతిలేనికరుణ నీడజ, పతిమృతికిం బాపి సుగతిఁ బడసితి నీసం
గతి గాదే యీయాప, ల్లతలంటినమ్ముబోటులకుఁ గృతకృత్యా. 45

క. భవదీయస్నేహము నా, కవిరళతేజోవిధాయి యగు నెయ్యుఁడవై
శపథవలేక మనీషిప్రవరా వర్తింపు మన హిరణ్యకుఁ డనియెన్. 46

క. కయ్యమునకు నెయ్యమునకు, వియ్యమునకు సమతవలయు వేఱొకఁడైనన్
గయ్యము గెలువదు నిలువదు, నెయ్యము వియ్యంబు పొసఁగ నేరదు మొదలన్.

క. బలహీనుఁడ నేను మహాబలుఁడవు నీ వధముఁ డెట్లు బలవంతునితోఁ
జెలిమి యొనరించు జెపుమా, తలద్రిప్పక మ్రింగఁ జూచెదవు వెలువడినన్. 48

క. అమరదు నీపొత్తు వృథా, భ్రమఁ బెట్టకు భోక్త వీవు భక్ష్యమ నే నం
చుమొగంబోడక పలికినఁ, దమకింపక మఱియు లఘుపతనకుఁ డనియెన్. 49

క. బలవంతము కాకము నే, బలహీనుఁడ ననుచు విడిచిపలుకకు ప్రజ్ఞా
బలమున నధికుఁడ వదివో, బలము శరీరస్థమైనబలము న్బలమే. 50

క. తలద్రిప్పక మ్రింగెద వని, పలికెద వేనట్టిదుస్స్వభావుఁడనే నీ
కలిమి పరాపత్తి దవ, జ్వలనఘనాఘనము గాదె సాధుచరిత్రా. 51

క. నీవంటియుత్తముఁడు సుఖ, జీవితుఁడై యున్న నేను జిరజీవిఁ జుమీ
నీవిందుఁ గలుగఁ జిత్ర, గ్రీవుఁడు విపదంబునిధిఁ దరించెనొ లేదో. 52

చ. పరుషవిశృంఖలాలపనపంక్తుల సాధుమనంబు లీక్రియం
బొరయఁగఁ జేయ నెవ్వరికిఁ బోలదహో ఖచరాపగాపయో

ధరపరిరంభసంభ్రమణతత్పరతుంగతరంగహస్తసు
స్తరశరధిం దృణాగ్రశిఖితప్తముగా నొనరింప నేర్చునే. 53

క. అనలఘుపతనకుపలుకులు, విని మూషకరాజు పలికె వెఱ్ఱీ నీతో
ననుబోటి యలఁతినెయ్యం, బొనరించినఁ దగునె తేరొకో బలవంతుల్. 54

క. తనగుణముఁబూనియున్నాఁ, డనిపగతునినమ్మఁబోల దనిశము మదిలో
ననలశిఖాతప్తోదక, మనలునిపైఁ జింది చల్లనార్చునొ లేదో. 55

క. పోలినదిపోలు నెవ్వోఁ, బోలని యదిపోల దంబుపూరంబునఁ బోఁ
జాలునె శకటములీల, న్నేలం బోతములు నేర్చునే యేఁగంగన్. 56

క. మోసంబూరకతలఁచుం, జేసినమేల్మఱచు విశ్వసించినఁ జెఱుచున్
నాసత్యము దుష్పురుషుం, డోసుగుణా వినుము చూడ ముత్తమునొకనిన్. 57

వ. సుజనశబ్దంబు పురాణోక్తంబుగావిచారించెద నిష్టుండయ్యును బహుసుకృతోపలాలితుండయ్యును దుర్జనుం డంకగతక్రూరోరగంబు చందంబున భయంబుసంపాదించుచుండునని వెండియు. 58

క. పరపురుషచింత యుంతః, కరణంబునఁ గలిగి మగనిఁగరఁగించుతలో
దరికరణి హృదయకలుషము, మఱుఁగిడి ఖలుఁడాడుమధురమధురతరోక్తుల్. 59

క. నేరములొనరించిన నుప, కారము సేయుదుము నొవ్వఁగాఁ బల్కనఁగై
వారము మఱవము మే మను, వారలకున్ ఖలులకొండనైగుఱుగారే. 60

ఉ. కావున నిన్నువంటిబలగర్వసమగ్రులతోడి మైత్రి దుః
ఖావహ మేఁగుమన్నఁ గరటాగ్రణి వహ్నిశిఖానుమాపకో
పావిలచిత్తుఁడై పలికె నద్దిర మాటలజోలిఁబన్న నేలా
విను లత్తురైనవదల న్నినుమూషకలోకవల్లభా. 61

క. చెలిమికి దూరస్థుఁడవై, తొలఁగిచన న్మదిఁదలంచెదో యదినాతోఁ
నొలుపదు త్రివ్వెద ధరణీ, తలవివరముఁ ద్రవ్వినల్లఁ ద్రావెదఁ బిదపన్. 62

క. అనలమునఁ గాఁచిలోహము, నెనయించినకరణి వేఁడి నేనియుఁ బ్రజ్ఞా
ధనులఁ దనుఁగూర్చికొమ్మను, మనువచనము వినవె యదియు మత మెవ్వరికిన్. 63

క. ఖలుఁడుసుఖభేద్యుఁడతిమృ, త్కలశగతి న్సజ్జనుండు గాఢాగ్నిశిఖా
కులతప్తకనకఘటముం, బలె దుర్భేద్యుండు చక్కఁబడఁడు మృదూక్తిన్. 64

తే. అట్లుగావున నినువంటి యనఘచరితు, వెఱపుఁబనినైన సఖునిఁగావించుకొనఁగ
వలయు మేల్గోరు నావంటివాని కనిన, సమ్మదంబంది మూషకస్వామిపలికె. 65

క. అరివలెనుండుట క్రియలం, బరమాప్తస్ఫూర్తిఁ దేటపఱుచుట యదివో
యరయ సుహృల్లక్షణమో, కరటా నీయందుఁ దోఁచెఁ గదయీసరణుల్. 66

క. మతిశంకలేక మూషక, పతివివరమువెడలి కరటపరివృఢుతో న
ప్రతిమగుణరత్నఖనితో, గతకల్మషుతోడఁ జెలిమికాఁ గైయుండెన్. 67

వ. అట్లు కృతసఖ్యుండగు నయ్యుందురుముఖ్యుండు విందుఁబెట్టి వీడ్కొలిపిన దరి
ద్రునకు నిధానంబునుంబోలె సుహృల్లాభంబుఁ గనుట కలరుచు సింహవ్యాఘ్ర
గజగవయ గండభేరుండ ప్రముఖజంతు వహనంబులగు గహనంబుల విక్రమించి
సారంబులగు వన్యాహారంబులఁ దెచ్చియిచ్చుచు నచ్చిక బుచ్చికలడరఁ గొంతకాలం
బుఁగడపి యొక్కనాఁడా వాయసపరివృఢుండు హిరణ్యకు డాయంబోయి
యిట్లనియె. 68

ఉ. పోయెదనిప్పుడన్యవనభూమికిఁ బ్రాణసఖా ప్రమోదసం
ధాయక నన్నుఁబంపు మనినన్విని ధైర్యము వ్రస్సి వెల్వెలం
బోయినమోముతోడ బలిభుక్ప్రవరుఁ బురుషార్థసంగ్రహో
పాయము సుహృద్విధేయుఁ గని పల్కె, హిరణ్యకుఁ డార్తచిత్తుఁడై. 69

చ. ఇట నను డించి యేమికతమేఁగెదు చెప్పఁగదన్న యెట్టు లె
క్కటినిజరింతువన్న త్రుటికాలము నిన్నెడఁబాసియున్కి దు
ర్ఘటముగదన్న నాకడనుగల్గినయీధృతియెందుఁబోయె ని
ప్పటికివిచిత్రమన్న విధిభద్రవిరోధిగదన్న యెన్నఁగాన్. 70

చ. అని కనుదోయిచెమ్మగిల నాకృతివిస్మృతినొంద మూర్ఛవో
యినబలిభుగ్విభుండు చలియించి గరుద్వ్యజనానిలంబునన్
దనువిడిఁదేర్చి యోపరమధార్మిక నిన్నెడఁబాసిపోవ నే
ర్తునె సకలార్థసిద్ధఫలదుండని చూతుఁగదయ్య నిన్నిటన్. 71

ఉ. నాపయనంబువిన్ము కరుణావరుణాలయ పుత్రకళత్రవా
సాపురకాననోర్వి నొకసారసరోవరమొప్పు నందు వి
ద్యాపరమేష్ఠి మంథరకుఁ డన్కమఠాగ్రణి మత్సఖుండు సౌ
ఖ్యాకరవహుఁ డుండు నప్పరహితార్థిఁ గనుంగొని సాదరంబునన్. 72

ఉ. ఆతఁడు నాకుఁ బ్రీతివశుఁడై యొనరించు ననూనమీనమాం
సాతిథుజక్రియ న్బఁసముగ్రుఁడనై చనుదెంతుఁ గ్రమ్మఱన్
నీతిధురీణ నన్ననుపు నీ వనఁ గన్నులశోకబాష్పధా
రాతతు లుప్పతిల్లఁగ హిరణ్యకుఁ డాతనిఁజూచి యిట్లనున్. 73

చ. ఉడుగనియంత నింతతడ వ్రాలుటలేక పరాకువోలె మే
నడిచిపడంగనున్కి గహనాంతరచింత జనించె నంఘ్రిలి
వ్వఁడకున నూదసైఁపవు కృపానిధి మందరకాంకు డుండు న
క్కడకరుదెంతు నింపడరఁగా ననుఁదోడ్కొనిపొమ్ము నావుడున్. 74

వ. లఘుపతనకుం డిట్లనియె. 75

ఉ. కాదన నేలవచ్చెదవుగాక సఖా వెఱఁ గావహిల్లె ని
ర్వేదము నీకు నెట్టులొదవె న్వివరింపుము నావు డాత్మ సం
పాదిహిరణ్యకుం డనియె బల్కుల కిందెడలేదు నెవ్వడిం
బోదము పోయియావ్విపినభూమి సమస్తముఁ దెల్పిచెప్పెదన్. 76

క. నావుడు దత్తప్రతిభాషావర్గుం డగుచు వాయసస్వామి నయ
శ్రీవిభవు మూషకాగ్రణి, వే వాతన్గఱచుకొని దివిజమార్గమునన్. 77

వ. కఱచి యగాధశరంబగుతత్సరోవరంబున కరిగితీరంబున హిరణ్యకు నునిచిలఘుపతనకుం డుదారస్వరంబునం బిలుచుటయు సందర్శనకుతూహలంబునమందరకుండచ్చెం దమ్మికొలఁకు వెలువడి ప్రత్యుత్థానం బాచరించి వారిచరతిరసాహారంబున విముక్తమార్గశ్రములంగావించిస్వాగతాదికార్యంబులు వేఱవేఱనడిగినలఘుపతనకుండుకమఠపరివృఢునాలోకించి. 78

చ. అనుదినదూరితాఖిలశతా కమఠా యితఁ డాఖుఁలేఖరా
జనఁగుసఖుం డుపాయసఖుఁ డాత్తశరణ్యుఁడు పుణ్యుఁ డిట్టియి
మ్మనుపథవర్తి యంత నడుమంబొడమం బొడవేఁది యిల్లుపీ
డ్కొనియిటకేగుదెంచె నినుఁగూర్చి సుఖస్థితినుండు నాతఁడై. 79

క. క్షణభంగురములు కపట, ప్రణయంబులు ప్రాణపతనపర్యంతంబున్
గుణవికలత శశశృంగము, ప్రణుతమతీ యిట్టిసాధుపథగాములకున్. 80

క. చావునకుఁ బాపెఁ జిత్ర, గ్రీవుని నిటువంటిపుణ్యకృత్యము లాహా
యేవేళ నెన్నిసేసెనొ, కో వేడుక నీహిరణ్యకుఁడు మందరకా. 81

వ. అని లఘుపతనకుం డుత్కర్షించిన నాశ్చర్యధుర్యుండై కమఠవర్యుండుహిరణ్యకున
కిట్లనియె. 82

చ. విమలనీచరిత్రములు వింటిఁ గృతార్థుఁడనైతి సత్యభా
షానిధి యోగిమానసముచాడ్పున నిర్మలమైననీమహా
మానస మెట్లు దుఃఖగరిమ న్భజియించె విచిత్ర మివ్విధం
జే నిటవిందుఁ జెప్పఁగదవే యన నాయన కాతఁ డిట్లనున్. 83

ఆ. అనఘ సఖ సఖుండ వగుటనీకు మామక, వ్యథనకథన మభినయంబొనర్చి
సరసతావకాశ్వసనభాషితంబుల, గాఢసమ్మదంబుఁ గాంతు నేను. 84

సీ. విను మహిళారోప్యమనుపట్టణము సర్వసౌభాగ్యవిలసనాస్పదము గలదు
దానిచెంగట వసుంధర బొక్కయొనరించుకొని యేను గౌరవంబున సుఖింతు
నటకుఁ జూడాకర్ణుఁ డనుతుచ్ఛసన్యాసి చనుదెంచి యేశుండు మునికిలోను
గాఁ గట్టి మఠము భిక్ష మనుదినము ధరాత్రిదశులవీటఁ బెట్టుదురు గాన

తే. నెట్టుకొని పెద్దగాలంబు నిలువవాని, స్నానమొనరింపఁ దోంకారజపముఁ దడవఁ
డాంతమునఁ జూడఁ డంతవేదాంతవిద్య, కడుపుకై లాస మరయ నక్కష్టయతికి. 85

క. కుక్షింభరుఁ డగునలయా, భిక్షుఁడు వేసరక తిరగి భిక్షించినయా
భిక్షము భక్షింపుగుర, క్షోత్సుండై యిలఁగోలనదలింపంగన్. 86

క. ఆయతికూరిమిసఖుఁడు క, థాయుతకుతపాఁగుఁడు బృహత్స్ఫిక్కను వాఁ
డాయెడ కేతెంచె నుతో,న్మాయూ యొకనాటి మట్టమధ్యాహ్నమునన్. 87

క. పచ్చిపురాణోక్తకథల్, నెచ్చెలి విను నునుచు నాతనికి రసభారల్
పిచ్చిల వినిపింపఁగ విన, కచ్చెనఁటి మోపుఁబోలె నటు మొగమయ్యెన్. 88

క. అగుటయుఁ గథకుండాయతి, మొగమారసి పలికె మాఱుమొగమైతివయో
తగు నే నీతో రసపుష్టిగ నేరుపు మెఱసి కథఁ జెప్పుచునుండన్. 89

శా. నాకీచందముఁ దెల్పిచెప్పు మని విన్నంబోయినం బల్కెఁ జూ
డాకర్ణుండు సఖా సుఖంబెటులుఁగ కింక్లం భిక్ష భక్షించి యం
టాకుంబాత్రికఁ బెట్టి తెచ్చి మఠమధ్యం జేర్చితిం జూడు నేఁ
డీకొండాటపుటెల్క యెల్కెఱుఁగ కిల్లీపార భక్షించెడున్. 90

క. నా కెక్కడిదిపరాక, స్తోకంబగు నలుక నెలుకఁ జూచెద నని చూ
డాకర్ణుఁడు వల్కు బృహ,స్ఫిక్కాకర్ణించి యుల్లసిల్లుచుఁ బలికెన్. 91

క. ఇక్కలుఁగుగున నిమ్మూషిక, మెక్కటి మెలఁగుటకు వలయు హేతువుగలుఁగన్
బొక్కలుగములైయుండుట నిక్క మిట్లొంటినుండు నేయుందురువుల్. 92

క. ఒలువనితిలలకు నొలిచిన, తిలలీ నత్రాడువసుమతీసురభార్యా
తిలకమునం దొక కార్యము, తిలఘాతిని యూహసేయదే పూర్వమునన్. 93

క. ఆకరిణి జాంగలంబున, నేకాకితఁ దిరుగు నెలుకయెడ నూహింతుం
గాక యొక కార్యమనఁ జూ,డాకర్ణుం డనియె నాదృఢప్రజ్ఞునకున్. 94

క. ఒలువనితిలలకునొలిచిన, తిలలీనజాడ్డునసుమతీభార్యా
తిలకమునం దేకార్యముఁ, దిలఘాతినినిశ్చయించె దెలుపవె యనుడున్. 95

వ. బృహన్నీకిట్లనియె. 96

క. తొలుత నొకానొకభూసుర, నిలయమున కనువసతి కుఁగుట నివసించితి న
న్నిలయపతి ప్రొద్దుపొడుపునఁ, గులభామం బ్రీతిఁ బిలిచికొని యిట్లనియెన్. 97

క. బాలాబుధసంతర్పణ, కాలంబిది యదనుగూడఁ గావింపు శుచి
త్వాలంకృతవై చరువన, లీలావతి పతికిఁ గొలుచుతే దనిచెప్పెన్. 98

క. చెప్పిన యజమానుఁడు సతిఁ, దప్పకవీక్షించి పలికెఁ దన్వి గృహమం
దెప్పుడుఁ దఱుగదు కొలుచి, ట్లొప్పునె లేదని విలాసయుక్తులు నెరపన్. 99

క. సంచయముచితంబగు నతి, సంచయ మనుచితము సర్వజనులకు నెందున్
సంచయలోభంబున నొక, పంచక మారూఢచాపనశమునఁ దెగదే. 100

క. నావిని వాతెరపై నొఱ, పై విన్నాణంపునగవు లత్తమిల న
జ్జావతి పతిఁగమఁగొని తన, కావిధ మెఱఁగింపు మనిన నతఁడిట్లనియెన్. 101

చ. అవహితబుద్ధి విన్ము మధురాధర యామిసగంధపిక్కణం
బవునొకపక్కణంబున మృగావ్యతిలిప్సుఁడు కూరిపుల్కస
ప్రవరుఁడు గ్రాలు నాతఁడు ప్రభాతమున న్మృగఘోషభీషణా
టవిచొరఁబాఱి చేరి యచటం గిరిమేషము సేసె నెక్కటిన్. 102

క. వాలికతూపుల నేలం, గూలిన యలకొండగొఱియఁ గొని తనియక నా
శాలంపటుఁ డొక్కఁడయా, భీలాటవిలోన నిర్లపితుఁడై తిరుగన్. 103

వ. ముందర నొకశాద్వలంబున. 104

ఉ. క్రమ్మి చతుష్ఖురిం జమురు కాలువలై ప్రవహింప రోమపుం
గుమ్మిలఁ బార్శ్వభూజములు గూకలువ్రత్తులుగా ముఖంబునం
దుమ్ములు రేఁగ మైమఱచి దున్నుచు ముస్తలఁ దెల్చి కుంజముల్
గొమ్ములఁ జిమ్ము దాని నొకఘోరవరాహముఁ గాంచియాత్మలోన్. 105

క. కలముం బోలిన యీయాయే, కలము మదాహారమునకుఁ గా దైవంబీ
పొలము తఱిఁ జూపెఁ బొమ్మని, యులరుచు వాఁ డప్పుడమ్ము పోకిటి నేసెన్. 106

ఉ. ఏసిన బద్ధరోషమున నేకల మేడ్తెఱఁ దూఱిపుల్కసా
గ్రేసరు మీఁద నెత్తితల క్రిందుగఁ ద్రెళ్ళగ వైచి వజ్రధా
రాసునిశాతదంష్ట్రికల వ్రచ్చి యచేతనుఁ జేసి నొప్పిచే
గాసిలి ప్రాణముల్విడిచెఁ గన్నరమూని ధరిత్రిన త్తఱిన్. 107

వ. ఇట్లున్న మృగనరశవంబుల గాలివాఱఁ గాలప్రేరితంబై దహ్యకనామధేయం
బొక్క జంబుకంబు వచ్చి కొండగొఱియ రెండుదినంబులకు నేకలంబు పదినాళ్ళకు

నరుఁడు నాల్గువారంబులకుం జాలుఁ గృతసుకృతవిశేషంబునం గాక యీబహు
సంచయం బెవ్వరికినని తలంచి హాలాహలాభంబగు లోభంబునఁ గొంచెపడునని
యెంచి యందేమిటిని గంటిపెట్టంజాలక పండ్లయూటలు ద్రావుచుఁ గొండొకతడ
వుండి మందుదండియాఁకటిచిచ్చునకుం గాక యుబ్బక్కనక్క యెక్కిడిన శరాస
నంబుంగడిసి నేఁడీఘనుః ప్రతిబంధంబునఁ బ్రొద్దుఁ బుచ్చెదం గాక యని నిశ్చయించి.

క. ఆపిసినినక్క చాపము, కోఁపంగిట నిఱికి నరముఁగొఱికినరభసం
బేపార మిడిసి మర్మని, రూపణ మొనరింప నక్క రోఁజాచుఁగూలెన్. 109

క. అతిసంచయపు మిదిపో, రతిబోటీ పలగు దాఁపురంబన నగుచుం
బతికి సతిపలికె దాఁప, న్గతమేమీ ధాన్యమొదుఁగు గాలేదంటన్. 110

గీ. చోలఁదిలలు గ్రమ్మితైలంబుఁదివి చిధూ, తౌఘవిసరకృసరమాచరింతుఁ
బుడమి వేలుపులకు పిడుమన్నవిప్ర, సింహుఁ డబల నట్లచేయుమనియె. 111

క. నూనియఁదివియుటకై తిల, లానీరజనయన దెచ్చునప్పుడొకకాల
జ్ఞానిహాలికాలయాగ్ర, స్థానంబుననుండి చేట జడియన్రావలెన్. 112

క. ప్రాలిన జెల్లాచెదర్లై, నేలందిఁగాలిక నంతనిన్వేఱఁగున న
న్నీలాలక చూచునెడన్, వాలింపక సతికిఁ బ్రాణవల్లభుఁడనియెన్. 113

క. కలికి యున్నట్టి యీక్రియ, నొలికినతిలలెత్తి దంపు మోర్పున నన న
క్కలకంఠి యట్లచేసె, న్నలి భీతిప్రీతులగ్గలములై పెరుగన్. 114

క. ఆమహీసురశరణమునకుఁ, గామందకి యనఁగ నొక్క గానుఁది సుతుల్
నేమింపఁ బేరగంపం, గోములగతి నువ్వులమ్ముకొన నేతెంచెన్. 115

క. ఏతెంచినఁబలుకులసరి, నాతీ ముడినువ్వులిత్తె నా కనివిప్ర
స్త్రీతిలకము ముదలించిన నాతిలలది యంటువడియె ననియూహించెన్. 116

వ. అట్లు బుద్ధికౌశలంబున నేను నిస్పృహయై యలుకచోట నిక్షేపంబుగలదని నిశ్చ
యించితినని చెప్పి ఘాలకుద్దాలంబుల నామెలంగు కలుఁగుఁ ద్రవ్వి నాచేతఁ జిరస్థా
పితంబగు ఘనంబుఁ బుచ్చుకొనియె నదిమొదలు పొదలుటలే కచ్చోటనాహారో
పపాదనంబునకుం గాక వితాకుండనై మందు నాకఁటికి మిడికినడిఁకి యునికిపోసం
గక మఱియుమఱియు భిక్షాపాత్రంబునలగొనుచుండితి నట్టి నన్నుంగనుంగొని
చూడాకర్ణుం డుపాలంభ గంభీరభాషితంబుల నిట్లనియె. 117

క. అతిరక్షితార్థమంతయు, నితరులపాలయ్యెఁ జెడుగు టెలుకా నీయ
ద్ధతియాన విఁకనిదేమీ, గతవిభవులు సాధుతరులు గారా పుడమిన్. 118

క. ధనముడిగిన నుడుగచునీ, తనుజనితంబైనదుర్మదము నేఁడనుచున్

గన లునికిఁ గనికరంబఱి, తనపదిలినకోలచే నతఁడు ననువేసెన్. 119

క. వేసిన వేటు దురంత, త్రాసంబున నోహటించి తప్పించుకొనన్
కోసంబున నన్యాస, న్యాసి నిరీక్షించి మఱియు నపు డిట్లనియెన్. 120

క. అర్థమునఁ బండితుండగు, నర్థమునం బలసమగ్రుఁడగు నర్థమునన్
బార్థివుఁడగుఁ బుణ్యుండగు, నర్థమునను భువనపూజ్యుఁడగు నరుఁ డెందున్. 121

గీ. అన్వవాయవృద్ధు లాచారవృద్ధులు. శౌర్యవృద్ధు లిద్ధసత్యవృద్ధు
లాగమార్థవృద్ధు లఖిలార్థవృద్ధులు కొలుతురర్థవృద్ధుఁ గోరి వేడి. 122

చ. వినఁ డని రోయ రంధుఁడసవేఁగరు తుందిలుఁడంచు గేలిఁ గాఁ
గొనరు వికర్ణుఁడంచుఁ దగఁగూయరు వామనుఁడంచుఁ బోరు దు
ర్జనుఁడనిపాయ రజ్ఞుఁడనిమానరు నిష్ఠురరోగపీడితుం
డనరు కనిష్ఠుడంచుఁ జెడనాడరు భోగిను లర్థవంతునిన్. 123

చ. కనకముఁ గూర్చి యున్నఁ బడుఁగాదె సమస్తగుణంబు లర్థమె
వ్వనికి వసుంధరం గలదు వాఁడె కులీనుఁడు వాఁడె పండితుం
డనఘుఁడు వాఁడె వాఁడె సకలార్థవిధిజ్ఞుఁడు వాఁడె వక్త వాఁ
డె నయపరుండు వాఁడె ప్రకటప్రియభాషణుఁడుం బ్రసిద్ధుఁడున్. 124

క. కలవానికిఁ జుట్టంబులు, గలరు హితుల్గలరు భటులు గల రఖిలంబున్
గలదు మఱి లేని పుట్టిన, కలవానికి నీడుజోడు గలదా జగతిన్. 125

క. చిట్టడుగు లేనియిల్లును, జుట్టంబులు లేనిచోటు శూన్యము శూన్యం
బెట్టును దుర్జనహృదయము, కట్టా మదిసర్వశూన్యకము లేమి సుమీ. 126

క. ధనహీనుఁ డధముఁ డల్పుఁడు, ధనహీనుఁడె మూఢుఁ డప్రధానుఁడు ధర న
ద్ధనహీనుఁడు తలపెట్టిన, పని గ్రీష్మ సరిజ్జలంబు పగిది నడంగున్. 127

వ. అని భిక్షుకుండు నన్నధిక్షేపించిన రోసి నివాసత్యాగంబు చేసివచ్చితి నిన్నుం
డాసితి. 128

క. త్రిదశవిమానారోహణ, మొదవిన నవమానధరణి నుండుట కష్టం
బదియొకటఁగి నీతివిద్యా, విదుఁ డభిమానస్థలంబె పదమనం బుద్ధిన్. 129

క. యాచయాతన యవమాన, క్షుధబాధ యిఁకెద్ది దానిఁ గడచనవిద్యా
గమసౌఖ్యాగమవిత్తా, గమశూన్యంబైనచోటఁ గాదు వసింపన్. 130

క. పరదేశం బెఱుఁగక తగు, గరగరిక న్వేడువనుదుపఁ గలిగి నడుమఁ బే
దరికము వాటిలి తిరియ, న్దిరిగిన ననుబోఁటి కమరునే యింతైనన్. 131

ఆ. వెల్లివిరిసెఁ బెంటివిద్యలు మగవిద్య, లడుగుపట్టెఁ గ్రిందు పడిరి బుధులు

హీనజాతిపురుషు లెచ్చిరి యాచింపఁ, బోవు రెట్లు నేఁటిభూమిపతుల. 132

శా. ఏల న్తుందనతాన లేమయినలేవే యంచు బోధించు నే
నూలంబెట్టఁగఁజాల మూఢనృపుఁ డోహో నామహాసాహితీ
శూలంబు ల్సెవులాడ సొమ్మసిలు నొచ్చుంజచ్చుఁ దత్కల్మషం
బేలా యంజలిచేసి మ్రొక్కెదఁ బదార్థవ్యాఖ్యనిశాచారికిన్ 133

క. అనుచితభాషణముఖరా, ననులమొ విటగాయకులమొ నటులమొ గాఢ
స్తనసంభరనమ్రవధూ, జనులమొ మన్నించు రాజు సంభావించున్. 134

ఉ. కోరినగద్యపద్యములఁ గూరిచి యిచ్చెద నంటినేని ని
స్సారము లంచు విత్త మిడఁజాలక కేరడమాడు లోభి యా
నేరుపు నేర్పు గాదు తను నిందలఁ బెట్టు రసజ్ఞుఁడైనయు
ర్వీరమణుండు గల్గినఁ గవిత్వము సర్వఫలంబు లీదొకో. 135

చ. పలుకులశబ్దసద్గతశతప్రభవంబులు జాతవర్ణముల్
బలుకడుపుల్ నిరుక్తికలు ప్రజ్ఞలనర్థకము ల్విచారముల్
వలవనిశీవినవ్వుఁ బెఱవారి నెఱుంగక తిట్టి కూళలే
పొలుపునఁ దప్పులొప్పులనఁ బోదురొకో సుకవిప్రబంధముల్. 136

చ. మెఱసి బహుప్రబంధతను మెచ్చుట మెచ్చుట యొచ్చమంటి పా
మఱిమిఱి నెన్న, లెన్నుట నిపత్కగణుక్తు లధీరశిక్షితుల్
కఱటులు భూరుహాళ్యపశుకల్పులు మత్కృతిఁ బ్రస్తుతించినం
గఱగఱఁబోవనాడినను గల్గవు నామదిమోదఖేదముల్. 137

క. పరిహాసకులకు నటులకుఁ, దరుణులకును లంజెదారితమ్ములకుం గా
పురుషులను గాయకులకుం, బొరయింతురు రాజు లీయవో సరసులకున్. 138

ఉ. ఏపున సంచితార్థము పరంగితభాస మెఱింగి యీఁగి మే
లై పొగడొందనిచ్చి నెఱయన్నుఱచు న్నెఱదాత యిట్టిచో
దాపయిత్ప్రభోధవశతం బొరయుంచి యనంతరంబు సం
తాపమునొందువాఁ డధమదాత వృథాలపితంబులేటికిన్. 139

ఉ. దాతలు దాతలం డ్రిదియతథ్యము లోకమునందు లేఁడుపో
దాత యతండు గల్గినను దాతృత దాసకలార్థులందు నే
లాతులతూఁగకుండు నచలస్థితి నింతయెఱింగి యే నహో
దాతబుణానుబంధముగ దాయనిచిత్తమునందలంచెదన్. 140

క. తల్లలెత్తి మాఁపెపఱతురు, నలవెలనై మాఱుపలుక వెఱతురు నెఱయుం

జలియించిపఱతు రిస్సి, కొలప గతులు గారె యాచకులు లోభులకున్. 141
క. చరణములుపడఁకు భీతిం, బరవశమానొడలు రాఱుపడు సెలుఁ గాహో
మరణమున నెట్టి చిహ్నము, లరయ న్యాచకుఁడుదాల్చు నచ్చిహ్నములన్. 142
వ. అట్లగుటఁ జింతించి యాచకత్వంబునకుఁ జిత్తం బొడఁబాటుగాదు దారిద్ర్యంబువం బ్రజ్ఞాహైన్యంబు వాటిల్లుఁ బ్రజ్ఞారాహిత్యంబున సత్వక్షీణంబగు సత్వభ్రంశనంబునఁ దిరస్కృతివొడముఁ దిరస్కారంబున నఖర్వనిర్వేదనం బావహిల్లు నిర్వేదనంబు శోకంబుదెచ్చు శోకంబుబుద్ధిబాధకంబగు బుద్ధినాశకారికావున నిర్ధనంబఖిలవిపదాస్పదంబని పలికి మఱియును. 143
చ. సముచితభాషణంబులకుఁజాతురిసాలక యున్న మాన ము
త్తిమము పరాంగనాగమనతత్పరుఁడయ్యెడు దానికంటె సం
దమతము మేలు చాడికినొడంబడియుండెడిప్రత్తికన్నఁ బా
వుమిగులలెస్స యాన్యవసువు ల్గొనుకంటెను భిక్షమొప్పగున్. 144
క. దీపమునఁ దమము రోగ, వ్యాపృతిఁ జెలునంబుహారిహారాఖ్యానము చేఁ
బాపమువలె యాచ్ఞావిధి, వేపాయుగురుత్వ మతులవిజ్ఞాననిధీ 145
చ. అలఘుఘుత్వమూలమగు నర్థిత కంజలిఁజేసి మ్రొక్కి వి
డ్కొలిపి నృపాలురంగొలిచి కూర్చదభూరితరార్థమంచు నేఁ
దలఁచితి నేని పట్టియులఁతంబడుటొక్కటి నిర్దయుష్కలు
ల్దులువలు హీనమర్త్యఫలదుల్నరవల్లభు లీరు విత్తముల్. 146
క. తానీఁగొఱమాలిమహా, హీననరాధిపుఁడు భాగ్యహీనుఁడను న్స
న్మానార్హలసుభటులఁవి, ద్యానిధులన్ హాలహాలాభమగులోభమునన్. 147
వ. అట్లగుటరాజసంశ్రయంబును గూడదు ప్రేష్యభావంబు మృత్యుద్వారంబు రోగియుఁ జిరప్రవాసియుఁ బరాన్నభోక్తయుఁ బరగృహశాయియు జీవన్మృతులని చెప్పి హిరణ్యకుండువెండియు. 148
క. సంతుష్టివర్షసంగు, ప్రాంతఃకరణునకువెఱచునతిశయతృష్ణా
కాంతములుభీతిచింతా, సంతాపక్లేశరుజలసంపాదింపన్. 149
ఉ. వీతఖలీనమై యతులవేగమున న్మనగాలు ద్రొక్కుతృ
ష్ణాతురగంబు నెక్కి యలసస్థితిఁజేట్పడకుండు వానికిం
జేతెడునేల మేరుగిరి సింధువుపత్సపదంబు దూరతృ
ష్ణాతనుఁడైనవానికి నిజాంకగతార్థము దవ్వు పెద్దయున్. 150
క. అశాశృంఖలఁబడినా, నాశాభూములఁజరించునదిపో యసుఖ

శ్రీశోభితుఁడై నిలుచును, ధీశరధీ మనుజుఁడొక్క దెసయరుదేరన్. 151

క. పొట్టకుఁగా బట్టకుగాఁ, జెట్టాడుందెలివితేఁజీవి నిజంబా
నొట్టపు శపథంబవుఁ దనుఁ, బుట్టించిన దేవుఁ డిమ్ముఁబో కర్మగతిన్. 152

క. కూరలు నారలు చాలవె, పూరింప న్నెల్ల మేల పొట్టను మఱి యే
నీరైనఁ గాలదే పన్నీరేటికి నింగిఁగిల్లు నినదిచ్చార్పన్. 153

ఉ. ఊరయొలమంచము ల్పసిఁడియుప్పరగ ల్లపురంపువీడెము
ల్గాయనిపుట్టము ల్ప్రచిరమండనము ల్గడలేని క్రొవ్విరు
ల్గాయనగాయనీమధురగానసుఖంబులు గన్నగాని సీ
పాయదె యన్నమాత్రమునఁ బస్తనుజీవికిఁ జక్రవర్తికిన్. 154

చ. ఒకరునికిమ్ము నిచ్చి తిరియు న్మఱియొక్క తటిన్మహోగ్రుఁడై
యొకరునిఁజంపుఁ జంపివొలియ న్మఱియొక్కనిచే బలాఢ్యుఁడై
యొకరునిఁద్రోయుఁ ద్రోచిమఱియొక్కనిచేఁబడు నేలు నొడ్ల నొం
డొకరునిఁగొల్చు మానవుఁ డొహో సుఖసంపత్తి విపత్తిసంపత్తులన్. 155

వ. అట్లగుట మేలుగీళ్ళు దేహధారులకుప భోగ్యంబులుగదాయని తెలిసి మదింబదిలంబు సేసికొని యిచ్చటికివచ్చితివని హిరణ్యకుండు చెప్పినమందరకుండతని నాలోకించి.

క. నెలవునఁ బూజ్యంబులు నఖ, ములు దంతంబులు శిరోజములు గాలకతిన్
నెల వెడలియుఁబూజ్యంబులు, పులిగోళ్లును దంతిదంతములు చామరముల్. 157

క. హరి పెంపువడయుఁ గరి పెద్దరికముఁగను సజ్జనుండు తగఁబూజ్యుండౌ
నిరవెడలియునిరవెడలినఁ, గరటము దెగుఁ గుజనుఁ డీల్గుఁగడ చనుమృగముల్. 158

క. అరివిదళన పరుషుండగు, పురుషుండెచ్చోటనయినఁబూజ్యుఁడుగాఁడే
ఖరనఖరవిజితకరిహరి, తిరముగమృగరాజ్యమేలదే పెఱయడవిన్. 159

క. కదలనినీటికిమీనము, లెదుకెక్కు నెయుఱిదిఁబాఱు నేటికిఁబోలెం
బదవి నిరుద్యోగులఁబొం, దదుసోద్యోగులకాని ధార్మికముఖ్యా. 160

క. తనపుణ్యపాపవశమునఁ, దనివిసనన్నమ్ము సంపదలునాపదలున్
ఘనతకు నుబ్బక హీనత, కనుతాపం బందకుండువది సుజనునకున్. 161

క. శకటగతచక్రభంగి, న్నేకరములై తిరుగుచుండుసుఖదుఃఖము లిం
తకు ఖేద మంద నేటికి, నకటా సంతోషయుక్తుఁడగు టొప్పుఁగదా. 162

మ. సతతోత్సాహపరుం గ్రియానిపుణు భాస్వద్దీక్షసూత్రుం గృత
జ్ఞతము న్సత్యధురంధరు న్మధురభాషావేది సౌహార్ద్రభా
సితు నారంభవిజృంభమాణుఁ గరుణాసింధు న్శుచి న్శాంతు ని

ర్జితకామ్ముం దనుఁదా వరించు సిరి నిర్ణిద్రానురాగంబునన్. 163

క. అవివేకి వలసు విగత, న్యాయసహాయుఁ హీనుఁ గుటిలవర్తను నఘమున్
గువిచారుఁ జేర దిందిర, యువతీమణి వృద్ధుఁ గవయు నొల్లనిభంగిన్. 164

క. సరసప్రజ్ఞోత్సాహ, స్ఫురితుఁడ వీ వెచట నున్నఁ బూజ్యుఁడవు గుణా
కర మూషకకులశేఖర, యురగేంద్రుఁడుఁ గాను నిన్ను నుత్కర్షింపన్. 165

చ. అడఁగని లేమిఁ బొట్టుపొఱలయ్యును ధీరుఁ డొకానొకప్పుడున్
విడిచి చరింపఁ డగ్రపదవిం గృపణుం డసమానసంపదం
బొడవయి యుండియుం దపయుఁ బోఁ డదియొప్పరికేది మూర్ధమా
నడవడి వా రొకింతవిడనాడరుగా గడతేరునంతకున్. 166

క. ధనవంతుఁడనని మదమున్, ధనహీనుఁడ నని విషణ్ణతం బొందవు హ
స్తనిహతహేలాకందుక, మనఁ బాతోత్పాతములు జనా వళికగుటన్. 167

సీ. జలధరచ్ఛాయయు ఖలమైత్రియును నవసస్యంబు యువతియు జవ్వనంబు
సంచితార్థంబు నీచతాకలభోగ్యము లావున వలవంత గా దొకింత
తెలు పంచగమికి నెచ్చులకుఁ జిత్రతకీరములకుఁ బచ్చదనంబు గలిగె మొదల
నేవేల్పువలన నద్దేవదేవుఁడు పోషకుఁడు సుమ్మె మది నేల కుతిలపడఁగ

తే. జనుఁడు బ్రతుకునూఱు సంవత్సరములంత, కాల మెవ్వఁడుండు మేలుతోడఁ
గౌతుకమునఁ గొంతకాలము చను మహా, కష్టవిష్టిఁ గొంతగాల మరుగు. 168

వ. దానతుల్య యాగవిధియును సంతోషసమం బగుసుఖంబును శీలసదృశం బగుభూషణంబును నారోగ్యసదృక్షం బగులాభంబును లేదుగదా యిమ్మాటలట్టుండె మదీయ స్నేహంబునఁ గాలం బపనయింతురుగాక యని మందరకుండు హిరణ్యకు నాశ్వాసింపుచుండె నప్పుడు లఘుపతనకుండు. 169

క. శమితశతాకమతాని, ర్గమనప్రమదంబు హృదయగతచింతాశ
ల్యముఁ బెఱికివైవ నీమై, త్రి మనోజ్ఞవిశల్యకరణి ధృతినూహింపన్. 170

క. ధరలో సత్పురుషులు సత్పురుషాపద్ధరణ హేతుభూతులు గారే
కరులుబ్బలిలోఁ జిక్కినఁ, గరులె త్తెఁగఁ జాలియుండుఁ గాదే పుడమిన్. 171

క. నిధిసాధకుఁడు ఘనాంజన, విధినిక్షేపంబుఁ జూపువిధమున సుజనుం
డధికాపదార్తులకు హిత, మధురోక్తి నఖండసౌఖ్యమహిమ ఘటించున్. 172

మ. కరసీరేరుహమార్గిపాఁపఁ బ్రతిపక్షత్రస్తుఁడై వచ్చి కా
తరబుద్ధి న్మనుజుండు మాటుసొరనాస్థన్నిస్తులార్ధాభయా
చరణప్రక్రియలం గృపామతిఁ దదాశాభింగవై ముఖ్యమున్

బొరయం గోరనివాఁడువో పురుషుఁ డొప్పు న్వానిఁ గీర్తింపగాన్. 173

చ. విటపసమృద్ధభూజముల వీవలుల న్విరుల న్మరందలి
ట్పలివియుత్ప్రిదేశమునఁ బక్షులు వారిమరాళమండలం
బెటునలె నాశ్రయించి బలమెవ్విధిఁ గైకొను నేము నిట్టిచో
నటువలె నిన్నుఁ జేరి ముదమందెద మోకమహాన్వయాగ్రణీ. 174

వ. అని లఘుపతనకుం డనేకప్రకారంబుల మందరకు నుత్కర్షింపుచుండె నాసమయం
బున. 175

మ. చకితస్వాంతముతో మహామహీరజశ్ఛన్నప్రతీకంబుతో
వికసద్వక్త్రముతో బృహద్గతిజనిర్వ్యదైకనిశ్వాసవి
చికతో బమ్మెరపోకతో నటకుఁ గశ్చిల్లుబ్ధకక్షోభ మొం
డొక కాంతారమృగంబు భిన్నఖురటంకోదగ్ర మేతెంచినన్. 176

క. మానికిఁ బోటియకు సలిల, స్థానమునకుఁ గాక వివరసజ్జలచరముల్
లో నెరసినభీతిఁ బసిం, దానిఁ గనుంగొని యథాయథముగాఁ బఱచెన్. 177

క. క్షితిజాంతాగ్రస్థితలఘు, పతనకుఁ డద్దిక్కు లెల్లఁ బరికించి యుప
స్థితమైనది కించిద్భయ, మతిభయ మిచ్చోటఁ గలుగదని తెలుపుటయున్. 178

వ. హిరణ్యకమందరకులు బహిర్నిర్గమనం బొనర్చి వెగడుపడియున్నమృగంబు నూఱ
డించి యాతిథ్యం బొనరించి చిత్రాంగనుం డనునామం బిడి ముఖ్యసఖ్యంబున నల
రించి భీతికి హేతువెద్ది చెప్పుమని యడిగిన నది మృగయుత్రస్తం బని చెప్పె నమ్మ
వ్వురు నతం డొక్కరుండునుంగా డనలువురై యన్యోన్యస్నేహవ్యామోహంబునఁ
గొంతకాలంబు గడపి రట నొక్కనాఁడు. 179

సీ. ఆహారవాంఛఁ జిత్రాంగదుం డడవికి బఱచి యొండొకకుంటఁ బడియచోట
నలఘుసధీవరయంత్రవాగురఁ దగుల్కొని భీతినంగము ల్వడఁక గోడు
గుడుచుచుఁ దోనీడ్చుకొనుచు శుష్యద్గ్రీవమై వచ్చుచుండ వృక్షాగ్రవర్తి
యగుచు దూరమున వాయసనాథుఁ డచ్చొట్టఁ గని నుక్కి యెటువంటికష్టమొదవె
తే. నేమిసేయుదు ననుచు నహీనవేగ, కలన ఱెక్కల పటపటాత్కార మెసఁగ
నరిగి బాష్పనిరుద్ధాక్షుఁ డగుచు సఖునిఁ, గదిసి యిట్లనుఁ గంఠగాద్గద్య మడర.

మ. చెలికాఁడా పదబంధ మేవలనవచ్చెం జెప్పుమా నివ్వెఱం
గలఁగ న్మానసమన్న నాతఁడను బల్కుం దాల్మితే దెంతయుం
దలియం జెప్పెదఁ బిమ్మటం బ్రతుకుఁగంటేఁ గ్రమ్మఱం బోయిని
ర్మలహృద్ధాము హిరణ్యకుం బిలిచి తెమ్మా బంధవిచ్ఛిత్తికిన్. 181

చ. మనుపఁ బ్రియంబయేనిఁ జనుమా యన నాయన నిత్ఘరత్వరం
జని నిరవద్యహృద్యగుణసారు హిరణ్యకుఁ జేరి చూచితే
చెనఁటివిధాతచేత మనుఁజిత్రమృగాగ్రణికృత్తివాగురా
భినిహతపాదుఁడయ్యె నినుఁ బిల్వఁగవచ్చితిఁ దత్ప్రశాంతికిన్. 152

క. నావిని మూషకపతి దుః, ఖావేశితహృదయుఁడై సఖా పోవలయుం
బోవలయు జాగుసేయక, వేవేగ న్నన్నుఁ జేర్పవే నీవచటన్. 183

వ. అనిపలికిన నతని మృదురీతిం గఱచుకొని చని వాయసకులవల్లభుండు నికటం
బున నిలిచిన రుగ్ణునకు నౌషధంబును దృషితున కుదకంబును క్షుధార్తునకు మృష్టా
న్నంబును నగాధజలపతితునకు నోడయు దరిద్రునకు నిధానంబునుంబోలె నుప
స్థితుం డైన హిరణ్యకుం జూచి చిత్రాంగకుం డిట్లనియె. 184

క. మృగయుభయంబునఁ జీకా, కగుచున్నది మది భుజంగమాకృతిఁ గాలం
దగిలినయురిగొఱికి భయా, ధ్వగచిత్రగ్రీవుఁబోలెఁ దగు ననుఁ బ్రోవన్. 185

క. మందరకుండును గరటపు, రందరుఁడును నేను నీపరామర్శ న్నే
లందెదమని తలపోయుదు, మందెక్కుడిశంక నీదయకుఁ బాత్రంబుల్. 186

క విచ్చలవిడి వాగురికుఁడు, వచ్చినఁ బ్రాణములమీఁద వచ్చును గృపనేఁ
డిచ్చెట్టు మాన్ప మనవుడు, నచ్చకితునిఁ జూచి మూషకాగ్రణి పలికెన్. 187

క. వెఱవకు వాగురదునియుం, గొఱుకుటయన నెంత నీతికోవిద నీకే
తెఱఁగున నీదుర్దశ దు,ష్పరమై చనుదెంచెఁ దేటపడఁ జెప్పవనా. 188

క. అనిన నిది నేఁడ కాదట, మునుగలదన నతనిఁ జూచి మూషకరాజో
యనఘా నీతొలుతటికథ, విన నిష్టంబయ్యెఁ దెలుపవే నాకనుడున్. 189

ఉ. రంగదుపాయపారగుహిరణ్యకుఁ గన్గొని యొప్పఁ బల్కెఁ జి
త్రాంగదుఁ డిత్తెఱంగుఁ దెలియ న్వినుమాఱవమాస మేగుచుం
డంగ సుగంధసై జననిడాఁపునఁ బర్వి యఖర్వపర్వత
ప్రాంగణశాద్వలస్థలులఁ బచ్చికమచ్చికమేయ నాయెడన్. 190

చ. వరనుతకీర్తియాత్కులమునాఁ గటకంబునఁ బుష్కరుండు భా
స్కరకులుఁ డొక్కనాఁడు తెలిగన్నులయన్ను లొయారమొప్పఁ జా
మరము లిడంగ దివ్యమణిమంటపమధ్యమృగేంద్రపీఠి నం
బురుహవిరోధి పూర్వగిరిఁబోలె రహిం గొలువుండె నుండఁగన్. 191

మ. తుటుమై యొక్కటఁ గూడి గూడెపుఁగిరాతుర్న్నను వీక్షింపఁగా
వటకాల్లోన హుటాహుటిం బఱచి పచ్చాకుల్ దృషత్సానము

ల్గిటిదంష్ట్రి ల్గరిదంతము ల్సవరము ల్ఖడ్గ ల్కివాశృంగముల్
చిటుకలై వచ్చిన మ్రోఁగువారువములుం జేకానుక ల్సేయుచున్. 192

గీ. మ్రొక్కిఁ జేమోడ్చి మాయున్న చక్కిఁ జెప్పి, యెన్ని హరులెన్ని యేనుగులెన్ని పందు
లెన్ని పులు లెన్నిదుసుబిల్లు లెన్నియెల్లు, చెప్పఁ జిత్రంబు వేఁట విచ్చేయుమటకు 193

సీ. కొసవెంట్రుకలబట్టి కూపెట్టసింగంబుఁ బట్టితేకున్న నీబంటఁగాను
నెఱవారసిలసొమ్ముసిలవైచి శరభంబుఁ బరిమార్పకున్న నీబంటఁగాను
గండ్రగొడ్డటన వక్త్రంబుఁ జించి గజంబుఁ బడఁద్రొక్కకున్న నీబంటఁగాను
గండభేరుండపక్షుల నెత్తుట భూతబలిఁ జల్లకున్న నీబంటఁగాను
తే. గబ్బిబెబ్బులిడాకాల ద్రొబ్బి విరియఁ, బ్రామి రూపార్పకున్న నీబంటగాను
లావిగవిఁ జొచ్చి యచ్ఛభల్లములగముల, బడఁలువాపకయున్న నీబంటఁగాను. 194

వ. అని మృగారాతు లక్కిరాతులు పంతంబులు పలికి మృగయావినోదంబునకు
మోదం బాపాదించినం బుష్కరుం డలరి వేటసన్నాహంబువీటఁ జాంటించిన. 195

సీ. అసంగించుఁబో యిమ్మహాసారమేయంబు జముఁ డెక్కు కాసరస్వామి నైనఁ
గూల్చుఁబో యమ్మహాకుక్కురం బద్ధిశుముద్దులాయము కాఱు మొసలి నైనఁ
గఱచుఁబో యిమ్మహాకౌలేయకము విషగ్రీవు పేరెకిరింతగిత్తి నైనఁ
బట్టుఁబో యిమ్మహాభషకంబు తొలుసంజ గన్నమానిసి వాత్మైకంబు నైన
తే. నవఁగఁబులిగాఁడుచిలుకుటమ్మచ్చపచ్చి, మిరియమురిద్రాడుకాత్రేఁడు మెఱుపుదీగ
పిడుగుకలగూరగంపను పేళ్ళనలరు, నిడుదకుక్కల పట్టుపట్టెడలఁబట్టి. 196

గీ. పరుసుకరసానఁ దీటినపందిపోట్లు, భూరిభుజపీఠములయందుఁ బొంకుపఱిచి
పరికరంబులఁ గొనుచు భూపాలునగరి, యేలుబడి వేంటకాండ్రు మున్నే చినడవ.

క. ఏలలఁ బాడుచుఁ దగ విలు, గోలలఁ గొని నల్లప్రజలు గుములై నడవ
న్నీలాంబరుఁడై విభుఁ డు, ద్వేలాశుకశ్యావిరాజి తేజీ నెక్కెన్. 198

క. ఎక్కినఁ ద్రొక్కనిచోటులఁ, ద్రొక్కుచు గుఱ్ఱంబునడవ దూరము లగుమా
యిక్కలకు వచ్చె నరపతి, పక్కణవాస్తవ్యసమితిపథ మెరిఁగింపన్. 199

తే. వచ్చి మాయున్నపొలమెల్ల వల్లవైచు, చందమునఁ జొట్టుకొనినఁ బోసందులేక
చలితచరణంబులును బరాసన్నదృష్టి, గలిగియుండిరి మచటఁ గాకవులకరణి. 200

వ. అంత. 201

క. పవికల్పప్రదరంబున, నవనీపతి దుప్పిదుప్పవరనఁ బడనేసెన్
నవలాఘువ మేర్పడ రా, రవబాధకు మొదలుగారె రాజులు దలఁపన్. 202

క. శిఖిధూమశ్యామలములు, ప్రకరగరుద్వీసరభాసురము లుద్యజ్జ్వా

ముఖరితములు రాజశిలీ, ముఖములు బహుపుండరీకముఖముల వ్రాలెన్. 203

క. తారలుచెడ నుడ్డీశో, దారగతు ల్మెఱపి గగనతలమున జవన
ద్భేరుండము లాస్యముల న,పారముగాఁ గొనియె రాజబాణఫలంబుల్. 204

క. తులలేని శైత్యములుఁ జెఱు, బిలముల బురుడించుకొనలఁ బెరిగినశరముల్
పొలములు లాయంబులగశి, ములు మోవఁగఁ దుండషండములఁ బూరించెన్. 205

క. నిరవధిక దానవిద్యా, పరఘనుఁడాఘనుఁడు దాత ప్రజ్ఞాని వనే
చరమృగ చరజాంగకముల, శరధిస్పృషత్కముల సరభసంబునఁ గప్పెన్. 206

క. సమయించె ఖడ్గముల ఖడ్గములం గ్రూరాచ్ఛభల్లగణముల జగతీ
రమణుఁడు దుర్గాహవన, క్షమఁ గ్రూరతరాచ్ఛభల్లగణములఁ గప్పెన్. 207

వ. అయ్యాఖేటనంబు శాసితపశుప్రకరంబు గావున యజనవాటంబును ధ్వనిప్రధానంబు గావున సుప్రబంధంబును భంగదుర్నిరీక్ష్యంబు గావున బయోనిధానంబును నఖండ ధర్మసంపన్నంబు గావున కృతయుగంబును నిరూఢఋశ్యశృంగంబు గావున విభాండకాశ్రమంబును శిధిలీకృతాచ్ఛభల్లంబు గావునఁ బ్రభగ్నసంగ్రామంబును గుంతీష్టవిహారయోగ్యంబు గావునఁ బాండురాజార్జనంబును నష్టసింహబలంబు గావున భీమసేనోత్సాహంబును నపాస్తసింధురాజంబు గావున ఫలితార్జునప్రతిజ్ఞయు నికుంచితపంచకంబు గావున రాజనగరంబును నిశ్చేష్టితగవయంబు గావునఁ గుంభకర్ణసంరంభంబును సప్రకాశితపుండరీకంబు గావున శిశిరకాలంబును ననుకరించె నప్పుడు. 208

క. పోలములు వెదకి పక్కణ, పాలురతఱుముటయుఁ దల్లి ప్రజ లుద్ధురజం
ఘాలురు గావునఁ బరచిరి, పోలేకం దగులుపడితిఁబో వారలకున్. 209

క. వను నంతఁ జిత్రవర్ణుఁడు, గనిఁజంపక తెచ్చి పతికిఁ గైకానుకగా
నొనరించిరి శబరసుతు, ల్వీను రా జన్వేటమీఁద విరిగె న్దిరిగెన్. 210

వ. తిరిగి మహిమహీశాకటకం బగుకటకంబునకు వచ్చి రాజు యువరాజునకు నన్నిచ్చె నిచ్చిన నచ్చెలువుండు నన్నుఁ గన్ననందనుకంటె నగణ్యకారుణ్యంబున రక్షించె నట్లు కుక్షిద్రక్షితుండనై యుండి యంతఃపురంబున వాసగృహంబున యువరాజొక్కరుండు పవ్వళించియుండ నేనును దత్సమీపంబున నుండితి నయ్యర్ధరాత్రంబున. 211

క. ప్రతిగర్జత్కేసరియై, యతికంపజ్జంతు హృదయమై నిర్భిన్న
శ్రుతిహృత్పుటమై విద్యు, ద్ద్యుతివాంతధ్వాంత మగుచు నొకయుఱుము మఱిమెఱెన్.

మ. తనకర్ణంబుల కెంతయాఘననినాదం బూర్జితామోదకం
బొనరింప న్సుఖమెత్తి వానతటి యయ్యోత్యపర్వతాధిత్యకా

వనుల నసద్వనులం గులప్రభులతో వర్తింతుఁగా యంను బా
ష్ప నిరుద్ధాక్షుఁడనై సఖా మనుజభాషం బల్కితిం బల్కినన్. 213

చ. విని యువరాజు ద్రాసరసవిహ్వలుఁడై సదనంబు నల్దెస
ల్గనుఁగొని యేను నీమృగముకాని యొరు ల్విహరింప రింకుఁజె
ప్పను వినఁగూడు నే మనుజభాషల నిప్పళు నద్భుతధ్వనిం
బనివడి మ్రొసె వేగి తెలుపందగు నీతెఱఁ గెల్లవారికిన్. 214

క. అనితనువు వేఁగ వేగినఁ, దన కాపుష్కరవరేశుతమ్ముఁడు నెమ్మిం
గనుగూర్కు వెఱచి యొకలా, ఘన నంతయు దైవచింతకుల కెఱిఁగించెన్. 215

క. ఎఱిఁగించి మృగములెక్కడ, తరి నేతన్మనుజభాషితము లెక్కడ నే
తెఱఁగో యేయుత్పాతమొ, వెఱఁగయ్యెడు ననిన నవ్వి విద్వత్సింహుల్. 216

క. యువరాజుఁ జూచి ధరణీ, ధవనందన యేలవెఱచెదవు మృగజాతుల్
పవలూరకుండి నిశనవ, నవభంగి మ్మనుజభాషణంబులఁ బలుకున్. 217

క. నరసంచారవిహీనో, ర్వర నని చెప్పుటయు భయము వదలి నృపాలా
వరజుఁడు నను విడిపించెను, గరుణాపరుఁడై దురంతకాంతారములన్. 218

క. ఇది నాకు నేఁడకాద, న్మొదలం గలదనుమఁ దెల్లముగ మృగము జగ
ద్విదితుఁడగు నెయ్యునకు నా, ర్తదశం దడిలేనినోరఁ దనకథఁ జెప్పెన్. 219

క. అతివేలచింత నంతట, నతమదిలో నెరసి సరసి వెలువడి మంద
స్థితి చాయఁ జూచుకొని య, ప్రతిమదయాశరధి మందనకుఁ డేతెంచెన్. 220

క. ఏతెంచిన భీతి విని, ర్ఘాతహతిం గృతినగంబు ప్రయ్యలుగాఁ జిం
తాతంతుబద్ధమానసుఁ, డై తత్తర మెసఁగ మూషకాగ్రణి వలికెన్. 221

చ. అరయ నుపాయపారగుఁడ వయ్య నయోదధివయ్య సంతత
స్థిరమతివయ్యుఁ గానిపనిఁ జేసితి నస్మసఖా మృగంబు ని
క్కరటము నేను నెప్పటికిఁ గాల్గలవారము చిక్కి మేరికి
ట్లురుగతి నీకులే దిచటికుద్ధురుఁడామృగయుండు వచ్చినన్. 222

చ. అతివిపులాత్ముఁడైనసఖునందును బెంపొనరించుధారుణీ
పతివరునందు భూరిగుణబంధుర మైనకళత్రమందు ను
న్నతనయతత్వశాలి యగునందనునందు మనంబు సొన్పి యా
గతబహుదుఃఖము ల్దొఱఁగుఁగాదె విచారధురీణుఁ డుర్వరన్. 223

చ. అను నెడ వేఁటకాఁ డదయుఁ డప్పు డుపస్థితుఁడై నదైన్యమా
ననమున మోసులెత్త మృగనాథుఁడు బెగ్గిలినన్ హిరణ్యకుం

డనునయవాక్యము లెఱయ నాత్మఁ మంత్రిపరీతవాగురం
దునియలు సేసి మందరకు దూఱి యథాయథలయ్యె నయ్యెడన్. 224

క. జలచరుఁడు గనపరత్వర, నిలబోవం జేవలేక యెప్పటిచో ని
ర్గళితగమనేచ్ఛఁ గచ్ఛప, కులనాథుఁడు శిరము ముడుచుకొని యుండుటయున్.

క. సరిసురికిఁ బాసి గాఢ, త్వరఁబఱచినమృగముఁ జూచి దారుణచింతా
పరితప్తుఁ డగుచు మృతయుఁడు మఱుగుచు నచ్చో ముహూర్తమాత్రము నిలిచెన్.

వ. అట్లుండి మందర మందరకుం గాంచి పట్టుకొని త్రాటం గట్టుకొని వింటికొపునం బెట్టుకొని విన్ననైన మొగంబునం దిరిగి యరుగుచుండె నప్పుడు హిరణ్యక లఘుపతనక చిత్రాంగదు లంతంత ననుసరించి చనుచుండి రందుందురు పురందరుండు తనలోన. 227

ఆ. అంబురాశిపారమైనను గనవచ్చు, నిశ్చయింపవచ్చు నింగిపొడవు
బ్రహ్మ మిట్టిదనుచుఁ బలుకంగనగు సుహృ, ద్విరహ మింతయనుచుఁ దెలియరాదు.

తే. అదియ సువ్యక్త మది నిజప్రాణతుల్య, మదియ నిర్వాచ్య మట్లుగాదయ్యెనేని
జననిపై భార్యపైఁ దనూజన్ములపయిఁ గలిమిపై మైత్రిపైఁ బోలెఁ గలదె మమత.

సీ. కర్మచేష్టితములు గాలాంతరావర్తితము లగు మేలుగీ ళ్ళమరు నైనఁ
గనుఁగొంటి మరిసమాగమవియోగములేల చెనఁటివిధాత సృజించె మొదలఁ
బృథులశోకారాతిభీతిఘాతిప్రమోదసంపాదిప్రీతివిస్రంభభాజ
నము మఱి రెండక్షరములఁ బూన్చంబైనమిత్రశబ్దము మేర మెఱసి విడిసి

తే. యెట్లునిలువఁగూడు నెబ్భంగి రుచియించుఁ, గూడు కంటికెట్లు గూర్కవచ్చు
నని హిరణ్యకుండు దనలోన దుఃఖించి యపుడు పలికె వాయసాధిపతికి. 230

క. ఈయధముఁ డెంతదూరము, పోయెడునో యెంతదవ్వు పోదము సర్వో
పాయములఁ గానలోపల, నీయెడ విడిపించుకొంద మిమ్మందరకున్. 231

క. నావిని లఘుపతనకుఁడును, లావుపసం బోర నలఁతులము మందరకుం
డేవడువున విడివడు నీ, చేవినికి దిక్కు చెప్పవే వెరవనినన్. 232

సీ. అశ్రుమిశ్రితనేత్రుఁ డైనహిరణ్యకుఁ డనియె నిప్పాపాత్ముఁ డరుగుత్రోవఁ
గలదు చెందామరకొలను దత్తటమున మృగముఖ్య చచ్చినపగిది నుండు
నేమించి యాదల నిలిచి లోఁజెవులను ముకుగోళ్ళఁ బొడుచున ట్లొకట గన్నుఁ
గ్రుడ్లూడ్చి మెసవులాగున నుండు ముండినవాపూఁట కచ్ఛపనాథుఁ బ్రోవ

తే. వేగఁ గేడించి యస్కేచు వెనుకఁ జేసి, యరుగుమచ్చకిక్కనికూర్చి యనుచుటయును
ఖగమృగాగ్రత్యాలు లరిగి రాఘనులపజ్ఞ, నంత నంతట దానును నరుగుచుండె. 233

సీ. చిత్రాంగదుండు వచ్చినవానిగతిఁ బురస్సరణసరస్తీరధరణినుండె

వానిమస్తకమున వ్రాలి వాయసకులాగ్రణి కనుగ్రుడ్డులు గఱచి పెఱికి
కొని తినువానిలాగునఁ గావుకావున నఱచుచు ముఱియించునంతలోన
నరుగుచున్న కిరాతుఁ డగ్రభాగమునఁ జిత్రాంగుఁ గని మేనుపొంగ నురక

తే. కలిగెఁ దకతేర నేతన్మృగం బనుచును, మందరకు డించి కాకి బల్మి నదల్చి
కొనుచుఁ జనుచోట మూషకకులవిభుండు, కూర్మవల్లభుబంధము ల్గొరికివైచె. 234

క. కొరికిన మందరకుఁడు దె, ప్పరపున డింబఱచి సరసిఁ బడె మూషకరా
జారిక మృగవాయసంబులు, తెరఁగొప్పగ లేచి రెండుదిక్కుల కరిగెన్. 235

తే. అట్లు విఫలప్రయత్నుఁ డై యడవిఁ బాసి, విన్నబాటునఁ జనియెను వేఁటకాఁడు
కమఠమూషకమృగమహాకరటవిభులు, గాఢతరమైత్రిఁ బొదలి రత్యంతనందు.

వ. సుహృల్లాభంబున సాధింపరాని కార్యంబులు గలవే యని సుదర్శనకుమారులకు విష్ణుశర్మం డెఱింగించె నెఱింగించిన. 237

క. విని రాజకుమారకు లన, ఘ నయాంశవిలాసదివిజగురు నిజగురునిన్
గని మాఁడవతంత్రము పా, యనిధీ మాతోడఁ జెప్పుమని యడుగుటయున్. 238

మ. అతికారుణ్యకటాక్షసర్వభువనైకాధ్యక్షరాధాసుత
ప్రతిపక్షప్రియచర్యకల్పకనిశారాడ్ధుర్యచక్రత్రిశూ
లతిరోభూతరవిప్రభూతశుభలీలాపూతరూఢాంధకా
హితతేజోవిభవప్రచారణదయావ్యాప్తస్ఫురద్వారణా. 239

క. మాయాతీతమహానిత, కాయఘటీకృతమరున్నికాయతపస్వి
ధ్యేయ నిజభక్తరక్షా, పాయ విభూతిప్రధానపాండిత్యనిధీ. 240

మాలిని. నిరనుమితమహత్త్వా నిశ్చలానందతత్త్వా, నిరతసుఖితలోకా నిత్యపుణ్యావలోకా
గరుడవృషపతాకా ఖండితానన్యశోకా, మరణజననదూరా మానిచేతోవిహారా.

గద్యము. ఇది శ్రీవేంకటనాథ కరుణాలబ్ధ సరససాహిత్య నిత్యకవితావిలాస సకలసుకవిప్రశంసా భాషణోల్లాస రాజకులపారావార పర్వశర్వరీరమణ నీతిశాస్త్రమార్గపరిశ్రమణ ధైర్యపర్యాయ ధిక్కృతనీహారపర్వత పర్వతరాజకుమార నిస్సహాయ ప్రబంధనిర్మాణ భోజభూదార సుధామధుర భారతీసనాథ వేంకటనాథప్రణీతంబైన పంచతంత్రంబునందు సుహృల్లాభం బన్నది ద్వితీయాశ్వాసము సంపూర్ణము.

# శ్రీరస్తు.

# పంచతంత్రము.

## తృతీయాశ్వాసము.

శ్రీమద్వృషాకపాయీ
రామాసాపత్న్యరోషరసకృత్వరతో
భూమకుటీవ్యోమధునీ
వ్యామిశ్రకటాక్షవీక్షహరిహరనాథా. 1

వ. దేవాసంధివిగ్రహాభిధాన తృతీయతంత్రం బాకర్ణింపు మధీతనీతిశాస్త్రమర్మం డగు
విష్ణుశర్మండు సుదర్శనకుమారుల కిట్లనియె. 2

క. ఆకడ వైరం డగున, స్తోకప్రతిపక్షుఁ బెనిచి తుది రాజుచెడుం
గాకంబుఁ జేర్చుకొని నుత, లోకబలోద్రేక మొకయులూకము చెడదే. 3

క. నావిని రాజకుమారకు, లావిప్రుని జూచి చిత్రమది చెప్పుమా భూ
దేవకులోత్తమ మాకును, దావహముగ ననినవారి కతఁ డిట్లనియెన్. 4

చ. మధురనభోమణిద్యుతిసమంచితరత్నవిరాజమానధా
మధురవిలాసినీక్వణనమంగళరాగవదీరితేక్షుహృ
న్మధురధురంతసంప దభిమానతృణీకృతరాజరాజధి
ష్మధురచెలంగుఁ బాండ్యమహిమండలిఁ దన్నికటాయతాటవిన్. 5

చ. ఫలరుచివిద్యుదర్చిఁ దెలుపం బలిభుగ్రుతు లుగ్రగర్జలై
యొలయఁగ బెల్లుగా డిగినయూడలు పుష్కరవర్షధారలై
నిలువఁగ వార్షికాభ్రసరణిం గగనస్థలచుంబియై దళ
ద్దళములకల్మిఁ గాన్కొనుమదగ్రవటం బొకఁడొప్పు నున్నతిన్. 6

చ. నటన ననేకకాకపృతన ల్ప్రతివాసరము న్భజింప న
వ్వటమున మేఘవర్ణుఁ డనువాయసవల్లభుఁడుండు వాని క
త్కటభయకంపనంబు లెసఁగ న్నికటప్రకటాటవీకుటీ
పటమునఘూకసేన గొలువం బెనుగూబయొకండు నెప్పుడున్. 7

ఉ. ఆయరిమర్దనుండు మది వచ్చలమెచ్చఁ గృతాంతవాలసా
లాయుధకంఠఘోర తిమిరాకులమై నొకనాఁటిచీఁకటిం
బాయనిఘూకసేనఁ బనుపం బెనుపొందినమత్తి కేడ్తెఱం
బోయి యజాగరూకబలిభుక్పటలిం బరిమార్చి పోయినన్. 8

క. ఆటెంకిఁ గరటవిభుఁ డొక, కోటరగర్భమున నణఁగికొని యుండుట నా
చేటొదవదయ్యె వానికి, నాఁటికి నదిపోయె మఱుసు నాఁ డుదయమునన్. 9

వ. హతశేషానుజీవకోటిం గూడుకొని యతనిమంత్రు లుద్దీపియు సందీపియుఁ బ్రదీ
పియు నాదీపియుఁ జిరజీవియు ననువా రేవురుం గలసి రంత నందఱం గలయం
గనుంగొని మేఘవర్ణుం డిట్లనియె. 10

ఉ. మ్రాఁకున నిద్రవోవ నరిమర్దనుపంపున వచ్చి ఘూకముల్
గాకముల న్వధించె నిది కక్కసపుంబని నిర్వహించుటె
ట్లీకడ నీతికార్యపరు లిందఱు పోలినభంగిఁ జెప్పుఁడా
నాకిపుడంచు రాజడిగిన న్వినయాన్వితసంగచిత్తుఁడై. 11

వ. ఉద్దీపి యిట్లనియె. 12

క. ఈదృశబలవంతులతో, వాదులకుం దించి బ్రతుకనచ్చునె యొండేఁ
బోద మఱ త్తుల కిది మర్యాద వృథా పోలిసిపోవ నగుఫలమేమీ. 13

క. అనువచనంబులు వాయస, జనపతి విని యానతిచ్చె సందీపికి నీ
వును నొకకార్యముఁ జెపుమా, యను డాతఁడు విహితహృదయుఁడై పతిమొగమై.

క. ఇది యొకపక్షమున మం,చిది యగు నగుఁగాక యేమిచిరవిక్రమసం
పద గలరాజున కుచితమె, సదనత్యాగంబు మానుషమ్యతిగాదే. 15

క. స్థానంబు సకలఫలసం,ధానం బొనరించుఁబతికిఁ దగనజకంఠ
స్థాన స్తనమిదునె యథా, స్థాన స్తనభంగి మధురతరదుగ్ధంబుల్. 16

క. చేవఁగలభూమిపతు లటు, గావునఁ గోరరు విదేశగమనము దేవా
నీవెఱుఁగనికార్యములుం, ద్రోవలు మఱియెవ్వరెఱుఁగుదురు లోకమునన్. 17

వ. అనుమాటలు విని రాజు ప్రదీపి నాలోకించి తోఁచినకార్యంబుఁ జెప్పుమని యడి
గిన నతండు. 18

చ. తడయక బాలవృద్ధవనితాజనతాదులవైరికోటికిం
గడువడిఁ జంపు మంచునిడుకంటె నయంబున సంధిసేయు టే
ర్పడ నుచితంబు వైరుల వపాయబలాఢ్యులు రాత్రిచారు లె
య్యెడఁ దగదీరసంబు బలహీనులకు న్మనబోటివారికిన్. 19

క. ఈవాలువచ్చితేవం, జావంగా నున్నవారిఁ జంపెద రహితుల్
దేవా సంధి యనూనశు, భావహ మొనరింపు మస్మదాదేశమునన్. 20

వ. అనుభాషితంబు లాకర్ణించి యధిపతి యాదీపినడిగిన నతం డతని కభిముఖుండై 21

క. సంధికిఁ జనుటె ట్లరులు ది,వాంధులు బలదుర్నిరీక్ష్యులయ్యును దుస్సం
బంధ మిది గాదె మనము ని, శాంధుల మెట్లమరు దూత కరుగఁ దిరుగన్. 22

క. అటుగనుక సంధికార్యం, బెటువలె నొడఁగూడు రాత్రు లెదిరికి నెల వి
ప్పటికి మనకదను పగలు, త్కటగతిఁ జని సంహరింపుదము పగవారిన్. 23

వ. అని యుద్దీపి ప్రదీపి సందీపి యాదీపులు తమకుఁ దోఁచినట్లు చెప్పినవిని మేఘ
వర్ణుండు చిరజీవి నాలోకించి. 24

క. ఈశం డితఁ డితఁ డీతఁడు, చేతోగతిఁ దోఁచినట్లు చెప్పిరి పథ్యం
బై తోఁపదు కించిత్తుం, దాతా నీవేమిచెప్పెదవు నాతోడన్. 25

క. నీసద్బుద్ధిబలంబునఁ, జేసెద రాజ్యంబు నేఁ డజేయదివాంధ
త్రాస ముదయించె నీకిది, యోసమయము ప్రాప్తకాల ముపదేశింపన్. 26

క. హరిపరిణామమునకు ని, ర్భరనీతిపయంబు గురుఁడుబలె నాభద్రం
బరయుటకు నీవె కా కె,వ్వరు నాఁ జిరజీవి మేఘవర్ణుని కనియెన్. 27

క. అఘునయవినయనిధు లీ, వలువురు విన్నపముఁ జేసినారి మ్మతిమం
తులకంటెఁ గార్యనిశ్చయ, బలమున నధికుఁడ నె యంతపాండితిగలదే. 28

ఆ. వీరు నీకుఁ బరమవిశ్వాసఘుటకులు, వీరినీతిరీతి వినుట యొప్ప
నైన నాకుఁ దోఁచినంతయు వినుపింతు, నేకతంబువలయు నింతదడవు. 29

క. హితుఁడని యొకనికిఁ జెప్పిన, నతఁడును దనకూర్చుసఖుని కది దెలుపు నర
క్షితమై నృపమంత్రం బీ,గతిఁ బలువురు వినుటచే విఘాతతనొందున్. 30

క. అతిగుప్తమయ్యె మంత్రము, హితనికర శ్రుతముచేత నివురంబడు ని
కృత యెఱిఁగి ప్రాంతజనసం, గతి రాజు రహస్య మొసఁగి కావఁగవలయున్.

వ. అని యేకాంతంబు వడసి చిరంజీవి మేఘవర్ణునకు సంధివిగ్రహయానాసనద్వైధీభావ
సమాశ్రయంబు లనుగుణంబులం బ్రారంభోపాయపురుష ద్రవ్యసంపద్దేశకాలవిభాగ
వినిపాతప్రతికారంబు లనునంగంబుల సామదానభేదమాయోపాయంబు లనుచతు
రుపాయంబులఁ బ్రభుమంత్రోత్సాహశక్తుల విచారించి యం దుచితం బగుదాని
నంగీకరింపుము నాకుఁ దోఁచినకార్యం బొక్కటి ప్రతిపక్షు లుదగ్రసత్త్వద
క్షులు మనకు సమరసామర్థ్యంబు చాలదు దేశకాలంబులు విచారరమణీయంబులు.

క. మీనొదవునంతకుం జనఁ, గానక బకముండు కరణి ఘననీతిధనుం

డైన్యయుతుఁ డూరకుండుం, దానహితుఁడు చిక్కువడినదను కలికాంతిన్. 33

క. తనసత్వ మెదిరిసత్త్వముఁ, గనుఁగొన కెవ్వాఁ డఖర్వగర్వమునం బో
రునకుఁ దుడఁ గాలు ద్రవ్వు, న్వాను మమ్ముష్కురనిఁబొందు విపదోఘంబుల్. 34

చ. సురియఁకరంబునం గొనక శూరుఁడు నీతి కళావిలాసభా
సురుఁడు వధించువైరి విరసుం దవుదవ్వులఁ జెంతనుండియున్
సురియ ధరించియు న్మగువచొప్పున నేమియుఁ జేయలేఁడు త
న్నెరలఁగఁ జేయుమానవనికృష్టుఁడు మాటలు వేయునేటికిన్. 35

క. తొలిమియు ధృతియుఁ బ్రజ్ఞా, శీలతయుఁ బరాత్మగుణ విశేషజ్ఞతయుం
గాలోచితశౌర్యము గల వాలుమగం డేలువార్ధిపరీతధరిత్రిన్. 36

క. సిరిపొందును పాయకళా, పరిణతుఁ డనుఁ దానపాయపారగుసభయుం
బరుషోక్తిఁ జేరరాదిం, దిరకేలం గురులఁ బట్టి తివిచినయినన్. 37

క. గృహపేటినుండుమంత్రో, త్సహనాఢ్యునకు న్రమాభుజంగినుమంత్ర
గ్రహణవిమూఢున కదిగు, స్సహభీతి ననారతంబు సంపాదించున్. 38

క. మతిమంతుఁడు శాంతుఁడు వి, శ్రుతగుణసంసిద్ధుఁడు న్వ్యశుద్ధుఁడు నీతి
ప్రతిరహితుఁడు బలసహితుఁడు, గతభయుఁ డనఘుండుఁ గార్యఘటకులుసుమ్మీ.

వ. విశేషించి యిట్లుచెప్పవలసి చెప్పితిఁ గాని యుద్ధ మిప్పటికి నకరణీయంబు. 40

సీ. కోశమంత్రములు దక్కువలు గాకుండినఁ గలుగులెక్కులకు నగ్గలము బలము
శాంతులు నిర్మలస్వాంతులు విక్రమోదయులు నిర్భయులును ధర్మమయులు
కరినశాత్రవుని సాగావిత్తవంతుని వేల్పుగాఁ జూచి సేవింతు రెపుడుఁ
బ్రభుతసహాయనిబంధనం బనిచెప్ప విందుము నీవును వింటివట్లు

తే. కులము గుణము రూపు చెలువంబు మురిపంబు, మానధర్మవిక్రమక్రమముల
వానిఁ జూడ దజ్జవానిని నిరపాయ, శూరసంగ్రహంబుఁ జూచినట్లు. 41

క. ఏరీతి జైత్రయాత్రా, ప్రారంభము సెల్లుఁ బతికిఁ బ్రజలేమి నభి
శ్చారత గూడునె పక్షికి, భూతిబలాఢ్యత్వపక్షములు లేకున్నన్. 42

క. ఘోరారివీరపారా, వారం బెప్పాట దాఁటవచ్చు సహాయా
ధారతతి తారుఁ గోరక, పౌరుషసంపన్నుఁ డగునృపాలాగ్రణికిన్. 43

క. ధనమంత్రసహాయంబుల, నొనరినభూవిభునకన్నియును గల వట్ల
య్యును సమరమకరణీయము, చన నేరదు సంధి సహజశత్రుల మగుటన్. 44

వ. ఘూకంబులకుఁ గాకంబులకు సహజవైరానుబంధంబునన కాద వాక్పారుష్యం బెవ్వ
రికిఁ జేటుఁ జేయదు. 45

క. భీషణశార్దూలతనూ, వేషము దన కమర దొల్లి విశ్రుతసస్యా
న్వేషణతత్పరమతివా, గ్దోషంబున నొక్క ఖరము ద్రుంగదె పుడమిన్. 46

క. నావిని వాయసపతి చిర, జీవికి నిట్లనియె నీతిశీలా యేలా
గీవిధము దేటపడఁ జెప్పు, మా వినియెద ననిన నతని కతఁ డిట్లనియెన్. 47

క. ఒకపురి నొకచాకలవాఁ, డొకదిక్కున నొకనిచేత నొక గాడిద వి
ల్వకుఁ బుచ్చుకొనియెఁ బొర, ప్రకరపటీభృతికి మేనుబట్టువై యునికిన్. 48

క. వలువలు చలువలు సేసెడు, నెలవునఁ బగ లెల్ల నిలిపి నిశియగుటయు న
ప్పులుగాకి చాకి పెనుగ్రొ, ల్పులిచర్మము గప్పి సస్యముల కగవిడుచున్. 49

క. అది కడుపుకొలఁదియును దిని, సదనమునకు మగిడివచ్చు సరిప్రొద్దున ని
ట్లెద నరసి యరుగఁ దిరుగం, బొది చెడియెం బైరు గొన్నిపూఁటలుచనియెన్ 50

క. పొల మరయుకర్షకులు మదిఁ, బులిగాఁ దలపోసి భీతిఁ బులిపులి యనుచున్
దలసాఁపవెడల రందొక, హాలికుఁడు శరచాపహస్తుఁడయి నిశ్శంకన్. 51

క. నెలవొడిచినధూసరరుచిఁ, గలగొంగడిముసుఁగుఁ దిగిచి కడువడిఁ దనయి
ల్వెలువడి చని కని తనముం, గలబొంచినవానిఁ జెండి గాడిదె యనుచున్ 52

క. మెందుగ నుత్థాపించిన, దండము గమనమున కెగ్గుఁదలఁపఁగ వీనుల్
బెండుపడ నొండ్రపెట్టుచు, దుండగపుఖరంబు దన కెదుర్పడి తేరన్. 53

క. హాలికుఁడు నీవాయనుచుం, జలివిడిచి ప్రహాస మెసఁగ శయములఁ గాల్గం
బిలుపిలు నెదురుగఁ బఱచిన, నలగాడిదెయుం గువాళినచెంతికివచ్చెన్. 54

వ. వచ్చిన. 55

క. తగిలి తనపైరు మేసిన, పగ యగ్గలమగుటఁ గినిసి పటుముష్టిని వి
ల్లిగిచి ఘనతరశరంబునఁ, దెగనేసిన గార్దభంబు ద్రెళ్ళెం బుడమిన్. 56

ఇది వాగ్దోషఫలంబని వెండియు. 57

క. అనిచెప్పిన చిరజీవిం, గని వాయసరాజు పలికెఁ గౌశికములకున్
మనకు న్బగ వాగ్దోషం, బునఁ బాటిలె నంటి విదిచెప్పుము వినవలతున్. 58

వ. అనినఁ జిరంజీవి మేఘవర్ణున కిట్లనియె. 59

చ. అపరిమితానురాగమొలయ న్వలయాద్రిపరీతభూపతి
త్రిపటలిమంత్రగూట మొనరించి మదాంధదివాంధము న్మహా
కుపితముఁ బక్షిరాజ్యమునకుం బతిగా నొనరింపఁ బూనియు
న్నపు డొకవృద్ధకాక మటకై యరుదెంచినఁ బుల్గులన్నియున్. 60

క. వెడవెడ నొండొకరొండొక, తడవు విచారించి సమతఁ దమలోననియెన్

జెడకిది బహుకాలంబులు, గడపినయది గాన యుచితగతి నెఱిఁగించుఁడీ. 61

వ. కార్యాలోచనంబున నిందఱ మసమర్థులము కార్యనిర్ణయసమర్థం బగుదీని నడిగి చూతమే యనుచు నాతిథ్యం బాచరించి పరివేష్టించి తమయభిప్రాయంబుఁ జెప్పిన నప్పక్షులకు వాయసాధ్యక్షుం డిట్లనియె 62

సీ. కర్ణహృత్స్ఫుటసూచికాయమానోత్థానవికటఘోషము విన్న వెగటుగాదె
కాలకాకోదరోగ్రస్ఫుటాస్ఫుటముఖం బాలోకనముసేయ నళుకుగాదె
భ్రమదుల్కభ్రాంతిభాగవీక్షణదృష్టిసరణిఁ ద్రిమ్మరుచుండ జాలిగాదె
కర్కశవ్యాయామగరుదమంగళమరుత్ప్రతతిసోఁకినఁ బీడవట్టుకొనదె

తే. దారుణాకార మప్రియదర్శనంబు, ప్రకృతిరౌద్రంబు క్షుద్రం బపక్షమంబు
ఘూక మేయూరు పికశారికాకలాప, కీరికాముఖభరణ మేయూరుచెప్పుఁడ. 63

క. దారుణదృష్టివికారా, కార మతిక్రూర మహముఁ గానదు కరుణా
దూరం బెట్లయ్యెడు రక్షారంభం బెఱుఁగఁ జెప్పఁడా వినవలతున్. 64

క. వ్యపదేశక్రియ మెఱసిన, నృపు నింపెసలార నాశ్రయించినఁ గలుగున్
విపులసుఖ మమృతకిరణ, వ్యపదేశతఁ గుశలమంద దాశశ మడవిన్. 65

క. అనుకాకమునకుఁ బులుఁగుల వినయంబునఁ బలికెఁ దెలుపవే శశకం బ
ట్లనజరిపుని వ్యపదేశం, బున భద్రముఁ గనుట గరటముఖ్యా మాకున్. 66

వ. అని యడిగిన వాయసపుంగవం బవ్విహంగంబులకు నిట్లని చెప్పందొడంగె. 67

మ. అగళద్దుర్ధరతీక్ష్ణభాస్వదభిషువ్యాఘాతపాతక్షర
న్మృగ మస్తక్షతజంబు పశ్చిమమరుద్వృద్ధత్రిధామజ్వల
న్నగ మంతర్జలనిర్ఝరంబు మృగతృష్ణావాహినీ సంచితా
ధ్వగ ముష్ణాగమమయ్యెఁ దొల్లి పురజిత్ప్రాలంబకాభీలమై. 68

వ. అక్కాలంబున. 69

చ. జలధరముల్దరాస్థలికి జాఱిన న్దిననాథరశ్మికిన్
దొలఁగ కహో బయల్పెఱసెనో తిమిరంబులు నాఁగ జంగమా
ద్రులగతి గండకంపితగిరుల్దరులారయ లెక్కకెక్కుఁడై
యలఘుమృగేంద్రభీతిరహితాటవిలో విహరించు నేర్పడన్. 70

క. ఏకసరోవర మగునల, భీకరగహనమున నిలువ బెగడి పిపాసా
వ్యాకులితమానసము లప్పు, డాకరు లిట్లనియె యూథపాధ్యక్షునకున్. 71

క. ఇచ్చోటిసరము శరముల్, నిచ్చలుఁ గొన నివిరె మేఁపునీళ్ళకయో ని
ప్పచ్చరమై యెవ్విధి మన, యిచ్చ నవారిగఁ బ్రవారివలె మాకానన్. 72

క. ఆపాతాళగభీరప, యాపూర్ణమహాప్రవాహమైనను గూపా
రాపరిమితసరమైనం, జూపుము విలవిలకపోవఁజొచ్చెం దనువుల్. 73

వ. అని పదనోదకంబులఁ జూపి విన్ననయి యున్న నన్నీచదళపళావల్లభుం డరసి నిమిషంబునం దడయక యప్పటికి సత్వక్షీణంబులు గానివానిఁ గొన్నిగజంబులం బిలిచి యనుజీవులారా యప్రతిహతమనోరథంబుల గహనఘంటాపథంబులం బఱచి యగాధశరం బగుసరంబుఁ గనుంగొని రండు పొండని నియోగించిన. 74

సీ. మదవనేచరవనూమధురగానధ్యానవివశకుంజక్రోడవిషధరములు
పరిపక్వఫలవిలుబ్ధ స్తబ్ధరోమ దంష్ట్రాటంకభిన్నగోత్రారుహములు
ధరచరత్పవనబాంధవవదన వ్యాయామధూమకల్పితమేఘదుర్దినములు
చరమదిఙ్ముఖపతజ్జరఠకాసరవిరక్త వ్యాఘ్రబీతఖడ్గవ్రజములు
తే. పవనతరసరసస్తేయసారమేయ, దళనదంశనవిష్ఫాణితరుణహరిణ
నాభిసౌరభ్యదశదిశాంతస్థలములు, ఘోరకాంతారములు కొన్నికొన్ని గడచి. 75

క. సరిసెరసి మెఱసి బిలములు, దరిసి ధృతు ల్బెరసి దొరసి దంతావళముల్
పరశిఖరం బగు నొకమల, సరస న్సరసారసరసి సరసి గ్గనియెన్. 76

వ. తత్సరోవరం బావిష్కృతపుష్కరంబు గావున యాదవస్థానంబును మత్స్యమూర్తి విలాసభాసురంబు గావున యోగిరాజును బ్రకాశితాహిమకరంబు గావునఁ బ్రాతఃకాలంబును నధిగతబ్రహ్మరథంబు గావునం బర్యస్తవితానంబును నారాధితారికులంబు గావున నపారబల సంపన్నంబును బకవిహారయోగ్యంబు గావున నేకచక్రపురంబును నూర్మికాభిరామంబు గావున నలంకృతుం బురుడించి యొప్పుచుండు.

క. కని యనురాగరసాబ్ధి, న్మునుము నోలాడి భిన్నముఖకమలవనీ
ఘనపరిమళగుణచిక్కణ, వనజాకరవారిలో నవారిగ నాడెన్. 78

ఉ. ప్రావృతమాతపోత్తమదుష్పల్లవపారణకారణంబునన్
లావువహించి సొంపు వొదల న్బదలం బదలాఘవంబునం
బోవఁగఁ ద్రోయుచు న్మరలిపోయి సరోవరలాభవార్త యా
క్రేవఁ జరించుయూధపతికి న్వినిపించె గజంబులన్నియున్ 79

ఉ. చెప్పిన నప్పు డుల్లసిలుచిత్తమునం గరిరాజు గౌరవం
బొప్ప మహాహితద్విరదయూథముఁ దోకొనిపోయెఁ బోవ నా
చొప్పున దాఁటిపోవ నొకచోటును గానక తత్పదాహతిం
జెప్పలు గుల్లలై పొలిసె శీఘ్రమె పెక్కుశశంబు లచ్చటన్. 80

సీ. అచ్చోటఁ జావియు నంతశిలీముఖుం డనుశశరాజు దైన్యపఱంచి
యగుచు మంత్రుల కిట్టులనునీతి నిధులార యబ్ధికి వారివాహములుపోలె

సరమున కలఘుత్రస్తాభరంబున నేఁ డవారణ నీదారివారణములు
పఱతెంచుమన్నవి పరికింపు మల్లనె కుందేళ్ళ వీని త్రొక్కుళ్ల మడిసె
తే. ద్రాసకర మైనయీశశప్రళయమునకు, నకట యెబ్భంగి శాంతికార్యంబు దొరకు
నేమిసేయుదు ననువంత నెదుర నిలిచి, వివితనీతికళాశాలి విజయుఁ డనియె. 81

క. దేవా నేఁ గలుగఁగఁ జిం, తావారిధి నేల మునిఁగెదవు శశములకుం
గావించెద శుభ మిభములు, రావిడువం జూడు నాపరాక్రమ మనుడున్. 82

క. పలికె శశరాజు గాఢో, త్కలికన్నయనిధి దేశకాలవిభాగం
బులు నీక తెలియు నిట నీ, కలిమిఁ గ్రియాసిద్ధి యెట్లు గాకుండున్. 83

క. ఆలస్య మకర్తవ్యము, కాలం బారంభమునకుఁ గరుణమదరులన్
దోలి శశప్రాణంబులఁ, బాలింపుము నీయుపాయపాటవ మమరన్. 84

క. అని యాజ్ఞాపించిన నయ, వినయపరాక్రమవిధానవిజయుఁడు విజయుం
డనిలరయంబున నెదురుగఁ, జని యూథపుఁ గాంచి మానసము గలఁగుటయున్. 85

క. గజమంటినట్ల యడచు, న్భుజగము మూర్కొనినయట్ల పొరిగొను ధరణీ
భుజుఁడు నగినట్ల చంపుం, గుజనుఁడు మన్నించునట్ల కొను బ్రాణంబుల్. 86

క. కావునఁ గరినికటమునకుఁ, బోవం గార్యంబు గాదు పో యిపుడు మహా
భావనమున నుపకంఠ, గ్రామాగ్రం బెక్కి ముఖ్యకరిఁ బలికింతున్. 87

చ. అనిగిరి నెత్తమెక్కి శశ మగ్గజవల్లభుఁ జూచి యిట్లనుం
గవలున నీకు రాఁబొలము గాదిది నిల్విలు చందమామ న
న్ననుపఁగ నచ్చితిం బయనమై యలజాబిలిలో శశంబుగా
మనమున నన్నెఱింగికొనుమా యన దంతి పతంపుఁ డిట్లనున్. 88

క. ఏమినిమిత్తము శశక, గ్రామణి నిన్నిటపుఁ బంపెఁ గైరవమిత్త్రుం
డామాట తేటపడఁ జెపు, మా మాకన విజయుఁ డగ్గజాగ్రణి కనియెన్. 89

క. హేతులు పైఁబడునపుడున్, దూతలు సత్యంబుఁ బలుకుదురు తద్భాషా
వ్రాతమునకుఁ గలుగరు ఘా, త్రీతలవల్లభులు నగరు తెగ రెప్పటికిన్. 90

క. అలనెల తనమాటలుగా, నిలవున నీతోడ నాడుమని నన్నుపన్
దలమోఁచి చెప్పవచ్చితిఁ, దెలియ న్నీవను యూథపతితిప యప్పలుకుల్. 91

ఉ. చారువిచార యిక్కొలను చంద్రసరోవర మిందుఁ దారకా
ధారుఁడు చంద్రుఁ డిష్టవనితాజనతాయుతుఁడై యథేష్టసం
చారవినోదము ల్సలుపుసంతతిమ న్నిను మట్లుగాన నె
వ్వారికిఁ బోవరా దెఱుఁగవా యుట కిత్తెఱఁ గింతవింతయే. 92

చ. నిరతము నీయరణ్యధరణీసరణిం జరియించునీశశో
త్కరములు నాకుఁ జుట్టములుగాఁ బరికింపుము చంద్రనీరజా
కర మతిభీకరంబు తడగాఁజను నా విహితోపదేశ మా
దరమున వీనుల న్జొనుపు దవ్వుఁలవాఁడవు గాక నీతికిన్. 93

చ. సరసికి మీ రఖండరభసంబున రాఁ బరికించి యాసుధా
కిరణుఁడు నేఁడు మేరుగిరికేసరుల న్మిముఁ జంపఁ బంపఁగాఁ
పరశువు గోరఁ బోవుపనిపట్టున నేమిటికంచు మాన్చియీ
తెరువున మిమ్ము నిల్పఁ జమదెంచితి నీతిపరుండఁ గావునన్. 94

క. చావక నోవక యాదల, పూ వాడక నానియోగమున నెందైనన్
బోవుట శోభన మన దం, తావళ మిట్లనియె శశపతింసంబునకున్. 95

సీ. ఆదిచంద్రకాసారమాసారమానసతారలు దారలై తనుభజింప
జలవిహారం బందుసఖుపునె నిలుపునె యొరులెవ్వ రిటకు రాకుండ విధుఁడు
పంచాననముల మాపైఁ బంప ననుకంప మాన్చి యేతెంచితె మమ్ముఁ గావ
నీవంటి కారుణ్యనిధి యెన్ని భవములం గలుగు నీకతమునఁ గలిగె బ్రతుకు
తే. మగిడి పోయెద మనుచు నమస్కరింపఁ
బ్రత్యయమువుట్ట నక్కరి ప్రవరుఁ గొనుచు
విజయుఁ డారేయి గొలనిలో వెలుఁగువానిఁ
జంద్రు ననుబింబితుని జూపి జరుగుమనియె. 96

వ. అవ్విజయు నియోగంబున దంతిపతి వనాంతరచింతం బఱచె నంత శిలీముఖ ప్రముఖశశంబు లానందించె గజంబులుఁ దిరుగఁ ద్రిప్పుట శశంబుల ప్రళయంబు మాన్చుటచంద్రవ్యపదేశంబునం గాదె యట్లగుటఁ బ్రసిద్ధుం డగు రాజు నాశ్రయింపవలయు దాన సుఖలాభంబులు దుఃఖక్షోభంబును నగు నీయులూకంబు ప్రసిద్ధంబగురాజ్యంబున కర్హంబు కాదని చెప్పి కాకంబు వెండియుం బులుఁగుల కిట్లనియె.

క. సముచిత మెఱుఁగక క్షుద్రుం, గ్రమరహితుగు తెంచిపోవఁ గడుఁగీడౌదవున్
దమలో నొంటక మార్జా, లముదగ్గతి శశకపింజలంబులు దెగవే. 98

క. నావిని విహగములను నయ, కోవిద యారెంటికేల గొదగొదపొడమెన్
జావేలవచ్చె నోతువు, చే వానికి నింతవట్టుఁ జెపుమా తెలియన్. 99

చ. అని తనువేఁడుకొన్నఁ గరటాగ్రణి పక్షులఁ జూచి యిట్లను
న్వినుఁ డలవింధ్యభూమి నొకవీరమహీరుహమూలకోటరం
బునికి యొనర్చి యున్ననికినుండుఁ గపింజలమప్పతత్రితో
నెనసి కుటైకదేశమున నేనును నుండుదు సఖ్య మేర్పడన్. 100

చ. తగ గగనప్రచార మవితారివిభాకరుఁ డస్తమింపఁగా
ఖగము నగంబుఁ బాసి పలుకంగుసలు న్వినుమంద పెంటలం
జిగి నిగుడం జదల్తెదలు చేఁడెలపండినపూరి దారులం
బొగనినపాళ్ళ మేఁపుఁగొనఁబోయి హుటాహుటి రాకతక్కినన్. 101

ఉ. డేఁగకుఁ జిక్కెనో యురుపడిం గృతి గాడ్పడి దవ్వుపోయెనో
లాగము దక్కి మచ్చువలలంబడెనో వెరవేదిపాదినెం
దేగనొ పుట్టలెక్కి కర మేమఱి పాములచేతఁ జచ్చెనో
యేగతియుంచునో తెలియ దింతయు రాఁడు వయస్యుఁ డక్కటా. 102

క. అని బాష్పవారిధార, ల్గనుదోయిం జెమ్మగింపఁగా నలుదిక్కుల్
గనుఁగొనుచు వితాకుఁడనై, చన నేరక యుంటి నన్నిశాసము నమునన్. 103

శా. ఆహాకృచ్ఛపలావిలాస మఖిలప్రాణిశ్రుతివ్యగ్రగ
ర్జాహంభావసమగ్ర ముగ్రరయనద్యంబూత్థితాంభోనిధి
వ్యూహం బాహతకాననజ్వలన మోహాహో మింటిలో వ్రేలఁగా
లాహిం గట్టినచాప్పవం గురిసె ఘోరాసార మచ్చీఁకటిన్. 104

క. అలజడి యాలజడిచేతం, గలఁగి మహాశకము దీర్ఘకర్ణం డనువాఁ
డలఘుకపింజలకోటర, నిలయంబున నంఘ్రులూఁది నెమ్మదినుండెన్. 105

క. జడిగొన్న వాననేనుం, దడిసితి నాలో నొకింతదపవున కానె
వ్వడి సడలెనడఁగె నుఱుముల్, నిడిమించులు మాసె వెలుఁగు నిలిచె న్వెలిచెన్.

ఉ. పెక్కువఁ బ్రాంతపక్కణకుటీశిఖరంబుల నెక్కి లార్చుచుం
గుక్కుటకోటి మ్రోసె నెసగూరుమిటారులపుట్టినిల్లు గ
బ్బెక్కినమబ్బుతైలగుహ లీఁగె దిశ ల్వెలుఁగొందె నిక్కలం
జక్కవజోళ్లు గేరె జలఁ జాత హితుం డుదయించెఁ దూర్పునన్. 107

క. పొలమున మేఁపాడికపిం, జలమత్తతి మరలివచ్చి శశము నివాస
స్థలిఁ గనుఁగొని యదలింపుచు, నఘుతరక్రోధహృదయమై యిట్లనియెన్. 108

శా. ఔరా కన్గొన మెంత నీతగవు లెస్సాయెం బురే యెవ్వరి
ట్లూరం బుట్టనివింత యన్యగృహమందుండ న్విచారింతురే
రారాపు ల్గొఱగావు నేఁటి కొకనేరం బోర్చితిం జాన కో
కోరి యెచ్చటికైనఁ బోయెదవొ పాపో యింతక్రొవ్వేటికిన్. 109

క. ఇది నాయది నాకేలీ, సదనము నీకెందు నిల్వఁ జను నె దురాత్మా
పదటతన ముడిగి యెంతేఁ, గదలుము లెమ్మనిన దీర్ఘకర్ణం డనియెన్. 110

చ. బిరుసులువల్క నన్ను వెఱపింపఁదలంచెదొ కట్టిపెట్టు నీ
గరువము వెట్టి యీశశిశిఖామణిముందర నేడ నెవ్వరి
వ్వరు వసియించి యుండి రది వారిదకాననభూమిజాతకో
టరముల నాఁపువెట్టె నెయొడంబడి పక్షుల కుర్వి చెప్పరా. 111

క. చెఱువులు బావులు గృహములు, తరువులు వృత్తులు ననారతము గాచినయా
నరులయవి యనుచు మనువుత్తర మొసఁగఁడె తొల్లి దేవతా సంతతికిన్. 112

క. బలవంతుఁ డైనధరణీ, తలభర్తకుఁ బోలునిట్టితగ వకటవకటా
పులుఁగులకును గుండేర్పకుఁ, బలుకులు వేయేల చెల్లుబడి గాదుసుమీ. 113

క. జగతీరుహవివరమునకు, ఖగనాథా నీకులేదు కారణమేలా
తెగిపోర నాకు నీకుం, దగ వెక్కుడికేని నరుగుదము ధర్మనుడున్. 114

వ. మదీయమైత్త్రీమంజాలం బక్కపింజలం బిట్లనియె. 115

క. ఒప్పిటి నిటఁ దగ వెవ్వరు, చెప్పెద రెఱిఁగింపు మతనిఁ జేరఁగ నెడలే
కిప్పుడ యరుగుద మనవుడుఁ, గప్పినతమకమున దీర్ఘకర్ణుం డనియెన్. 116

సీ. తపనజాతటమున దధికర్ణుఁ డనుమహావృద్ధమార్జాలంబు విఖ్యాతిసల్పు
నది రుద్రచాంద్రాయణాదికార్యంబులఁ దనువు సన్నముఁ జేసికొని విరోధి
షడ్వర్గ మణఁగించి శాంతినత్రిలుబహువ్యవహారదర్శినయాంబురాశి
యది నేర్పుమన చిక్కవదలింపఁ బెనుజోలి ద్రవ్యక నిమిషంబు దడయకటకుఁ
తే. బోదమావాద మాఱడి బోకపోవు, నని ప్రబోధించి శశ మమ్మహాకపింజ
లంబుఁ దోకొని చనుచుండె లాఘవమున, దలలు వడుచోటికీగుపాదములు గాదె.

క. ఏను గపింజలుఁ జిరమై, త్రినిధి విడనాడలేక వృక్షులతో గ్ర
స్థాని విడనాడి యెపుడెం, తేసెవ్వడిఁ గూడిపోయితిం జెలికానిన్. 118

మహాస్రగ్ధర. చని కంటిం బ్రాంతకాంతక్షమనిరవధికశ్లాఘ్యసౌభాగ్యసంప
ద్వనజాతవ్రాత రోధోవనవమధుమధువ్యగ్రమత్తాళిగీతన్
జనితశ్రద్ధానిమజ్జజ్జనఘనహరణోచ్ఛండకాండప్రపూతిన్
వినిపక్త్రబ్రహ్మనిష్ఠద్విజహితసికతాస్వీతఖద్యోతజాతిన్. 119

తే. కని తదంచితమణివాలుకావితర్దిఁ, జరణములు మోఁపి నిర్గతశ్రముఁడ నైతిఁ
గంఠపర్యంతపరిమిళగ్రాసమంద, జపనపవనాభిగమసమాచారకలన. 120

సీ. మనికిచో టిదిగాదె యనువాసరాచాంతఖచరజీవిత మరుత్కాళియునకు
నాటపట్టిదిగాదె యరివధాగతగోపవేషబృందావత్రివిష్ణువునకు
నిష్టముజ్జనగృహం బిది గాదె రాసనృత్తాక్రాంతకాంతాసతంసములకు
హాలహాలంబిదిగాదె హాలోద్ధతప్రలంబారిలాంగలలేవి హానమునకుఁ

తే. ప్రతిదినము గ్రోల నిది గాడిబావిగాదె, కృతశకృత్కారినందగోబృందమునకు
క్షేత్ర మిది గాదె దివసకృజ్జలజమునకు, నని నుతించితి సంవిదాయమునయమున.

సీ. అచటఁ గపింజల మావృద్ధమార్జాలపతిఁ జూచి చిత్తంబు పల్లటిలినఁ
గదియఁగూడక దీర్ఘకర్ణుఁ జూచి నిజాలతగవరి యని వీనిఁ బొగడితీవు
కుటిలమానసుఁ డతిక్షుద్రుండు కేవలజఠరపూరకుఁడు మార్జాలజాతి
బెడిదుండు వీని నమ్మెడితెఱంగయ్యాది యొద్దికిఁ జనఁ జిత్త మొప్పకొనదు

తే. తగవు దయ్యాకెఱుంగు నీతిగవుపట్టు, ప్రాణమేటికిఁ దెక తేరఁ బాపికొనఁగ
ధర్మమునకొండుకడ కేగువము దురాత్ము,మగుడు ఘనుటయుఁ గనలిమ్మదటశకము

చ పలికెఁ గపింజలంబున కపారకృపానిధితుల్యదర్శికే
వలపరిశుద్ధుఁ డార్తజనవత్సలుఁ డుత్తముఁ డబ్బిడాలభూ
తలపతి యిట్టిధర్మపరతంత్రుఁడు నమ్మినవారిఁ జంపఁగాఁ
దలఁచునె యేమిపల్కితి పతత్రిపసంశయ మొప్ప దియ్యెడన్. 123

చ. ఇన్నియుఁ జెప్పనేమిపని యింకిట నీవది నంతసాధ్వసం
బున్నబిడాలముఖ్యుకడ కొక్కట నిద్దఱ మేగి సర్వ మ
చ్ఛిన్నమనీషవిన్నపముఁ జేయుద మూరకపత్తు మంచు ము
న్నెన్నును గానలేక పిఱుబీకులు సేయ ఖగంబు బీరమై. 124

వ. యోగపద్యాభిమానంబున శశకపింజలంబులు డాయంబోవుచుండె నప్పు డారెం
టికి నిత్యప్రత్యయం బారాధించుటకుఁగా దధికర్ణుండు ధర్మవాక్యంబు లుచ్చ
రింపం దొడంగె. 125

క. ధర్మంబు తన్నుఁ బెనుచున్, ధర్మం బభివృద్ధిఁబొంది తను బ్రదికించున్
ధర్మము శర్మకరం బని, ధర్మం బేమఱరు సంతతము దత్త్వజ్ఞుల్. 126

ఉ. ఉపగతులై భజించుతనయు ల్సహజన్ములు గూర్మిచుట్టము
ల్విపులతరైకదుఃఖముల వేగుదు రింతియ రారు వెంబడిన్
నిపుణులకేల తన్మమత నెట్టన దేహి శరీరమూడ్చి చ
న్నపుడును ధర్మమొక్కడ సహాయము దానిఁ ద్యజింపవచ్చునే. 127

క. పురుషార్థపరున కిహముం, బరముం గలదండ్రు సత్యపరతంత్రు సురా
సుర లర్చింతురు గావునఁ, బరహితసత్యములు విడువఁబడ వెప్పటికిన్. 128

తే. ఆత్మవ త్సర్వభూతాని యనుపురాణ, వచనమూని బహుప్రాణివత్సలుఁడయి
సుఖము దుఃఖము సమముగాఁ జూచికొనుచు, దేహి పరలోకచింత వర్తింపవలయు.

చ. సొలవక మేను కంటకము సోఁకినఁ గొండొకశోణితంబు పి
చ్చిలి తనకెంతనొప్పి యగుఁ జెప్పెడి దొండొకఁ డేఘదేహముల్

గలిగినవారి కివ్విధముగాఁ దనువేదనలంచు నేరిసై
నలుగుటలేక హింస కెడరై చనఁగాఁ జనుసద్వివేకికిన్. 130

క. అనుదధికర్ణునిపలుకులు, విని నిర్భయవృత్తిఁ గొంకువీడ్కొని కదియం
జనితనతన వాగ్వాదము, లనుదానికి శశకపింజలంబులు సెప్పెన్. 131

సీ. చెప్పిన నప్పు డాజీర్ణోతువారెంటి కనియె మీరేమనియెదరో వినము
తెగనిచాంద్రాయణాదివ్రతంబుల దేహ మతికృశం బొనరించుకతనఁ జెవులు
తావకసూక్తశబ్దస్వీకృతిం బాటిగావు గావున నీవు నీవు నిపుడ
శ్రవణము ల్గదిసి యుచ్చైస్స్వనంబులఁ బల్కుఁ డేర్పడ మీసుస్థులెల్లఁ దెలియఁ
తే. గదవె మమువంటిమునులకుఁ దగవుదీర్ప, వేవురుండంగ మము మీరు విశ్వసించి
దూర మరుదెంచితిరి కానఁ ద్రోవరాదు, జాగుపనిలేదు మాకనుష్ఠానవేళ. 132

క. అరుదెండని నికటంబున, కరిగినదధికర్ణుఁ దంష్ట్రిహతి నారెంటికిన్
దొరకుపడఁ బట్టుకొని కం, ధరవిరియం గొఱికిచంపి తగభక్షించెన్. 133

సీ. క్షుద్రాశ్రయంబు నొచ్చుటకు నచ్చుట కాదికారణం బనిచెప్పి కాకముఖుల
ఖగములఁ జూచి ఘూకంబేడఁ బక్షిసామ్రాజ్యాభిషేకసంరంభ మేడఁ
బనిగానిపని మానుఁడన రోసి కూడినపులుఁగులు చదలఁ బేరెలుఁగులెసఁగ
జెసఁగన్న దెసఁ బెబ్బెసలారఁ బఱచినదర్పాంధ మద్దివాంధంబు గనలి
తే. పసపుఁగెంపుకొలకుచ్చు మిసిమిదేర, మిట్టకనుగ్రుడ్లు మిడిమిట్లు మిడిసిపడఁగఁ
గంఠఘూత్కారములదిశ ల్గలవరింప, గర్వదుర్లోకమునకుఁ గాకమున కనియె. 134

క. ఏమినిమిత్తము కుటిలా, త్మా మత్స్వామితను నెగ్గుఁదలఁచితి వే నీ
కేమిదురితం బొనర్చితి, నేమంటి భవద్విరోధినే యిదితగవే. 135

క. శైలవనవహ్నిశిఖలం, గాలిపాదల్పొదలఁ బరశుగతిఁ ద్రవ్వి మనున్
సాలములు సర్కిఁ బ్రతి, కూలవచోదగ్ధమునుదుకొన దింతైనన్. 136

ఉ. కుచ్చితమేమిగాదు సమకూడినరాజ్యము వీటిఁబుచ్చఁగా
వచ్చినలాభమేమి మఱవంబడదా తరువాత నిట్టినీ
యుచ్చపుఁజేఁత సౌఖ్యమున నందుదుగాకని పల్కిపోయె న
న్వెచ్చఁజూమీ విరోధ మొదవెం గరటాళి కులూకజాతికిన్. 137

క. నావిని వాయసపతిచిర, జీవికి నిట్లనియె నీతిశీలా హితసం
భావన కిఁక నీతడవే, లా వేగమ తెలుపు మనిన నతఁ డిట్లనియెన్. 138

వ. సంధివిగ్రహంబు విచారణీయం బాసనము బలిష్ఠమయ్యు నుపస్థితరిపుస్థానం బగుట
నదియునుం గాకను యానంబునకు లావు చాలదు స్థానత్యాగంబు లాఘవమూలంబు

ప్రత్యాసన్నవిరోధికులం బభావంబగుట ద్వైధీభావంబు పొసంగదు సంశ్రయం
బన్నిటికిం గర్తవ్యంబు విను శరీరపతనపర్యంతంబు నీకార్యంబున కేఁ బాలుపడఁ
గలవాఁడ. 139

క. పలువురుకృతవైరులు మఱి, బలధుర్యులు విమతులున్నఁ బరకార్యంబుల్
పొలిసిపవుం జెడు మును ధూ, ర్తులు మేఁకం గుక్కఁ జేసి తోలరె విప్రున్ 140

క. వానిని వాయసపతి చిర, జీవికి నిట్లనియె నీతిశీలా యేలా
గీవిధము తేటపడఁ జెపు, మా వినియెద ననిన నతని కతఁ డిట్లనియెన్. 141

సీ. చెనఁటి యాకులపాటుచే నలంగినసాధుతరుల కుబ్బాసఁగు నాదరణమూర్తి
భీమతీవ్రాంబకాభిహతిస్రుక్కిన మహావధురధర్ముని నొప్పి మాన్పవెజ్జు
ఫలభంగమున మాటపట్టుజాఱిన పైకమునకు సత్కోర్కు లిచ్చినసుదాత
పోలినున్నతచండాలుర మాధవార్చనధురంధరులఁ జేసిన ఘనుండు
తే. కాలగతిఁ బేర్చు నలజళ్ళఁ గలఁగఁబడిన, సరసులకు నిర్మలత్వంబు సంఘటించు
సౌఖ్యసందాయకుండు సాక్షాత్కరించె, సన్నుతానంతుఁ డవనివసంతుఁ డంత. 142

సీ. ముక్తపత్రవ్యాజమునఁ జీరసడలించి కళికలఁ న్పాలకల గలుగఁజేసి
పాలిపోనితావులఁ బూవుదండలఁ జుట్టి కడలేనిమధుసాత్త్వికమునఁ దెల్చి
రణదళిఝుంకారమణితము ల్పుట్టియించి దీవిచక్కెరలూఱు మోవియాని
సరవినున్నతఫలస్తనములఁ గబళించి కళదేఱుతనువల్లి గౌఁగిలించి
తే. కలికిరాచిల్కపల్కుఁబల్కుల నలర్చి, సురభికర్పూరరజముల సొంపొనర్చి
కలితవనలక్ష్మిఁ గూడి రాగము వహించె, మాధవుఁడు హృష్టనిఖిలతమాధవుండు.

వ. మఱియు నవ్వసంతంబు కళికాభిరామంబై యుద్దాహరణంబును శుకసూక్తి సందర్భ
గర్భితంబై భాగవతంబును గలకంఠికలాప దీపితంబై రాజాజ్ఞరోధంబును బ్రకాశిత
ప్రవాహంబై సముద్రతీరంబును సంద్రుష్టశారికాజాలంబయి వీణాయంత్రంబును
బురుడించు నక్కాలంబున. 144

చ. కలఁ డిల ముగ్ధభూసురుఁ డొకానొకఁ డాయనయజ్ఞార్థమై
బలిసినమేఁకపోతు మెడ పగ్గమునం బిగియించి యీడ్చికొం
చలవున నింటికై యరుగ నప్పుడు గొందఱు ధూర్తు లిచ్చలో
పలఁ దలపోసి యయ్యజముఁ బాపఁదలంచిరి దుర్ణయంబునన్. 145

క. తలఁచి యొకఁడొకఁడ చని లో, కులు నవ్వ న్విప్రుకుఁ గొనిపోయెదు నీ
కులశీలంబులు వఱదం, గలపితి విఁక నేమియని వికావికనగుచున్. 146

క. ఈగతి నందఱు యాజన, చ్ఛాగముఁ గుక్కరముఁ జేసి చనుచుండంగా

నాగరిక మేదివిప్రుఁడు, వేగలమున నిలిచి భ్రాంతి వికలుం డగుచున్. 147

కం. ఒకరిరువురుగా కందఱు, నకటా ఛాగంబుఁ గుక్కయని పోయెద రే
టికి బ్రమసి వేఁపిఁ దెచ్చితిఁ, దుకతుక నను నవ్వకుండుదురె తత్త్వజ్ఞుల్. 148

వ. అని విహరణస్థఁదచ్ఛాగం బగుభాగంబు విడిచి విప్రుండు పూర్ణశరం బగుకాసారంబునకు స్నానార్థియై చనియె నప్పుడు ధూర్తులు ప్రహాసభాసమానానను లగుచు నొండొరులకరంబు లప్పళించుకొనుచు నయ్యజంబుం జంపుకొని భక్షించి రట్లు ప్రజ్ఞాశౌర్యధైర్యాదిగుణంబులు గలవారలు పరులకార్యంబుల విఘాతంబు సేసి స్వకార్య ముద్ధరింతురని మఱియుఁ జిరఁజీవి మేఘవర్ణు నాలోకించి. 149

కం. తనలావుఁ జూచి మృతకా, కనికాయశరీరరక్తకణములు మేనన్
జినికిపటతటమునందిడి, చనుఁ దుపహతిరహితభూమిజాతంబులకున్. 150

కం. అరిమర్దనుండు సరిస్రా, ద్ధరుదెంచుం గెరలి తరలి హతశేషరట
త్కారలపత్కృతికటభజింతున్, హరుఁ డాపగ వారిఁబోలె నాపగవారిన్. 151

వ. భజించి నీకార్య మార్యసమ్మతంబుగా నిర్వహింపం గలవాఁడనని పలికిన మేఘవర్ణుండు లుంఛితగరుజ్జాలుం గావించి విస్రం బగు కాకజఠరాస్రంబుఁ జినికి యచ్చిరజీవిని న్యగ్రోధాగ్రకోటరంబునం బెట్టించి సపరివారుండై నిరుపహతిస్థానంబున కరిగె నాసమయంబున. 152

చ. అరుణగభస్తిబింబ మపరాద్రిఁ దిరోహితమయ్యెఁ బన్నగా
భరణి శిరోధిహాలహలభంగి నిఱు ల్మెరసె న్విరోధిభీ
కరగతి పంతగాఁబరిగాఢమహీధరభూజమర్గకో
టరములు నిర్గమించి వికటప్రకటాననము ల్మడించుచున్. 153

కం. అరిమర్దనుఁ డనుపబల, స్ఫురణోల్లోకములు ఘూకములు పటకరటా
హరణేచ్ఛఁ గదలి బహుపా, ద్ధరణీరుహ మాశ్రయించి తద్విటపమునన్. 154

కం. కాకములు మెదలకున్నన్, ఘూకంబులు కర్ణఘోరఘూత్కారహతా
కాకులము లగుచుఁ గ్రమ్మఱి, పోకకు నఱాడుచున్నపుడ భూజమునన్. 155

కం. మతివిదులకు నుచితమనూ, ద్యతనము సారంభుఁడయ్యు నాకృతకార్య
స్థితిఁ గడఁగనియునికి మహో, న్నతియని మను వానతిచ్చినాఁ డట్లగుటన్. 156

కం. అనితలఁచి నిలిచి రీవిం, బనివడి చిరజీవి యేరుపడ నొకనెట్టం
బొనరించినఁ గ్రమ్మఱి పరి, మునుమై యత్తోలులఁ జొట్టుముట్టె న్బట్టెన్. 157

కం. పట్టుకొని చంప నొంపం, గట్టాయితపడక యరుగుఁ గావున నతనిం
జట్టమువలెఁ గొనిచని పతి, కట్టెదురం బెట్టి కౌశికంబులు నిలిచెన్. 158

క. దూరితగరుడుత్కరువి, స్ఫారుణఘనలోహితాకృతాకృతి వతనిన్
దేరికొనఁ జూచి గర్వస, మారంభోక్తుల విరోధిమర్దనుఁ డనియెన్. 159

క. ఓరీ నీవెవ్వఁడ వీ, తీరేమిటికైతి వనిన ధృతిపెంపున నా
పేరు చిరజీవి యనిన య, పారగుఁ డాయన యులూకపతి కెఱిఁగించెన్. 160

క. ఎఱిఁగించిన మించిన ని, వ్వెఱ నిట్లను ఘూకలోకవిభుఁ డిట్లనుచే
తెఱఁగు చిరజీవి విన్నఁట, మఱి లే కకాకరాజు మన్నించుఁ గదా. 161

వ. దివస్పతికి బృహస్పతియుంబోలె మేఘవర్ణునకు ముఖ్యప్రధానుండవు నీతిపథికుండవు ధన్యుండవు నీయట్టి కృతకృత్యునకు నిక్కిచదర రానేర్చునొకో సర్వంబును జెప్పుమనిన జిరజీవి యరిమర్దను నాలోకించి. 162

చ. తన పెనుగాకిమూఁకల నదాటున నీభటకోటిముట్టి కా
వనితటిఁ జంపి చన్న మఱునాఁడు మృతేతరభృత్యవర్గము
ల్గనుకనిఁగొల్వ నచ్చిలిచి కార్యము వాయసభర్త వేఁడినన్
మనమునఁ గొంకులేక యరిమర్దనునిం గనుమంటి నాతనిన్. 163

చ. ఘోరబలుండ గాఢతరకోటరదుర్గవిహారిరాత్రిసం
చారనిరంకుశుండు పటుశౌర్యధనుం డరిమర్దనుండు క్రూ
రోదగథంగిఁ జంపఁదలఁచుంచఁగ నెవ్విధి నిద్రవచ్చు నీ
వారికి నీకు నెట్లుమనవచ్చు శుభంబు భజింపుమా యనన్. 164

క. అరిమర్దను నిటుఁగని మని, తిరిగినజమునోరు దన్నితివి నాబుద్ధిం
జరియింపు మనిన వాయస, పరివృఢుఁ డందులకు మండిపడి నాపంకన్. 165

ఉ. చూచి హితప్రధానుఁ డనుమ న్నదిఁబెద్దయు నమ్మియుండు ని
న్నీచు విరోధిపక్షుఁ డని నేరనయో తుది నిశ్చయింప నిం
దీచెడుగొట్టు కాల్నిలిచె నేనిఁ జెడుం బ్రతుకంచు నూఁదిపో
నైచి యులూకభుక్తికిఁ గనవత్సలుఁడై విడిపించె మత్తిపైన్. 166

తే. ఎఱుక పిడికెడుధనమందు రదినిజంబు, నెరయనీమూఁకమున్నున న్నెఱుఁగుఁ గానఁ
గవలి చంపక కొంపక గౌరవమున, దేవ నీపాదముల మ్రోలఁ దెచ్చి నిలిపె. 167

తే. తోడిమంత్రులజూడ నాదుర్మదాంధుఁ, డాడిన ట్లాడ కుచితకార్యంబుఁ జెప్పి
సిగ్గు గోల్పోతినని చిరజీవిజాతి, బాష్పుఁడై చెప్పెఁ దనచేటుపాటుఁ బలికి. 168

క ఆవేళ ఘూకపతి నయ, కోవిదు లగుమంత్రివరులఁ గూర్చి ప్రభుత్వ
ప్రావీణ్యంబున వచ్చిర, జీవిచరిత్రంబుఁ బ్రీతిఁ జెప్పం దెలియన్. 169

తే. చెప్పి వాయసరాజన్యశేఖరునకు, మాననీయుండు ముఖ్యప్రధానుఁ డితఁడు

దీని కార్యాదితెఱఁగు వేర్వేఱ పలుకుఁ, డనిన నయదక్షుఁ డందు రక్తాక్షుఁ డనియె.

క. చేరినమృత్యువు రిపుఁ డ, క్రూరాత్ముఁడు చిక్కినపుడ కొంకక చంపం
గోరుట నీతివిధానము, వైరికి దయఁదలఁచువెఱ్ఱివాఁడుం గలఁడే. 171

సీ. ఇతఁడు వాయసనరపతికి మాన్యుఁడు ముఖ్యదండనాథుఁడు నీతిధాముఁ డనుచు
నానతిచ్చితి నిట్టివానికి నిట్టిదుర్వ్యసనంబు వచ్చుట వెఱ్ఱిగాదె
ప్రత్యర్థికర్మమర్మము లెఱుంగుటకు రాజ్యప్రతిష్ఠకు నిట్టిసాధుమతులు
వినునీచవేషమైనను బూని బద్ధవైరులలోఁ బ్రవేశించి చెలిమిఁ జేసి

తే. చిచ్చు దొలిసొచ్చి వృక్షంబుఁ జెఱచినట్లు, పొదివి నానాటి కభివృద్ధిఁ బొందిపిదప.
జెఱచి పోదురు వీనిరక్షింపనేల, చంపి రాజ్యంబు సేయుము నిశ్శంక నధిప 172

క. అని రక్తాక్షుఁడు చెప్పిన, వినఁగూడక ఘూకభర్త విశ్రుతనయధీ
ధనదక్షునిఁ గ్రూరాక్షుని, గనుఁగొనుటయు నతఁడు మధురగతి నిట్లనియెన్. 173

క. శరణాగతు రక్షించిన, పరహితచరితున కిహంబుఁ బరముం దురగా
ధ్వరఫలముం గలదనిరో, యరిమర్దన కావు మిమ్మహాచిరజీవిన్ 174

తే. అనుచు గ్రూరాక్షుఁ డాడిన నద్ది వాంఛ, నల్లభుఁడు విని దీప్తాక్షువంకఁ జూచి
నీకుఁ దోఁచినకార్యంబు నీవు చెప్పు, మనిన నంగీకరించి యిట్లనియె నతఁడు

క. క్రూరాక్షునినీతి సుధా, పూరంబది యెట్టిదుస్స్వభావుఁడు జంపం
గోరఁడు శరణాగతు నన, ఘా రాజున నీకుఁ దగవు గానేర్చునొకో. 176

క. ఈరీతి నీతి గలిగిన, సూరిజనుం డెట్టిచెఱుపఁ జూచుం జనతా
వైరి యగుదొంగబం టుగ, కారము వృద్ధునకుఁ దొల్లి గావింపఁడొకో. 177

క. నావిని యరిమర్దనుఁ డురు, భావుని దీప్తాక్షుఁ జూచి ప్రభునీతికళా
సేవధి విన నింపయ్యెఁడు, నావిధ మెఱిఁగింపు మనిన నతఁ డిట్లనియెన్. 178

చ. కుండినరాజధానిఁ బసుగుప్తుఁ డనంగఁ బ్రధానసార్థవా
హుం డఖిలార్థవంతుఁ డొకఁ డుండు నతండు ప్రియావియుక్తుఁడై
పండినమూర్తితో ధనగుబాటున కుంకువఁ దన్వి నొందుచో
నండజయాన రూపవతి యన్నుకలకన్యకఁ బెండ్లియాడినన్. 179

క. అలరుం బ్రాయపుఁ గన్నుల, కలికికి ముదిమగఁడు బూచిగావున గవియ
న్దిలతైలమువలె నెనయక, తొలఁగుం జెలిసెట్టిఁ గన్నఁ దుష్పవనుమియున్. 180

క. వెతలం బొగులుచు నెట్టన, రతిగతికిం బిన్నపడుచ రారమ్మనుచుం
బతిమాలి పిలువ విన దది, పతిఁబట్టిన చెవుడు దన్నుఁ బట్టినభంగిన్. 181

మ. పలితశ్మశ్రుశిరోజరోగలతికోపఘ్నుం ద్దనూర్ఘుంగురున్
బలియుం గ్వక్రునితస్తరశ్చలితనిస్వస్థోత్తమాంగుం గర

స్థలయష్టిం బటలావృతాక్షు విగళద్దంతు న్వయోగద్వని
స్ఖలయోషిత్కుల మేర్పడం బరిహరించు న్బాలవానింబలెన్. 182

సీ. పాలువోయుటె కాని భక్ష్యంబు లిచ్చిన వాతెర నంటు దవ్వాలుగంటి
చించివైచుటె కాని చీరలిచ్చినఁ గటీరమునఁ గైసేయు దాలింపులాడి
తొలఁగఁబెట్టుటె కాని తొడవులిచ్చిన సొంపుపస మేనబూన దప్పలువచెలువ
మగుడనిచ్చుటె కాని మాడలిచ్చిన ముల్లెఁ గట్ట దాజగజాణ కలువకంటి

తే. యింటిముంగాలు పెండెలో నిడుటె కాని, పుష్పలిచ్చిన ముడువ దప్పొగరుముగుద
కుడిచి కూర్చుండి యిదియేమిగొడవఁజేసె, వార్ధకంబున నాసార్థవాహకుండు 183

ఆ. చెనఁటిభార్య పేరుఁ జెప్పగ పెఱబోటి, పేర సిగ్గుఁ దొలఁగఁ జెట్టె సెట్టి
ముదిమి నేడ రోఁత యిదె నాకవిటవిటీ, జాతివశ్యభేషజంబు బడుగు. 184

సీ. మొరదుసంగిన సెట్టిముదుకకు జవరాలిమోహు గాననివానిముకురమయ్యె
వగ్గుభర్తకు నాఁతి వాతెర చండాలవాటినండిన పిండివంటలయ్యె
గొయ్యలూడిన పెండ్లికొడుకుకుఁ జెలినవ్వు విపినమండలిఁ గాయువెన్నెలయ్యె
వయసుపోయిన బేరివానికి సఖిచన్ను గొండలందనిమానిపండులయ్యెఁ

తే బలితునకుఁ గోకిలాలాపజిలుగు టెలుఁగు, బధిరునకు నయిన సంగీతపాకమయ్యె
మొలఁతనీక్షించి గ్రుక్కిళ్ళుమ్రింగుఁగాని, సౌఖ్యమేమియు నెఱుఁగఁడజ్జరఠతముఁడు.

చ నెల కొకనాఁడు గట్టెదుర నిల్వఁగఁ జూచినవాఁడు గాఁడు వీ
నుల కొకనాఁడు మాటవిన నోఁచినవాఁడును గాఁడు నవ్వులన్
వలపులఁ జల్లమేఁగినవాఁడును గాఁ డతఁడెందువాఁడు గాఁ
డలజవరాలితోడిరతి యందనిమ్రానిఫలంబు సెట్టికిన్. 186

వ ఇట్లు సన్నిహితవిశేషవేదనాజాతఖేదంబున నారాటంబు బుట్టి యడియాసపస నసు
రుఁ బరిత్యజింపంజాలక తలక యుమకొని యొడతెగక నిగుడు నమందోష్ణనిశ్వాస
మాతరిశ్వంబున వధరపల్లవం బల్లలనాడ నతం డొక్కనాఁడు శయ్యాతలంబున
నొడలుపడవైచి దాసీజనంబులు తనకాచరించునూడిగంబులఁ గోడిగంబులం జేసి
కూడునీళ్ళుకుం బాసి గాసిపడుసమయంబున రజస్వలాంభోజినీదివాసంగమక్రీడా
సంప్రాప్తదురిత ప్రాయశ్చిత్తార్థంబు భృగుపాతం బొనర్చినవిధంబున దపనుం డపర
గిరిఁ దిరోహితుం డయ్యె నయ్యెడ. 187

సీ. పిసవెత్తియంకుగుబ్బెతలతప్పులు దప్పదాల్పుట కిది కన్నతల్లియిల్లు
కడుపుకక్కుతిలిపిల్పుడుగను ముదిలంజె నటులకు కిది పిన్నగాసుమందు
గడికన్నగాండ్ర యక్కలలకు నిలుచూలు పొరువుసొమ్మిడనిది పూఁటకాఁపు

కలవత్తకుల కన్నుఁగవఁ బాయనినిద్రఁ గదలింపనిది నిమ్మకాయపులుసు
తే. ప్రభకుఁ బాసినకుముదినీపత్రనేత్ర, రంజనంబున కిది విశుద్ధాంజనంబు
నాఘనాఘనకాళిమోన్నతి వహించి, కటికిచీఁకటి జగమెల్ల గప్పుకొనియె. 188

తే. మానసాటవి నేర్చుమన్మథదవాగ్ని, బాహ్యసంచారమునకుఁ బాల్పడియె ననఁగ
దీపములు సార్థవాహుమందిరమునందుఁ, త్రికరశిఖ లుల్లసిల్ల జూపట్టెనపుడు. 189

క. ఆరూపవతి సహసా, హారంబుల దృప్తిఁబొంది యపుడొకభంగిం
బోరామి ఘోరనరక, ద్వారమువలె వృద్ధపతినివాసముఁ జొచ్చెన్. 190

తే. చొచ్చి వచ్చినచండాలుఁ జూచుమాడ్కిఁ, జూడ కల్లంత నోసరించుచు గృహాంత
కాంతభిత్తికఁ జెంతఁ గంకటికి వరుగు, బిటికి నీక్షించి యప్పటి పెద్దసెట్టి. 191

తే. విరహదహనగ్రహంబున విగ్రహంబు, కొలిమి నూఁదినగతి వేఁడి గలిగియుండ
సెజ్జ నారాటపడుచు నక్షీణవిభవు, భల్లకంపితభవు మనోభవుఁ దలంచి. 192

ఉ. లేరె ధనుర్ధరుల్పుడమి లెక్కకు మిక్కిలి యొండు రెండుగా
వారడరింతు రేటి నెఱవాదితనం బదిరెండు నొండుగా
నారసి వేయనేరవలదా మఱినీవలె నెంతవింత యా
నీరజగర్భుఁ డుండుఁ గడునీకరకౌశల మెన్న మన్మథా. 193

ఉ. ఇంపున నన్యచాపధరు లేసినతూపులు బాహ్యమాంసముం
జింపక మర్మభేదనముఁ జేయుఁగఁజాలవు బాహ్యమాంసముం
జింపక మర్మభేదనముసేయు భవద్విశిఖంబు లెల్లఁగీ
ర్తింపుదు నీదుచాప మవధీరితశంబరకాంచనాంబరా. 194

క. తీరనికోలపగయుంబలె, నీరమణీమణికి నాకు నెనయుచు విరహాం
భోరాశి నెట్లుగడతు, న్వీరోత్తమ నన్నుఁ గూర్పవే కలకంఠిన్. 195

క. అని వెన్నునికొమరు మరు, న్వినతొమరు విరహిభయదవిధసముఁ గన
త్కనకమణినిచయచామరు, ననుషక్తభ్రమరు దూఱి యతఁ డున్నంతన్. 196

తే. కుశలగతి మజ్జనములాడి కుడిచి కట్టి, ప్రజలు నిద్రించి రయ్యర్ధరాత్రవేళ
ఖడ్గఖేటకపాణులై గస్తుదిరిగెఁ, బెద్దతలవరి కింకరోపేతుఁ డగుచు. 197

వ. అంత. 198

సీ. భవనదీపాహితభ్రమరపేటికవాలు కాభస్త్రితలముల్పృగద్దగోళ్ళు
ములుదోరణముబట్ట మొలత్రాటికుఱువాఁడికైదువు దెసకట్టు కావుబొట్టు
జిలుఁగుగన్నపుఁగత్తి బలపంబు మొగమాయమందు తాలపుటాకు మైలగోఁచి
మడుపుటాకులు పోఁకపొడి కాయ మోరచ్చు చెప్పులు భుజగవృశ్చికచికిత్స

తే. సుప్తివృద్ధికరౌషధక్షోద మనిత, వసనభంగంబు పెడతలవంకనికయుఁ
గాలునును మేను నెత్తినికన్ను లమర, దూరితత్రాసుఁడపుడొక్క దొంగబంటు 199

సీ. వచ్చి త్రిమ్మరుతలవరులు గన్గొనకుండ బవరిచుట్టును బలపమున వ్రాసి
ముంచి కన్నపుఁగత్తి మొనకెత్తి పెట్టించి యొయ్యనొయ్యన శిలలూడ దివిచి
వివర మేర్పటిచి యావెంబడి బదములు నడపి నల్వంకలు దడవిచూచి
యలికిడిలేకుండఁ దెలిసి యిల్సొరఁబాటి వాకిటిగడియ నెవ్వడిసడల్చి
తే. గాలిరాకుండ వెలుతురు గాకయుండఁ, గఱకుగఱబట్ట కన్నపుగండిగప్పి
యొడలిసొమ్ములు వేర్వేర నొలిచికొనఁగ, సరస కేతెర బరికించి జలదరించి 200

క. కచభరము విరియ హార, ప్రచయం బల్లాడఁబఱచి పరిరంభించెన్
రుచిరగతి రూపవతి నిజ, కుచలికుచాగ్రములు నాఁటుకొనఁ బ్రాణేశున్. 201

సీ. యువతిసేసిన యపూర్వోపచారమునకు వెసమిన్నుముట్టి యమ్ముసలిసెట్టి
యిచ్చనచ్చెరువంది ముచ్చటయినను మొగం బీనిరక్కస దనుదాన వచ్చి
ననునిటు గౌఁగిలించినది నేఁడింతకుఁ గారణం బేమేనిఁ గలుగవలయు
ననిలేచి నల్వంక లరసి యొక్కెడ భయంకరహేతికరునిఁ దస్కరుని గాంచి
తే. యితఁడుపో మూల మీశుభస్థితికి ననుచుఁ, బెన్నిధానంబుఁ జూచిన పేదవోలె
నీరదోదయ మరసిన నెమ్మివోలె, సమ్మదంబంది యాపరాస్కందిఁ గనియె. 202

క. పొడపులువుంబలె ననుఁ దన, కడకన్నులఁ జూడరోయకన్నులకలికిం
గడువేడ్కఁ గూర్చితిఁక నె, క్కడఁగలఁ డిటువంటిచెలిమికాఁ డారసినన్. 203

క. మానవమహీజక్రోడ, స్థానంబున వెలుఁగుమదనదావానలకీ
లానివహము చల్లార్చను, దీనిపయోధరము లద్వితీయచరిత్రా. 204

క. చోరకుఁడవె యతిసమ్మద, కారకుఁడవుగాక తీర్చగలనే నీస
త్కారర్ణ మీభవంబున, దూరీకృతకలుష వడ్డితోడంగూడన్. 205

క. తనగృహమునఁ గలవాసో, ధనకనకము లెల్లనిచ్చెదను ధృతిమీఱన్
గొని చనుమని యంజలిసే, సినఁ జోరుఁ డతిప్రసన్నచేతస్కుండై. 206

చ. నెఱయఁ జెలంగియున్న యతనిం గని యిట్లను సార్థవాహ యి
త్తెఱవ భవన్నియోగమునఁ ద్రిమ్మరదే యది క్రొత్తగాదె నా
మఱఁదివి నీవు చెల్లెలిది మమ్మవలోకముఁ జేసికాదె బ
ల్వెఱపున నిన్నుఁ జేరి పాదవెం దనచక్కనిసోగచేతులన్. 207

క. నీనిలయంబునఁ గలసొ, మ్మెన్నొల్లం బదుచుకరణ మిచ్చితిసది నీ
తో నలగిన వేసారిన, చో నను మదిఁదలఁపు మలయుచుం బఱతెంతున్. 208

క. చెలియలని చూడఁ గినిసిన, దలఁ గోయుదుఁ బతికి సమ్మదము గానిది య
వ్వలికేల హితులకేటికి, లలనామణి యిది మొదలై తెలఁగు నీయాజ్ఞన్. 209

వ. అని భయంబుఁ బుట్టించి కృతసత్కారుండై చోరుండు సార్థవాహు వీడ్కొని చని
యె నాసమయంబున. 210

సీ. రాజాస్యముఖతామరసవాసనల గ్రుక్క నానుముక్కునబంటి యైనదనుక
ధరపయోధరసుధాధరరసంబునఁ జొక్కఁ బంచబాణపిపాస పాయుదనుకఁ
జంచలేక్షణఘనస్తనగుళుచ్ఛకముల నలముహస్తగ్లాని దొలఁగుదనుక
నాతిగాఢాలింగనమునఁ దెప్పలఁదేలు బొందితాపము శాంతిఁ బొందుదనుకఁ

తే. బ్రాయ ముడిబోయి కిసరింకఁ బాటియుండు, పంటిచాట్పున నెఱవేరుపడినయొడలి
వరుసు సెట్టన బీదచే వడిన పగిదిఁ, గుంకుముగబ్బితపయ సెల్లఁ గొల్లలాడె. 211

సీ. ఉదయవేళకు మున్నె నిదుర మేల్కొనివచ్చి ప్రాణవల్లభు పదాబ్జములవ్రాలు
వ్రాలి నిర్మలతరజ్వలనతప్తసువర్ణకలశోదకంబుల జలకమార్చు
జలకమార్చి సపర్వశర్వరీశాతపోత్తాలచేలంబులఁ దాల్పనిచ్చు
నిచ్చి పొచ్చములేక హేమపాత్రంబున నిష్టాన్నముల భుజియింపఁ బెట్టుఁ

తే. బరిమళముఁ బూయుఁ గపురంబు సువటి విసరుఁ
బూవుదండలఁ జుట్టుఁ దాంబూల మిచ్చు
బడక సవరించుఁ జిటిపొటినడుగులొత్తు
వలముఁ గౌఁగిట నాతిచోరాతిభీతి. 212

ఉ. ఏరికినైనఁ జోరుఁడు సుహృత్తముఁడే యతఁడేలనేసెస
త్కారము సార్థవాహునకుఁ గన్గొన నిచ్చిరజీవితావకీ
నారికి ముఖ్యమంత్రియగు నైనను నీతిపరుండు గాన నే
తీరుననైన నిట్టిసుమతిప్రవరుం డశుభం బొనర్చునే. 213

క. అని దీప్తాక్షుఁడు చెప్పిన, విని యరిమర్దనుఁడు నీతివిభవవిలాసున్
వినుతాసువక్రనాసుం, గనుఁగొనుటయు నతఁడు కౌశికప్రభు మొగమై. 214

క. కంటకులు రిపులు దమలో, నొంటకపురిఁబానీయూర నొకఁడై వినుమి
ట్లొంటిఁ గృశియింపుచుండుట, గెంటనిశోభనము గాదె క్షితిపా నీకున్. 215

ఉ. ఈతఁడు మేఘవర్ణునకు నిష్టము గల్గినవాఁడు సత్క్రియా
న్వీతుఁడు రాజకార్యపరినిష్ఠితుఁ డీతఁడు లేమి లేమిను
మ్మాతని కూర్చి తెకవిజయస్థితి నీ కితఁ డున్కిఁ జేసి వి
ఖ్యాతివిహీనతు శత్రుబలహైన్యము నీకు శుభంబు గాదొకో. 216

క. వైరులు రాయుట హితస, త్కారమునక యసువులిచ్చెఁ దస్కరుఁడు లఘు
శ్రీరమహాగోద్వితయము, రారాపున గృహికి బ్రహ్మరాక్షసుఁ డిచ్చెన్. 217

క. అనవిని యరిమర్దనుఁ డా, నన మలరఁగ వక్రనాసునకు నిట్లను ది
గ్వినుత నయప్రథ యక్కథ, వినవేడుక యయ్యెఁ దెలుపవే నాకనుడున్. 218

వ. వక్రనాసుం డిట్లని చెప్పం దొడంగె. 219

చ. కృతవిదధీశ చెప్పెదఁ బరిగ్రహలబ్ధము భూరిదుగ్ధగో
ద్వితయము పొల్చు నొక్క జగతీసురు లోఁగిట దానివంచనా
మతి నొకటన్ హరించుటకు మందచరుం డనుతస్కరుం డళి
ప్రతినవకాలకూటరుచిబంధుర మైనయమాస చీఁకటిన్. 220

క. వెన్నెలుఁగక చనఁ గానల, చొప్పున నొక బ్రహ్మరాక్షసుం డరుగుచు నా
దెప్పరపుమ్రుచ్చు నచ్చోఁ, దప్పక వీక్షించి యద్భుతధ్వనిఁ బలికెన్. 221

క. ఓరీ యిఱులూ తెడునీ, దారుణనిశ నెందుఁ బోయెదవు చెపుమా దు
ర్వారత్వర ననుటయు నల, చోరకుఁ డా బ్రహ్మరాక్షసున కిట్లనియెన్. 222

క. జయసిద్ధి యనుధరామరు, నయనంబునఁ గలదు గోద్వయము దాని నతి
ప్రియతం గొని చను నాతఁడ, నయి పోయెద నొంటి నిమ్మహారాత్రమునన్. 223

ఉ. కందెనదాయచాయతొఱ కచ్చులమేళము లక్షగోళము
ల్గందెనమాయనోరువసిగోష్యలదండులుపండు లిట్టిరా
పెందుసు దెప్పఁ జూపనరు దెవ్వఁడవీవని వేఁడినం దరా
స్కందకి బ్రహ్మరాక్షసుఁడు సత్యపురస్సరభాషనిట్లనున్. 224

క. ఈనిశ నిట నేవిప్రుని, ధేనువులం ద్రాటనీవు దివియుటకై చో
రా నేఁ డరిగెద నతని న, తానకమునఁ జంపఁబోయెద న్బలలాశిన్. 225

క. నావిని చోరకుఁ డంతం, బోవక యనునిన్నిశీథమునఁ గ్రోధమునన్
భూవిబుధుఁ జంపఁబోయెదో, కో వాఁ డెటువంటి నేర మొనరించెనొకో. 226

క. కారణముఁ దెలుపుమన నల, చోరకునకు బ్రహ్మరాక్షసుండను రజనీ
చారపలాయనమంత్రక, శారూఢుఁడు గాఁడె యరయ నవ్విప్రుండున్. 227

చ. జరఠకపిత్థరంధ్రములు సాలబిలంబులగాధనింబకో
టరములు మఱ్ఱిమానితొఱట ల్పెనురావులతొఱ్ఱలు న్మహా
నిరవధితంత్రిణీమహిజనిర్వ్యథనంబులు తొంగిచూడరా
దరసిన బ్రహ్మరాక్షసుల కద్ధరణీసురుచేతిరాయడిన్. 228

క. మెఱమెఱని యద్ధరామరుఁ, బటిమార్పం బోవరాదు బ్రహ్మకునైనన్

మొఱఁగి నిదురించుచో నిది, తఱి యగుటం జంపఁబోయెదం బదమనుచున్. 229

వ. ఇరువురు చని యవ్విప్రగృహంబు ప్రవేశించి రందు బ్రహ్మరాక్షసుండు ప్రతిరోధి కిట్లనియె. 230

క. తొలుదొలుత నరిగి విప్రుని, బొలుపారం జంపి కడకుఁ బోయెద నాలోఁ
దలఁకక నీ వరిగి నిరా,కులవృత్తిం బసుల నాఁచికొనిపొ మ్మొకటన్. 231

క. తీరిదియని చెప్పిన విని, చోరకుఁ డా బ్రహ్మరాక్షసున కను నీద
ర్వారంభ మెఱిఁగిరేని మ, హారభసము పుట్టు నీగృహంబున నకటా. 232

క. ఈనెఱి నలికిడిపుట్టిన, ధేనువులను ముచ్చిలింపఁ దీఱునె నాపూఁ
పైనతరువాత దూరము, గా నరిగినమీఁదఁ జంపు కాదన విప్రున్. 233

ఉ. నా విని బ్రహ్మరాక్షసుఁడు నన్నిటులాడఁగ నెంతవాఁడ వీ
లేవడి నిన్ను వేఁడ నవులేకలిగెం దొలుదొల్త నిద్ధరా
దేవునిఁ జంపెదం గనలు దీఱఁగనం చడరంగ దొంగయుం
బోవకు పోకు మం చతనిభూరితరధ్వని నడ్డగించినన్. 234

వ. అక్కలకలంబు విని బ్రాహ్మణుండు మేల్కనియె నప్పు డతనికి విశ్వాసంబుఁ బుట్టింపం దలంచి. 235

క. మును బ్రహ్మరాక్షసుం డి,ట్లను నసఘా తావకీన మగుగోద్వయమున్
గొన నున్న త్రాసదీపితుఁ, డని చోరునిఁ జూపె నిజకరాంగుళికోటిన్. 236

క. చోరుండును బటురౌద్రా,కారుండై నినువధింపఁగా నదయుండై
చేరిన క్రూరుం డితఁడని, యారాక్షసుఁ జూపె భూసురాధ్యక్షునకున్. 237

క. నేరముఁ దప్పించుకొనం, జోరుండును బ్రహ్మరాక్షసుండును దనతో
నీరూపునఁ జెప్పినముఖ,సారసరిపుమీఁద హాసచంద్రిక మెఱయున్. 238

క. ధరణీసురుఁ డిట్లను మీ,రిరువురు పరమాప్తు లనఘు లిందెవ్వరిపైఁ
గెరలెదము చనుఁడు గాఢ,త్వరఁ గ్రమ్మఱ మీరు మీనివాసంబులకున్. 239

క. దీవింపవలవ దవనీ,దేవత లామోదవనధిఁ దేలిన శాపం
బీవలవ దలఘుసంతా,పావిలచేతస్కు లమ్మహామహులయినన్. 240

వ. బ్రాహ్మణద్వేషంబులేక బ్రతుకుం డని వీడ్కొలిపినం బోయి రాచోర బ్రహ్మరాక్షస వివాదంబు జయసిద్ధికిం బోలె మేఘవర్ణ చిరజీవి సంవాదంబు నీకు నిస్తులకల్యాణంబుఁ జేయునని విన్నవించి వక్రనాసుండు వెండియు. 241

సీ. తనమేనికండలు దఱిగి డేఁగకు మేఁపి ఖగముఁ గావఁడె శిబిక్ష్మాపరుండు
గరుడుని కాహారకబళమై నాగేంద్రవరుఁ బ్రోవఁడే మేఘవాహనుండు

నిజకళత్రద్రోహి నిర్దయాత్ముఁ గిరాతు మనుపఁడే నిర్నిద్రమైత్రిపత్రి
శత్రుసోదరువిభీషణు సమిద్ధ్భీషణు రక్షింపఁడే తొల్లి రాఘవుండు
తే. సకలదిక్కామినీకుచ స్తబకములకుఁ, దారహారకలాపమై తద్యశంబు
నేఁడు నాఁడును నున్నది నిత్యమగుచుఁ, గంటె శరణార్థి మనుచుటకంటె శుభము.

సీ. అని వక్రనాసుఁ డిట్లాడుమాటలు విని యందఱు వేర్వేఱ నడుగుబుద్ధి
నపుడు శివాభీతనృపతివికారకర్ణునిఁ జూచి తోఁచిన ట్లనఘ నీవు
పోలినతెఱఁగుఁ జెప్పుకుగాక యనునంత నెడసొచ్చి రక్తాక్షుఁ డిట్టులనియె
నేకార్య మెఱుఁగును రిందఱు పలుగూఁత లఱచెద రవివేకి పగుటఁ జేసి
తే. మంత్రులకు నైజములు మృదుమధురఫణితు, లవి యథార్థీకరించి వాయసముఁ బెంచి
యేలచెడిపోయెదవు సేన నేలచెఱచె, దహితు నిర్జింపు నాబుద్ధి నాదరింపు. 243

క. నేరము ప్రత్యక్షంబై, చేరువ నుండంగ సంతసిల్లి సజారన్
దారన్ స్వాధూర్తుల రథ, కారుఁడు శిరసావహించుకథ యిదియర్యోన్. 244

క. అనవిని యరిమర్దనుఁ డా, యన నాలోకించి యోనయార్ణవ యిది యె
ట్లనురాగంబునఁ జెపుమా, వినియెద నన నతఁ డులూకవిభునకు ననియెన్. 245

క. కేరళదేశంబున రథ, కారప్రమదామతల్లి గల దవ్వికచాం
భోరుహముఖి యువజారో, దారన్యసంబులకు వల్లెత్రాడై మెఱయున్. 246

ఉ. జారులకొంగుపుత్తడి యసభ్యులచేరువపంట మన్మథ
ప్రేరితకోటి కేడుగడ పెన్నిధి గాముకజాతికిం బర
ద్వారులపట్టుగొమ్మ యుపవల్లభసంపదపాంథబృందమం
దారము పల్లవాంగణనిధానము దానివిలాస మారయన్. 247

ఉ. క్రొవ్వినచన్నుదోయికులుకు న్ననుబయ్యెదఁ దెల్పఁ జూచిన
న్రవ్వునఁ బర్వుచూపులదరు ల్చెదరం బటుపాంథమర్త్యముల్
ద్రవ్య మెఱుంగుమేనిచెలువం బెడఁ జేయకచూడఁ గోడెకాం
డ్రువ్విళులూఱి నూఱ మెఱయు న్రథకారవధూటి నీటునన్. 248

చ. మెఱుఁగులఁ గ్రుమ్మరించుకనుమించులు త్రొక్కనిచోట్లు ద్రొక్కఁ గ్రి
క్కిఱిసినగుబ్బచన్ను లెసయాక విరోధులజోక నొండొక
ళ్లొఱయ నితంబబింబమున నొక్కొకయించుక జాఱఁగట్టుఁగ
ట్లోఱపు ఘటింప నేగునలయుగ్మలి మారుపుటేటినీటికిన్. 249

శా. ఆవృత్తస్తని రూపలక్ష్మి కనువిందై యుండ న్నిగ్రాహిహా మో
హావేశక్షుభితుండు గానినరుఁ డిష్టాహారసంచారని

ద్రావైముఖ్యము లేనివాఁడు గృహకాంతాకాంతసంతానచి
న్తావైరాగ్యవశుండు గానిజనుఁ డెవ్వఁడున్ లేఁడు లేఁ డొక్కఁడున్. 250

సీ. పలుమెఱుంగులు మోవిపై నటింపఁగఁ గేరి నవ్వు నొక్కొకసారి అవ్వనవ్వు
జారకర్ణగ్లాని చేర నారజముగా బలుకు నొక్కొక సారి పచ్చిపలుకు
ముఖదృష్టియువమన్మథులు గ్రుచ్చి పారంగఁజూచు నొక్కొకసారి చుఱుకుఁజూపు
గిలుకుమెట్టెలఅంతు బెళుకుసంపాదింప నడుచు నొక్కొకసారి బెడఁగునడుపు

తే. పదనుగా జాజుచేసినపసిఁడితీవ, పోలికఁ జూపట్టు దూతికపోఁతలము
తమ్మరసమంటఁగఱుచు బ్రాయంపుకలిమి, మురియు నొకసారి సన్నంగి మోహనాంగి.

సీ. ఏతెంతువనియు పొక్కిడిపోయి మత్తాళిచూడ నాకట తొంగిచూడనయితి
చేసేఁత నప్పుడ యచ్చికబుచ్చికపుమాటలాడ నాతో మాటలాడనయితి
కెమ్మోవిరుచులఁ జొక్కించి తింతియముద్దుగుమ్మగుబ్బలఁబొమ్ము గుమ్మనయితి
వను నేకతమున రమ్మని యొప్పి రప్పించి తెఱవ యేటికిఁ దల్పుఁ దెఱవనయితి

తే. నీకుఁ జరణానతుఁడనైతి నేత్రజితచకోరనన్నిచ్చలో నేఁ కోరనయితి
వంచు రాత్రిప్రపంచకులైనజారు, లెనరుతాఁకైన నవ్వాడవది నెఁగూర్చి. 252

తే. పరుషటంకకుఠారసంభరణకరణ, జనితతాపరసక్లాంతశాంతికాంత
హస్తములఁ దేర్చునొక్కొక్క యవసరమున, శైత్యభైషజ్యమున దానిచన్నుదోయి.

క. కైసేసిబిడ్డపాపలతో సందడిలేమి నొడలు దొడలుం బిఱుఁదిం
తేనికుచంబులు మెఱయుం, గా సుందరి పోతబొమ్మగతిఁ జూపట్టున్. 254

క. చెలిచెలువు తెరువుకొసను, బలె నానాపథికభోగపాత్రంబై వ
ర్తిలుచుండ. దానిచెడుపోకలు దెలిసెం బతికిఁ గొంతకాలంబునకున్. 255

క. తెలిసి యొకనాఁడు వాఁడా, లలనాతిలకంబు తలతలం బట్టుకొనన్
వలయునని తలఁచి వెంగలి, కలికిం బరికించి నిర్వికారతఁ బలికెన్. 256

క. ఏలినయాకేవళనర, పాలుఁడు నా కానతిచ్చెఁ బయనము చాలన్
గాలవిళంబన మోమహి, శాలీనం దెమ్ము సంబళముఁ గంబళమున్. 257

క. వేఱూరికిఁ జని యిటకై, దాఱుదినంబులకు వత్తు నద్దివసము లా
ఱూఱుకుమీ నీసంగతి, జాఱుట నాకనినయోష సంతోషమునన్. 258

సీ. చివురువాతెర అచ్చసేయుఁబో వేఱూరి యొసపరి గానిపల్లొత్తుకెంపు
తమిగుబ్బచంటిపాళెముడగ్గుఁబో వింతగుమ్మచిమ్మటవ్రేలిగోరి తాఁకు
మోముదామరతావి ముదమందుఁబో క్రొత్తబొజుఁగుకస్తురిచుక్కబొట్టుతేఁటి
చిన్నారిమేనవాసించుఁబో పొఱుగింటికలికిచుట్టము ఒమ్ముకమ్మపూఁత

తే. తనచొకాటపుఁ జెక్కుటద్దములఁ బ్రతిఫలించుఁబో మాఱుమగనిక్రొమ్మించుమూపు
ప్రాఁతపోరాటమెంచుమాఱఁ బఱచెననుచుఁ బొంగెదె లాఁత్యానీను వర్ణంగిలేదు. 259

క. తలపేనుపంటిసందిద్ది, పులుకాలనుముల్లు వస్త్రమున యూకకటి
స్థలితీఁటపాదరక్షన్, శిలవోలెం బ్రాఁతమగఁడు చే పెట్టెకిన్. 260

ఆ. నెరసుతోడఁబోలె నేత్రంబు దుర్భర, వ్యాధితోడఁ బాసి యంగకంబు
కాంతి నుల్లసిల్లుగతి వీనిఁబాసి యిచ్ఛానురూపవృత్తి నగుదు నేను. 261

క. అనిమూఁపులు మూఁడై లాంగలవరథకారునకు సంబళము గంబళి వి-
చ్చి నిలిచి కుహనాత్రిగడ లొక్కన నప్పుడనిలిచి పేరుకొని పతికనియెన్. 262

ఉ. నిక్కువ మారికేగదవె నీకు దయారహితాత్ముఁ డైనరా
జెక్కడఁ గల్గె నిన్ను నొకయించుకనేఁ బెడఁబాసి యుండలే
నిక్కడ నేను మీపిఱుఁద నిప్పుడవచ్చెదఁ దోడుకొంచుఁబొ
మ్మక్కఱదీఱ నాహృదయ మక్కట నీవశమై తెలుంగవే. 263

క. నిమిషము దివసంబై దివసము నెలయై మాసకంబు సంవత్సరమై
సమయుగమై చింతించెద, రమణా భవదీయసంయోగరాహిత్యమునన్. 264

ఉ. ఈచెలువీకళావిభవ మీగుణ మీకమనీయవిగ్రహం
బీచతురత్వ మీగరిమ మేనుగవారికి లేదు చూచితిం
జూచితిఁ బ్రాణనాథ నినుఁ జూచినకన్నుల కాంతొంతనా
రాముఁడుఁ బట్టఁడీవు మగరాజవు రాజవు నిక్క మింతయున్. 265

ఉ. కేవలసాధనంబు లిరుగేల వహించి నటించునమ్మహా
భావజునట్ల యొక్కటులిబాడిసయుం గొని నీవు మామకీ
నావసథంబున న్మెలఁగ నచ్చరచాడ్పునఁ గన్నులార్పకిం
పావహిలంగఁ జూతు దరహాసపరిస్ఫురితాననాబ్జనై. 266

క. విశిఁగలమాణిక్యము పు, త్తడితోడం గూర్చినట్లు తనతో నినుసొం
పవరం గూర్చినబ్రహ్మకుఁ, దపమొక చేయెత్తి మ్రొక్కెదమె ప్రాణేశా. 267

క. తడసినఁ జత్తు న్వడి ని,క్కడి కేతెమ్మనుచు ముచ్చ గన్నీరొలుకన్
బుడిబుడియేడ్పులతో న,వ్వెడమాయలప్రోవు మగనివీడ్కొల్పుటయున్. 268

ఉ వంచనఁజేసి వాఁడు తలవాకిలి వెల్వడి పోయిపోయి య
స్తాచలకుంజకోటరమునం దినుఁ డేగినఁ డక్కుబెట్టి యా
ముంచినచీకటి న్మసలి ముచ్చవలెం జొరఁబాఱి యింటిలో
మంచముక్రిందఁ దూఱుకొని మౌనముఁ గైకొనియుండె నంతటన్. 269

ఆ. జలములాడి మేనఁ గలపంబు నలఁది యు,చ్చెలువచలువ వలిపెచీరఁ గట్టి
ముడిచి కుడిచి లేచి విడియంబు సేయుచు, మొదలియామమయిన యద నెఱింగి.

ఉ. ఆతెలిగంటిగంటి నెరసైనవిభుం డరిగె న్నిరంకుశ
ప్రీతి రమింపవచ్చు నిటఁ బిల్వుము నీవనితోఁ జన దూతి యా
రాత్రిఁ బోయి చీరనగరీప్రతిరథ్యముసుం గొనర్చి సం
జాతకుతూహలుం డగుచు జారుఁడు తత్పదనంబుఁ జేరఁగన్. 271

ఆ. కోల్లమూ యనుద్దుగొంగడిఁ బఱచిన, మంచమునకుఁ గ్రొత్తమగనిఁ గొనుచు
కులుకునడల నరిగి కూర్చుండె దానిక్రిం, దింటిమగఁడు డాఁగు టెఱుఁగలేక 272

చ. ప్రవిఘటితానురూపదృఢబంధ మమంథరమోదకృద్గళా
రవము కటీకపోలముకుర స్తనదృష్టనఖక్షతంబు కై
తవపరిహాసభాషితమతాంతచపేటముపా స్తలజ్జము
ప్రవిగుపగూహ ముల్లసిలె సంగమ మిద్దఱకు న్నిరాంగ్యమై. 273

క. సాధీయాకృతధారా, సాధారణకరశిఖరనిశాతనఖంబుల్
సాధింపఁగ రతినాథా, యోధనసాధనములయ్యె యువయువతులకున్. 274

క. ఆసతి యుపపతియును నిజ, పసతిం జెలరేఁగి యట్లవారణగాఢో
ల్లసనమునఁ బెనఁగ దుసికిలి, పస నచ్చెలికాలు మగని వెన్నంటయుటయున్ 275

క. దిటచెడక యాధరిత్రి, కటిమదిలో నిశ్చయించెఁ గనలున నీచిఁ
కటి నెక్కటి నిక్కడికం, కటి క్రిందిటు వచ్చె గట్టిగా మగఁ డనుచున్. 276

క. గతితృప్తిఁ బొందు యుయ్యపు, పతి నాతిం జూచి పలికెఁ బద్మముఖీ నీ
పతిరతిలో నారతిలో, మతిఁ దలఁపఁగ నీకు బ్రియతమం బెయ్యది యో. 277

క. నోరార్పక నిక్కము చెపు, మా రామా ప్రేమ ననిన నది వానిదెసన్
గూరిమిఁ గలిగియు నలరథ, కారము నోరంజకంబుగా నిట్లనియెన్. 278

మ. *పతికందర్పరహస్యకేళికిఁ దలంప న్మాకుఁ రోచ్చావణ
స్థితి ముంగొంగుపసిండిగాదె యది నాతిం బ్రీతిఁ దేలింపఁగా
కతివారాగతుఁడై విరక్తిఁ దొలఁగంగాఁ జేయుజారుండు నీ
పతమే చెప్పకు వానితోడిరతి నిస్సారంబు రాజాస్యకున్. 279

క. ఇదియేటిమాట యేలా, యదిరెము నిను నీవెఱుంగవా నారమణుం
డుదధిదిఱుపడియు వీవ, ల్లది నే ననసున్నఁ దెలియుదా నీమదికిన్. 280

క. రోఁతనినువంటిమానిని, శ్రోఁతికి నామగనిఁ బేరుకొనఁ జక్కఁదకున్

---

* ప్రతిప్రాణేశరహస్యకేళికి నని పాఠాంతరము.

జేతికిఁ గలవాని సుమీ, కాతాళము గాదు నీకు ఘనుఁ డాతనికిన్. 281

ఉ. ఒంపననేల నామగనియొద్ద రమించుట యింద్రభోగమై
యుండునరో యనుంగువిభుఁ డూరికిఁ బోవు టెఱింగి యొంటి ని
ట్లుండఁగ వచ్చి పట్టికొని యోరిదురాత్మక సిగ్గుగొంటి పీ
వెండయుఁ బోలె వేఁడి ఘటియింపదె నాకిటువంటికూరిమిన్. 282

ఉ. రాచపను ల్వహించి వలరాచకుమారునివంటిదేవుఁ డ
య్యో చని కాళ్ళతో నరిగె నూరికి నెప్పుడు వచ్చువాఁడు లే
లే చవిగావు కండ్లు వెకలింపుచు నున్నవి ప్రాణవల్లభుం
జూచినదాఁక యొట్లునిలుచుం దనువెట్లు సహించియుండునన్. 283

శా. కాయం బెక్కడనుండెనేమి వనితాకందర్పుఁ బ్రాణేశ్వరుం
బాయంజాలవు ప్రాణము ల్మనసురుబ్బాబూళ్ళుగాఁ జేయుటన్
డాయ న్వమ్ముఁగదా పయోధరము లంటం గౌఁగిటం జేర్చి యా
చాయం బైకొని చెక్కునొక్కరతిరాజ్యశ్రీలఁ దేలింపుగన్. 284

చ. అగునగు బైసిమాలిచిలివంచు విజృంభణవృత్తి నివ్విధి
న్నోగయనిమాటలం జెవులు నూఁదను సైఁచినదానఁ గాను నా
మగనికి నిన్నువంటికొఱమాలినమానుసులీడె *భర్తతోఁ
దెగి యొడద్రవ్యకం బ్రదికితే మని యైనువనై సుఖించెదన్. 285

చ. అనుతనుమధ్యభాషితము లారథకారుఁడు సాదరంబుగా
విని యిది నాయెడం బ్రణయవిశ్రుతయౌ నటుగాక యుండినన్
నను ననుకూలుఁడంచు నృపనాథునితోడ శతాననంబుల
న్వినుతి యొనర్చునే పరిభవింపక చంపక కాతు మెచ్చితిన్. 286

ఉ. ఏను బ్రవాసినౌ టెఱిఁగి యింతట నంతట నాకుమాఱువ
ర్లేని దెఱింగి కన్గొని చలింపక వీఁడిలు సొచ్చి యుద్ధతుం
డై నిలుపోవలేక కదియుంబడెఁ గాఁతలు రోఁతలంచు ల
జ్జానిధిగాన మెత్తఁబడి సాధ్వి రతిస్థితి నూరకుండెడున్. 287

ఉ. చిక్కితి వీనిచేత రొదసేయుట సిగ్గులచేటు పొంగులం
జొక్కక వేగ నిల్వెడలఁ జూడఁడు ముచ్చటఁ దీర్పకున్న గెఁ
డుక్కున నేమిసేయునొ భయోదయ మయ్యెడునంచు నోడి యీ
చక్కరముద్దుగుమ్మ సరసప్రియభాషల నింపొనర్చెడున్. 288

* భర్తకుం దెగి యొడద్రవ్యకం బ్రదుకదే యని పాఠాంతరము.

క. అతివా నారతిలో నీ, పతిరతిలో నిష్ఠ మెద్ది పలుకం దగునం
చితఁ డడిగిన హితరూపా, న్వితుఁడని నన్నుబల పొగడ వినిం దెగడెన్. 289

ఉ. పంచన యిప్పు డీతులునవంకజనించె జనించుఁగాక యీ
చంచలనేత్రి నాయెడఁ బ్రసన్నమనోరథ దీనిమాటలన్
గాంచితి మోదమంచు రథకారుఁడు వేగ సజారదారతో
మంచము నెత్తికెత్తుకొని మంజుగతిం జని వాడవాడకున్. 290

ఉ. వాకొని యొంతశాంత యొటువంటిపతివ్రత యొంతయుత్తమ
శ్లోకవివేకరాశి యనుచుం బ్రియు నెన్నుచు హస్తతాళమా
నైకలఘుప్రచారగతి నాడెఁ బ్రహాసవిలాసవక్త్రులై
మూఁకలుగట్టి నాగరికముఖ్యులు తన్నరికించి నవ్వఁగన్. 291

వ. ఇచ్చరిత్రంబు సాపరాధుం డగుచిరంజీవిం జేపట్టిన నీ కుదాహరణం బగు నని రక్తాక్షుండు చెప్పిన నప్పలుకు లాదరింపక నులూకేశ్వరుం డూరకుండె నంత నయ్యభిప్రాయ మారసి. 292

క. తనకు నులూకత్రాసము, మనుగడ కుపహతి యునబహుమానత్వము లే
దని తెలిసి తెలివిఁ గలయా, వనమునఁ జిరజీవి ఘూకనాథుని కనియెన్. 293

క. నీరిపుచే నూరక యవ, ధీరణఁ గాంచితి జగద్విదితమతి నయ్యున్
క్రూరాగ్ని కాహుతిగ దను, ధారణ మిఁకఁ జాలు వేల్చెదం బ్రాణంబుల్. 294

క. నావిని రక్తాక్షుఁడు చిర, జీవిం బరికించి చచ్చి చేసెడుపనియే
మీవిపరపుట్టఁ జెపుమా, నీవనుటయు నాతఁ డాతనికి నిట్లనియెన్. 295

క. ఈకాయ మనలముఖమునఁ, బోకార్చి యులూకయోనిఁ బుట్టి బలిమి మైఁ
గాకముల గర్వరేఖా, స్తోకములం ద్రుంతు మనసుతుందుడుకాఱన్. 296

వ. అనిన విని రక్తాక్షుండు. 297

క. లోకదృశఘనసమీరము, హాకుధరంబులవరింతు నని కాదాపూ
ర్వాకృతికి వచ్చె నొక్కతె, కాకికి నీకేల కౌశికత్వము గల్గున్. 298

క. అనురక్తాక్షునిఁ గనుఁగొని, ఘనుఁ డచ్చిరజీవి వలికె గాఢప్రజ్ఞా
ధన వినఁగోరితి నిక్కథ, యనురక్తిం జెప్పుమనిన నతఁ డిట్లనియెన్. 299

సీ. కైటభాహితపదాంగదమౌక్తికచ్ఛాయ విధికమండలుసమన్వితమరాళి
మారారిమకుటమందారమాలికవి యుత్కృష్టధేనుక్షురక్షితధార
సాధుజీవంజీవచంద్రికసగరజస్ఫాటికస్వర్గసోపానపంక్తి
చిరతపోవిత్తకుంచితభగీరథకీర్తి వారాశిహృదయకర్పూరవర్చ

తే. పరుషహానిస్థశాపసంప్రాప్యమాణ, మిత్రసహపుత్ర గీర్వాణశత్రువేష
సముదితక్లాంతిహ్యాతిసమ్యగమృతవృష్టి, గంగ పొంగడంగ నెగడు శంగ త్తరంగి. 300

సీ. తజ్జలంబుల నొక్క తపసి యాస్వాదింప శయపుటం బల్లనఁ జాఁపుచోటఁ
దటకుటానిలనటద్విటపకాండనిషణ్ణ ఘనగృధ్రచంచునిర్గళిత యగుచు
మూషికపడియె నమ్ముని దానినిజతపోమహిమను నొక్క మనోజ్ఞమహిళఁ జేసి
కన్నకూఁతునకంటెఁ గడుగారవంబునఁ బోషింప నొకకొన్నిపూఁటలకును

ఆ. గుఱులుగూడె మేను మెఱుఁగెక్కెఁ బాలిండ్లు, బయలు మెఱసెఁ బిఱుఁదుబలిసె నడలు
ముదిప మెఱిఁగె సిగ్గుమోమున నివురొత్తెఁ, దోయజాస్య కలదుఁ బ్రాయమైన.

క. కలితరుచిమించునించున, ఫలముంబలె నూఁగునూఁగుఁ బ్రాయము చెలిపై
నిలువం గని ముని మనుపీ, వలవని తలపోసె నధికవాత్సల్యమునన్. 302

క. ప్రతినూతన ర్తువేళా, న్వితరుచిన్వతె యన్వఘూటి న్వపలి యగు నద్ద
త్సతిపాణిగ్రహణముఁగా, మతిఁ దలఁపరు సుమతుల నభిమతమ్మై యునికిన్. 303

వ. ఇంతపమున్న వివాహంబు సేయలేనైతి నిచ్చిపుచ్చుకొనువారికిఁ గులధనాది గౌర
వంబులు సదృశంబులునయిన ననురాగంబు పెనుగుదాంపత్యావనాదులు పరస్పరాను
రూపంబు లయియుండిన సతిపతులకుఁ బ్రేమాంకురంబులు వృద్ధిఁబొందుఁ గావున
నివ్వనజగంధి మహానుభావుండగు సూర్యదేవునకుం బరిణయంబు సేసెద నని యా
ముని తీవ్రధాము నాకర్షించి. 304

సీ. తనునోరఁ జేరవచ్చినవారి కారోగ్య మిచ్చువాఁ డఘములవ్రచ్చువాఁడు
పరరాడసంబాధ విరియుచక్రముల రక్షించువాఁ డీఱులశిక్షించువాఁడు
వేదాంత శుద్ధాంత వీథుల నోలగంబుండువాఁ డాపద ల్చెండువాఁడు
దుష్టమందేహ సందోహంబు నెలగోలు తరమువాఁడు సురారితరమువాఁడు

తే. సంప్రదోషపచష్టిస్థితి జలదరించు, నవనిజనులకు దృష్టిపాటనము నిచ్చి
మించువాఁ డెల్లదిశల దీపించువాఁడు, సారసాప్తుండు మునికి సాక్షాత్కరించె.

చ. ముని యలతీవ్రధాముని సముజ్జ్వలధామునిఁ బూజసేసి యి
ట్లను దిననాథ యిక్కసలయాధర పెంపుడుబిడ్డ నాకు నీ
కెన సుముహూర్తవేళ వరియింపుము నీకిదె యిత్తునన్న న
వ్వనరుహబాంధవుండు శ్రుతవంతుఁ బ్రశాంతునిఁ జూచి యిట్లనున్. 306

తే. అనఘ నాకన్నఁ బద్మన్యుఁ డధికుఁ డత్రి, సంచయంబున నను నిరోధించుఁ గాన
నప్పుహొత్తున కీకన్య నఖిలమాన్యఁ, బరిణయము సేయు మదినీకుఁ బరమశుభము.

క. అనిచెప్పి తపనుఁ డరిగిన, ననఘుం బద్మన్యు నంత నాకర్షింపన్
జనుదెంచి నిలిచె నతఁ డమ్ముని యావ్వేల్పునకు నెయ్యమున నిట్లనియెన్. 307

క. కన్య న్భువనత్రయమున, న్నాన్య ననన్య న్వరింపుమా యిచ్చితి నీ
ధన్యత్వ మమర ననఁ బ్రజ్ఞన్యుం డిట్లనియె మానిజనమాన్యునకున్. 309

క. మరుదభిహతిదూదిక్రియం, దరలుదు నాకన్నఘునుఁ డతం డాయన కి
త్తరశాఖి నిచ్చి సంయమి, పరపెండ్లి యొనర్చు మనుచు వాఁడుం బోయెన్.

క. పవమానుఁ గ్రోధహతశై, పవమానుఁ దలంపఁ దపసిపాలికి నతఁ డా
స్వజవము లమరవచ్చిన, వివిధాతిథ్యముల గారవింపుచుఁ బలికెన్. 311

చ. ఉచితసభాయితాఖిలపురోపవనాపవనాసురాసుర
ప్రచయములందు నీసవతు రాఁ డొకఁ డిష్టజనప్రసన్నతా
రుచుల నశౌ బెఱింగి గుణరూపవయోనయధన్యఁ గన్య నీ
కచలమనీష నిచ్చెద సదాదృతిఁ గమ్ము వివాహ మీవనన్. 312

చ నరులు సుర ల్ఖవాదృశులు నన్ను మహాబలుఁ డండ్రు సత్కళా
పరపరమేష్ఠిశైలము లపాంబలంబులు నేనెఱుంగుదుం
బరు లనకున్న నేమి కనుపట్టిన పట్టిధరాధిభర్తృకా
దరమున నిత్తుఁగాక నని సదాగతి సెప్పి యథేచ్ఛ నేగినన్. 313

క. ధరములఁ దలఘటితపయో, ధరముల సంగీతముఖరదైవతవిద్యా
ధరముల శ్రీగరుడసుధా, ధరములఁ దఁచుటయుఁ బర్వతము లేతెంచెన్. 314

క. ముని యద్ధరణీధరములఁ, గనుఁగొని యిట్లనియె నాత్మకన్య ననన్యన్
జనలోకమాన్య నిచ్చెద, గొనకొని యొండొకఁడు పుచ్చుకొనుఁ డింపెసఁగన్.

చ. అతిశుభలగ్న మీసమయ మన్న నమస్కృతు లాచరించి ప
ర్వతములు పల్కె నేఁ డబలవంతులమందురు పాదజర్జరీ
కృతులము మమ్ము లెక్కఁగొన వెల్కలు వానికి నిమ్ము నిర్మల
వ్రతభవదీయప్రీతి కనివారణ లేకని చెప్పినపోయినన్. 316

క. ఎలుకలఁ బిలిచి మహాముని, కులవల్లభుఁ డనియె నిత్తుఁ గూఁతు న్మోదం
బొలయ వరియింపుఁ డొకఁడని, పలికిన నవి కరము వెఱఁగుపడి యిట్లనియెన్.

క. ఎలుకలకు మనుజసతులకుఁ, గలయిక లెట్లనిన మాని కమనీయతపో
బలమునఁ గన్యం గూఁతురు, నెలుకంగాఁ జేసి యొకటికిచ్చెం బుచ్చెన్. 318

వ. అట్లగుటఁ గాకి వగునీకు ఘూకజన్మ మెట్లుగల్గునని కేరడం బాడి యధిక్షేపించు రక్తాక్షుని వారించి యరిమర్దనుండు ప్రసాదపురస్సరదృష్టిఁ జిరజీవి నాలోకించి.

ఉ. క్రూరతరావలోకములు ఘూకము లాదృతి నీకు నీప్సితా
హారము లిచ్చు నిర్భయుఁడవై ధరణీరుహదుర్గకోటరా

గారవములం జరింపుచు సుఖస్థితి నుండు కొఱంతలేక యా
భూరివివేక యంచుఁ గడిపోవనిభక్తి బహూకరించినన్. 320

వ. కృతకృత్యుండ నయితినని ధైర్యవిజితనీహారాచలుం డగ్గళప్రచారంబున దుర్గబాహ్యాభ్యంతరంబులం బ్రవర్తించి యున్నయదియుం గనుంగొని శరీరరక్షణపర్యంతంబు చింత దొరలకుండ ఘూకంబులం గలసి మెలసి పక్షంబులు వ్యవహారదక్షంబు లగుటయు నొక్కనాఁ డెడఱు వేచి యులూకమూలోత్పాటనంబునకుఁ బృథ్వీరుహదుర్గకోటరద్వారంబుల నీరంబులుగాఁ బూరిఁ గూరి నీరసేంధనంబులు దుఱిఁగి కరీషపిండఖండంబులు గ్రుక్కి యక్కడ నిలువక మేఘవర్ణుఁ గానంబోయి యవ్వాయసపతిచేత సంభావితుండై యప్పు డుపస్థితంబైన కార్యంబు విన్నవించి చిరజీవి యిట్లను నీవును నిన్నుం గొలుచువారును నీరసతరుశాఖలను గొఱవులను బట్టుకొని రండు వైరిసంహారసమయం బిదియని తెలుపుటయు. 321

క. ఎరవలిపట్టినకొండలు, కురువడిఁ జని కాకిమూఁక లొక్కటఁ గొఱవుల్
వరనవవైనపిడకలు, తరిగైకొనిపోయి ధీరతం దరికొల్పెన్. 322

మ. తెగ నత్యుద్ధతి మించువాయువులచేత న్రాఁజితోద్ధూత క్రొం
బొగ కీలలు పర్వ నిక్కఁ జిఱునిప్పు ల్రాచి యుక్కుమ్మడిన్
గగనం బంటి ఘనస్ఫులింగములు నాల్కల్గ్రోలియునచ్చిమ్మనం
బగిలెం బ్రేలిపడెం దివాంధకులము ల్భస్మంబులయ్యెం దుదిన్. 323

క. ఈవిధమున నిశ్శేషము, గా వైరుల సంహరించి కౌతూహలసం
భావితుఁడై యప్పుడు చిర, జీవికి వలకాకరాజశేఖరుఁ డనియెన్. 324

క. పగవానిగృహము మృత్యువు, మొగముచొచ్చి సన్నిధివసనములు గిట్టా యే
పగిది జరించితి వీవని, నగచివఁ జిరజీవి మేఘవర్ణుని కనియెన్. 325

చ. అపుడు గార్యకాంక్షి యగునాతఁడు దేజము డాఁచి సుస్థితు
ల్గడుచుచు నీచుఁ గొల్చు తిరుగుం దివిజఘ్నయుతులై ధరిత్రిఁ జే
గ్పడినసహోదరుల్డవకఁ బ్రాపుగ నుండియుఁ బుణ్యగాథలం
గడపఁడె మత్స్యరాజుసముఖంబున ధర్మసుతుండు కాలమున్. 326

ఉ. పౌరుషము న్మహాబలముఁ బండితభావముఁ గల్గినట్టియా
ధీరుఁడు కార్యదాహానిరతిం బరుఁ గొల్చు మహానసాగ్నిధూ
మారుణతోత్తులు న్మలినమైనపటంబు మహావిభూషితా
కారము దర్వియు న్మఱియుఁ గా వలభీముఁడు మాత్స్యుఁ గొల్వఁడే. 327

ఉ. పౌరుష ముజ్జగించి నగుబాటున కోర్చి సాధుగస్థితా

కారతఁ గాలకాంతు పొసఁగ న్నిజకార్య మొనర్చు గాంచిన
జ్యారవదేవదత్తరథసంక్షుభితాప్తహరిత్కరిశ్రుతి
ద్వారుఁడు క్రీడి మత్స్యపురి నాఁడు బృహన్నలయై నటింపఁడే. 328

చ. ఒకదెసఁ గార్యదాహమున నుండక యేరికినైనఁ దీక్ష దం
తకనిభసత్యుఁ డాదరణధామకటాక్షుఁ డఖండవిక్రమా
ధికుఁడు విలాసవిభ్రమణదేశము మాద్రికిఁ దొల్త పుత్త్రుఁ డా
వకులుఁడు మత్స్యరాజభవనంబున సాహిణియై చరింపఁడే. 329

చ. భుజబలశాలి నీతిపరిపూర్ణుఁడు రూపవిలాసవారిజ
ధ్వజుఁడు హరిజ్జయాభిముఖదర్పుఁ డతిప్రియభాషుఁ డాశ్రిత
ద్విజనిధి కార్యదాహనిరతి న్నిజవేషముఁ గప్పిపుచ్చి గో
వ్రజములఁ గాచువాఁడయి విరాటుపురి న్సహదేవుఁ డుండఁడే. 330

ఉ. కాలము దాఁట నెవ్వరిలఁ గాల్గలవారలు వారిరాశికీ
లాలపరీతభూతవిపులాన్వపరాజముఖశ్రీశిరస్థ
స్థాలఘురత్నభానునికపాతిసమున్నపదంఘ్రిపద్మ పాం
చాలతనూజ తొత్తుపని సల్పదె దైవగతి న్సధేష్ణకున్. 331

వ. అని చెప్పి బాష్పనిష్ఠ్యూతనేత్రుండై వాయసాధ్యక్షుండు చిరజీవి నాలోకించి. 332

క. పరదేశ మఖిలదుఃఖా, కరము మదీయోపదేశగమ్యుఁడవై కా
ర్యరథసముత్కర్ష రిపుపురం, బిరమున నెబ్భంగి నుండితివి చిరజీవీ. 333

క. ఘూకములు దొరఁడ ఘూక, స్తోకాంతుఁడు గౌరవంబు సలుపఁగ ప్రతిప
క్షౌకమున నుంటి విద్దశ, నాకతమున నీకుఁ గలిగెనా చిరజీవీ. 334

సీ. అని విన్నవయిన వాయసరాజు నీక్షించి యాచ్చిరజీవి యిట్లనియె మత్ప్రి
తపువున నీయాజ్ఞఁ దలమోచి యేనుండుతఱి మదాంధదివాంధతతులు వచ్చి
కెలఁకు లీక్షించి మీపాలఁకువ లేకున్న తెరలివచ్చిన త్రోవ మరలి చనఁగ
నున్నక న్నెఱిఁగ నేనొకశబ్ద మొనరించి క్రమ్మఱించితిఁ గార్యకరణబుద్ధి

ఆ. నప్పుడు వికృతమూర్తి నైయున్న న న్నులూ, కములు గాంచి యొఱుఁగుఁ గానఁ దోలుత
నింపుకలిమి సంహరింపక నొంపక, నాదరమున భర్త కప్పగించె. 335

వ. అప్పుడు ఘూకవల్లభుండు నన్నుం జూచి నీ వెవ్వండవని యడిగిన మేఘవర్ణు
నకు ముఖ్యదండనాథుండ నగు చిరజీవి నని చెప్పితి నప్పలుకులు విని మంత్రులరా
వించి మంత్రకూటంబున నన్నుం జూపి యితని కుచితం బగు కార్యం బొకరొకరు
చెప్పుండనిన నందు రక్తాక్షుండనువాఁ డొక్కరుండు దక్కఁ దక్కినవారందఱు
నాపక్షంబ పలికిరి రాజును వారివాక్యంబు లంగీకరించి నీతిదక్షుండగు రక్తాక్షుని

దెస నాదరణంబు సేయండయ్యెఁ గాలపక్వంబును నట్టిద. 336

క. జనియింపం గలకార్యము, మనమున దగ నిశ్చయించి మంత్రి సునీతిన్
వినిపించిన వినవొల్లని, చెనఁటికి ముకుబంటిగాదె చేటుంబాటున్. 337

తే. గగనమంటిన దోషాగ్ని గాఢశాంతి, నీరమున శీతలముసేయ నేర్చుమంత్రి
విరహితారంభిపరుఁ డైనసేవకుండుఁ, గార్యనిర్వాహకులు సూవె కరటముఖ్య.

క. తానెంత కార్యపారగుఁ, డైనరహస్యమున మంత్రి నడుగక ధరణీ
జానికి నేకార్యంబుం, బూనందగ దుద్ధతప్రభుత్వప్రజ్ఞన్. 339

ఉ. ముప్పదిమూఁడుగోటుల సుమూర్తులవేల్పుల నేలువజ్రియు
ప్పప్పయు వార్యశౌర్యకరుణాదులపట్టున నింతకేనియున్
జెప్పనివాఁడె యట్టినయశాలి బృహస్పతిగోపనంబునం
జెప్పినపంపుసేయక విశృంఖలవృత్తిఁ జరింప నేర్చునే. 340

క. కావున రక్తాక్షుఁడు నయ, కోవిదుఁ డమ్మంత్రిమాట గురుమంత్రముగా
భావింపలేక కోటఁడు, పావకకీలాళిఁ గాలి భస్మంబయ్యెన్. 341

చ. అరయఁగ దుష్టమంత్రినివహం బనువారము గల్గియుండ నే
పురుషు ననీతిదోషములు పొందవు రోగములే యపథ్యబం
ధురుఁ గలఁగింప వేజనునిఁ ద్రుంపదు మృత్యువు లక్ష్మియెవ్వనిన్
జిరమదగర్వదర్పితునిఁ జేయదు పైకొనవేరి నాపదల్. 342

వ. లోభికిఁ గీర్తియుఁ ఖలునకు మైత్రియు నష్టక్రియునకుఁ గులంబును ధనార్జనతత్పరునకు ధర్మంబును నలసునకు విద్యయుఁ గృపణునకు సౌఖ్యంబును బ్రమత్తసచివుండగు జగతీపతికి రాజ్యంబును లేదు వెండియు నీరసేంధనంబుల వహ్నియుఁ మూర్ఖులందు శోకంబును జపలచిత్తులయందు గోపంబును గాంతలందు విత్తంబును దయావంతులందు ధర్మంబును మహాత్ములయందు ధైర్యంబును వృద్ధిఁబొందు నది యట్లుండె. 343

క. పలనగునంతకు బగతుం, దలనిడుకొని తిరుగునీతితత్త్వజ్ఞుఁడు ముక్
జిలువయొకం డట్టిదయై, మలుగందినదే యనేకమండూకములన్. 344

క. అనినవిని మేఘవర్ణుం, డనురాగరసాబ్ధి నోలలాడుచు విద్యా
ఖనికా యె ట్లీకథ చెపు, మను డచ్చిరజీవి వాయసాగ్రణి కనియెన్. 345

సీ. విను పూర్వమున మందవిదుఁ డనుకాలాహి యాహారకాంక్ష నహర్ముఖమున
బఱచి యొండొకచోట బహుభేకకలకల ప్రతిభిన్నసకలదిగ్భాగమైన
హ్రదము గన్గొని లోనికరుగ నెద్దిక్కున దెరువు గావక తీరధరణినిల్చి
కుంభిని ఫణమూదికొని డిల్లచెడినట్లు పరవశుగతి రుగ్ణపగిదినుండఁ

తే. బలికి మండూకపతి మహాఫణివతంస, ప్రాణములు లోచనంబుల బట్టిపట్టి
యొఱచి యెల్లక యిట్లుండ నేలనేల, చింతలేమిటికేని భక్షింపరాదె. 346

క. తలద్రిప్పక మ్రింగుచు కే,వలము మహాబలునియంతవాని నయోనీ
కలఁతంబడ నేకార్యము, గలిగెనో కో యన్నఁ బన్నగం బిట్లనియెన్. 347

తే. ఓదయానిధి దైవోపపాదితుండ, నైననాకేల దొరకు నాహార ముఱక
నోరులు వెట్టివదనుక బస్తుండవలయుఁ, దనకు నావుడు మఱియు నద్దర్దురంబు. 348

క. అనిలాశనవల్లభ చె,ప్పు నహో చిత్రంబు వస్తు పారణ లుండన్
పవరం గారణమున్నను, వినియెద జెపుమనిన మందవిదుఁ డిట్లనియెన్. 349

క. కేవల మాహారేచ్ఛం, బోవఁగ నొకనాఁటిరేయి భోగం బద్రువం
గాపడి ద్రొక్కిన నొకభూ, దేవకుమారకునిఁ గఱిచితిని బడలుపడన్. 350

క. కాటుపడి భీతిఁ గాయం, బూటాడంబరచి జనకునూరుద్వితయా
స్ఫోటితమస్తకుఁడై శిశు, వేటుపడినకురరివోలె నేడ్చుచునుండెన్. 351

క. అపలునలముద్దుపట్టిం, జడియకుమని వీపుజఱిచి జనకుం డురముం
దిడికొని మునుగడ పుడమిం, గడునడకువ నున్ననున్న గని కోపమునన్. 352

క. వసుధామరుఁ డిట్లను వెలి, విసరినతమినోరి విసపువిత్తానోర
వసనాడెఁ గటకటా యి, క్కసుగంగుం గుంటులేక కరసన్ బంపన్. 353

ఆ. కుటిలగతికిఁ బుట్టు గుడ్డికి ననుదిన, శ్రుతివిహీనునకును క్రూరమతికి
బాపజాతికేలప్రాపించుఁ బరహితా, చరణవిద్య నిన్ను నైఁపఁదగునె. 354

చ. కడుదొడుసైన యిద్దురితకర్మము నిన్గొని ముంచుగాక యె
క్కుడఁ జననిచ్చుఁ బుట్టపురుగా కొఱగా కెపు పస్వతంత్రతన్
మడుఁగు భజించి భేకముల మస్తమున న్భరియించి కొల్చి యె
ప్పుడవి దయామతిం గడుపు పోయఁగనుండు పాకారిసొమ్మునన్. 355

క. ధారాళచింత నంతం, క్రూరతచెడి మిమ్ము మోచికొని తిరుగంగా
నోరాజా వచ్చితి నా,హారము మీరిడక లేదయా నాకనుచున్. 356

క. ఆరోహణకౌతూహల, సౌరభ్యము మోసులొత్తె జలపాదుఁడు దు
ష్టోరగభాషణములు మా,యారూపము లనక నిజము లని తనలోనన్. 357

క. తలఁచి యలచిలువకిట్లను, నెలకొనినమఁ గొలువనిలువ నీహృదయమువం
గలిగిన నాహారం బిడి, తలకుం గ్రొవ్వెక్క నడపెద న్నే ననుడున్. 358

ఉ. మందవిదుండు కప్ప దనమాయకు లోనయి చిక్కె నంచు నా
నందమునొంది భేకరమణభ్రమణాదులు నాకులేవు నీ

కంఠమునఁ జేరి భోగఫలకంబున నీపదము ల్వహించి యుం
దుం దుదిముట్టనందనుకఁ ద్రోవక దగ్గఱఁ జేర్చుకొమ్మిటన్. 359

క. నను విశ్వసింపు మిప్పటి, కనుమానము మాను చచ్చునంతకు నెందుం
జననని దేవరనగరికి, దనపేరం గమ్మకట్టెదం గొనుమనుచున్. 360

ఆ. కడుపుఁజూపి చావగా నింక నెన్నఁడు, వడుపుకొనియె దనుచు చెడుగుఁబురుగు
చెప్పరాని ప్రియముఁ జెప్పినహృదయంబు, గరఁగి భేకరాజు తెరువుచూపి. 361

క. ఆరోహింపఁగవలె గృ,ష్ణోరగ యీసరియువెంట నొద్దికఁ జనుదె
మ్మా రయమున ననుటయు ని,ర్వారణనది సొచ్చి కదియ వచ్చెం గప్పన్. 362

క. అప్పు డనురాగ మొప్పం, గుప్పలుగొని క్రోతిగొమ్మగొన్నట్లు వడం
గుప్పించి కప్ప తేఁడ, ప్పప్పఫణిప్రవరుభోగ మారోహించెన్ 363

క. జలపాదుని బాదుకొనం, దలనిడికొని త్రాఁచునేచునటనం దటభూ
ములకొంతసేపు ద్రిమ్మరి, యలసినగతి నూరకుండె నట్లుండుటయున్. 364

ఉ. పన్నగభర్తఁ జూచి జలపాదుఁడు పల్కె నిదేమి వేగసం
పన్నము గాకయున్నయది మందవిషా భవదీయవిగ్రహం
బన్నభుజంగ మిట్లను దయామయ యాఁకటఁ దీలుపడ్డ నా
కున్నదె యానశక్తి కడు పోమిన మీఁదటఁ జూడు చిత్రముల్. 365

క. దొరలు తమవేడుకల జా,తురగాని వహించి తిరుగు తురగంబులఁ బ్రో
వరు మేపునీళ్ళతఱినిడి, యరుదివ్విధ మనిన దర్దురాగ్రణి మదిలోన్. 368

క. కలతెఱ గిట్టిద యనుచుం, దలఁచి యయో విప్రశాపదశ దనయిచ్చన్
వలసిన యాహారము గొన, గలుగమి నిచ్చిలువ నొచ్చెగద యకటకటా. 367

క. భారవహం బిదిలేదా, హారము నే నిడక కటికి యాఁకట నిపుడే
కారెడునిట్లుండిన నా, యారోహణకేళి యే క్రియం గొనసాగున్. 368

చ. అని తలపోసి మందవిషు నారసి యజ్జలపాదుఁ డిట్లనున్
ననుఁ దలఁదాల్చి యాడజవనంబువలెం జఠరానలంబు రాఁ
జిన యపుడెల్ల గప్పల విశృంఖలవృత్తి భుజించి లావుగై
కొని విహరింపుభోగికులకుంజర నాదములన్ హ్రదంబునన్. 369

వ. అని నిరప్పణగాఁ గప్పల తేఁడు సెలవిచ్చిన బలవంత మగుట నీరంబున ననర్గళప్రచారంబునం బేరంబులు వాఱుచు నొడిసియొడిసి బడలుపడం గఱచి కిచుకు కిచుకురనక కతిపయదినంబులకు జలపాదావశేషంబుగా నిఖిలభేకంబులం భక్షించి.

క. తలనంటి పట్టుకొని చి,ప్పలు విరిగి పడంకుచున్నవాని నహో యు
జ్జలపాదు విడిచి రోషా,విలమానసుఁ డగుచు మందవిషుఁ డిట్లనియెన్. 371

క. తగునే భోగిశిరోమణి, నగునే నొకవేళ నలఁగి యరుదెంచినఁ దై
నెగురుకొనఁ గొండయెక్కడ, దగ రెక్కడ వలదె తారతమ్యం బరయన్. 372

క. నలఁకువ ధర నెవ్వరికిం, గలయదియ మహాబలారిగా యితఁడంచుం
దలఁపక గౌరవమింతయు, సలుపక నను నసదుసేయఁజనునే నీకున్. 373

క. అతిమణిఘృణిసంభరణో, చిత మగు నాఫణము కష్టశిలా నీకు
త్సితపుటడుగులకు వశ్యమె, తతినిక్క నలాఱ మ్రింగెద న్ని న్ననుచున్. 374

క. పడి నొడిసిపట్టుకొని దెస, పడ నొడలుం దొడలు బడలుపడ నొక్క ముదం
బడర దిగ మ్రింగి వలసిన, కడ కరిగె న్మందవిషుఁడు కాకాధ్యక్షా. 375

వ. ఏ నమ్మందవిషుచందంబున నవమానంబున కోర్చి ప్రతిపక్షక్షయం బాపాదించితి
నని చెప్పి చిరజీవి మఱియు మేఘవర్ణున కిట్లనియె. 376

క. మూలముల జెఱుప వనల, జ్వాలలు తరువులనకాని చందనశైత్య
శ్రీల మగు గాడ్పు చెఱుచు, న్మూలంబులతోన వృక్షముల శీఘ్రమునన్. 377

క. ధనమున ఋణశేషము సా, ధనముల రిపుశేష మౌషధంబునఁ దనుసం
జనితగదశేష ముదకం,బున శిఖిశేషం బశేషముగఁ జేయఁదగున్. 378

చ. ముడివడియున్నదుర్వ్యసనము న్సడలించి దురంతరోషపుం
గడలి సుశాంతిసేతువునఁ గట్టి సమాసమదేశకాలముల్
కడఁగనిచిత్రగుప్తి పొసఁగ న్మను జేనికి వేయునేల యి
ప్పుడమిఁ గరస్థలామలకముల్గద సంపదలు న్యర్థంబులున్. 379

క. శరములఁ బవరు మనీషా, శరములఁ బడినట్లు రిపులు సమరమువలయున్
శరములకు వలను ప్రజ్ఞా, శరములకుం గ్రాహ్యమెద్ది సరియా రంటన్. 380

క. అలఁతులకు దైవయత్నము, బలవంతంబైన నెల్లపనులొదగు మహా
బలుల కది లేకయుండినఁ, బలుకులు వేయేల కడమవడు సర్వంబున్. 381

వ. సుచరితఫలంబులంగాక సకలకార్యంబులు చేకూడవు త్యాగంబున శూరుండును
వైదుష్యంబునం బ్రియుండును గుణంబుల లుబ్ధుండును నగుచు రాజు రాజ్యంబు
గావింపవలయు నింతొక్కటితక్కినం బురుషాకారంబు నిరర్థకం బని విందు మది
యట్టిద. 382

సీ. ఘనయాగనిధి యనంగునకా యసంగత్వ ముచితమే బలి కహివ్యూహవసతి
పాండునందనునకా బహుకాలవనవాస మిథపురాధిపునకా యేటిచోరవ
యమకులాధ్యక్షునకా శాపమరణంబు జాహ్నవీసుతునకా శస్త్రశయ్య
వలరాజుకా మహానసపాకభజనంబు నహుషునకా ఘోరనాగమూర్తి

తే. మఱిత్రిశంకునకా పచ్చిమాలతనము, ద్రుపదనందనకా రాచతోత్తుపాటు
మనుజుఁడెవ్వఁడు కర్మస్వతంత్రుఁ డరయ, నీశ్వరుఁడుగాక సమకూర్పనిట్టిపనులు.

వ. ఇదియెఱిఁగి ప్రజ్ఞాన్యాయంబు లేమఱక యుండవలయు దైవబలంబు గలవాఁడవగుట నీకు శీఘ్రకాలంబునఁ గార్యసిద్ధియయ్యె నిరమిత్రుండవయితి ప్రాప్తమిత్రుండవయితి వింకఁ బ్రాజ్యవైభవంబున రాజ్యంబు సేయుమని చిరజీవి చెప్పిన మేఘవర్ణుండు సకలసంపత్పరిపూర్ణుండై రాజ్యభోగంబు లనుభవింపుచుండె. 384

క. అని చెప్పిన ధరణీవర, తనయులు నిజగురునిఁ జూచి తాత్వికముఖ్యా
వినఁ బ్రియమయ్యెడు జెప్పుమా, ఘనువారఁ జతుర్థతంత్ర మని యడుగుటయున్.

చ. అతనుభయంకరైకవిషమాంబకసమ్యగనంతభోగసం
గతవిగతాంతరాయగతి గాఢవినాయకపత్రిచిత్రజా
ద్భృతిబహుపద్మజాండమణిదీపితకుక్షికరంకమందరీ
కృతపరతత్త్వవిజ్జటిమృగేంద్రవికస్వరయోగపుష్కరా. 386

క. రంగత్తరజాతమహా, గాంగేయస్తవనఘటితఘనపులకాయ
త్సాంగనిచోళయమప్రా, గ్రంగస్థలమధ్యసంచరణశైలూషా. 387

మాలిని. కలుషఘుశకధూమాక్లాంతచింతామరామా
ప్రళయకరణరోషా ప్రాణిసంగుప్తితోషా
విలసదచలధర్మా విశ్రుతశ్రౌతకర్మా
కులధరజనలోలా సుస్థిరశ్రీవిలాసా. 388

గద్య. ఇది శ్రీవేంకటనాథకరుణాలబ్ధ సరససాహిత్య నిత్యకవితావిలాస సకలసుకవికృతకైవారభాషణోల్లాస రాజకులపారావార పర్వ శర్వరీరమణ నీతిశాస్త్రమార్గపరిశ్రమణ ధైర్యపర్యాయధిక్కృత నీహార పర్వత పర్వతరాజకుమార నిస్సహాయప్రబంధనిర్మాణ భోజభూదార సుధామధుర భారతీసనాథ వేంకటనాథ ప్రణీతం బైన పంచతంత్రంబున సంధివిగ్రహం బన్నది తృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

# పంచతంత్రము.

## చతుర్థాశ్వాసము.

సత్యాలోకనజని
తాసమశరకరణసంభ్రమాధికనటక
త్రాసవిధిప్రాఘరణా
భ్యాసభుజార్గళీసనాథ హరిహరనాథా. 1

వ. దేవా లబ్ధనాశనాభిధానచతుర్థతంత్ర మాకర్ణింపు మధీతనీతిశాస్త్రమర్ముం డవ్విష్ణుశర్ముండు సుదర్శనకుమారుల కిట్లనియె. 2

క. పరకపటాలాపపరం, పరకేర్పడ భ్రమసివిడుచు ప్రాప్తార్థముగా
పురుషుఁడు విడువఁడె మును సాగరమునఁ గపిశింశుమారకము గుప్పణిశిలన్. 3

క. నావిని రాజకుమారకు, లావిప్రవతంసుఁ బలికి రదియెట్లు నయ
ప్రావీణ్యా యాకథ జెప్పుమా వినియెద మనిన వారి కతఁ డిట్లనియెన్. 4

సీ. నీరదపథికపానీయనికేతంబు మేదినీయువతికటీదుకూల
మంబరచరపరాభ్యవహారసత్రంబు సరిదలంకృతికార్యకరణశాలి
కార్పణ్యభయదవీక్షణవధూజనికర్త రాక్షసజీవ్యాహారస్థలంబు
మునిరోషనష్టనాకనిసర్గశుభదాయి నిస్తులరత్నపూర్ణితకరండ
తే. ముగ్రశతధారధారాసమగ్రభీతి, పరవశాగత బహుకుభృద్భరణనిపుణ
మతనుసత్త్వ మలక్షితౌర్వావలంబు, వఱలు దక్షిణశరధిసర్వజ్ఞశరధి. 5

సీ. ఇమ్మహాగాంభీర్య మెవ్వనికొదవు నీవాహినీభరణ మెవ్వనికిఁ గలుగు
నీగోత్రరక్షణ మెవ్వనికబ్బు నీయనిమిషావాప్తి యెవ్వరికిదొరకు
నీసత్త్వసౌభాగ్య మెవ్వనికెసఁగు నీఘనహితాచరణ మెవ్వనికి నొదగు
నీగాఢజీవన మెవ్వనికుండు నీకనకరత్నోర్ము లెవ్వనికి వశము
తే. నీలలితరాజసస్నాన మెవ్వనికి లభించు నెవ్వని కిట్టియొప్పిదము నిత్య
మతనికెకాక యని లోకు లభినుతింపఁ, గ్రాలు నిర్భరవిభుఁ డాపగావిభుండు. 6

క. అపరిమితం బుడుపతర, ణ్యుపసక్తం బఖిలజలధరోపాస్యం బా
త్మపదస్థానిమిషంబు, ద్విపులాక్షౌమం బనంతవిధ మెఱిఁగించున్. 7

క. ఆనీరధితటమున బహు, మానుం డనువాఁడు వృద్ధమర్కటుఁడు మహా
వానరులు ముఖరశత్రు, స్థానరులు భజింప సుముఖుఁడై వర్తిల్లున్. 8

ఉ. వానికిఁ గంటిలో నెరసునంటివిరోధి సమీపపర్వత
స్థానమునం జయోన్ముఖుఁడు తామ్రముఖుండు చరించు నమ్మహా
వానరసార్వభౌముఁడు ప్లవజ్జనసంగబహుప్లవంగసే
నానతగోత్రుఁడౌచు నొకనాఁడు సమిత్కరణేచ్ఛ వచ్చినన్. 9

క. కైకొనఁగలబహుమానుం, డాకంఠక్రోధవివశుఁడై ప్రతివీరా
నీకినిపై బలధిక్కృత, నాకపుల న్గపులఁ బనిచిన న్నిశ్శంకన్. 10

క. ఆహవ మొనరించె సము, త్సాహత నిరువాఁగు దొడరి దంతాదంతిన్
బాహాబాహిముఖాముఖి, నాహావాజ్మఖరఖచర మై నభ మొప్పన్. 11

శా. లావు ల్పేర్కొని నొంతు రుగ్రిఁ బిడికిళ్ళం ద్రెళ్ళ పార్శ్వాచల
గ్రావంబు ల్పెకలించి ఉవ్వురు మ్రగ్గ న్మొగ్గ వృక్షాగ్రశా
ఖావర్గంబుల నెత్తి మొత్తుదురు సుక్కం జిక్కఁ గంఠచ్ఛటల్
గావుల్వెట్టుదు రొండొరు ల్మదమణంగం బ్రుంగ నవ్వానరుల్. 12

క. చఱతురు పెడచేతులనోఁ, గఱతురు తెరనోళ్ళఁ బిసితఖండంబులు రా
విఱుతురు పెళపెళ నెమ్ములు, పఱిబోవనికలిమిబలిమిఁ బ్లవగాగ్ర్యతుల్. 13

క. విరసము నెఱసాహసమున్, బురిగొన నిట్లుభయసైన్యములు పోర న
క్తరసతరసములు గదురఁగ, శరనిధిసత్వములు వెలివిపరి రాఁదొడఁగెన్. 14

వ. అప్లవంగసంగరం బావిష్కృతారుణంబు నవ్యక్తతారకంబు నగుచు నహర్ముఖం
బును లుంఠితాగమనంబు లుంఛితశ్మశ్రురోమంబు నగుచు బాధకర్మంబును నదృ
ష్టశాస్త్రంబు ననక్షతపరికరంబు నగుచు యౌవనవివాహంబును బరిభ్రంసితచరణం
బుం బ్రణష్టవళీవిలాసంబు నగుచుఁ గుకవికవిత్వంబును ననుకరించె. 15

క. అంతఁ దనఘనబలంబులు, పంతము దిగనాడి యోడి పఱచిన సంవ
ర్తాంతకుఁడవ బహుమానుఁడు, తాం తేశరతామ్రముఖపతాకినిఁ దోలెన్. 16

తే. అప్పు డూర్ధ్వశిఖుం డైనయనిలసఖుఁడు, పోలె మత్తామ్రముఖుఁడు మూఁపులవతిస్ఫు
లింగసంఘాత ముదయింప నింగినింగి, దాఁకుచుం బావ బహుమానుఁ దారసించి. 17

చ. తతిమివధింప శత్రునకుఁ దానసమీకసమీకరంతయై
యుఱిముఱిఁ బల్కె నోరిజరతా పెఱతావునకేగు నాబలం

బెఱిఁగియుఁ జూవనేలయుపుడ్డీ వన నబ్బహుమానుఁ డోరి ద
బ్బఱలకు రాను తాఁకువెడపల్కుల కోర్చినవాఁడఁ గాఁ జుమీ. 18

క. పందకుఁ గాక పలాయన, కందళితసాహసునియందు గలుగునె యని మి
న్నందినకోపంబున వై,చెం దామ్రముఖుండు పుల్లసిల శిలనలుకన్. 19

క. మఱియొకకుటవిటపంబునఁ, జఱచి ఘనక్రోధదృష్టి సమకొనముష్టిన్
బఱియయిడ నురముఁ బొడిచిన, మఱియుం బడకప్పుడు తామ్రముఖుఁ డుగ్రుండై.

క. బలవంతు మాల్యవంతుం, జలధికడం గడఁగి నొంప సమయింపంగాఁ
దలఁచుహనుమంతుఁ డంతున, నవ్వృద్ధుం గ్రుద్ధుముష్టిహతి క్షితిఁగూల్చెన్. 21

తే. కూల్చి చంపక యసురయతోఁ గూడ నతని, నతనికాంతాళిఁ గైకొని యతులగతుల
బఱచి వారాశిరాశితటప్రాంతకాంత, ధరఁ జిరాదృతిశైత్యకృత్యము లొనర్ప 22

క. కొండొకకాలమునకుఁ గపి, మండలపతి మూర్ఛఁదేఱి మహితరహితోఁ గూ
ర్చుండి కనువిచ్చి రిపును, ద్దండపరాక్రమునిఁ గాంచి తలవంచుకొనెన్. 23

వ. అగణ్యదాక్షిణ్యాభిముఖుం డగుతామ్రముఖుం డబ్బహుమానుని నవ్వర్ధనాముఁ
గావించి పంచిన 24

చ. జరఠకపీంద్రుఁ డట్లరిగి సాగరతీరమునందు మానితాం
బురుహభవాండషండపరిభూషితుఁడై వెలుఁగొందుచున్నయీ
శ్వరుఁడన నుజ్జ్వలజ్జటిలసారఫలంబులఁ బూర్ణమై మహా
గరిమ వహించుదాని మధుగర్భమునాఁ జను మేడిఁదోఁచినన్. 25

క. పరికించి యయ్యుదుంబర, తరువెక్కి తదీయపక్వతరఫలసేవా
గరిమం బ్రాణానిలసం, భరణముఁ గావించికొనుచుఁ బ్లవఁగుం డుండెన్. 26

క. అలకపిచేతిపచేళిమ, ఫలము ప్రమాదమున జారి పాథోధిజలం
బులఁ బడియెఁ బడినయొండొక, బుళబుళశబ్దంబు సంప్రభూతం బయ్యెన్. 27

క. ఆనినదము కర్ణంబుల, కానందవిధావిధాయి యగుటయు గణనా
హీనము లగుతత్ఫలముల, వానరుఁ డక్కడలి నీటవైవఁగఁ దొడఁగెన్. 28

క. వనచరకరముక్తములై, వనధింబడు మేడిపండ్ల వారణలోలోఁ
దినుచుఁ జలింపక క్రకచుం, డను దారుణశింశుమార మచ్చోనుండెన్. 29

క. అధికతమోదుంబరఫల, మధురరుచిం జొక్కి శింశుమారము మాసా
వధిగా నచ్చోటన కర, మధివసియించె న్నిజప్రియావిముఖుండై. 30

చ. క్రకచునిభార్య కూర్మిచెలిఁ గన్గొని యిట్లనుఁ బ్రాణవల్లభుం
డకట యొకేనిఁబోయి తడవయ్యె విలంబనహేతు వెద్దియో

తికమకమైతి నా వెగలుఁ దీర్పుము నీ విపు డేఁగి మా దినా
యకసుఖవార్తఁ జెప్పుమని యంచిన దూతిక పోయి ముందరన్. 31

క. ఒకచో వికచోదుంబర, నికటంబున ముసలిక్రోఁతి నెయ్యంబునఁ బా
యక యున్న శింశుమారుం, గ్రకచాంకునిదూతి ప్రీతిఁ గని చని యొనరన్. 32

చ. చెలువతియున్నకూర్మి చెలిఁ జేరి వినం గన గ్రొత్తలైనవో
చెలి తెలియంగ నంతయును జెప్పెద రోయుక విన్మి నేను నీ
యలఘునియోగమూఁది చని యక్కడ నొక్కెడఁ జూచి వచ్చితిం
దొలఁగక వానరప్రమదతోఁ గవఁబాయనివాని నీపతిన్. 33

క. నేనెఱుక చేయుకొఱ కిట, వెనువెనుకను వచ్చివచ్చి వెలఁదికొలందిన్
జననీపని చెప్పితిఁ బర, వనితారతి లుబ్ధుఁ డేలవచ్చు న్నగుచున్. 34

క. నావిని కాఁపుర మెట్టువలె, నీవిషమునఁ బ్రాణనాథుఁ డితరస్త్రీమై
త్రీవశుఁడయి యుండఁగ నని, పావకశిఖిపోలె మండిపడి యది మదిలోన్. 35

చ. కనుఁగవ నశ్రులోడికలు గట్టఁగఁ దైలనిషిక్తయై నిజా
నన మరవాంచియుండె సదనంబున నత్తఱి శింశుమారుఁ డ
వ్వనచరనాథువీడ్కొని యవారిగఁ దివ్యని మేడిపండ్లు గొం
చు నిలువ కేఁగుదెంచి యిలుసొచ్చి కులాంగనఁ జూచెఁ జూడ్కికిన్. 36

ఉ. ఒండొకభంగిఁ దోఁచు బరుసుల్లము ఝల్లనిపల్కె శింశుమా
రుండు ప్రియా నయాతిగవిరోధిసె హృత్ప్రియదా ప్రమా నే
యుండకువచ్చినం బలుక నక్కట నీవన శింశుమారిని
ఖండవిధానమైనయలుకం దలయెత్తదు చూడ దెంతయున్. 37

క. అదియట్టిద యప్పనికిం, బోదరగుటం దూతి ప్రీతిఁ బురికొనఁ బలికెన్
జగురాలికిఁ దెవులెత్తిన, యదినీతో నెట్లుమాటలాడం గూడున్. 38

క. మందులు దెమ్మనిచెప్పిన, మందులు నినుఁ గొలుచుమిటులు మాతోఁ దమలో
నిందెవ్వరుఁ బలుకరు నీ, చందముగా నెట్లు సాధ్వీజా రుజ మానున్. 39

క. నావిని క్రకచుం డను మ, జ్జీవము లౌషధము లయినఁ జేడియ కీలో
సేవింపఁజేసి నిర్గదఁ, గావించెదఁ జెపుము దాఁచఁగా నేమిటికిన్. 40

క. అని కూర్మి తేటపడఁ బ, ల్కినపల్కులు శింశుమారి గొంటనివేడ్కన్
విని నీతితంత్రమంత్రిం, గనుఁగీఁటిన నతఁడు చేరి క్రకచుని కనియెన్. 41

క. ఎలనాఁగ రోగమణఁపం, గలమందులు చెప్పఁడనిన ఘనశాస్త్రకళా
బలవేద్యులు వైద్యులు నే, నారీతిం గ్రోఁతిగుండె వలెనని రధిపా. 42

క. అది మదిఁ దలఁపఁగకున్నన్, బ్రతుకదు చెడచెడఁగరాదు పరిణామమునన్
మఱిఁ గదిరిన వెఱఁ గ్రకచుం, డిది యువ్విధికొఱకు భార్య నెట్లీడేర్తున్. 43

క. బహుమానుం డొకఁడున్నాఁడు, అహితుఁడు గాఁ డతఁడు హితుఁడు హాహా ముక్త
స్పృహాగ్రహారక్షార్థము దు,స్సహమహనాప్రజ్ఞ నెట్లు చంపుదు నతనిన్. 44

చ. నిరతము విశ్వసించు నతినిర్మలచిత్తున కగ్గు సేయుటా
పురుషుఁడు దక్క భూరికులభూమిధరంబులు గావు సప్తసా
గరములు గా వరణ్యములు గావు భరంబని ధాత్రి మైత్రి నా
సిరివరుతోడ విన్నపము సేయదె వేఁడిన నట్లు గావునన్. 45

చ. కడపట భార్య నిల్కడనుఁ గాఁ జెలికానికి నెగ్గు సేఁత యొ
క్కఁడు దురితంబు కాఁపురము గూలఁగఁ జూచుటయున్ మహాఘమి
ప్పుడఁతుక పట్టున న్సఖుని పట్టున నింతి విశేష మింతకై
చెడుపని యేనియుం దగిలి చేయక మానఁగరాదు గొబ్బునన్. 46

వ. అని నిశ్చయించి బహుమానసభోద్యోగంబునం దిరిగి వచ్చె నప్పు డుప్పొంగుసమ్మ
దంబునం బ్లవంగపుంగవుండు. 47

క. క్రకచాలికచాదృతియె, ద్దసఁ గ్రమ్మఱ నరుగుదెంచె దవు కులకాంతా
నికటము కటా యసహ్యాం, బొకొ సత్యముఁ జెప్పుమనిన నువచరుఁ డనియెన్.

ఉ. ఏను భవన్నియోగమున నేగి ఫలంబులు కానుకిచ్చినన్
మానిని పల్కె నీ వరిగి మాసకమయ్యెఁ బ్రవాస మెవ్విధిం
బోనిది నీకు నెద్దిగతమో గతమోహభవద్వియంబు నా
తో నెఱిఁగింపుమన్న భయదూరసవాద్యుతి నంటి దానికిన్. 49

చ. తనయుననూనధామతిమధామతటంబున లెక్కకెక్కడో
ఘనఫలరాజిఁ గ్రాలు మనుగర్భము నాఁ జను మేడి దానిపై
మను వనువాసరంబు బహుమానుఁడు తత్కపిచక్రవర్తి ప్రో
పున నితరం బెఱుంగక యపూర్వసుఖస్థితి నుంటి దాలిమిన్. 50

చ. మఱవఁగ రాని సఖ్య మది మాటలు వేయును నేల పుట్టి బు
ద్ధెఱిఁగితిఁ గాని యట్టిజగదేకపవిత్రునిఁ జూడ నెందు నో
తెఱవరో యంచుఁ బొరకుగతిం గృతి నీయుపకారకృత్యముల్
గుఱిగడవం బ్రియంబు తమిఁ గొండలు కోటులు చేసి చెప్పితిన్. 51

ఉ. చెప్పిన నంతరంగమున సింగఁడు బూఁడఁడునై ప్రియంబు సొం
పుప్పతిలంగఁ బల్కె నది యోయికృతఘ్నుఁడ వీవు గావె యు

ష్పప్ప సుహృత్తముం డయిన యాయన నింటికిఁ దెచ్చి వేల్పునే
చొప్పునఁ గొల్తు రట్లు పరిశుద్ధసపర్యల దేల్చుటొప్పదే. 52

ఉ. ఎక్కటి మేడపై నిలువ నేటికి నేఁటికిఁ గాను నిల్చుఁగా
కెక్కుడఁ బెద్దకాల మఖిలేప్సితభక్ష్యము లావహింతు నా
మ్రొక్కని మ్రొక్కి పెక్కుప్రియము ల్నయము ల్వచరించి తోడితె
మ్మక్కపినాథునంచుఁ బ్రియయ ంచిన నిన్గొనిపోవవచ్చితిన్. 53

క. కారణవిముఖుండై యుప, కారముఁ గావింపలేరుగద లోకము కై
వారం బగు నిట్లన ని,ష్కారణవత్సలుఁడ వీవు కారణజన్మా. 54

క. కపివర నీచేనందిన, యుపకారపుటప్పుఁ దీర్పనోప న్గరుణా
నిపుణమతి నాగృహంబున, కిపుడీ వేతెమ్ము పూజ లిచ్చెద భక్తిన్. 55

క. ఇలువాడి మ్రుగ్గులిడి కూ,రలు గూర్లమరించి యేలరాఁడాయెనో కో
వెలలెం బ్రొద్దని యట నీ,చెలియలు నేఁ డెదురుఁ జూచు సేవించుటకున్. 56

క. రారానిచోటుగాదు కృ,పారాజితపిచ్చుకుంటుపైఁ బర్వినభా
గీరథివిధమున నస్మద, గారమునకు రమ్ము కపిశిఖామణి యనుడున్. 57

వ, ప్లవంగపుంగవుండు. 58

ఉ. రాసిరణం బొనర్చి నిజరాజ్యముఁ గైకొని నన్ను గాసి గాఁ
జేసినవైరిఁ గన్గొనుచుఁ జెంగటనుండుట కష్ట మిందునా
కోసఖ యట్లుగానఁ బదమూఁద సహింపఁగు సంతసంబడిం
గాసిలియుండువారలకుఁ గాననిక్రంతలు మేలుగా వొకో. 59

క. అనఘా నీనిలయమునకుఁ, జనుదెంచెద మీకుఁగాక జలసంచారం
బనువగు నే మముఁ బోలిన, వనచరులకుఁ జెప్ప మనిన వాఁ డిట్లనియెన్. 60

క. నీవాక్యము లుచితంబులు, గావె పయోవిహృతియేడఁ గపులేడ యొకే
నావీపున నిన్నిడికొని, యావాసముఁ జేర్చువాఁడ నరుదె మ్మనినన్. 61

వ. తద్భాషితంబులు మాయాదూషితంబు లగు టెఱుంగక. 62

చ. మెఱసి యుదుంబరద్రుమముమీఁద వసించినకీశరాజు చే
టెఱుఁగనికూనతెప్పవలె నేత్తెఱఁ దోఁచినశింశుమారుపై
నుఱికెఁ దదీయపృష్ఠమున నుండినవాఁడు విశృంఖలత్వరం
బఱచి హుటాహుటి న్మనికిపట్టున కేఁగెడుత్రోవ నేర్పడన్. 63

క. నీరము తెరువునఁ గొండొక, దూరము చని యాలసి నిలిచి దుర్దాంతవిషా
దారూఢహృదయమై చిం,తారతి నది యారెలుంగునం దనలోనన్. 64

ఉ. నన్నిటఁ దంతిరంగమున నమ్మి యయో చనుదెంచుచున్నవాఁ
డెన్నిభవంబులం దొలఁగు నిష్ఠులఁ జంపినఘోరపాప మిం
దున్ననువంటిదుష్టచరితుం బరికింపదు లోక మాక్రియల్
గన్నవిగావు విన్నయవిగా వొనరింపఁగఁ బాసె సఖ్యముల్. 65

క. వసవడి పురుషుని భారం, బిడి భూరివృషంబు ఱాత హేమము నొఱయం
బడు శుద్ధిశక్తిరుచులకుఁ, బడఁతులహృదయంబు లారయఁ బడ వేగతులన్. 66

మ. పరమద్రోహపురస్సరంబులు నయోపాయక్రియాదూరము
ల్దురితచ్ఛన్నము లన్యతాపకరణోద్యోగంబు లప్రత్యయా
కరము ల్సత్యపరాఙ్ముఖంబులు సమగ్రక్షాంతివల్లీశిత
క్షురము ల్దంభమయంబు లెల్లెఱఁగవచ్చుం గామినీచిత్తముల్. 67

క. ఈమనసులు గలిగినమహా, కామాయామయుతరోక్తులకు లోనై య
య్యో మదినమ్మినకీశ, గ్రామణిఁ దెగటార్పఁబలసెఁగా నా కనుచున్. 68

క. అంక్రకచుఁ డల్లనల్లనఁ, బలుకఁగ విని వానరాధిపతి భూరిభయా
కులమానసుఁడై యపుడో, దళితాఘా యేమిపలికెదవు నీ వనుడున్. 69

క. ధృతిఁ గ్రకచుఁ డపుడదత్త, ప్రతివచనుం డగుచు నుఱక పలుచుచునుండన్
వితతప్రజ్ఞం గపి యూ, ద్ధతు వానిం గ్రమ్మఱించెదం గా కనుచున్. 70

క. భీతిప్రవాహ మతిధృతి, సేతువుచే నాఁగి పలికె చెలికాఁడా నీ
శాతోదరి నాసోదరి, కౌతుకమున నున్నె భవదగారం బమరన్. 71

క. ఇది వినవలతుం జెపుమా, మది వొదలఁగ ననిన శింశుమారుఁడు పలికెన్
గదబాధిత యయియున్నది, గద నీయనుజాత యెట్లుగా ధరియింతున్. 72

సీ. భార్యలేకయొనర్చుపండువు దండువు కులకాంతపెట్టనికూడు గెడు
పత్నితోఁ బలుకనిపలుకులు చిలుకలు గృహిణిలేనికబంధకేళి జాలి
జాయవాటింపనిసరసము ల్విరసము ల్ప్రాణేశ్వరికిఁగానిపాటు చేటు
దయితక్కఁ జేయనిప్రియములు భయములు వల్లభవెలియైనయిల్లు పొల్లు
తే. ముద్దుకులకాంతసుద్దు లేప్రొద్దు వినని, చెవులు గవులు వృథా వేయుఁ జెప్పనేల
యకట సతిలేనిబ్రతుకేల యర్థమేల, వాహనములేల కరులేల వసుధయేల. 73

క. నా విని బహుమానుఁడు బా, ష్పావృతముఖుఁడగుచు వాని కనుఁ గ్రకచా నీ
దేవి రుజ మాన్పుటకు లే, రె వెజ్జులు మందుఁ జెప్పరే వా రనినన్. 74

క. చెప్పిరి వానరహృదయం, బప్పనికి నవశ్య మనుచు నగదంకారు
లప్ప కదిహేతువుగ ని, న్నిప్పుడు గొనిచనుట యని యహితుఁ డతఁ డాడెన్.

క. నగచరుఁ డదివిని వెఱఁబం, డ్లిగిలిచి పడపడ వడంకి యొదపడి చెడితిన్
దెగితిఁ గడచన్నితిఁ బొలిసితిఁ, బొగరున నిట్లయితి మోసపోయితి ననియెన్. 76

వ. అని. 77

క. దారుణగహనంబున నా, హారోఁతలఁ బెట్టుమదిమి నసురుసుర్రై కా
మారంభం బుడుగని యల, ఘోరాఘఫలంబు గట్టి కుడిపెదునన్నున్. 78

క. భీమాటవిలో నున్నం, గామాంధుని బొదవుబాతకంబులు రాజ
గ్రామముననున్న దూరిత, కాముని గల్మషము లంటఁగా శంకించున్. 79

క. చిరకాల మరిగె సురిగెం, దరుణిమ యిక నేడ గామతంత్రం బనుచున్
బరలోకచింత సేయుని, పురుషార్థముఁ జేటుపాటు పొందదె యనుచున్. 80

చ. క్రకమని చూచి వానరశిఖామణి యిట్లను నీవిచార మే
టికిఁ జెడిపోయె నేమిటికి డెందె భవన్మతిప్రాణమైనభా
ర్యకు రుజమాన్పఁ గిశహృదయంబునకుం జనుదెంచువాఁడ వీ
వకట యెఱుంగఁ జెప్పవలదా మునుగల్గగ నాకు నింతయున్. 81

ఉ. చెప్పిన నాయుదుంబరపుఁ జెట్టున నెప్పుడు దాచియుందు నో
కప్పుడు మామకీనహృదయంబు సమర్పణఁ జేసిపుత్తు నీ
చొప్పున నింతదాచెదరె చుట్టముఁగానె విరోధినే వృథా
త్రిప్పటజేసి తింకొరులు దెత్తురె నిన్నడవం బ్రతిక్రియల్. 82

క. హృదయము దరువున నున్నది, గద నాకాయమున లేదుగద మునుగా నా
కిదిచెప్పక పనిచెడిచితి, గద రిపుఁడవుగాని చెలివిగా వంగనకున్. 83

సీ. ధర్మార్థకామచింతకులకు భూదేవధారుణీపరవధూదర్శనములఁ
జనరాదు రిక్తహస్తములను గామ్యార్థి వగునీకు మున్నుపాయనముపలయు
హృదయంబు మేడినున్నది పోకమరలు సిద్ధ్యండితారినికాను గుండెకాయ
చేయార నీకు నిచ్చెదఁ బుచ్చుకొని చేరి జాయ నిరామయఁ జేయవయ్య
తే. యనుచుబహుమానుఁడాడుమాయామయోక్తు, లాగమోక్తులుగానప్పుడాత్మఁదలఁచి
తిరిగి యాశింశుమారుఁడే తేరఁ దీర, వృక్షమెగఁబ్రాఁకి కపి వాని వెక్కిరించె. 84

క. కసినుస నాఁకట ఫలము, ల్మెసవుచు జలివిడిచి మేడిమీఁద న్మోదం
బెసఁగ నటియించువానరు, మసలక వీక్షించుశింశుమారుం డనియెన్. 85

చ. కుజమున నున్నవానరునిగుండియ దండియశంబు నీకుఁగా
భుజబలసార యిమ్ము కొనిపోయెద నాయెదదీఱ మత్ప్రియా
రుజ కనఁ బల్కెఁ గాననచరుండు దురాత్మ విచారమూఢ యే

కుజముననుండు వానరునిగుండియ యొక్కఁడిజోలిపొమ్మిసీ. 86

చ. స్తుతులఁ గరంచి నాగృహము జూతువు రమ్మని తోడుకొంచుఁబో
యి తగవుమాలి నన్ను బొలియింపఁగ యత్నముఁజేసితేను నీ
గతి భవదీప్సితం బొసఁగుకై పడి నిన్మరలించి మేనిఁబ్రో
చితి జిరకాలజీవి మతిశీలుఁడ మోసము నాకుగల్గునే. 87

క. కదలుమిఁక ననినఁ గ్రకచం, డెదపడి యేపలన మోసమెఱుఁగనినను ని
మ్మదిఁ గ్రోఁతి మోసపుచ్చెం, గదరా యని విన్ననగుమొగముతో నున్నన్. 88

వ బహుమానుండు. 89

క. దొరకిన నను విడుచుట క,బ్బురపడకుము నీకుఁ దోడుపోయినధరణీ
సురుఁ డొకఁడు లబ్ధమనుజే, శ్వరకన్యక విడిచి రిత్తివాఁడై చనఁడే 90

క. నానీరచారుఁ డాబహు, మానున కిట్లనియెఁ దెలుపుమా వినవలతున్
దానేలవిడిచె నయవి, ద్యానిధి బ్రాహ్మణుఁడు భూతలాధిపకన్యన్. 91

సీ. అనిన శాఖామృగాధ్యక్షుఁ డాక్రకముని కనుఁగొని పలికె నిక్కథ వినంగ
దగుదువు నేనును దగుదు నీకెఱిఁగింప మును విశాలాపురంబున సుకీర్తి
యనురాజు రాజిలు నమ్మహీజానికి భువనమోహిని యనుపుత్త్రి గలదు
దానికి మందాభిధానుఁ డొండొకధరాత్రిదశుండు సుముఖుఁడై చదువుఁజెప్ప
ఆ. నట్లు కొంతకాల మరిగిన నపరఁజి, పసిఁడి కలరుతావివలె మనోజ్ఞ
ఫలము చెఱుకునందుఁబలె నేమిచెప్ప లేఁ, బ్రాయమయ్యె నానృపాలసుతకు. 92

మ. సితరోచిర్ముఖికప్పుగొప్పు సుమనస్స్నేహం బధిష్ఠించి కృ
ష్ణతనొందంగని యోర్వలేక వదనాబ్జాతంబు గాంచె న్విధూ
న్నతిజన్మంగవ యచ్యుతాప్తి బొదలెన్ మధ్యంబు దాల్చెన్ హరి
స్థితిరోమావళివల్లివక్రిత భజించె న్నిష్ప్రియాసక్రియన్. 93

శా. బింబోష్ఠంబు మధూద్ధతంబు పరహృద్భేదు ల్గటాక్షంబు లా
స్యం బుద్యద్ద్విజరాజమండలపరిస్పర్ధాళు వాక్కర్ణదీ
ర్ఘుంబౌ గ్రాల్గనుదోయియుం గువలయప్రత్యర్థితారాపథా
లంబు లాల్వల్గురులేలొకో పొగడుబాలం జాలముల్లోకముల్. 94

శా. లీల వ్రాగరసోదయస్ఫురణ దాల్చెన్ మైజగద్గీతస
ర్వాలంకారపదప్రవీణయది యాహా యట్లుగాకుండినన్
వాలగ్రంథివరాళిమోవి నునుదీవంగూడి తోరంబులౌ
పాలిండ్లన్ ఫలమంజరీగరిమ జెప్పం జూపనౌ బెవ్విధిన్. 95

మ. అతిభాస్వత్తరకాంచనంబు చెలినాసాంగంబు కల్యాణ మా
శతపత్రేక్షణ మేను మేరుకుధరాంచత్కూటములు ల్దానియు
న్నతవక్షోజము లేమిచెప్ప నదియుం తాయంతబంగార మ
ప్రతిమం బౌనరనాథుపట్టి గణుతింప న్శక్యమే యేరికిన్. 96

క తనకుఁ బయోధరవృత్తి వ్రేఁ, గని మిన్నేలనాఁగ మధ్యమయ్యె నటైనన్
జనను పయోధరభారము, జనాంతరకర్మమేల చను నెంచున్నన్. 97

క. పరమాణువు పరమమహ, త్పరిపూర్తి న్గోచరించుపరమమహత్తున్
బరమాణువై కనంబడు, దరుణీమధ్యస్తనేక్షితత్త్వజ్ఞులకున్. 98

క కన్నులకు మొగముచాలదు, చన్నులకు నురస్థలంబు చాలదు వెన్నుం
బెన్నెరివేణికిఁ జాలదు, కన్నియచెలువంబుఁ బొగడఁగా నాతరమే 99

వ. ఈదృగ్విలాసధన్య యగునారాజకన్య చకోరికాపరివృత యగుచంద్రికయుంబోలె
సఖీజనసహాయయయి వన్నెమెఱసి యొక్కనాఁడాస్థానంబునకు వచ్చి నల్లెగుదెం
చిన కుమారీరత్నంబు సౌహార్ద్రభాసమానోల్లాసంబునం దిగిచి యంగపీఠంబున నునిచి
సుకీర్తిబంధుజనాదులతోడఁ దత్సౌందర్యసౌశీల్యాదిగుణంబు లుగ్గడించుచు గొలు
విచ్చియుండె నాసమయంబున. 100

సీ. చిఱుతకెంజడలఁ గీల్చినజాతిపటికంబు గళమున రుద్రాక్షకంఠమాల
యుపరంజిపసిఁడి కామాక్షులుడామూఁపుపై గొండ్లిఁగావించుయోగపట్టె
చిన్నారికంబెగ్రుచ్చివశింగినాదంబు గుత్తంపుజికుక్కలకుట్లబుట్టి
కరమునఁ జెనుచో అగరిముల్లు మాయూరబర్హనిర్మితమైనబవరిసురటి
తే. భసితభస్త్రిక పులితోలుపచ్చడంబు, నాగబెత్తము దంతపుయోగవాగ
లమరఁ జెట్టువడిగినట్టు లవనినాథుఁ, జేరనేతెంచె నొకమహాసిద్ధుఁ డపుడు. 101

క. ఏతెంచినఁ గాంచి ధరి, త్రీతలనాథుఁడు హృదంకురితనిర్ణిద్ర
ప్రీతి నెదురేఁగి నతుఁడై, యాతిథ్య మొనర్చి యమ్మహాయోగీంద్రున్. 102

క. వినయమునఁ దెచ్చి కనకా, సనమున నిడి రాజుపలికె సదయా మీచూ
డనిభూములు వానం దడి, యనివారలు గలరె మిమ్ము నడిగెద నొకటిన్. 103

క. రాజకుమారులలో రతి, రాజసుమారుల సురూపసవిక్రముల
శ్రీజయముల మించినవాఁ, డోజగదారాధ్య కలఁడె యొకఁ డట్లున్నన్. 104

క ఆసర్వజ్ఞున కపర, వ్యాసా కులగోత్రజాత యగునీసుత ను
ల్లాసగుణవసతి నిచ్చెద, నాసక్తిం దెలుపుమనిన నతఁ డిట్లనియెన్. 105

క. ఇలఁగలరాజకుమారుల, దెలివిపడం దిరిగిచూచితిని బాటలపూ

ర్మిలయుండు జయసేనుఁడనం, గలఁడాతఁడు నీకుమారికకుఁ దగుఁ గూర్పన్. 106

క. ఆత్రైలోక్యశ్లోకిత, గాత్రుఁ బ్రశంసింపనేల కనుఁగొను మనుచుం
జిత్రరస మానిహిల్లం, జిత్రించి మునీంద్రుఁ డధిపుచేతికి నిచ్చెన్. 107

వ. ఇచ్చినం బుచ్చుకొని యచ్చిత్రరూపంబుఁ జూచి యచ్చెరువంది యమ్మనోహరాకారంబు తనయనుంగుతనయునకుఁ గానంజేసి యజ్జయసేనుండు దనకు మేనల్లుండు గావున సదృశసంబంధంబున కరుగుము. 108

క. జనపతి మునిపతిఁ బూజా, వినుతి నతిక్రియలఁ బల్లవింపఁజేసి ప్రియం
బున వీడుకొలిపి తానుం, జనియెఁ గొలువువిరిసి రత్నసదనంబునకున్. 109

ఆ. అన్నరాజపుత్రి యాచిత్రరూపంబు, గన్నదనియుఁ జూచి కంఠదఘ్న
మోహసింధుపతితయై హార మాహార, మాళిజనవిహార మఱచిపుచ్చి. 110

వ. చింతించుచుండ నెచ్చెలు లారామంబునకుం గొని చని. 111

సీ. కలకంఠి కలికయోత్కలికావిలాసంబుఁ దార్పదే యారామధామకేళి
లీల నేతత్ప్రియాళికి నమందానందలహరిఁ బుట్టింపవే లతలు విరులు
వికసిల్లునీపద్మినికి సదామోదంబు జరుపదే కాసారసారవిహృతి
శిఖిబర్హతులితకైశికకు సంతాపంబుఁ బాపదే ఘనకదంబకకులంబు

తే. సడలెనుగదమ్మ లావుకాంచనకలాప, పరిచయము మానెనమ్మ దెప్పరపువంత
వాడెనుగదమ్మ మాతోడ నాడదమ్మ, కొమ్మ మ్రాన్పాటు కెట్లోర్చుకొనఁగవచ్చు.

వ. అని నెచ్చెలు లచ్చెలి నాలోకించి సుముఖిగాఁ జేయువారయి శిలీముఖప్రముఖంబులం జూపి యిట్లనిరి 113

చ. కరములఁ బొంగుచుం గదపుఁ గాలము బల్లవసంగమంబున
న్దిరుగుఁ గుజాతమైత్రి నెపత్రెవ్వక శీఘ్రుఁ గ్రోలు మాలలం
దగసివనుండు మ్రోఁత తఱు చాత్మభరైకసుపర్వఘస్మముం
గుఱు చయొనర్చు నెట్లుపొసఁగుం జెలి దీని ప్రియాళిగాఁ గొనన్. 114

చ. కలగుణముల్ద్యజించి పలుగాకులవంటి వనంగవచ్చునే
ఘలదళపారణల్వినయపాటవముల్మతిప్రాప్తకాలభా
షల సుమహత్తరయ్యొలిమి సల్పఁగనున్కి దగుం ద్విగంగదీ
ప్తులు వెలిగాఁ దపస్వినులు కోకలకంఠులు మాకుఁజూడఁగన్. 115

మ. మురిపంబుల్ గలమిండతేటికడియంబుల్ మారుతోత్క్షభ్రమిం
దిరుగం భాసురకేసరేక్షుకణికాధిష్ఠానకించిద్విక
స్వరపుంగ్రొవ్విరిజోళ్ళఁ జైత్రహారినించం జంచరీకాళికా

కురిసెం బుష్పరసైక్షవంబు చిగురాకుం గొప్పెర ల్నిండఁగన్. 116

చ. సరసులలో సువర్ణపరిషక్తములై కనుపట్టుకోశముల్
గర మనురక్తిఁజూచి మృదులస్వర ముట్టిపడ న్సుభాషితో
త్కరము విధాత కెక్కుడగుగౌరవ మొప్పఁ బఠించుఁ జూచితే
హరిణవిలోచనా పరమహంసవతంసము లూర్జితస్థితిన్. 117

మ. గమకంపుంబసనేలకై దిగినశాఖల్ హస్తపాద్విభ్రమ
భ్రమఁ బుట్టింప లతాంతబిందుకులముల్ పైదేర నుద్యద్ద్రవ
త్సుమధూళీమదధారలూర నళిపంక్తుల్ గప్ప నుద్యానపా
నమహీం గానఁగనయ్యెఁ జూచితివె పున్నాగంబు బింబాధరా. 118

ఉ. ఉన్నతి నంబరం బొరసి యొచ్చె మొకింతయులేక కొమ్మలం
గన్నులపండువై బవరిగా నరుదెంచిన ప్రాసవాసవో
త్పన్నఝరం బగ స్తదెలుప న్గుళపాలిక యొప్పె జూడు మా
సన్నబలైకపత్రకవిశాలము సాల మఖండమూలమున్. 119

చ. చదువులమేలులేదొ శుకసంతతిగానొ వినీతరీతి చా
లనొ భజియించునీచతురుల న్మతిమాటికవచ్చునిచ్చలుం
బదిపదిగా నొనర్చుఫలభంగము నెమ్మొగ మెట్టిజేయున
ల్లదె పరికింపుచిల్కహృదయంబున గోపముజిక్కె దొయ్యలీ. 120

చ. సరళగభీరశబ్దఘనసారసమృద్ధిఁ బ్రసిద్ధిగన్నయా
సరసులఁగూడి చారుగతి సద్వ్రతతు ల్భజియింప బాదవి
స్ఫురణఘటింపుచుం దొడుసుపుట్టక యుజ్జ్వలధారచే నుదా
హరణము జేయుచున్నకవి నారసిచూడు మరాళగామినీ. 121

క. నిరుపమఘనరసపుష్టి, స్ఫురణం బాదములు మెఱయ భూభువనమునన్
సరిజెప్పఁగలదె యిందిం, దిరకుంతల యీవసంతతిలకంబునకున్. 122

క. విరిగొఱవులఁ బథికపరం, పర జూడుంజూడు మిట్టిపరుసపలాశో
త్కరమునకు నెట్లుగలిగెం, ధరణీసురదండవిధిసుధామధుగోష్ఠి. 123

చ. గళితఫలాశఁ బూజకలికాచ్ఛలనంబున విస్ఫులింగము
ల్చిలుకుచు మత్తకోకిలవిశృంఖలఘోషమిషంబుచేత గ
ర్జిలుచు ధరాపరాగముల రేఁచి వడి న్నడిగొంచువచ్చెడిం
బెలుచమనోజమాంత్రికుఁడు పెంచినగాలిపిశాచిఁ జూచితే. 124

ఉ. వేవెడఁగేల డీలుపడ వ్రేసినఁ బైఁబడ వక్త్రశీధుని
ష్ఠీవన మాచరించినపడిం జరణంబున దన్నిన న్రహీశ
బోవనిపార్థివస్ఫురణఁ బొందియు నత్కళికా ప్తినొందు హే
లావతి యిట్టినీచతరులం బరికించితె యిమ్మహావనిన్. 125

సీ. నెలఁత నీపలుకులో నిదికర్ణకారంబు వనిత నీనగ వెఱింగినది పొన్న
మెలఁత నీకనుసన్న నలరుబొట్టుగముద్దుపాలఁతి నీచేసంజ్ఞఁ బొదలుమావి
ముగుద నీసమ్ముఖంబున గ్రాలుసంపెంగ రామ నీహృదయాపారగము క్రోవి
పడఁతి నీపదమాసపనునశోకము వినఁ బ్రియపడునీపాటఁ బ్రేంకణంబు
తే. అతివయుష్మత్పదగ్రహాశ్రితము పొగడ, యువిదవావిలియలరునీయుసురుకలిమి
బంధుమధ్యము మిన్న నాభ్యంతరంబు, విగ్రుమాధరకన్నిచ్చ విశ్రమింపు. 126

సీ. ఘనసుమనఃసుఃంబున నెట్లుపుట్టెనో యొరులచేరువ నున్నవాడుకుఁ జూపు
బహుపత్త్రభరణసౌభాగ్య మెట్లందెనో యుగ్రగంధస్ఫూర్తి నుల్లసిల్లు
నిరవధికామోదధరిత మెట్లయ్యెనో మహిఁబుణ్యతరులకొమ్ములఁ బెనంగు
సతతాభివృద్ధి రాజసమెట్లుగల్గెనో కఠినకంటకమైత్త్రిఁ గడపుఁ బ్రొద్దు
తే. ననుచు బెనుచూరపోలె జెల్లాటమెసఁగ, వసముకుసుమాపచయకౌతుకాప్తి నడరి
సంపెఁగలమల్లికాగుళుచ్ఛములఁ బొన్న, విరులమతిగేదఁగుల రెమ్మి వెలఁదులంత.

ఉ. కోయిలనోరుసోఁకని చిగుళ్లు నికారపుఁజిల్క భిన్నము
ల్సేయనిపండ్లు కాలవడి లేవడితెమ్మెరకూనరాశిగా
వ్రేయనికమ్మపుప్పొడి ప్రవృద్ధపిపాసమదాళికుత్తుకం
బోయనితేనియ ల్గనిచి పూవిలుకానిఁ ఘజింప నంగనల్. 128

సీ. కలకంఠముల నోరికడిదివ్వవలె నంచుఁ జికిలిగుబ్బెతలు గోసిరి చిగుళ్లు
చిలుకముఁకలకూడు చెలుతమా యని పువ్వుబోండ్లు మాఁగినపండ్లు పుచ్చుకొనిరి
యుదుటుదుమ్మెదలఁ బస్తునతమా యని ముద్దుగొమరాండ్రు విరితేనె కొల్లఁగొనిరి
మదటగాలి వయాలి మాన్తమా యని కుమారికలు పుప్పొడు లావరించుకొనిరి
తే. అతనువిలు మూలవేయింతమని సుధార, సాధనలు తావిపూవుల నపహరించి
రంత నాక్రీడ భూక్రీడ నేసి యేసి, తాంబుజాక్షులు కంకేళిహాళి వ్రాలి. 129

సీ. మోమాటనేరుతమ్ములతావు లగలింప గనుసన్న మనుఝషకముల నలపఁ
జూడనాగనమైత్త్రిఁ జొక్కినయళిరేఁప నగు తికగుసంకు నలటఁబెట్టఁ
గైవసం బగుబిసాగ్రముల నున్మూలింప మాటకు లోనైనమనువు లొలుకఁ
జనుమానమంటినజక్కవలను రేఁప దండఁబాయనికుముదములఁ జెండఁ
తే. జరణముల నాశ్రయించినసన్నరాళ, నీడజములపయోభూతి నేలఁగలప

నెత్తుకొని రెంతనిర్దయు లీలతోఁగు, లనఁగఁ గంకేళికాంతుఁ గాలఁగ కరిగి. 130

ఉ. చేరువఁగాంచి రక్కలికిచేడియ లవ్వనపాలిఁ గేళికా
సారము దుంగభృంగకులఝుంకృతిభాంకృతిసంగమంగళా
గారము గుంజపుంజబిసఖండనచండమరాళలోలవాః
పూరము దారకోరకితపుండ్రగపూగకుటీరతీరమున్. 131

చ. కని బిసదండపత్రపుటికాపరిపూర్ణసువర్ణకర్ణికా
కనకఘటీస్ఫుటీభవదఖండసహస్రదళాతపత్రముల్
దినపకరోష్మఁ దీర్ప నిరుదిక్కులఁ బత్త్రము లాశ్రయింప ని
ల్చినయలరాజహంసపటలిం గని సమ్మదవార్ధిఁ దేలుచున్. 132

చ. పడిఁ బుటమెత్తి వ్రాలునిడువాలుపచాలుపులింతనంతపై
నిడువెలిగుంచెలం దెలుప నీదరగాడ్పులఁ గ్రిందుమీఁదుగాఁ
బడుజలజచ్ఛదంబులు శుభవ్యజనక్రియఁజేయ రాజుకై
పడి గనుపట్టునంబురుహవాసముఁ జూచి ముదాప్తి నొందుచున్. 133

ఉ. చుట్టినమాఖ్యమాలికలచొక్కపుఁదావులు సోఁడుముట్టఁ జూ
పట్టునిరల్పకంకణవిభ ల్లయనోత్సవ మాచరింపఁగా
మట్టపుటూర్ముల స్తైఅయ మంజుసరోరుహరాగపూగముల్
పట్టపురాణిరీతిఁ గనుపట్టుసరోరముఁ జూచి యుబ్బుచున్. 134

ఉ. పొంగ నఖండతుండరవము ల్జనముల్ ఘనపక్షనిర్భరా
సంగమునం బహుప్రసవజాకలరేణువు లంటిరాఁ బరి
ష్వంగితసాధుశీధుమదసంపద నింపొదవించుతుంగసా
రంగములం గనుంగొని మృగాక్షులు సమ్మదవార్ధిఁ దేలుచున్. 135

చ. సరసమృణాళనాళతనుసంభృతము న్వికచచ్ఛదస్ఫుటో
ద్ధరణము కేసరప్రసరదంష్ట్రిము ఝుంకృతిభాగలీనభూ
త్కరణమిషంబునై సొగసు గాడ్పులదూలుచు మాగుతుండిక
ద్విరసనభంగి నొప్పునరవిందముఁ గన్గొని సోలియాడుచున్. 136

ఉ. జాతకుతూహలాప్తిఁ దమచక్కఁదనంబులఁ గాంచి యద్భుత
ప్రీతిరసంబు లుట్టిపడ బెద్దల నొదలయూఁచు లోకవి
ఖ్యాతసరోరమాలలనకమ్మల మించినక్రౌంచమండలీ
భీతిఁ దళుక్కన న్బెళుకుబేడసలం గని క్రేళ్లు దాఁటుచున్. 137

చ. సిరిగలచోటులన్నియును జేకొని బంధురధారసత్రసం
వరణబలంబు నిత్యమయి వర్తిల దారుణమైనవిక్రమం

క. కరములఁ గైకొని చెలువ, ల్మరుజాపగుణీకృతభ్రమరుఁ బ్రతిదినతా
మరు జైత్రార్పితమణిచా, మరు నారాధించి రప్రమత్తప్రజ్ఞన్. 156

క. ఆరాధ్యద్యుమణిప్రభు, నారాధనవిధులఁ దనిపి యతిశయవర్షా
ధారాధరవేణులు మధు, ధారాధరఘణితి వినయతాయుత లగుచున్ 157

సీ. తలయేఱు పుట్టించె నెలదాల్పునకు భవత్కంఠనిష్కుంఠహుంకారరవము
వికటించి త్రోటికోటికి దెచ్చె భారతీకాంత దావకభయంకరశరంబు
ముష్కనిర్చ్ఛేదనంబున సాధుజేసె నీపైరంబు మఱిదివ్యవృషపతింపుఁ
గన్నచాయకుఁ బోయెఁ గాని నీ నెఱదాడిఁ జేరఁడు గ్రహరాజశేఖరుండు
తే. నీప్రతాపాగ్ని దపియించి నీరజారి, సంశ్రయించె సురాచార్యశరణభూమి
సదృశులెవ్వరు నీకు ముజ్జగములందు, శంబరాసురవిమతహింసాతిరంస 158

సీ. వివిధాగమాంతప్రవేశచాతురి నెన్నదగు శుకాగులు వినీతత ఘటింప
మహీసురాప్తిసుహృత్తమహిమ గాంచినయుత్తమాళులు హితవృత్తి ననుసరింప
ఘనదానవేగరాగముల మీఱినజగత్ప్రాణుండు నీమనోరథము గడప
నాశువాగ్గ్రహణమేధాశక్తి మాధవాదృతి భజించినమహాద్విజులు గొలువ
తే. కువలయప్రీతికాముఁడై నెవఁడు రాజు, గాఢరూఢప్రసన్నతఁ గాంచి తిరుగ
సాధుబుద్ధివి గావైతి శంబరారి, వేమునకు బోయపాలయ్యె వృద్ధసేవ. 159

ఉ. పూతమరందబృందకరము ల్బరము ల్బ్రీతిపర్వసంధిసం
జాతమధూద్ధతంబు విలుసారసమీరకుమారవాదనో
ద్ధూతసుజాతిచూతరసతుందిల మార రమాకుమార నీ
చేతిగుణంబుమాన వదెచేతిగుణం బిటులయ్యె నక్కటా. 160

సీ. ఆర్తివహించు నీయస్త్రపీఠమునకు నిలుపుగన్నులసిక నివ్వటిల్లె
నతిముక్త మగుతావకాయుధంబున కహో దొరకె జండాలుంతోడి మైత్రి
ప్రంతెఁబాయని భవద్ధ్వజవాశ్చరమునకుఁ గలిగెఁ బేరలుఁగులఁ బొలిసి పోవ
బుట్టుగుర్రైన నీబూమెర తేజికిఁ దగిలె మహావినీతప్రతీతి
తే. యకట జాతికిఁబాసిన యనుఁగుఁజెలికి, నెసఁగె మఱివేళవేళ మానిసితనంబు
నొడలుమాపిన నీకయ్యె మగ్రకృత్య, మంగభవనిందితులకు మేలావహిలునె. 161

మ. అమదప్రక్రియ మూఁడుగాళ్ళజరతుం డైయున్నతంద్రింద్రవి
క్రముఁనిం దమ్ములఁ జేరి తత్ప్రిబలపత్రచ్ఛాయ వర్తించునా
దిమసాధ్వి క్రమఁజేర రమ్మనక యుద్వృత్తి న్విజృంభింతు నీ
తిమనీషోదయలాభమెట్లు జనికిత్త్రిద్రోహియౌ వానికిన్. 162

ఉ. అల్లనఁ గాచి మిత్రగృహ మారటఁ బెట్టుసఖుండు నీతిపొం
దొల్లఁడు మంత్రి మానులకు నొప్పమిఁ జేయు రథంబు నీవునం
బల్లవధర్మ మూఁని రతిపైఁ దమిపత్రిలు దట్టినీకు న
త్ఫుల్లదయానయాదిగుణము ల్జనియించునె శంబరాంతకా. 163

వ. అని యనంగు నంగనారత్నంబులు మాటి తన్మాతులుఁడగు నీరజారిం బేసుకొని 164

ఉ. నీదయ పంచబాణశరనిర్భరతాపదవాగ్ని గ్రాఁగిపో
నీదయ నీదయోదయసమృద్ధి సదావెదచల్లుచుండుఁ దా
నీదయ సేదఁ దేర దొకయింత యిదెక్కడి వింత నేఁడు నీ
పాదములాన మావికచపంకజనేత్రకు సారసాంతకా. 165

ఉ. కాలగతిం ద్వదీయజనికర్త్ప్రతిరూపము న్గరాళకో
త్తాలకృపీటజన్మపరితశ్శిఖలం గడుఁ గ్రాఁగు నాతనిన్
బోలి కళంకివై మొదలఁ బుట్టినవానికి నీకు శైత్య మే
వేళ జనించు విత్తొకటి విత్తినఁ జెట్టొకటౌనె జాబిలీ. 166

చ. పరువమహాకృపీటభవభావము నీయెడసత్య మత్తెఱం
గరయక నిన్ను శీతకరుఁడందు రటేని సుజాతశీతల
స్ఫురణ పయోధికిం గలదె పొంగు కళంకము పేరఁ గ్రొంబొగ
ల్గురియదె మింటనాలికలు గ్రోయదె లోకకోచ్ఛలంబునన్. 167

చ. పరిధిమిషంబునం గుడుసుకడ్డశరాసముఁ బూని శైత్యవి
స్ఫురణ మెఱుంగులీను ఘృణిభూరిశరంబుల వేఁడిగా రహిన్
విరహిజనాళి నొంచెదవు వేఱె మనోభవుఁ డేల నీపయిన్
సరసతలే దనంతపదసంశ్రయ మేమయిపోయె జాబిలీ. 168

ఉ. గోత్రులు రాకపోక నినుఁ గోల్కొననీరు దురంతశీతరు
క్షేత్రత్రిదృఢాంబరాశ్రయము మానవు నిన్నవిరోధియు నీకరా
మాత్రవిభూతి నిట్టియెడుమంబడితో హరిణాంక వారిరు
ట్పత్రసుగంధలం గిరణపాతనశాతనరీతి నొంతురే. 169

ఉ. కందళితానురాగములు గావు మనంబులు విన్నయంతలో
నందఱు పారవశ్యపదమందురు చల్లఁదనం బొకింతలే
దిందున శంకరాభరణ మెట్లయితీవు శశాంక నీపదం
బుం దుదినంతశూన్యముగుఁ బో వివరింపఁగ మాటలేటికిన్. 170

చ. సదవనవైభవంబు పరచక్రవధోద్యతనంబు నిస్తులా
భ్యుదయ మనూనదానవిధియు న్సుఖలబ్ధపటుప్రసాదసం

పదబలవత్తమోదళనపాండితియుం దగురాజవైన నీ
కదయఁత కామినీజనులయం దుదయించుట పాడియే శశీ. 171

మ. కృతదక్షాపకృతి న్మహామయుఁ గళంకి న్సోదరీసుందర
ప్రతిపక్షు న్రజనీచరుం గురుకళత్రప్రాప్తభూయఃకళా
పతను న్ని న్నిరసావహించెఁ ద్రిపురప్రత్యర్థి సర్వజ్ఞు లా
శ్రితదోషస్మృతివిస్మృతివ్రతులు గారే రోహిణీవల్లభా. 172

ఉ. మేదిని నర్జునస్ఫురణ మించి చరించుట సింధుచక్రర
క్షాధృతి నీకు నంతతిలకాంతమువో హరిణాంకకృష్ణప
క్షోదయము న్గురూపకృతియుక్ ఝుషకేతువిరోధివిగ్రహా
హ్లాదము లేద దేమిచెప్పుమా వెలుఁగయ్యెడు నీకు నక్కటా. 173

వ. అని హాలాహలవిరోధి శిరోధిగృహమేధి యగు నవ్వనజవిరోధిం బలికి చెలికిఁ దాపో
పశాంతిఁ గానక వరారోహలు గంధవాహు నుద్దేశించి. 174

సీ. కాండభృద్ఘనబాధ గాసినొందినమిత్రు నోమవే సుఖవృత్తి నుల్లసిల్ల
మోచివచ్చినకార్యములఁ దోటనోసఁగవే కుసుమబాణునకు నెక్కుడుధనంబు
చెలిమిఁ బక్షీకరించినమహాశిఖికిఁ జేరుపవె లావరిసమారోహణంబు
మొదలనిన్ను సహస్రముఖములఁ గొనియాడు చక్రికి నీవె నితాంతసత్త్వగరిమ
తే. నీవిహారంబు దాక్షిణ్యనిర్భరంబు, నిను సదాగతిగాఁ జూచు నిఖిలలోక
మాజగత్ప్రాణ నీవంటియుత్తమునకు, వర్ణ్యమే పాంథయోషానిబర్హణంబు. 175

మ. సలిలాహారుల గణ్యపుణ్యతరులం జంద్రాస్యలం గాక నీ
బల ముత్కృష్టబలాధినాథులఁ దరల్పం జాలునే నిన్నుఁ గే
వలముం దైవము దెచ్చి మూలఁబడనైన న్మించునీలావు లం
కలపాలై చన నీభవంబు దునియల్ గా కృష్ణవర్త్మప్రియా. 176

చ. గరళగళప్రసాదమునఁ గన్నసుతుక్ హరినంటివానిఁ గే
సరిసతి కీవె తజ్జఠరజజ్వలనైకశిఖాప్రశాంతికై
పరుషగతి న్మహామునులఁ బల్లటఁబెట్టవె యట్టినీకు నో
కరువలి మేఘవేణికల గాసియొనర్చుట ధాత్రిఁ జిత్రమే. 177

ఉ. కొమ్మలచోట నీకుఁ బ్రతికూలతపుట్టుటయెంత చొక్కపుం
దమ్ముల సాధుమత్సరమునం దలఁకింతువు నిచ్చలుం బరా
గమ్ములరేఁతు వేమనవు కాలుపదం బిటునంటినిన్నుఁ దా
నమ్మక చెల్ల సర్వభువనానువుగాఁ దలపోయఁబోలునే. 178

వ. అని సమీరుదూఱు నవసరంబున నలరాత్రి. 179

క. స్మరమృగయు విశిఖబాధా, పరవశయయి యున్న దానిఁ బద్మిని గాఢ
త్వరఁ బరుషరీతి రుచిమత్కిరణ నఖాగ్రములఁ జంద్రకేసరి నొంచెన్. 180

క. యువతికిఁ బ్రాణంబయ్యెం, బవతుగతిం బ్రోదిసేసె మలయక్షితిభృ
త్పవమానుఁడు దూరితరై, పవమానుఁడు మోహదావపావకశిఖలన్. 181

వ. ఇట్లు మారతారేశకుమారసమీరబాధావిధురయై యమ్మధురభాషిణి శోషిల్లునుల్లం
బున నొల్లంబోయి నెచ్చెలులఁ గలయ నాలోకించి. 182

సీ. కనలుచుక్కలరాజుకంటఁ బుట్టిననేమి గాడ్పుపేరెము వాఱుఁ గాకయేమి
కంతుఁ డాకృతిఁ బెంచుఁ గాకయేమి కుజాతకలితుఁడై మధువుండుఁ గాకయేమి
హంస మాపగవారికై పోవుఁ గాకేమి గండుఁదుమ్మెద మ్రోయుఁ గాకయేమి
చిలుకవాదులకు వచ్చినవచ్చుఁ గాకేమి కలకంఠి గలహించుఁ గాకయేమి

తే. కమ్మదిగురాకుచే మించుఁ గాకయేమి, కళిక లంతంత మొనఁజూపుఁ గాకయేమి
వెఱపు నాకేల వెన్నెల వెల్లిద్రెళ్ళి, ప్రాణసఖులార వలవంతఁ బాయుదాన. 183

క. అని మోముదమ్మి వాడ, న్మనసిజశిఖిమండ సకలమర్మస్థలముల్
దనుపూటాడం గన్నియ, పెనుదెగువ న్నుబ్బతిలిన భీతిలి రతివల్. 184

క. కామాస్త్రములకు నాళీ, గ్రామణి వైషమ్య మొదవుఁ గా కెప్పటికిన్
సోమకుమారీమణి యీ, కౌముది దానెట్లసౌమ్యగా నేర్చునొకో. 185

వ. అని జననాథకన్య నాలోకించి. 186

సీ. దరహాసలేశధిక్కరణ మున్నదియె నీనంకవెన్నెల కేల వహ్నిఁ గురియఁ
గినిసిమాటలు నేరవనుచు శిక్షించితే చిలుక కేటికి వాగావళి యొనర్పఁ
బ్రతిపక్షియని తిరస్కృతిఁ జేసితే సాధుపికమునకేల వాబిఱుసుఁ జూపఁ
జూడఁబోలనిచూపుఁ జూచితే చంచరీకమునకు నేల ఛిద్రములు వెదక

తే. గోచరింపక యొకమూలఁ గూలి చనక, మందతవహింప కిట్లు త్రిమ్మరఁగ నేటి
కని యుదాసీనుఁ జేసితో యభ్రవేణి, యనిలశిశు వేల పిచివాటయ్యె నిపుడు 187

సీ. మనసుగన్న రమాకుమారికాసుతునకుఁ బూర్వాశ్రితుం డైనపూర్ణశశికి
జీవమువంటి దక్షిణసమీరమునకుఁ జేరైనకుసుమాస్త్రబృందమునకుఁ
బలుకుమారనిముద్దుచిలుకకు నెయ్యంపుఁ బైకమై దీపించుఁ బరభృతాళి
కతులాళియయిన గయ్యాళి తేఁటికిఁ బెట్టుచెట్టైనలేఁ బ్రోదిచిగురుమావి

తే. కకట భయమందవలసె హా యనఁగవలసె, బెగడుపడియుండవలసె గంపింపవలసె
నాతురతఁ గూరవలసె బిట్టలయవలసె, జలదరింపఁగవలసె వే జడియవలసె. 188

ఉ. చేరునమావికెంజివురుచేతికి లోనుగదమ్మ పద్మ కాం
తారమనాళిమానసము నమ్మిన దింతెగదమ్మ కంతుబ

ల్వారువమైనచిల్క మిగులాతగులాయు మెఱుంగునమ్మ నీ
పైరుగదమ్మ మల్లికలు పల్లటమందఁగనేల వానికిన్. 189
ఉ. దారుణభంగిఁ బేర్చినతాపదవజ్వలనోష్మమంటికం
ఠీరవమధ్యతాంతదశ నీతను వల్లి సహించినం దగుం
గైరవసోదరస్ఫురణఁ గాంచిన నీనిడువాలుగన్నులే
లారజనిం గుభృజ్జనికళానిధిరాకకుఁ దల్లడిల్లెడిన్. 190
క. అకటా యని చింతింపుము, లికుచకుచ ల్నీలుచ సంబళింపక శుకముం
పికము న్మలయానిలుశా, బకము న్మదిఁ దలఁచి వినయపాటవ మమరన్. 191
ఉ. మాటకు రాకు ప్రోదిశుకమా యొకమారు జయింపరానికై
లాటము జేసె వేటికి భళాపికమా యిఁక మాను బోటి నీ
సాటియె ప్రాణమయ్యె వడచల్లుగురే యిటులైనఁ బోటి యె
వ్వాటికిఁ బోవు నీచలువ చూపవనా పవనాఘునాద్భుతిన్. 192
క. అనిపలికి కలికిచెలువలు, మనసిజతాపాతపోష్మమందద్యుతియై
తనరువధూతనువల్లిక, ఘనశీతలరీతిఁ దేర్పఁగాఁ దగు ననుచున్. 193
చ. చెలువల కిష్టమూలములు శీరము లుజ్జ్వలదంశుమత్పలా
దళములు వెన్నెలంబులు సదామృదులాకృతి మంచివారిలో
మెలఁగుమృణాళముల్ గరము మెచ్చొదవించుమధూళి మాటలో
పలియువి యన్నిటం జెలికిఁ బంచశిలీముఖతాప మారదే. 194
వ. అని శీతలోపచారంబు లాచరించిన. 195
సీ. నునుమావిచిగురుపానుపు మహోత్తను శస్త్రశయ్యగాఁ దలఁచుఁ గంజాతనయన
కడిపోనివిరులకంకటి గణించునుభూతకంటకాస్తరణంబుగా మృగాక్షి
వలపుగుంకుమపువ్వుతలిమ మంగధివాగ్నిశిఖగా విచారించుసింహమధ్య
శిరముకప్రపుఁబల్కు సెజ్జ సొక్కుపుఁగాముశరముగా వగదుయోపాలలామ
తే. మంచిపడమటిపన్నీరు మకరకేతు, విషముగా బుద్ధి నూహించువిద్రుమోష్ఠి
తావిపుప్పొడి శంబరాంతకుపరాగ, మని వితర్కించులలన మోహైకకలన. 196
వ. ఇట్లు మనోభవమోహదాహంబునం బొక్కి పొరలుచున్న కన్నియ నెచ్చెలులు నికేత
నంబునకు మరలఁ దోడ్కొనివచ్చిరంతఁ గొంతకాల మరిగిన నొక్కనాఁ డేకాంతం
బున విద్యామంటపంబుననుండి చదువుఁ జెప్పుచు దదీయసౌందర్యవయోవిలాసంబు
లీక్షించి మన్మథాతురుండై మందుండు భువనమోహిని కిట్లనియె. 197
చ. నిరవధికత్వరం బఱచి నీచనుగొండలసంధిడెందపుం
దెరువరిమారచోరనిహతిం బడి మోహవిదాహవేదనన్

బాఁ లెదుఁ దేర్పుపుణ్య మిదిపో యధరామృత మిచ్చి యిందునం
దరసినగల్గునే పరహితాచరణప్రతిమానధర్మముల్. 198

క. నవలా తావకమోహా, ర్ణవ మేమిటఁగడతు దుస్తరము వివరింపన్
భవదీయస్తనకుంభ, ప్లవ మబ్బినఁగాక యీవిపత్సమయమునన్. 199

క. అనిద్రాసుఖితంబులు, గానేరవు లోచనములు కంఠద్వయసం
బై నీలావణ్యరసం,బో నవలా త్రేన్పు వెడలకుండుటవలనన్. 200

క. హారవిలాసము గలని, న్నారసి చీకాకుపఱుప కతనుఁడు ముక్తా
హారవిశేషము గలన, న్నీరసమున గాసిసేయు టీ వెఱుఁగవొకో. 201

క. గాఢరుచి స్రుచిరం బనఁ, గూడదు నీయధరము ధరకుచచించై కా
మ్రేడితము కానిచో నే,లా డాపునఁ జూచువారలకు నోరూరున్. 202

క. ఇన్నియును జెప్పనేటికిఁ, బన్నినమరుగాసివాసిఁ బొసితి నో రా
కన్నియ వన్నియమెఱయం, గన్నెఱికపుభిక్ష నాకుఁ గరుణింపఁగదే. 203

క. అని దీనాననుఁడై మో, డ్చినకరములతోడఁ బ్రియముఁ జేకొ మ్మనుచుం
దనుఁ బ్రార్థించుధరాసురుఁ, గనుఁగొని రాజన్యకన్యకామణి పలికెన్. 204

క. గురుఁ డనఁగఁ దండ్రి యఘసం, హరణగుణా శిష్యురాల నైనప్పుడె కూఁ
తుర మేర దప్పి కామా, తురబుద్ధిం గోర్కి సేయుదుర నావోటన్. 205

మ. నరకద్వారకవాటభేది యవమానప్రాప్తిమూలంబు దుః
ఖరుజాపథ్యము పుణ్యలోకగమనఘ్నం బస్ఖలత్కీర్తి సా
గరమంథాద్రి జనాపవాదహుతభుక్కాష్ఠంబు సత్కారసం
హరణోజ్జృంభము గీడుగాదె పరభామాసంగ మెవ్వానికిన్. 206

ఆ. నీతి సాధువృత్తి నీయది ధరణీసు,రుఁడవు వేదపారగుఁడవు ధర్మ
తరులతాపరశ్వథము చెల్లఁబో యిట్టి, నీచచిత్తి మెట్లు నీకుఁ గలిగె. 207

తే. ఏను రాజన్యకన్యక నితరజాతి, భామగా నెట్లుపొసఁగు నీపాపవృత్తి
భూసురుఁడవైన యిది నీకు బుద్ధిగాదు, బ్రాహ్మ్యహాని తపోహాని ప్రాణహాని. 208

వ. అని యనేకప్రకారంబుల బోధించుచున్నయన్నెలవేణికి బ్రాహ్మణుం డిట్లనియె. 209

ఆ. నీవు మాటలాడనేర్తువు గురుఁ డేల, చెప్పకొను విరాళి శిష్యురాలిఁ
గవయరాదు ప్రాణికల్పన నేర్చిన, పలువనలువ గూఁతుఁ బట్టికొనఁడె. 210

క. గురుదారఁ బాటె చంద్రుఁడు, గురుభామం బ్రేమఁ బిలుమకొని వినుతబుధుల్
పరిణతముని విబుధబుధుల, గరిగమనాగమవలీలఁ గాంచుట వినవే. 211

క. గౌతమభార్య నహల్యన్, శాతోదరిఁ బదరి పట్టకొం గాలా
తీత మొనర్చియుఁ గూడిన, యాతని కింద్రునకు నేమియయ్యెం జెపుమా. 212

ఆ. ఇట్టివట్టిసుద్దు లేటికి నీయంగ, సంగలాభ మైన జాలుఁ దెఱవ
వెఱవ మెఱసి మీఁదఁ జఱతెంచు నత్యుగ్ర, పాపమునకు నరకకూపమునకు. 213

చ. కడపక నీవు నాపలుకుఁ గాదని వేదనిసర్గమార్గమం
దడిగొదవేని మేనియుడియాసఁ దొఱంగి లతాంగి ప్రాణముల్
విడిచెద నీవుచూడ నలవేపడిఁ బాపములోన దీనిలో
విడిదలగాక వేకలఁచి వేచెడి దెయ్యది చూచితొ మ్మనన్. 214

శా. ఆఘోరోక్తులు వీనులం బడిన నాహా పుట్టిరాపట్టని
ఘోఘం బీయనమాట తుచ్ఛదురితంబు ల్ధర్మకర్మక్రియా
శ్లాఘ న్మాన్చకొనంగవచ్చుఁ దుదిఁ ద్రైశ్యంబోనియా బ్రహ్మహ
త్యాఘం బేమిటఁబాయు నాకొకయుపాయం బెద్ది యాచేఁతకున్. 215

క. కులగోత్రశీలములకు, న్వెలియైనం దగు మహోగ్రవిప్రప్రాణా
నిలవిచ్యుతి కే నొప్పం, గఁదానె యింతకంటెఁ గలుషము గలదే. 216

క. అనుచితకార్యము లేమే, నొనరించినయత్న మొప్ప నుత్తమజను లా
ర్తుని విప్రుని విధ్వస్తా, త్మునిఁ నెప్పుడు సంతరింపుదురు మేలగుటన్. 217

ఉ. కావున నొండుపాయములుగావు మహీసురరక్షణంబ మే
లై విలసిల్లు నేమితెఱఁగైనను మంచిదె యంచు బుద్ధిలో
భావనఁజేసి యచ్చెలువ పల్కె ధరాసుర రెండుజాలలో
నీవది కేగుదెంతు సరణిం జలియింపకయుండు మిత్తఱిన్. 218

వ. అని యతండు విశ్వసించినట్టుగా నందులకుఁ గొన్నిశపథంబులం బలికి యక్కలికి
నగరికరుగుచు నపరాహ్ణగతుం డగుగగనమణి నాలోకించి కీర్తించి కరంబు లురో
జాగ్రంబులఁ గీలించి యిట్లనియె. 219

క. ఓలోకమిత్ర యొకరు, జాలయ నీకులముదాన నవనీసుర దు
శ్శీలంబు మాన్చి యిట నా, యీలువు చెడకుండఁ బ్రోవవే నేఁ డనుచున్. 220

క. చేరఁ జనుదెంచి యలసర, సీరుహహితుఁ డబల యట్లచేయుదు చింతా
భావంబుఁ ద్రోఁచి కదలుమ, గారమునకు ననుచుఁ బఱచె గగనంబునకున్. 221

వ. ఆసమయంబున. 222

చ. ఇనుఁడు పనూర్ధతుం డరయ సెప్పఁడు వానికి నీతిలేదు వీఁ
డినుఁడు పనూర్ధతుండు నయమెయ్యది తద్విసినీదివారతిం
దనిసి ప్రదోషకాలమునఁ దానిదె వారుణి నానియున్నవాఁ
డని యులుకెంబలె న్నరలె నా నడచెం దగ భాయ ప్రాచికిన్. 223

సీ. ఇవి చెందిరికచీరలవుఁగదా తిగిచికుచ్చెలఁబోసి కటులఁ గీల్కొలుపవచ్చు
నివి కుంకుమరసంబులవుఁగదా గబ్బిగుబ్బలజోకటంబుగా నలఁదవచ్చు
నివి చెంగలువసెజ్జలవుఁగదా కాఁగిళ్లఁ బ్రియులుండ మెఱసి నిద్రింపవచ్చు
నివి చిగిర్చినమావులవుగదా కటికివేసవులనీడలఁ గ్రీడ సలుపవచ్చు
తే. నివి సరోజాతరాగంబులవుగదా బెడంగడరుపేటికలఁ బెట్టి డాఁపవచ్చు
ననుచు వరుణావరోధకామినులుపలుక, నస్తగిరిఁ బ్రాఁకె జరఠారుణాతపములు. 224
మ. తనచిత్తంబునఁ బద్మినిం బవలుపొందన్ వారుణీకేళికిం
జనఁ బైకొన్న ప్రదోషపీడకు వహించన్ నేర్చె నింకేల్లుగా
దనువో మంగళవాఁడనంచు భృగుపాత్రప్రీతి నేతెంచెనో
యన సేవించె సరోజబాంధవుఁడు ప్రత్యగ్భూమిభృత్కూటముల్. 225
తే. అపరపర్వతశిఖరసింహాసనమున, గొంతిదడవుండె గ్రహరాజు గ్రుంకుటుడిగి
సమయరమ మజ్జనంబాడి సాగరంబు, దండనుంచిన కుంకుమపిండ మనఁగ. 226
చ. కరటనిషక్తఖర్జు వడఁగం జిరగర్వసమగ్రమంజన
ద్విరదము పాయుతన్మదస్రుతిం బొడుకెక్కినయస్తసానువం
దరదముఁ జారఁ బైనడుగు లానక యుర్వికి డిగ్గు నుద్ధత
త్వర ననఁ గ్రుంకె భానుఁ డవధాననికుంచితభానుహస్తుఁడై. 227
సీ. పరిపక్వబింబవిభ్రాంతి దవ్వులరాజకీరడింభములు గ్రుక్కిళ్ళు మ్రింగఁ
బ్రత్యగ్రశోణితభ్రమ నుపస్థితమూర్తై పంచాననంబుల బయలునాక
పల్లకీపల్లవచ్ఛదనశంక సగంధకరులు రిత్తకురిత్త కరము సాఁపఁ
బుంజీకృతక్రవ్యబుద్ధి నిర్ఝరవృద్ధశార్దూలములు నోళ్ళుచప్పరింప
తే. గైరికద్రవవిచికిత్స గాన నాట, పాటలోష్ఠులు పాలిండ్లఁ బ్రామఁ దివురఁ
బ్రత్యగవనీధరంబునఁ బ్రాకుదెంచె, నపుడు దివసావసానసంధ్యామరీచి. 228
తే. చరమదశఁ గన్నవాసరస్వామిఁ దలఁచి, తమ్ములామోద మఱివంతిఁ దలఁకుచుండ
నస్తమువగోత్రమయ్యురాగాప్తిఁ బొదలె, మొదలఁ బాశ్చాత్యకృత్యమట్టిదయకాదె.
తే. పద్మిజశ్రేణి దివసావసానవేళ, చలువఁదేరు వనప్రదేశములఁ జేరి
కన్నులరమోడ్చి విస్పష్టగతులుమీఱి, నారవవ్యాజమున జపం బాచరించె. 230
సీ. తావులకొండనెత్తము డిగ్గి చెంగల్వదొనల చల్లనినీటఁ దొప్పదోఁగి
పరిగొన్నపచ్చకప్పు పుదుమారము రేచి తరుణపల్లవపరంపరఁ దెరల్చి
వికసితప్రసవజాలకరేణువులవంటిగంధసంపద దేటిగములఁ బ్రోచి
బలిమి గానవపరంపరల నాఱటలూచి తీవపందిళ్ళలోఁ దిరిగితిరిగి
తే. రొండ పొడదూఁరక పగళ్లునిర్లు గవయు, తియ్యమావుల క్రేనీడఁ దెరువుసాగ

కల్లవల్లవఁ జనుదెంచె నతిసుభద్ర, వారణంబన సాయంసమీరణంబు. 231

చ. సరసులసంగతిం గలుగుచక్కనితమ్ములఁ జేరఁబోయి క
న్నరమొగిడించి వ్రాల్చుచిగురాకులడగ్గఱి పత్త్రము ల్నిశా
కరదృఢదోషముల్ గదిసి కల్మషడంబరిముక్తవృంతకే
సరములఁ జెంది కందునొకచక్కని దారవియోగవేదనన్. 232

సీ. నిండారుకమ్మదేనియ మజ్జనంబాడి కడిమిపుప్పొడిపన్నె మడుఁగుఁగట్టి
రేకుగన్నుల జంచరీకాంజనముఁ జేర్చి తనూవల్లి ఫేనచందనముఁ బూసి
తుంగలేఁతూఁడుజేతుల నూర్మికలు దాల్చి జలకణామౌక్తికచ్ఛటలు పూని
మొగ్గపాలిండ్ల సొంపున హిమాంబువునుంచి యామోదసంపద నతిశయిల్లి
తే. హంసకంబుల నిజపదం బలవరించి, భువనమోహనమైన వైభవముఁ గాంచి
కలువవిరిబోఁడి రాజురాకఁ దలంచి, పొలిచె వాసకసజ్జికాస్ఫురణ నపుడు. 233

తే. ఝుంకృతివ్యాజమున హాళిసన్నుతాళి, యూఱడింపఁగఁ దనకన్నవారిలోన
ననవధిక్లాంతిమిత్త్రమోహార్తి ఖిన్న, తమ్మికొమరాలు పత్త్రనేత్త్రములు మోడ్చె.

సీ. కనలుసంధ్యార్చిఁ బేర్చిననభఃకరిమేన బుటములెత్తిననీరుబొబ్బలనఁగఁ
గాలమాంత్రికుఁ డంధకారదానవబలిక్రియకు రాల్చినపేలగింజలనఁగఁ
దాండవభ్రమిఖమూర్ధజుఁ డంజలిపుటంబున విధిర్చినకమ్మపూవులనఁగ
మైరవసింధుసంపర్కశర్కరదేవమును లోనర్చినలింగమూర్తులనఁగఁ
తే. గమలగర్భాండగోస్తనీకాయమాన, జటిలపరిపక్వఫలగుళుచ్ఛములనంగ
నఖిలజనలోచనోత్సవం బాచరించెఁ, దామరసవైరికులదారతారకములు 235

ఉ. స్నేహవిరక్తిఁ గాలగతిచేఁ గని మిత్త్రుఁడు చాముగక్రియా
మోహాతుఁ డౌటఁ గన్గొని ప్రమోదవిధిం దనుఁజేర నీగురు
ద్రోహి శశాంకుఁ డెట్లనక దోయనిపూనిన శక్రదిగ్గజ
స్త్రోహిని మాము విన్నఁదనమో యనఁ బాండిమదోఁచె నెయ్యెడన్. 236

సీ. బలభిద్దిశావశాప్రతిమ గామినిముద్దుగులుకుటీరికనవ్వ తెలివిచెప్ప
యుదయమస్తక్రీడ నాడికోలులు మోవఁ గూలినచౌదంతికొమ్ముఁబోలి
గగనవాహినిరొంపి గాడికొండొకదోఁచు కమలాప్తురథరథాంగంబు దొరసి
కాలకాపాలికాగ్రణికరంబున నెత్తిమాచు క్రొన్నెమలికసురటి నొరసి
తే. యంచు గనుపట్టి మఱియించుకంత మెఱసి, సగముపర్యాయకమున సాక్షాత్కరించి
బింబమంతయు వెలికి దీపింప నిలిచెఁ, జదలఁ బూర్ణకళాసీమ చందమామ. 237

సీ. అది సుధాకరబింబమా కాదు మఱికామునన్నె వేలుపుటన్నవత్తిగాని
యది చంద్రమండలంబా కాదు చదలేటఁ దేలుదంతపుటరిగోలుగాని

యది నిండుచలివెలుంగా కాదు మబ్బుచేసుఁగుఁదోలుతెఱనోటి మొగము గాని
యది చకోరములవిందా కాదు దుగ్ధాబ్ధికడ జనించిన వెన్నకరుడు గాని
తే. యది నిశామిత్రమా కాదు మదవియుక్త, యువఘరట్టశిలావలయంబు గాని
యని జను లూఁచి కీర్తింప నతిశయిల్లెఁ, బ్రోవజాబిలికలువపూఁబోడికలిమి 238
సీ. ఇనకరాంకురములు కెడయాని మ్రాని క్రీనీడజాడల డాఁగి నిలిచెఁ గొన్ని
మధురసప్రస్నిగ్ధమాకీకచ్ఛత్రభాగవులలో గవులలో నడఁగెఁ గొన్ని
కలనైనవిఱుగెఱుంగనిపోటుపరికరామూరుకత్తులమాటు జొచ్చెఁ గొన్ని
చేసేఁతబడి తలంచినలేను బంతి యున్నులువకొమ్ములదాడిఁ బఱచెఁ గొన్ని
తే. త్రాసమునఁ బొంది పద్ధతి భ్రంశవములు, గూపకుహరాంతరంబులఁ గూడెఁ గొన్ని
యిరులు తిక్కరు లన నప్పుడేమిచెప్ప, రాజు బరచక్రహరణసంరంభుఁ జూచి 239
సీ. ప్రాయమింకినవాలుపాలిండ్ల వెలయాండ్రు పడుపుపుట్టక మూలఁబడి కృశింప
నేపురేగినరంకులెంబడీఁగబోఁడులు వింతకౌఁగిలిలేక వెతలఁబొందఁ
కడిపోనితెరనాటకపుటూరుజంగాలు కేళికల్ గూడ కోగిరము లెత్త
తడక ద్రోపరిమ్రుచ్చుపోగువులు మఱి దొంగపనిముక్కవాలైనఁబస్తుపోర
తే. గంటవేఁటల దిరుగాడుకఱపటెఱుకు, మూఁక వెఱజిక్కకాళ్ళు మోములునువావఁ
బిండిచల్లినచందానఁ బేదవారి, దివియువెన్నెల సాంద్రదీధితి వహించె. 240
సీ. చేఁపుపుట్టినగభస్తికలు ముక్కులఁ గ్రుచ్చి త్రచ్చి యూరటలేక క్రోలుఁ గొన్ని
యఱ్ఱులానఁగఁ ద్రావి యసుమరుచ్చరణకుఁ జోటుచాలక నేలఁ జూచుఁ గొన్ని
కడుసిగ్గుకేరుతొల్పడుపుదోమటుఁ జొక్కి యానందమున జిందులాడుఁ గొన్ని
నిగరంపుమోవి తేనియలతోన దొరల్చి చెలువలిచ్చిన సంతసించుఁ గొన్ని
తే. యోలములఁ డాఁగి తలచూపనోడి తల్ల, డించు నరికోటిపైఁ బుక్కిలించి యుమిసి
బయలుఁబట్టించి పేరెము లార్వరుఁగొన్ని, కైరవాప్తాతపములఁ జకోరకములు. 241
వ. ఆసమయంబున. 242
సీ. కట్టినజినుగుసిరాక్కవిధోవతి పింజయాపార్ష్ణిలంబియై యతిశయిల్ల
ఘాతోత్తరీయవస్త్రములోను శుభ్రశుభ్రంబులై బ్రహ్మసూత్రములు మెఱయఁ
గనకవీరుద్గ్రింధికలు కపోవాలావాలసీమబచ్చనిడాలు చివురువెట్ట
నామోదరసపుష్టి నచ్ఛిద్రమై ఫాలతలమున గోపిచందనము గ్రాల
తే. నపటుతటఖేలనంబున నమరుబిళ్ల, సికచొకాటంబువిరులతోఁ జెలిమిసేయ
నడుమ జగజంపుదోఁపుఁబచ్చపము దనర, వైదికబ్రాహ్మణుఁడు నిండువన్నె మెఱసి.
తే. క్రముకభంగపరంపరాకలితమయ్యిన, వన్నెతికతిత్రిమేఖలావల్లి నితిక

యాకు లక్షించి యలబలం బడఁగు టరసి, యునికి వెలువడి బ్రాహ్మణుం డొక్కరుండు.

ఉ. అప్పు డధిజ్యచాపధరుఁడై మరుఁ డేర్పడి వెంటనంటి రాఁ
జొప్పున జాలిమాలి యఘుసూరుఁడు పాఱుఁడు వచ్చివచ్చి యా
యొప్పులకుప్పరామికి నయో విధియం చుదితాశ్రుధారలుం
గప్పఁగ మోమునిశ్వసనకంపితచారుతరాధరోష్ఠుఁడై. 245

క. చెదరెడి మేనును జెమ్మట, గదిసిన కెంగేలు గ్రాలఁగా విప్రుఁడు లే
నిదురెఱుఁగనికంటంబడి, వడియగుమయమంట మంటపంబున నుండెన్. 246

ఆ. చీమ చిటుకుమన్నఁ జిమ్మెట బుఱ్ఱన్న, నెదురమూషకములు మెదలుకొనిన
నిదురలేక భూమి నిర్జరుం డాలించు, నప్పు డబలకాలిచప్పు డనుచు. 247

క. రాదాయెఁ జూచితే యను, రాదా యడ్డంకిబట్టి రాదను నిర్మ
ర్యాదలు సీమంతినులను, హా దైవము ప్రొద్దుపోయె నని తలయూఁచున్. 248

క. ఎదురుకొన నరిగి చాయకు, గదలుతలారులకు వెఱచి క్రమ్మరు నేన
మ్మదవతికి నేలదాదులు, పొదివికొన న్నిదురపోయెఁ బొమ్మని పలుకున్. 249

వ. ఇట్లు మోహానలంబున దేహంబు విదాహింప నయ్యుర్వీగీర్వాణుండు చలితవినో
గిప్రాణుం డగుపంచబాణుం దలంచి. 250

మ. ద్విజరాజుం దలదాల్చుకొన్నతని దృగ్వహ్నిప్రభూతాగ్నులన్
రజమై పోయిననిన్ను నీతిరసదూరా మార యీకేవల
ద్విజరా జగ్గిన నేమి సేయునో ప్రశాంతిం గాంతి పత్సాయక
వ్రజముం గూర్పకు నారి నారి ననుగూర్పం దేర్పఁ బుణ్యంబగున్. 251

చ. శివ గణనాయకా యనిన శీఘ్రమె కార్యము లడ్డపాటులే
కవు యనునాథపంచవిశిఖా యన హస్తపదాస్థికాండముల్
చివికెడువట్టినొప్పు లొడిసె ల్రసపాకులు గంట్లు బిబ్బవుం
డ్లవు నిటువంటిపుత్త్రుఁ దగవా కన నమ్మథుకైటభారికిన్. 252

వ. అని పనివి పనివి యనంగబాణమూర్ఛితుండుం బోలె నమ్మంచముంచు నిద్రాముద్రా
లోచనుం డయ్యె నయ్యవసరంబున. 253

క. అనిశ ధరణీసురునకుఁ, దా నిచ్చినమాటపట్టు దలఁచి తదీయ
స్థానీయపాలవీక్షా, ధీనాకృతి గాక నగ రతిత్వర వెడలెన్. 254

క. జలధరమాలికలోపలి, తొలుకార్మెఱుఁగనఁగ యమవిధుంతుదహాలా
హలకాచమేచకద్యుతి, గలనీలాంబరము ముసుఁగు గాఁ గైకొనుచున్. 255

క. పరివృత్తకంఠయై దిశ, లరయుచు నడ దడవడంగ నరుదెంచి ధరా
సురు నిద్రపోయెదే యని, కరసంజ్ఞం దెలుప మేలుకని వాఁ డంతన్. 256

వ. ఆదిత్యచోదితుండై క్రోధించి. 257

శా. అయ్యో నేఁడిట కేఁగుదెంతువని నీ కాశించి యిచ్చోట గ
న్మయ్యంజాలక నిద్ర గాచి యిపు డేమోకూర్కితి న్నాకుజా
లయ్యె న్నాలవజాముఁ జొచ్చె దడవాయ న్వచ్చి విచ్చేయునీ
సయ్యాటం బిఁకఁజాలు రోసితి ననుష్ఠానార్థినై పోయెదన్. 258

చ. కడువడి రెండుజాము లరుగం బరిరంభణ మీఁదలంచి నీ
కడ కరుదెంతు రానిపనిగల్గిన నాఁటికిఁ దండ్రిఁ గాశిలోఁ
బొడిచిన క్రూరకర్మమునఁ బోవుదు నంటివి సూనృతంబు నీ
కొడుకయిపోయె రాక కిదిగో గురులింపఱరాత్రిపాపముల్. 259

క. కడుసరసములకుఁ బ్రోడే, క్రొడిది దురంతోపగూహగతులకుఁ బ్రోడే
క్రొడిది యొకసెలవు సేసితె, కడజామున వచ్చి చాలొచ్చె కాలుకుబుద్ధిన్. 260

ఆ. కొదవలేక రతుల గోవావుఁగోడెనై, పొదలఁ బెద్దతపవు ప్రొద్దులేదు
నోరసి తెడ్డు నాఁకి యుపవాసకర్మంబు, చెఱుదుకొనఁగ దీనిచేత నేమి 261

క. అని చిందరేఁగిన ట్లుచ్చెనఁటీధరాసురుఁడు చెంతఁ జేపడిననిధి
న్మని గాలఁ దన్ని చనుగతి, ఘనజఘనం బాసి యబ్బగాఁడుగఁ బోయెన్. 262

క. చనఁ దనకు మనసువచ్చిన, పని యది గా కనికిఁ దీరఁ బట్టక చనుఁగా
కని యూరకుండె నట్లుండి నరాధిపకన్య దనహృదంతములోనన్. 263

క. సరిప్రొద్దున నరుదెంచితి, వరుణోదయసమయ మెట్టులయ్యె దురంత
స్మరమాయాంధుఁడు గావున, నరరే విప్రుండు తుర్యయామం బనియెన్. 264

క. కామాంధోపి నపశ్యతి, నా మును నే విన్నదానవకదా వెఱఁగే
లా మందునిమాటలకని, యాముద్దులగుమ్మ మందహాసముఁ దాల్చెన్. 265

క. వానీరచరాగ్రణి బహు,మానున కిట్లనియె నట్లు మహీసురుఁ డవ్య
స్థానస్థుఁ డయినపిమ్మట, నా నెలఁతుక యేమిసేసె ననఁ గపి పలికెన్. 266

క. మహీసురుఁ డట్లరిగిన వ,మ్మహిళారత్నంబు తొడసుమాలితి నని దు
స్సహరయమున భయమున నిజ, గృహమునకుం బోవఁ దత్తరింపఁగ నంతన్. 267

చ. ఘనదసమృద్ధి నీలికడవంబలె నంబరమొప్పఁ జంచలల్
మిసమిసలీన దోన మతిమె వ్వడి గండులు వ్రాలె వ్రాలెఁ దొ
ల్చినుకును దూర్పుఁటీదరొలసెం బలసెం జడివానసోనజో
రనఁ బురవిద్విషద్గళసహస్రభవాకృతిఁ బర్వెఁ జీఁకటుల్. 268

క. ఇది రాయిరప్ప పల్లం,బిది మిట్టిది మాకుమట్ట యిది పామిది గా
మిది యని వివరింపఁగఁ బె,ట్టిదమై యొప్పెసఁగు నక్కటికిఁ జీఁకటిలోన్. 269

చ. సుడిసుడి యింటిత్రోవయనుచుం బెరచోప్పునఁ బోయిపోయి యా
ప్పుడఁతి దృషద్వతీసరిదుపాంతగురంతవనాంతరంబులం
బడి ముళ్లుదీవలుం దవిలి భంగములై కురులుం దుకూలముం
దొడిపినకంచుకం బెడలఁ దొట్టినభీతి నొడల్వడంకఁగాన్. 270

క. ఊరము లూఱట నొందక, దూఱుచు నోరలయ నలుప దూఱుచు రొంపిం
జాఱుచు నెంతేవెలవెలఁ, బాఱుచు రాజన్యకన్య పఱచి యలంతన్. 271

శా. ఆయుగ్రాటవి నొక్కచోట భయదంబై తోఁచుఱత్కోపట
చ్ఛాయం బీనుఁగుఁ ద్రొక్కి కోమలకరాబ్జాతంబునం బట్టి యా
య్యో యీమానవుఁ డెవ్వఁడొక్కొ మృతికేమో హేతు వంచు న్విచా
రాయత్తం బగునాత్మఁ బోఁ దెరువులే కచ్చోటఁ దా నున్నెడన్. 272

క. ఆపటమునఁ ద్రింశద్వ, ర్షావధిగా నున్నభూసురాసురుఁడు విశా
లావరపుత్రికి హితసం, భావన సాక్షాత్కరించి పలికెం బ్రీతిన్. 273

క. మనుజులు మిట్టాడని యీ, ఘనగహనంబున నిశీథకాలమునం జ
చ్చినదరువక్కటి తెక్కటిఁ, దనుమధ్యా సంచరించెదవు నిశ్శంకన్. 274

తే. ముంచు కన్నీరు మించిన మోముదమ్మి, వాడియున్నది దీర్ఘనిశ్వాసనిహతిఁ
దల్లడిల్లెడునధరోష్ఠపల్లవంబు, ఇంతవలవంత నవ్వ నీ వెవ్వ రనుచు. 275

క. అనుమానింపక తనుభృ, త్తనువిసర వపారసప్రదానవిధాన
స్వనముల్లుకంబు వదనం,బున ద్రిప్పఫలాళి కిందుముఖి యిట్లనియెన్. 276

క. వినయవిశాల విశాలా, వనిపాలునిపుత్రి దైవవశమున నస్మ
జ్జననీజనకుల జనకుల, వినతులపొత్తెడసి యాటవికసతి యయితిన్. 277

శా. ఏ నిల్వేయుట యెట్లు లీపడినవాఁ డెవ్వాఁడు వక్షాతమః
పానఃపున్యముఁ దెల్పునల్పచపలాప్రత్యగ్రలాలోకముల్
మేనభ్రంలిహ ముగ్రమృత్యుముఖగంభీరంబునో రవ్వర
య్యా నిర్జాచిన గుండె ఝల్లురనుఁ దథ్యం బానతీవే యనన్. 278

మ. అతఁ డత్యంతతమప్రసన్నహృదయుండై పల్కె నే నంచిత
శ్రుతిసంపన్నుఁడ బ్రహ్మరాక్షసుఁడ నిచ్చోఁ గాపురం బుండుదున్
మతి భీతిల్లకు నీకు నొజ్జ లితఁ డమ్మా నీకు నే కారి యీ
క్షితిజచ్ఛాయమనోజబాణహతి నొచ్చె న్మాట లింకేటికిన్. 279

క. గురుఁడ నిది శిష్యురా, లీతరుణీమణి గవయ దుష్కృతం బని మదిలో
నరసి యెఱుంగనియాద్యశ, నరపశువుల మేలుపొందునా యెందైనన్. 280

క. సూరిశ్రేష్ఠునకు వరా, చారగరిష్ఠునకు నీకు సద్విప్రా యీ
ఘోరనిశాచరవేషం, బేరూపునఁ గలిగె ననిన నెఱిఁగింతుఁ జెలీ. 281

సీ. మొదల గౌశాంబి నుండుదు వేదశాస్త్రార్థచతురుండ నాపేరు చండశర్మ
కులకాంత శాంత యుచ్చెలువతప్పుఁడు మూలఘటకాంకుఁడతఁడొక్క కన్యఁ బెండ్లి
గాఁబోవుటయు గోడిగములకు నేనును బనిబూని యటువాని ననుసరించి
యతిసభ్యునట్ల పోయితిఁ బోవ నను బెండ్లిపెద్దగాఁ దలఁచి యాబిడ్డతండ్రి
తే. కదిసి యల్లునిగుణరూపగౌరవములు, వేఁడుటయు నావివేకంబు వీటిఁబోవ
నవగుణంబులప్రోవు మూర్ఖాత్ముఁ డంటి, ననిన నమ్మాట లతఁడు సత్యములఁ జేసి. 282

క. కాతాళంబున నిచ్చిన, కూఁతు నతం డీక వెడలఁగొట్టిన నపుడా
చేఁతకు నాహృదయం బుత్ప్రాతఁ బ్రేంఖోళనప్రయోజన మానెన్. 283

క. మఱఁది యని యుంబుసుపోకల, నెఱుఁగక యిట్లాడి లోను లెగ్గింపం దేం
పరినై కూడినపెండిలిఁ, జెఱిచితి నాకన్నఁ గష్టశీలుఁడు గలఁడే. 284

క. ఈయుగ్రాఘం బేమిటఁ, బాయు నయో హృత్ప్రతీపపరితాపశిఖిం
గాయము వేఁగెడునని పల, చేయి కపోలమునఁ జేర్చి చింతిలుచుంటిన్. 285

చ. అగణితధర్మకర్మరతుఁ డంచట ము న్నరుదెంచియున్నవాఁ
డగుట మునుగ్రకృత్య మపు డారసి ముద్గలనామధేయుఁడుం
డగలక నన్నుఁజూచి కుటిలాత్మ కళత్రసహోదరు న్మహా
సుగుణధురీణుఁ గానిమనుజుండని యూరక పల్కఁబోలునే. 286

ఆ. వేయుబొంకి పెండ్లిసేయుదు రుత్తము, లను లతిప్రయాసమునను నోర్చి
చెనఁటిసేఁత నిట్లు మనువులఁ జెఱిచిన, విసపువిత్తుఁ జెప్ప వినము గాని. 287

ఉ. మోఘము గాక నీవు తలమోచియొనర్చిన యట్టియిద్దురం
తాఘము నేఁడు పిల్లికొలఁదైయె చరణంబులఁ బ్రాఁకుసజ్జన
శ్లాఘనయోగ్యభూమిసురజన్మము వీడ్కొని కానలోఁ గ్రశా
ఖాఘనవృత్తివర్తివయి క్రాలు నిశాచరవేష మేర్పడన్. 288

ఉ. వంకరకట్టెకింగలము వైద్యము నీకిది వోలునంచు ని
శ్శంకనవృత్తి ముద్గలుఁడు శాపము నిచ్చిన శోకబాష్పధా
రాంకితనేత్రపంకజుఁడనై చరణంబుల వ్రాలి యోదయా
లంకృతచిత్త యోబుధకళానిధి యోగుణధుర్య కావవే. 289

చ. అనుఁగుమఱంది గానఁ బరిహాసపురస్సరభాషలాడ నీ
పనిజనియించె నీచరణపంకరుహంబులు సాక్షిగా మదిం

గవలు వహించి యిట్టికొఱగాని ప్రయోజన మాచరింప నీ
యనుపమదివ్యదృష్టి కొకఁ డడ్డమె చూడుము తీర్పనేరముల్. 290

క. అని యేను మేను వడఁక, న్వనితాజనతార్తిఁ బొగల వారించి ప్రబో
ధనిరీక్షణములసర్వముఁ, గనుఁగొని యితఁ డనపరాధిగా యని శాంతిన్. 291

వ. ముద్గలుండు న న్నాలోకించి యిట్లనియె. 292

చ. కొలఁకముఁ బూని పెండ్లిపనికిం బ్రతికూలుఁడ వైతి విట్లు మొ
క్కల మిదిగాదె నీపున సకల్మష మానటులైనఁ గేవలం
బుల కిది చోటె మోఘమయిపోవదు నావచనంబు గన్నచా
యల నిఁక బ్రహ్మరాక్షసుఁడవై యిల నీవు చరింపుచుండఁగన్. 293

ఉ. అల్లినపంతమూలఘటకాంకుఁడు భూమినిలింపకన్యకా
హల్లకభిల్లభగ్నహృదయస్థలుఁడై తను వుజ్జగించి మ
త్సిల్లున నుద్భవించు జయసేనుఁడు నా నవని ప్రకన్య యు
త్ఫుల్లసరోజనేత్ర ప్రియపుత్రిక యై పొడము న్సుకీర్తిన్. 294

ఉ. ఆయొలనాగ దైవగతి నర్ధనిశం గతిదప్పి నీతరు
చ్ఛాయకు వచ్చు నాసరసిజచ్ఛదనేత్రకు నవ్వసుంధరా
నాయకమాలికిం దగులొనర్చును సంశయ మేది యంతలోఁ
బాయును మహీసురాసురత బ్రహ్మపదంబు భజింతు విమ్మటన్. 295

మ. అని శాపావధిఁ జెప్పి ముద్గలుఁడు పోవం బోవ నాలోన నె
ఱ్ఱనిగ్రుడ్లుం గులిశంబులుం దెగడుకోఱల్ వాడబనూర్ఘ్రిజ్ఞతా
ననముం జొంజొరువెండ్రుకల్ భయదకర్ణద్వంద్వముం గల్గి మే
దినికి న్వేగిరగ బ్రహ్మరాక్షసుఁడ నైతిం జంచరీకాలకా. 296

వ. అట్లుర్వీపూర్వగీర్వాణుండనై సకలప్రాణిభక్షణంబునఁ గౌక్షింభర్యంబు ప్రవర్తిల్ల నివ్వటపి నాశ్రయించి యుండితి నిప్పటికి ముప్పదిసంవత్సరంబులు గడచె నమ్ముద్గలుండు చెప్పినట్లు నామరంది జయసేనుండై పుట్టె నవ్విప్రకన్యకవు నీవు నిన్నన్నరసాధకుమారునకుం బరిణయంబు సేసి యాసురం బగు నివ్వేషం బపనయించెద ననుటయు నలరుమొగంబున రాజన్యకన్య భూసురాసురున కిట్లనియె 297

క. ఇచ్చోట నానిమిత్తము, వచ్చిన యువ్విప్రు సుప్రసన్నత్వము నేఁ
డచ్చుపడ మనిచి ప్రదికిం, బుచ్చి జగద్వినుతకీర్తిఁ బొగడొందఁగదే. 298

క. భూసురహత్యాఘమహా, త్రాసమునకు వెఱతునని పదంబులఁ బడి గా
ఢాసక్తిం బ్రార్థించిన, నాసురకులశత్రవుఁడు దయాభిముఖుండై. 299

ఉ. ఆ విరితీవబోఁడి కృప కద్భుతమంది భవన్నియోగ మే
లా వృథయౌ ఫలింపక బలాయబలా యని విప్రుఁ గొంచు ర
క్షోవిభుఁ డేగి పీనుఁగున సుప్రదతీర్థమునం దొరల్చి సం
జీవితుఁ జేసి మందిరముఁ జేర్చి భజించి కుమారి కిట్లనున్. 300

క. చనిపోయిన నీయొజ్జలు, మనుగడఁ గనిరొ న్వసించె మందిరమున నో
తనుమధ్యా మెఱుఁగిడించిన, కనుఁగవతో నిలువు రాజుకడ నినుఁ జేర్తున్. 301

చ. వలదు విలంబ మన్నఁ బ్రతివాక్యము లాడక మోడ్పుకంటితో
నిలిచిన బ్రహ్మరాక్షసుఁడు నిర్భరవేగధురాధురీణుఁడై
పొలఁతుక నప్పు డెత్తుకొనిపోయె మనోజవుఁ డౌట నిల్చెఁ బా
టలనగరోపకంఠనిబిడద్రుమకాంచనసౌధవీథికన్. 302

వ. ఆసమయంబున. 303

శా. గొందు ల్వీడ్కొని పక్కణాంతరకుటీకూటాధ్వసంధు ల్వరా
స్కందు ల్బ్రాడ నవక్రచక్రములు మచ్చ ట్లాడ నిచ్చాగతిన్
గ్రిందు ల్మీఁదులుగా సతీపతులు గౌఁగిళ్ళాడ దీప్తుల్ దిశ
ల్పొందుల్ గూడఁ ద్రిభంగిభంగి మెఱసెం బుంస్కుక్కుటవ్రాతముల్. 304

చ. అతికృతికన్య నందినమురారివిరాజదనంతభోగసం
స్థితి బ్రతివారముం బొదల శిష్యులు పుణ్యజను ల్జయక్రియో
న్నతులు దురంతశాస్త్రకలనం బ్రతివాదుల నోర్వ సర్వతో
గతమతికుండు నిల్చెఁ గవికౌశికదిక్కుటకాగ్రపీఠికన్. 305

చ. వరవసులక్ష్మి నుల్లసిలువారికి నేమిగొఱంతె యీవిభా
కరునకు సంజనిచ్చి తిరుగంబడి లక్ష్మి హరింప నెట్టివో
నెరవులసొమ్ము సత్యమగునే యని వెల్వలనయ్యె వహ్నినాఁ
బరిగళితద్యుతి న్వెలఁకఁబాఱె నిశాంతనిశాంతదీపముల్. 306

చ. కనుఁగొని చైత్యనిత్యపథికప్రవిబోధకరంబులై ఖగ
స్వనము లుదగ్రబాహ్యవనవాటికల న్వినవయ్యె నయ్యెడన్
ఘనమదభృత్తమఃకరటికంపితదిగ్వటపస్ఫురన్నభో
వనరుహసంకురత్కుసుమవర్షము చాడ్పున జాఱెఁ జుక్కలున్. 307

సీ. ధారాధరస్మయోదయవియచ్చికురబంధమునఁ దారాలతాంతములు రాలె
రోదసీతనుసమారోహాంధకారైణమదవిలేపనరేఖ మసలిపోయెఁ
జక్రవాకస్తనస్థాతృనీహారఘర్మాంబువు ప్రత్యక్షమై యడంగె
మధుపకజ్జలభాసమానకైరవలోచనముల నిద్రాముద్ర వనలు పెట్టె

తే. మలయనిలయసుగంధసంబంధమంద, పవననిశ్వాసవీచికల్వారుదీర
సుధ ప్రభూతకళారమ్యసౌమ్యగమ్య, గంగసంక్రమాయామయామవతికి. 308

చ. తగఁ గుసుమాస్త్రకేళి దిగఁదన్నినచీరలు గౌఁగిలింతలుం
బగఁగొని యడ్డగింపఁగఁ దెమల్చినహారములు న్భరంబునన్
దిగిచినసొమ్ములు న్మదవతీతిలకంబులచేత వేఁకువ
న్మగుడ సపర్యఁ గైకొనియె మాన్యులు గారె గుణప్రదీపకుల్. 309

చ. కవిసి కవుంగిలింప నవకాశము చాలక ప్రొద్దుఁ జూచి లోఁ
జివికెడువారు హస్తముల జీవితనాథుల గ్రుచ్చిపట్టి వే
గవరుల మోవులాని యరగన్నిడువారును శయ్యలం బరా
భవ మొనరింపలేక పగపాల్పడువారును నైరి జవ్వనుల్. 310

శా. నానాదీపమరీచికల్ గొనియెనో నాఁ జూడ నిద్రాపరా
చీనస్త్రీనయనంబులం బ్రియదృఢాశ్లేషప్రకుబ్జీభవ
న్మీనాక్షీకుచము ల్దిగం గనికరామ్రేడీకృతోత్క్రాంతకాం
తానుష్ఠాధరము ల్జపాసుమము చెన్నారె న్నిశాంతంబునన్. 311

మ. తులనప్రేమరసోల్లసన్నిధువనచేతోజాతసంగ్రామకాం
క్షులు వారించె నుషఃప్రసూచకగతుల్ శాలాజరద్దీపికా
కళికల్ శైత్యదృఢస్తనస్తబకముక్తాహారము ల్వాసనల్
గలయం జల్లెడుపూఁత లిష్టరుచికృత్కర్పూరతాంబూలముల్. 312

సీ. శ్రమవార్నిమజ్జనజటిలాలకంబులు సంధూతకుంకుమస్థాసకములు
జాగరారుణితలోచనసరోజంబులు కాంతచుంబనముక్తకజ్జలములు
కరచపేటనిరస్తకరినక్రచిత్రంబు లభినవదిగలంకృతాధరములు
స్పృణిసమత్కరికాభరణభృద్గళంబు లనూననిద్రాముద్రితాననములు
తే. గాఢపరిరంభసంభ్రమక్లామ్యదచల, గురుపయోధరభరహారకువలమణులు
కలితతాంబూలరసరక్తగల్లతలము, లమరఁ గొమరాండ్రు పొలిచి రహర్ముఖమున.

శా. ఆశాఖడ్గమిళత్తమోమలినహృత్యర్థంబు నిర్వాంత్యసం
ధ్యాశిల్పిప్రభుకల్ప్యమానకురువిందక్షోదసమ్మిశ్రలా
క్షాశాణం బనఁ బ్రాచిదోఁచె బిసినీకాంతుండు జాగ్రత్పురో
దేశాంగారకరాజినాఁగ మొదలం దీండ్రించె సంధ్యాప్రభల్. 314

సీ. ప్రసవితద్యుక్షేత్రఘుసృణసస్యంబులు హల్లకప్రియసాలపల్లవములు
తిమిరేంధనప్రవర్ధితదావశిఖలు లుషఃపవనభుగ్వ్రతభోగఫలకమణులు

హారిపురంధ్రీకుసుంభాంబరంబులు ఘనప్రాక్పరిప్రాడ్జటార క్రియములు
దంభోళిఖండితోదయపతత్పుధిరంబులై రాజకాంగసింధూరసత్తమములు
తే. పక్షిసంతతిప్రమోదకృద్యామినీవి, యోగదళధూన్యధాత్రిఖిన్నోద్ధురమణి
నవ్యహల్లకతల్పము ల్వాడఁ జెలంగె, నంబరంబున నపుడు బాలాతపములు. 315

ఉ. ఇమ్ములఁ బశ్చిమాంబునిధి కేగు నెడం దగ వారక న్మయూ
ఖమ్ముల నెన్నికొంచితముగా నొనరించినవ్రేశ్వర క్రీలోఁ
గ్రమ్మఁగఁ బ్రాక్పరిస్ఫురద్ధరవిరశ్ములఁ బద్మిని వేగుపాటునం
గ్రమ్మఱ లెక్కఁబెట్టె ననఁగా వికసించె సహస్రపత్రముల్. 316

ఉ. గాసిలి రాజు మన్ననలు గాంచిన నే నొరుఁ జూడ నంచు క
న్మూసినభంగిఁ గైరవిణి మోడ్పఁ బతివ్రతవోలెఁ బద్మినీ
వాసరకృద్వియోగనవవహ్నిసముత్థితధూమరాజులో
నా సరసీజగర్భసదనంబులఁ బాసి నటించె భృంగముల్. 317

తే. ఇట్లు సూర్యోదయంబైన నేకతమున, బ్రహ్మరాక్షసుఁ డద్ధరాపాలుఁ గదిసి
పూర్వవృత్తాంతమంతయుఁ బొసఁగఁ జెప్పి, యబ్జముఖిఁ జూపి పెండ్లిగమ్మనుచు నిచ్చె.

వ. ఇచ్చిన. 319

క. ఆరామామణిఁ గైకొని, యారాముఁడు దాదరార్పితాతిథ్యుండై
యారామన్యగ్రోధగ, రారుహసౌధమున బ్రహ్మరాక్షసు నునిచెన్. 320

క. ఉనిచి ప్రణమిల్లి క్రమ్మఱి, చని యవ్విప్రాసురునకు సదసాన్ననివే
దనవిధికిఁ బుణ్యభూసుర, జనుల నియోగించె జనితసౌహార్దమునన్. 321

ఉ. కూరిమి తండ్రిపాదములకుం బ్రణమిల్లి సుకీర్తికన్య నం
భోరుహలోచన న్భువనమోహినిఁ జూపి ధరామరు న్నిశా
చారుచరిత్ర మేరుపడ సర్వముఁ జెప్పినఁ బుత్రు మెచ్చి యు
ర్వీరమణుండు బంధుపృథివీపతులం బిలిపించి యిట్లనెన్. 322

సీ. ఘనులార మనకు రక్తస్పర్శసంబంధ గాఁడె సుకీర్తి విఖ్యాతమూర్తి
దైవయోగమున నాతనిపుత్రిఁ గాంచనప్రతిమానగాత్రి చేపడియె మనకు
మనజయసేనకుమారున కాపూర్ణశీతాంశుముఖిఁ బెండ్లిసేయువలయు
లాలన నవ్విశాలాననఁ డిచటికి వచ్చినఁ జుట్టంపువరుస గాదె
తే. యతుల నయమార్గరతుల దండాధిపతుల, ననిచి రప్పింతమా యమ్మహామహాంబు
నతఁడు వీక్షించుఁగాకన్న నాప్తమిత్రు, లుచితమి కార్య మొనరింప నొప్పుననిరి.

క. నావిని మత్స్యల్లుఁడు హే, లావీక్షితనీతిశాస్త్రుల న్మంత్రుల సం
భావించి పనుచుటయు న, ప్పావనమతు లరిగి వినయపాటవ మమరన్. 324

సీ. రోహిణీవిరహాభీరుక్షపాకరబింబ మన ఘనగ్లానదీనాస్య మమర
నొసలునిండారి వెల్వడినశోకరసంబుతీరున వేఁడికన్నీరు దొరుగ
మెఱుఁగుటద్దపుబిళ్ళమీఁదికెంపులతెఱక్రియ గపోలమునఁ గెంగేలు మెఱయ
నతిపరుచ్ఛలమానలతభంగి నిశ్వాసధారచంద్రిక మోవి దల్లడిల్లఁ
తే. దనయ నీలోన లేదుగదా ధరిత్రి, చూపుమా యంచు ప్రార్థింపఁబోవుగతిన
దగ శిరమువంచి తనలోన దానపలుకు, మనుజపతిఁ గాంచి ప్రణమిల్లిమంత్రివరులు.
క. నతులై వినయవిచారో, న్నతులై నిలుచుటయు వదననలినములఁ దరం
గితదృష్టిచంచరీక, ప్రతతులు నటియింప ధరణిపాలుం డనియెన్. 326
క. అరుదెంచితి రెవ్వరు మీ,రరుదారం జెప్పుఁ డనిన నలికతటాంత
స్ఫురదంజలిపుటులై యి, న్నరనాథుం జూచి దండనాథవతంసుల్. 327
మ. క్షితినాథోత్తమ నేఁడు నీమఱఁది మత్సిల్లుండు పుత్తేర వ
చ్చితి మాలింపు తదీయభాషితము లస్తేయవ్రతబ్రాహ్మణ
క్రతుభుగ్వైరివంతసయోగమున నీగారాము నెచ్చెలి యొం
డితరక్షోణికిఁ బోకచేరె మము నీ వీక్షించి పోరాఁ దగున్. 328
క. అని దేవరతో విన్నప, మొనరింపం బంపె విక్రమోపేతపతా
కినితో సంబంధిపురం, బున కరుదెం చనిన భూవిభుఁడు సుముఖుండై. 329
వ. అమ్మంత్రులకుఁ బసదనంబు లిచ్చి యంతఃపురంబున కరిగి యింతికి నంతయుం దెలిపి విన్నయాదిప్రొద్దుగా సభార్యుండై చతురంగబలంబులు గొలువ వచ్చి సుకీర్తి మ ధ్యాహ్నకాలంబునకు పాటలీపురోపకంఠంబు గదిసె నప్పుడు. 330
ఉ. ఇంకనిశీవిశాల తనయింటికి వచ్చినఁ జంద్రసేనుఁ డ
భ్రంకషసమ్మదాభ్యుదయభాసురుఁడై యెదురేఁగుదెంచి ప
ల్యంకిక నున్నయప్పచరణాబ్జములం బడి కాంతకాంతిను
త్పంకజరాగపూగకృతధామకవీథికిఁ దెచ్చె దెచ్చినన్. 331
ఉ. ముందఱ నేగి యుబ్బువన మోహిని వాహినిపోలె నుబ్బుసం
తం దలచుట్టు కన్దొగల దట్టముగాఁ బ్రవహింపమనశ్రువా
రిం దులితేతరస్తనశరీరములం దిగుపారఁ జేయుచున్
వందన మాచరించి విరివాతెరతో మొగమెత్తి కేడ్చినన్. 333
సీ. కడుపులోఁ జేపెట్టి కలఁచిన ట్లగుటయు భక్తిఁ గూరిమిపట్టిఁ బట్టియెత్తి
శిర మురంబునఁ జేర్చి చెఱువు వ్రస్సినరీతి నోడి కల్గట్టి వెల్లువలు నశ్రు
ధారల నతిశాంతదశఁ గన్నతనువల్లి దడుపుచు గద్గదధ్వానలీల
భాషణంబుల నెంతపనియయ్యె నట్లుండె విధికృతం బనుచు నుర్వీవిభుండు

తే. గూఁతు నొండొకచందానఁ గుస్తరించి, యార్తి వారించి వలిసీట యాళిపాట
పాటలాధరవదనదర్పణముఁ గడిగి, యుచితకాంచనపీఠిఁ గూర్చుండ నంత. 333

ఉ. చిత్తము చెంగలింప జయసేనుఁడు సాఁగిలి మ్రొక్కి నన్మదో
న్మత్తవిరోధిరోధిరుచిమగ్నసమూర్తి సుకీర్తిఁ గీర్తిమై
నెత్తి కవుంగిలించె నపుడింపెసలారఁగఁ జంద్రసేనుఁ డు
ద్యత్తరసత్యభాషణవిధానుఁడు బావకు మ్రొక్కి యిట్లనున్. 334

క. దళితారి నీకుమారి, న్నిళితాంగవిలాస మైన మేనల్లున కీ
వలదే యిపుడని బద్ధాం, జలి యై ప్రార్థించుటయుఁ బ్రసాదోన్ముఖుఁడై. 335

వ. బ్రహ్మరాక్షసోద్యోగంబును బాంధవ్యంబునుం దలంచి సుకీర్తివర్తమానలగ్నంబున మిథ్యావలగ్నజయసేనులకుఁ బెండ్లిఁజేసెద ననియె నమ్మహోత్సవంబు వీటఁ బాటిలి ననాగతసంబంధిబాంధవంబును నాయాతశైలూషిశైలూషంబును నాగచ్ఛదఖిలాపనిపనికరంబును నాహూతబ్రాహ్మణజాతంబును నాబద్ధశుద్ధమాణిక్యతోరణంబును నలంకృతవిపణిమార్గంబును నభిరచితరంగవల్లీమతల్లికంబును నారాధితనవగ్రహంబును నఖండవాద్యమాననానాతూర్యంబును నై యమ్మహామహంబు ప్రవర్తిల్లె నాసమయంబున. 336

ఉ. బంగరుపీటఁ బెట్టి దడిపంబిడి రాజకుమారి దానిమీఁ
దం గదియించి తూర్యనినదంబుల రోదసి ఘూర్ణిలంగ శ్రీ
విం గడుపాటిపాట నరవేంద్రుకలం గొమరారు సువాసినుల్
చెంగట నక్షతంబు లిడి చేఁడియకుం దలయంటి రాదృతిన్. 337

క. సుమతైలప్లుతి నలరా, కొమరాలికి నలరెఁ గురులు కోకనదాంత
స్స్వమధూళిమగ్నమంద, భ్రమరీసమరీతినయనపర్వము లగుచున్. 338

తే. బుగులుకొను తావిసిరము కప్పురముతోడ, వడుపుదివ్వనిఘుసృణద్రవంబుతోడఁ
బొందుగా మేళవించినచందనంబు, నాఁతికొండొకకలకంఠి నలుగుఁ బెట్టె. 339

ఉ. అజ్జలజాక్షి వస్తుసుమహన్మతి మజ్జనశాలిబాలిక
ల్మజ్జనశాలఁ జేర్చి మణిమంజులపీఠముఁ బెట్టి దువ్వి పై
గొజ్జఁగినీరుచల్లి మెఱుఁగుల్గొన విప్పి విదిర్చి యొక్కచం
చజ్జఘనాంగ పెట్టె ఘనసారయుతామలకంబు నేర్పునన్. 340

ఉ. తోరపుజాలువాపసిఁడితొట్టెల నొట్టినపశ్చిమంబుప
న్నీరపరంజిబుంగలను నించి మనోహరకక్షకాంతిబం
గారువసంతమాడఁ గరకంకణఝుంకృతు లుల్లసిల్ల హే
లారతి నార్చ నొక్కనవలా జలకం బలకంబుకంఠికిన్. 341

సీ. జిలుఁగుపావడమీఁదఁ జికురధిక్కృతమిళిందాళియొక్కతివ మాంధాళిఁ గట్టె
తడియార్చి నెయపేశ్వడ దువ్వె యొకముగ్ధకలికివాల్గంటి గీల్గంటువైచె
నిలువుటద్దముమ్రోల నిలిపి యొండొకవధూతిలకంబు తిలకంబు దిద్దె నుదుట
నెరివుట్ట నొకదిట్ట నెఱవాదితనమూఁది కనుచెలు ల్వెలుఁగంద గంధ మలఁదె
తే. నొకశుకాలాపహారవల్లికలు వైచె, నొకవిలాసిని మణులకంచుకముఁ దొడిగె
నొకలతాతన్వి పెట్టెఁ గేయూరకంబు, లొకతటిన్నేత్ర యిడిరె బాలికకుసొమ్ము.
క. అక్కరిణీనిభగామిను, లక్కరణి నలంకరించి రాలో ధరణీ
భుక్కులచూడారత్నము, నక్కడ గైసేసి రాప్తు లగువా రంతన్. 343
మ. కదియుంబోయెఁ బతంగుఁ డస్తగుధరాగ్రక్షోణిసత్క్రించము
లొప్పదలె న్నిర్జరమార్గపల్వలమునన్ భూరిజ్వలజ్జ్వాలలున్
మొదలెం జాగృవియాపణాగ్రముల నెమ్మిల్సని దీపచ్ఛట
ల్పొదలెం జోళ్ళు రథాంగదంపతులు విల్వించెన్ మరుం డత్తఱిన్. 344
సీ. నూరెల వెలుఁగుపంజాలశరీరన్యస్తభూషామణిస్ఫూర్తి ప్రోదిసేయఁ
గైవారముఖరమార్గణవిలోచనకైరవముల వాననశశి వాడుదేర్ప
విమలబంధుస్వాంతవిధుకాంతముల గటాక్షజ్యోత్స్న విరవిర గరఁగుచుండఁ
గృతదృష్టికరణసంగతవధూటీహంసికల నీరజాకరము పిలువ
తే. గలువచెలికాఁడు పొడపుగుబ్బలివసించు,గతి నలంకృతసామజస్కంధ మెక్కఁ
బటహనిస్స్వాణముఖతూర్యపటల మెసఁగ,బుధజనాశీరవము లుబ్బ భూపసుతుఁడు.
వ. తార్క్ష్యారోహణుం డగు నారాయణునికరణి నేనుంగు నెక్కి జయసేనుండు నర్తకీ
నర్తకగాయనీగాయనమాగధీమాగధ బ్రాహ్మణీబ్రాహ్మణనాట్యగా నస్తవనాశీర్వాద
విశేషంబు లానందసంధాయకంబులుగా స్థానీయమీనలోచనమరీచికావీచికాకప
చితరాజమార్గంబున నేఁగుదెంచుచుండ. 346
ఉ. నీరము లాడి యాడి మదినిండినసొంపుపసంగ టీస్థలిం
జీరచెఱంగు వీడిపడఁ జిక్కుచుఁ దక్కినకొంగు నేలపై
జీరగఁ దన్నుఁ దామఱచి చెచ్చెరఁ జూడఁగవచ్చె నొక్కనీ
రేరుహపత్త్రనేత్ర యధరీకృతకంతుని రాజనందనున్. 347
చ. కుసుమసుగంధి యోర్తు నృపకుంజరుఁ గన్గొని మోహితాత్మయై
యసురుసురన్నదాని నికటాంగన యారసి నీకు నేటికి
ట్లుసురన నన్న నింటికడనుం డిటకుం బరువెత్తివచ్చును
క్కసనుసురంటిఁ బొమ్మనుచుఁ గ్రుక్కనఁబోలఁగ బొంకె నయ్యెడన్. 348

ఉ. పొంగినకిన్కఁ దోఁచినటు పోరుచు మంచముడిగ్గనీక చ
న్నుం గబళించుపుత్త్రునిఁ గనుంగొని యక్కట వీఁడు నాకు బ
ల్సుంగడమయ్యె నేఁడనుచు శయ్యపయిం బొరలించి త్రోఁచి వ
చ్చెం గలకంఠి యోర్తు నృపసింహము నెంతయుఁ జూడవేడుకన్. 349

ఉ. కే లగలించి పట్టి రతికిం బిలువీఁకులు సేయువల్లభుం
జాలుఁబొకాలు నిల్నిలువు సైఁచు మొకించుకతాళు మాను మీ
వేళ నిశాననం బనుచు వీడ్వడనాడి యురోజగౌరవా
ర్త్తాలసమధ్య యొర్త్తు కదియం జనుదెంచెఁ గుమారమన్మథున్. 350

చ. అరవిరిబాగుతమ్మరస మంటిన కన్నులు డిల్లపాటు క్రొం
జిఱుచెమటల్లను ల్లొనపుచెక్కులు చిక్కులు గొన్నసోరముల్
విరిసినకొప్పు నిశ్వసనవీచికలం దగ వేగ నొర్త్తురా
మఱుఁ గికనేల యీవిధము మంచిది పొమ్మని నవ్వి రంగనల్. 351

ఉ. మించి జయంబుఁ గైకొనునిమిత్తము నెత్తము లాడి యాడి యో
డించి పణంబు దెమ్మనుచుఁ డెక్కనఁ బట్టినప్రాణనాథుప
స్త్రాంచల మించుకేని విడనాడక నెవ్వడి నీడ్చుకొంచు శం
కించక నేగుదెంచె నొకకేసరిమధ్య కుమారుఁ జేరఁగన్. 352

*ఉ. కీలు ఘటిల్లువేణికతికిం బ్రతికూలత నొందఁ జంద్రజం
బాలిత మైనచన్నుఁగవ మధ్యముపై దయదప్ప ముత్తిరు
త్తెలిమి రాజిరాడఁగను మించులు శంపల గ్రమ్మతింప మం
దాలసవృత్తి నొక్కజవరా లరుదెంచెఁ గుమారుఁ జూడఁగన్. 353

వ. ఇట్లు పురస్త్రీరత్నంబులు నిజదృష్టిమసారసారంబుల నలంకరింప నేగివచ్చి సుకీర్త్రి మందిరద్వారంబున నవ్వారణావతరణం బొనరించి నారీజనార్పిత నీరాజనంబు లీక్షింపుచుఁ గక్ష్యాంతరంబులు గడచి చని ముందఱ † నతిముక్తాభిరామంబై బ్రహ్మసభను పుణ్యద్రవ్యసమీచీనంబై యాజనవాటంబును బల్లవకుసుమవిలసితంబై వసంతసమయంబును బ్రసిద్ధవర్ణగౌరవంబై సంగీతంబును నాట్యకార్యంబునం

---

*ఉ. మూలముఁ దార్చి సందుసుడిమూతులు నాకెడుగిండిదాని న
వ్వేళకు నొద్దఁబెట్టి యిదె వేవిడె మిచ్చెదఁగాని చూచెదం
గోలతనంబు పెండ్లికొడుకుం దలవాకిట నంచు వెళ్ళనీఁ
జాలనిభర్త్తఁ దేర్చి యొకచంద్రనిభానన వచ్చె వీథికిన్.

ఇది ప్రక్షిప్తమని తోఁచెడు.

† ఈస్థలంబున నుపమానోపమావాచకంబులు సాధారణధర్మవాక్యములను ముందు

దనరి భరతంబును పర్వధూర్వహంబయి భారతంబును సర్వతోరణవిహారంబయి జయశీలుని విబుధభవనసామ్యంబయి గ్రహమండలంబును రంభాలంకృతంబయి స్వర్గలోకంబును విశ్రుతావితానవితానంబయి కురుక్షేత్రంబును బ్రతిష్ఠితదధిముఖపాత్రంబయి మధువనంబును ననుకరించువివాహమంటపంబు డాయంబోయి.

ఉ. మోహనలీల నంత నొకముద్దియ గద్దియఁ దెచ్చినన్ మహో
త్సాహతభూమిపాలతనుసంభవుఁ డెక్కె ననంతరంబ దీ
నాహితనీతిసంచితగృహార్థుఁ డొసంగె సుకీర్తిభాసుర
వ్యాహృతి కుందనంపుహరిబాణమునన్ మధుపర్క మయ్యెడన్. 355

క. దానవశాత్రవుఁగా జయ, సేనుని నారాచకూఁతు సిరిగా మది న
మ్మానసపతి దలపోసి య, థానియతిని ధారఁబోసెఁ దనయన్ సనయన్. 356

క. లగ్నంబు గడిసె గగనవ, లగ్నం బెమ్మనిన బుధులు లలితగతి న్మున్
న గ్నలు గుచభరకించి,గ్నభగ్నలు నగుచెలులు సొంపుతోఁ జని కడకన్. 357

క గుద కొప్పు మెఱయ గవిసెన, గదియించినఘరునివింటిగతి నతిశయిలన్
గుద కొప్పు మెఱయ నింతికి, ముదితలు చిత్రాంబరమున ముసుఁగిడి వేడ్కన్. 358

క నడపింపఁగ మడుఁగులపై, నడురాజనిభాస్య యడుగు లొప్పెం గడున
య్యడుగులు కూర్మము లగునఁట, మడుగులపై బొరయకేల మానఁగ నేర్చున్. 359

*ఉ మోవవశమ్ముగాని తెలిము త్తెపుసొమ్ములతోడికమ్మపూఁ
దీవలవంటిబోంట్లు కవదివ్వెలతోఁ జెలిఁ దెచ్చి రద్ధరి
త్రీవరపుత్రుఁ జేర నధరీకృతరోహిణి రోహిణిం బ్రమో
దానహజక్క ముక్కు తునియ ల్వారిణాంకునిఁ జేర్చుచాడ్పునన్. 360

---

కొన్ని ప్రతులందుఁ గానంబడియెడిని. ఐన నీకవి యింతకుము న్నీగ్రంథమున నే యిట్టిఘట్టంబుల వచియించినరచనం బట్టియుఁ గొన్నిప్రతులయం దుండుటం బట్టియు నిట్లు సంస్కరింపంబడియె.

*శా. రాకాచంద్రనిభాస్య నెచ్చెలులు దేరం బ్రీతి నత్యూర్జిత
శ్రీకిం బట్టగుచుంగళా యుతవముం జేరంగ నేతెంచుచోఁ
గాకల్హారవమ త్తకోకిలలుజోక న్నూరలం డాసి ల
క్ష్మీకల్యాణముఁ బాడి రంతఁ బురహంసీయాన లుప్పొంగుచున్.

ఈపద్యము గొన్నిప్రతులలోఁ గానఁబడదయ్యెడు.

ఉ. ఆహరిణాక్షికేలు పతిహస్తమునం బతికేలు తజ్జగ
న్మోహినికేల నుల్లసిల నూతనసాత్త్వికకంకణాంకుర
వ్యూహముతోడ రాజతనయోత్తమహస్తమునన్ మహోవరా
రోహకరంబునం దిడె గురుండు సమంత్రకకంకణాంకముల్. 361

ఉ. అంతటఁ జిత్రభాగ్యవనికాంతరితం బరితశ్చరద్ధరా
కాంతపటావకుంఠనకృతకామినిఁ గన్గొనరామి వక్త్రసం
క్రాంతవిలాసలక్ష్మిఁ గనుకైవడి గడ్డముపట్టి యెత్తి ధీ
మంతుఁడు రాజనందనుఁడు మంగళసూత్రముఁ గట్టె నింతికిన్. 362

చ. అపుడు వధూకరోన్నమితమై తెలిముత్తెపు సేసఁబ్రాలు ధరా
ధిపసుతునౌదల న్మదనతీమణి నించె విభుండు నమ్మద
ద్విపనిభయానమౌళిఁ బోదివెం దలఁబ్రాలవి జాతికెంపుల
ట్లపరిమితప్రియాప్రియకరాంబుజశోణిమ నొప్పె నెంతయున్. 363

చ సరిమెటుఁ బ్రాలపుట్టికలసందున బట్టినపట్టుపుట్టముం
దెరఁ దెరలింపఁజూచె సుదతిం బతి యవ్విభుఁజూచె నింతి యా
య్యిరువురజూపులం గలసి యేసెఁ బరస్పరమర్మలక్ష్యము
ల్పరముల నిల్చి నెన్నడుమ సాహసబాణుఁడు సవ్యసాచియై. 364

క. విడువనితగు లిరువురకి,న్వడువున ననుకదణి నుభయవస్త్రాంచలము
ల్విడిదేరునక్షతలతో, ముడిఁబెట్టిరి పంచశరుఁడు ముడిఁబెట్టంగన్. 365

ఉ అంబరదంశితాఖిలసముగ్రమణిస్ఫుటవేదికాంతరా
దుంబరపీఠి నుండిరి వధూవరు లయ్యెలనాఁగ యగ్నిహో
త్రంబున వ్రేల్చె లాజలు ధరావరసూనుఁడు సంభృతానురా
గంబున నేమిచెప్పఁ దనకౌఁగిటి కింతిమొగంబు వ్రేల్వఁగాన్. 366

క ఆగామిప్రణయరణో,ద్యోగం బణఁచుటకు నేఁడ దొరకొనె నితఁడం
చాగురుకుచవగ నయారె, ఖాగురుఁ డడుగూఁది సన్నెకలు మెట్టించెన్. 367

సీ. అవలోకమొనరించి వసురఘుస్మరపదధ్యానసంపాదినౌత్తానపాది
నేద్ధ్వరుబుధులతో నీక్షించి రురుకుచశ్రీజితాహార్యవసిష్ఠభార్య
గళితచేలాంచలగ్రంధులై మ్రొక్కిరి యిలువేలుపులకు బెద్దలకు భక్తి
నుర్వీసుధాశనాశీర్వాదపూతాక్షతములు మస్తకములఁ దాల్చికొనిరి
తే. రాజకన్యక యంతఃపురమున నుండె, బెండ్లిచవికకు నేతెంచెఁ బెండ్లికొడుకు
విప్రులకు బంధుజనులకు విద్యవారి, శుభయనరనాథు లీప్సితం బొసఁగి రంత. 368

చ. నిరుపమశోభనాక్షతలు నించినపళ్ళెరము ల్ధరించి సు
స్వరమునఁ బూని యొన్నఁదగువర్ణములం బఱియింపుచుం ధరా
మరుల బహూకరింప గరిమంబున మూఁడవనాఁడు వర్తిలెం
బరమసుహృన్మనోజ్ఞమయి ప్రాఁకెనయమ్ములు నాఁటివేకువన్. 369

మ. నరులం గూర్చినతోష్పతోఁ బసపుమిన్నల్ దేఱునెమ్మోములో
గరిమ న్నాగమసానిప్రోలుదిరుగం గాఱంతులై తూర్యముల్
మొరయంగాఁ గడునొప్పునాకబలియాలోకాటికాపేటికల్
సరసాప్తిం జదివించి రాప్తులగురాజన్యుల్గురు ల్మెఱుఁగన్. 370

చ. అతికృతులై నృపోపకృతులై హితులై తవరారుధారిణీ
పతు లతులప్రభం బురముఁ బాసి గృహంబుల కేఁగి రంత రు
ద్వ్రితిపరిపంథి రాజసముపర్తి సుకీర్తితనూజ కిచ్చె నూ
ర్జితగుణరత్నపేటికలఁ జేటికలం బదివేల ప్రేల్మిడిన్. 371

క. ధాటీఘోటీఘటితవ, రాటీబోటీహృదాత్తరవుఁ డజ్జగతీ
తాటంకవతీపతిపటు, పేటీకోటీశతంబు బిడ్డకు నిచ్చెన్. 372

శా. సౌరభ్యాహృతివిశ్వభూజనమనస్సంతోషము ల్విస్తృతాం
భోరుద్రాగకరంకహృద్విహరణంబు ల్సారకర్పూరక
స్తూరీసాంకవగంధసారఘుసృణస్తోమంబుతో నిచ్చె సు
భూరిరత్నంబున కేడువారముఁ సొమ్ము ల్రాజు దేజంబునన్. 373

ఉ. ఆహతిగంధవాహముల నద్భుతహేషణదంభదూషణ
వ్యాహృతిభర్జితద్యుమణివాహములం గతిభిన్నమానస
వ్యూహములం గులీనమహిమోజ్జ్వలవాహములం గఠోరవీ
రాహితచిత్తభల్లుఁ డగునల్లుని కిచ్చె సుకీర్తికీర్తికిన్. 374

మ. కటకస్థాత్మమతంగజప్రభుమదౌత్కంఠ్యంబు వారించి యు
త్కటన క్షోణిపుచేతఁ బ్రాభృతముగాఁ గైకొన్నవైంధ్యద్విప
చ్ఛటలం భిన్నదిశావశాప్రియులఁ జంచజ్జంగమగ్రావధీ
ఘటనస్ఫూర్తుల నిచ్చె నల్లునకు భూకాంతుం డుదాత్తస్పృహన్. 375

క. అరదంబులఁ గుటిలాహిత, దరదంబులఁ గేతుపవనదళితప్రావృ
ట్ఛరదంబుల భరనతది, గ్ద్విరదంబుల నిచ్చె భూమివిభుఁ డల్లునికిన్. 376

వ. వెండియుం బేరుగలవస్తువు లిచ్చి జామాత నాదరించి తాను సుపకృతుండై సుకీర్తి
యాఁడుబిడ్డ నాలోకించి యుష్ణాశ్రుమిశ్రితాక్షుండై యిట్లనియె. 377

క. జనియించినయింటికిఁ జొ,చ్చినయింటికిఁ గ్రొత్తక్రొత్తసిరిగా సరిరా
నవబోండ్లు మేలుమేలన, మనుమిా వానుమితుల మైనమా కిం పొలయున్. 378

చ. మలసి ఋణానుబంధమహిమన్ హృదయేశ్వరుఁ డత్తి నత్తమా
మలతలగాకయుండఁ బతిమాన్తురు కాంతలు వారికన్నఁడున్
గలుగవు వన్నెవాసు లటుగావునఁ బుట్టినచోటు బుద్ధిలోఁ
దలఁచి తిదం ప్రిశక్తి పరతంత్రవు గమ్ము కుమారికామణీ. 379

చ. కృతనుతశీలరైయైనసతికిం బతివంటిగురుండు లేఁడు ని
శ్చిత మిది యమ్మునీషికి విశిష్టగురు ల్దలిదండ్రు లమ్మహా
మతు లుసురన్న విప్రుఁ బరిమార్చినపాపము వచ్చుఁ గాన నీ
మతముఁ దలంచి యత్తకును మామకు సేవయొనర్పు మోర్పునన్. 380

సీ. అత్తమామలచిత్త మలర నర్తిలవమ్మ ధవుని దైవంబుగఁ దలఁపవమ్మ
తోడికోడండ్రపొత్తును బాయనీకమ్మ మఱఁదులఁ గని మని తిరుగవమ్మ
యనుఁగుఁజుట్టములపట్టున వెట్టగాకమ్మ వఱపుళ్ళపై రక్తి వదలకమ్మ
కాఁగానిచెలుల డగ్గఱి చరింపకుమమ్మ యుత్తమస్త్రీలపొం దుడుగకమ్మ
తే. తోడుతోనైన వందనుతోడనైన, నొంటిపాటున భాషించు టుడుగవమ్మ
పనులఁ గొనకమ్మ భూసురాంగనలచేత, వ్రేలఁ జూపించుకొనక జీవింపవమ్మ. 381

ఉ. శ్రీవరవర్ణినీదనుజశిక్షణదీక్షులయట్లు దేవియున్
దేవరబోలి నీవు భవదీయవిభుండు నఖండసౌఖ్యసం
భావితులై మహాతనుకుమారు నఖర్వసుపర్వసర్ము నా
శావినుతైకశక్తిఘను జంపతు లూర్జితలీలఁ గాంచుఁడీ. 382

శా. తల్లీ నిన్నెడఁబాసి యుండొకముహూర్తంబైన నైరింప నా
యుల్లం బోర్చునె పుత్రునీక నిను వయోభ్యదైన మిట్టిచ్చె నే
వెల్లింబోయినవంతఁ గుందవలసె న్వైయ్యంబుఁ బ్రార్థించి వి
ద్యుల్లేఖానిభదేహ నిన్బ్రింపఁ బుత్తున్ శీఘ్రకాలంబునన్. 383

వ. అని సుకీర్తియార్తిం దలవంచుకొనియె నంతఁ దదీయసతి కాంతిమతి పుత్రిం గవుం
గిలించుకొనుచుఁ గన్నీరుకరతలంబునం దుడిచి డగ్గుత్తికఁ బెట్టి యొట్టకేలకు ధైర్యంబు
చిక్కంబట్టి యిట్లనియె. 384

క. నాయనుజాఁడు మత్సల్లుం, డీయిలు నాయిలు సుసేనుఁడీజయసేనుం
డోయబలా నీపెనిమిటి, పాయసమున నేయిదొరయఁగుబా గేర్పడియెన్. 385

చ. ఇరువుర మేను లారయఁగ నెక్కడ నుండిననేమి యొక్కడం
దరలదు గాదె మాయసుఖితానము నిన్నది వర్తమానవ

త్సరమునఁ బిల్వబంచెద విశాలకు నెమ్మదినుంచు పోయి క్ర
మ్మఱియొద నంచుఁ బుత్త్రిఁ దగుమాటలఁ దేర్చి సగౌరవంబునన్. 386

వ. వివిధాభరణంబులు చిత్రవస్త్రంబులు పరిమళప్రముఖంబు లగుసర్వవస్తువు లిచ్చి బంధుజనుల నియోగంబు వడసి చతురంతయానాధిరూఢ యగుచుఁ జతురంగసేనాపరివృతుం డగుసుకీర్తితోన మరలి పురంబున కరిగి సుఖం బుండె. 387

ఉ. ఆజయసేనుఁ డంతఁ బరమాదరణంబున బ్రహ్మరాక్షసుం
బూజలఁ దన్పి కేల్మోగిచి పొందిక మీఱన నుత్సహించి గో
త్రాజరదైత్యుఁ డానరవరాత్మజు మన్నన సేసిపోయె నం
భోజభవాలయంబునకుఁ బుష్పకమెక్కి సురల్భజింపఁగన్. 388

వ. ఆరాత్రి మజ్జనభోజనాదికార్యంబు లాచరించి. 389

సీ. చంద్రికపూవన్నెజిలుఁగుకుచ్చులమేల్కట్టుదంతపుఁగోళ్ళపట్టెమంచ
మెఱుఁగుబిల్లలుపట్టుపఱుపుకప్రపుఁబల్కుసురటి క్రొవ్విరులు కస్తూరిరాయి
పూపుగట్టినగందపొడికదంబముపెట్టె కలపంబుచికిలిబాగాలబరణి
పండుటాకులు నానవాల్పావకములును గండచక్కెర తెల్లపిండివంట
తే. సంజసరిపట్టుబకదారిజాతిపొరు, వనులు గుజరాతికెంపుదీపములు బూతు
చిత్రపటములు కుడిగిరుచెంబుగలిగి, తనరుసదనంబు రాజనందనుఁడు సొచ్చె. 390

సీ. మంచికప్రము మేళవించినపన్నీట సరసాళిజనము మజ్జనముఁజేసి
జిలుగుమాంధాళి కుచ్చెలఁబోసి కట్టి దేహమునఁ గుంకుమరసం బప్పళించి
చికిలిపైఠాణికంచుకము గీలించి చొక్కము లైనమణులహారములువైచి
సొగసుగా నుదుటఁ గస్తూరిరేఖ యమర్చి కళుకులు ముద్దుచెక్కుల ఘటించి
తే. గోరజవ్వాదిపదనిచ్చి కూడదువ్వి, కుసుమగర్భంబుగా జాలుకొప్పుఁబెట్టి
చవులచేర్చుక్క సీమంతసరణిఁగూర్చి, కన్య నిష్టాన్నసంతుష్టఁగా నొనర్చి. 391

ఉ. కూరిమి బుజ్జగించి యనుఁగుంజెలువ ల్దనుఁ దేర సమ్మదాం
కూరమహావిలంబమునకుం బనిలే దనఁ బోకపోకమం
చూఱటలేక సిగ్గుతెరువుండగ ముందఱఁబోయి పిమ్మటం
గ్రూరవిపాణమేషమయి కొమ్మ చనుం జనలేక క్రమ్మఱున్. 392

ఆ. వనిత నిలిచి నిలిచి వచ్చుచు మంజీర, మండనములు మాని మాని మొరయ
లజ్జ విడువరాదు లావణ్యవతులకుఁ, బ్రాణనాథుతగులుఁ బాయరాదు. 393

వ. ఇట్లు కేళిమందిరంబు చేరందెచ్చి 394

ఆ. చెలులు బలిమిఁజేసి పిలిచినఁ దల్పంబు, చేరరాక సిగ్గు చేర్లకొనఁగఁ
గ్రమ్ముడియును మోము కొండొకమాపట్టఁ, దలుపు దండగొనుచు నిలిచియుండె.

క. రతిబోటులంత మంద, స్మితచంద్రికవదనపర్వశీతద్యుతులం
దతులగతి మెఱయఁ దేజో, న్వితునకు నృపసూతి కిట్లనిరి నేర్పొలయన్. 396

క. ఈపాఁపపూఁప వయసుది, నీపాదములాన మెత్తనిది పేర్కొనరా
దేపనిపాటలనేనియుఁ, గాపాడుదుగాని గాసిఁ గావింపకుమీ. 397

తే. ఎంతతమకంబు గలిగిన నిగురుబోండ్లు, చేర నొల్లరు మగవారు చీరుదనుక
నది యథార్థీకరించి నీయలరుబోఁడిఁ, గదిసి పిలుతువుగాని కొంకెదవుసుమ్మి. 398

క. అని నగుచు మగువలందఱు, పనినెపమున నొక్కరొకరె పఱచిన లజ్జా
వనతాస్య యగుచు నంగన, మనమున ననుసిగ్గుదేరి మానాకృత్తన్. 399

ఉ. ఉవ్విళులూఱుచు న్వికసితోత్పలలోచన చూచు వల్లభున్
దవ్వులజూమభర్త దను నర్మిలిఁ జూచినఁ జూచు దంతలో
బువ్విలు వంచిఁబాణ మరి బోసి దయాంబున డాని శింజినిం
జివ్వునఁ బాపి యేసె నలచిత్తజుఁ డిద్దఱ సవ్యసాచియై. 400

క. ఆత్తఱి రాజకుమారుం, డెత్తినతమకమున ననునయోక్తుల సరసా
యత్తవిచేష్టలఁ గన్నియ, చిత్తము గరఁగించి సజ్జ జేరఁగఁ దెచ్చెన్. 401

సీ. మగువ నీకంకణమణుల నర్ఘ్యము లని పరికించు నెపమున గరముఁ బట్టె
నెత్తమ్మితావు లీనెడునీమొగం బని మూర్కొనువిధమున ముద్దుఁ బెట్టె
తేమ నీకంఠమాలిక దొడ్డసామ్మని తడవులాగున ఘనస్తనములంటె
బిఱుచుట్టుబిగువున విఱుగదేనడు మని సడలించుగతి జీరముడి వదల్చె
తే. నాఁతినీయెమ్మునాయెమ్మునకు సమాన, మయ్యెడినొకాదొ యటఁ గాములరయవలయు
నని మహోత్కైతవంబున నధిపపుత్రుఁ, డంబుజాననపరిరంభ మాచరించె. 402

ఉ. వేడుక లంకురింపఁ బృథివీవరుగౌఁగిలి మందుసోఁకి సి
గ్గూడని బాడిన న్నగుఁ బ్రియుండు హసించినఁ బిల్వమాఱుమా
టాడు మొగంబునం దెలివి యచ్చుపడం దఱితోడ నిమ్మనన్
వీడియ మిచ్చుఁ గన్నులకు విందగుచుం గలకంఠి వేమఱున్. 403

ఉ. జీనువముక్కుతోడఁ బ్రతిసేయఁగవచ్చిన గోరఁదీరుగా
నీనియ లొల్చి చుట్టి తనకిచ్చినవాగరఖండ మూర్వరా
జానిసగంబు వోఁ గొఱికి చానరదంబుల కందియయ్యె నా
లో నవినొప్పె వజ్రములలోఁ దళుకొత్తెడుకుందనం బనన్. 404

ఉ. చాతురిమీఱ మస్తకము సందిట బిగ్గరఁ గ్రుచ్చిపట్టి యా
నాఁతిసుధాధరంబు రదనంబున నొక్కినఁ దాళలేక నీ

రాతిశయోక్త్వ మేది బొమలార్చును కన్నరమూసి వల్లభుం
జేతుఁ ద్రోచి రాజముఖి సీత్కరణం బొనరించెఁ బల్మఱున్. 405

ఉ. అంగజసాంపరాయము సమాప్తివహించిన నిర్భరత్రపా
లింగితచిత్తయై యబల లేచి కటిన్స్రవదంబరాంచలం
బుం గదియించి హేమమణిపుత్త్రిక చాటున కేగుచోఁ బున
స్సంగమవాంఛ పుట్టె నృపజన్మున కిష్టవిలోకనాయతిన్. 406

వ. ఇట్లిచ్ఛానురూపవిలాసంబులం బొదలి సుఖించి రద్దంపతులు మఱియును. 407

సీ. సురభిపుష్పామోదఁ జొక్కించె నారామసీమ నారాజన్యచిత్తజుండు
కలహంసగమనఁ దెప్పలఁ దేల్చెఁ గాసారతటముల నానృపోత్తమసుతుండు
కంఠీరవవలగ్నఁ గరఁగించెఁ గృతకాద్రిగుహల నద్ధాత్రీశకుంజరుండు
కలకంఠి ననురాగ మొలయించెఁ జివురుఁజప్పరముల నవైరిభంజనుండు

తే. గారుడాశ్మచ్ఛటాచ్ఛన్నకనకసౌధ, పాళికల నావితీర్ణవిభ్రాజితుండు
రతులఁ బొలయించె నాశరద్రాజవదన, నతిశయప్రీతిలతిక మాటాకులిడఁగ. 408

క. మహిళారత్నంబును న,మ్మహిరమణసుతుండు భోగమహనీయకళా
విహారలీల నుండి రని యల, బహుమానుఁడు క్రకచుఁ జూచి పలికె న్మతిపూన్.

క. దొరికినవిశ్వాసకరిత్రీ, వరకన్యక విడిచె వెఱ్ఱివాఁడై యడవిన్
మరణమయి మనినమందుఁడు, పురుడింపఁగ నీకు దోడుఁ బోవఁడె క్రకచా. 410

ఆ. తనకుఁ దెవులు మాఁడె నని భార్య సెప్పిన, నీవు దానిమాట నిజము సేసి
నెయ్యుఁ డనక నన్ను నిగ్రహింపఁ జూచితి, చెడుఁగ నిన్ను విశ్వసింప నగునె. 411

క. వెడమాయలపుట్టిల్లగు, చెడుగుం గళ్ళలు పాపశేషంబునఁ జే
పడినకతంబునఁ గాఁపుఱ, గొడు కొక్కఁడు రాజబాధ గుందఁడె తొల్లిన్. 412

క. నావిని జలచరరమణుం, డావానరవిభుని కనియె నది యెట్లు ధరా
దేవస్తుత యాకథఁ జెపు,మా వినియెద ననిన నతని కతఁ డిట్లనియెన్. 413

సీ. ఆరసాతలగభీరాపారజలఖేయ మానాకరమ్యసాలాభిరామ
మాచంద్రమండలవ్యాయామమణిసౌధ మాబ్రహ్మశుద్ధవిప్రాన్వవాయ
మాప్రాణపవనశౌర్యాయూథనక్షత్ర మాఘలోద్యమసముద్యమకిరాట
మాదార్ఢ్యధర్మకార్యారంభచరణజం బాచక్రవాళశైలాశుతురగ

తే. మాంబరప్రాంశుదానధారాఢ్యనాగ, మాధ్రువస్థానపథశతాంగాతిశయము
బ్రహ్మకైనను బ్రస్తుతింపఁగఁ దరంబె, భూపదురునూపురంబు కాంచీపురంబు. 414

క. అలకాంచితమయి తనరిన, యలకాంచివిహారభద్రుఁడను పేర మహా

హాలికుఁ డొకఁ డుండు నలంది, కృకలబాహుం గలిమిచట్టుకొడు కితఁ డనఁగన్.

సీ. అలుగుంపులు గొటియలదొడ్లు తేఁబూరిరెనుములమునిమంద లెడ్లకదుపు
లులుఁగరంబులు వాఁలుపాలమువాకిటఁ బదికట్టుబండ్లింటికిఁ జొట్టుమగులు
తలుపుదూలము కొట్టములు సోగరాగాడిమచ్చు ముంగిట రెండు దచ్చమాకు
లీనుగోడిగె వేగురింటిబిడ్డలు మాళ్లతార్పులు నూబపాఁతిఅలఁ గొలుచు

తే. కలుపుకలిలేరుదండయుఁగమ్మతీగ, పొగడము పూసె నానెట్టె బవిరెపడిగె
చుక్కబొట్టును జిటిపొటిసొమ్ము గలిగి, కాఁపురము సేయుసవ్వీటఁ గాఁపుకొడుకు.

క. వానికి నిచ్ఛావతి యనఁ, గా నొకయిల్లాలు గలదు కమనీయవయో
నూనవనంబున నది జా, రానందలతాలవాలయై వర్తిల్లున్. 417

వ. అది యొక్కనాఁడు. 418

చ. తలఁ బెనుగుండఁ దాల్చి వితత స్తనభారమున న్వలగ్న మా
కులత వహింపఁ గాఁప వలిగుబ్బెత పట్టపగ ల్జలాశ ని
ల్వేలువడి మన్మథాస్త్ర పటలీనిశితాక్షకటాక్షమాలికల్
గెలఁకులఁబర్వ వేగవతికిం జని తత్తటినీతటంబునన్. 419

ఉ. కోమలధూళిధూసరితకుంతల నాతపరక్తరక్తదృ
క్తామరసుం గటీరపరిధాననిబద్ధకరాసిఁ బాదర
క్షామిళదంఘ్రిపద్మముఖసం స్తరణేతరచిత్తు గాఢచిం
తామయుసాంద్ర నద్ధ్వజనితశ్రమపీడితుఁ గాంచె నొక్కనిన్. 420

క. కాంచి దృగంచలశోభా, చంచచ్చంద్రాతపమున శాంతశ్రముఁ గా
వించి యలవిందునకు మదిఁ, గొంచించక హాలికలికుచకుచ యిట్లనియెన్. 421

మ. నిలువం జోటులు లేవె నీకుఁ జెపుమా నీరాటి కీవేల హా
తెలిసెం బాంథగతాగతైతదిధపృథ్వీభృత్పురస్త్రీకళా
కలితాస్యద్విజరాజబింబకృతసాక్షాత్కారసంభావనా
కలనన్ దూరపథప్రయాణజనితగ్లానిం ద్యజింపం జుమీ. 422

క. కలదుగదా యని మోవిన్, బలుమిండలు సందడింపఁ బలికినఁ జింతా
కులహృదయుఁ డగుట వాఁ డ,చ్చెలిమాటలు వినక సరకుసేయకయుండెన్. 423

వ. అట్లదత్తిప్రతివచనుండై యుండ నమ్మిండత వెండియుఁ దెరువరి నీక్షించి. 424

శా. అంపంజాలము చింత నీమనసు చీకాకాట నామాట లా
లింపం గూడదు నేఁడు క్రొమ్మెఱుఁగుదూలె న్నేను వీక్షించినన్
సొం పొక్కింతయు గానరా దెఱుఁగవచ్చుం జెల్లఁబో చుట్టమా
కొంపంబో రుదయించి రావుగద నాకుం జెప్పవమ్మా నీకథల్. 425

క. అని పరిదాఁకంబలికిన, విని కొండొకమనసు పల్లవించిన దానిం
గనుఁగొని యతఁ డనునా; డ్నునఁ దెలిసితి వింటఁబోరు పుట్టుట తరుణీ. 426

ఉ. సేర మొకింతలేమియును నిర్దయు లైనను గన్నతల్లి దు
ష్కార్యరత కోర్చి రాయుఁ దనకోడలి రేలు పగళ్లు కంట వ
గ్గోరము జూడలేక మదిఁ గుందుచు నిద్దగనాడి పోయితిన్
వారణలేక రాజుఁ గొలువం జిరకాలము దండుఁ జేసితిన్. 427

ఉ. నా కవనీశుఁ డిచ్చె నదనం గదనంబున నస్మదీయబా
హాకరవాలధారభయదారులు గూలినఁ జూచి మెచ్చి కో
రాకృతకృత్యయందు సవరాలు వరాలు సరాలు రూకలుం
గోకలు మానికంపుఁదలుకుల్ మృగనాభిజవాదిక ప్రముల్. 428

ఉ. ఆకమనీయవస్తుతతు లన్నియుఁ దెచ్చి నమస్కరించి యు
త్సేకరసం బెలర్పఁ దనచేతిక నిచ్చిన వాని నన్నియున్
గైకొని జల్లి బాష్పకలికాతరళీకృతలోచనాంతరయై
కాకుతనంబు సేవె గొడుకా యిఁక నేమన నేర్తుఁ గోడలిన్. 429

ఉ. తిట్టినఁ దిట్టు బెట్టుఁ జిటిదిండికిఁ గొల్చిన కొల్చు సాగ ది
చ్చిట్టకమన్న మూతులకుఁ జేతులు సాఁచు నొకప్పుడేని యి
ల్పట్టదు సంతకూటములఁ బాయదు చేయదు చెప్పినట్టు నీ
అట్టడిజంత యిల్సెటిచె రాతనయా యనయానుషంగతిన్. 430

క. కాపరమున వెండియు నది, గావించినపనులు పెక్కుగల వవి నాకే
లా వినుపింపఁగఁ బిమ్మట, నీవె యెఱింగెదవు డాఁగునే యపకీర్తుల్. 431

క. నీవఁట యదియాఁట నలసిన, త్రోసం జనుఁ డింక మమ్ము దూరఁగఁబనిలే
దీవఱదమ కారోఁతల, దేపళ్లంబడితి వినివితిం గోడలిచేన్. 432

చ. కొలపగగాక యత్తకును గోడలికిం బరికింప నెయ్యముల్
గలవె వలానిమచ్చరముఁ గైకొని యీముదిముండ చెప్పెడున్
బలుమఱు నంద్రు దానిగుణభంగు లెఱుంగనివారు సర్వమున్
దలిసెడుఁ గాదె చేయగలితే మఱిదాఁగునె పుణ్యపాపముల్. 433

క. పూవకపూచెం గడపట, కావకయు న్గాచె నచుఁ గడగన్నులఁ గెం
పావహిలఁ దల్లి సెప్పిన, యావాక్యము లన్నృతపుయములని యవ్వేళన్ 441

తే. తల్లి పలుకులు గాదనఁ దాల్మిలేక, యుత్తమాంగనఁ గులకాంత నొండునవక
బ్రతుకుభాగ్యము విడిచి నిర్భరవిరక్తి, నరుగుదెంచితి ననిన నయ్యంబుజాక్షి. 435

ఉ. ఆతనిఁ జూచి యిట్లనియె నట్టిద తప్పదు నాఁతి నీతితో
జాతి దలంచి సిగ్గులకుఁ జచ్చుచునుండిన నుండెగాక కా
మాతురతాతిరేకమున నాఁడిపోకలఁ బోవఁజూచినన్
వేతరవుండి పట్టుకొన నీరజగర్భునకైన శక్యమే. 436

క. కులసతి యుత్తమురాలని, దెలిసియు నీతల్లి మనసు దెలిసియు దగదీ
యాలుక మతివెట్టి దెలిసెన్, దల ఱోకలి చుట్టు మనువిధం బిదిగాదే. 437

క. నావిని యతఁ డిట్లనుఁ జెను, ద్రోవలఁ బోకుండ సుదసతుల నెప్పటికిన్
గావఁగరాదా పతులకు, నీవనియెదొ యెల్లవా రనిరో యిబ్భంగిన్. 438

క. మిన్నులపైఁ బోవదుగద, యిన్నేలనెకద మృగాక్షి యిటు లెవ్వరికిన్
గన్నాఁ దదు నెన్నె చెప్పు మన, నన్నెలఁతుక నవ్వి వాని కపు డిట్లనియెన్. 439

క. పరసతి నని చని యనుఁగుం, బురుషునితోఁ గూడి నిలయమున నాఁడోసఁగన్
సురతసుఖములు మును గొని, యిరవందగ నీకు విత్తమిత్తుం బుత్తున్. 440

క. ననుఁ జూడఁగలవె తొల్లిటి, ఘనజఘనలకైన తపంబు కతలుం గితలున్
వినిపింప నేటి కన్నియుఁ, గనుఁగొనియెదు గాక నేఁ డఖండప్రీతిన్. 441

ఉ. ఇచ్చట నుండ నేల తొలియిల్లుపడం బసిబిడ్డతల్లితో
వచ్చితి నేఁ బ్రవాసి నిలువన్వలెఁ బ్రొద్దుదయించు దాఁకనం
చచ్చుపడంగఁ బల్కు తమయాతనితోఁ దలసాఁపనిల్చి యో
ముచ్చటకాఁపయేనయల ముందటికార్యము లాచరించెదన్. 442

క. అని వేగవతీజలములఁ, గొని యామణిమంతుఁ దోడుకొని మృదుగతులన్
జనియె నొరు లెఱుఁగకుండం, దన ఝులు రెడిసాని యపు డతని కెఱిఁగించెన్. 443

ఉ. అంతట వేఁడివేలు పసరాద్రిఁ దిరోహితుఁ డయ్యె వాసరాం
తాంతరుచు ల్సెలంగెఁ గలయం దొలిచీకటిపర్వ సీరసీ
మంతినిమాటమీఁద మణిమంతుఁడు చీరముసుం గొనర్చి యొ
క్కింతభయంబులేక వడి నేగెఁ గృషీవలునిల్లుచేరఁగన్. 444

వ. ఏగి యఖండోత్కలికుం డగుహాలికున కిట్లనియె. 445

ఉ. నాపడుబాటు కే వగవ నా కనుకూలగతిం జరించునీ
పాపనితల్లి కీవికచపంకజలోచనకై దురంతసం
తాపముఁ బొందెదం దగినతా విది గావున వచ్చినాఁడ నేఁ
డీపని గాడిదఱడ వసియించి ప్రభాతమునందుఁ బోయెదన్. 446

క. ఉండుము నా యన నాయన, మండుచు నిట్లనియె మంచిమాటే యిది మా

యింధులు విడుదులె పురి గుడి, గుండంబులు లేవె పండుకొను మనో్చటన్. 447

క. పాసఁగ దని ముక్కుడుస్సిన, పసరముగతి రేఁగి రెడ్డి పలికిన నాలోఁ
బసిబిడ్డ నెత్తుకొని సం,తసమున రెడిసానిఇచ్చి తనపతి కనియెన్. 448

ఉ. చెప్పు మదేమి యేలరాదసేసెదు నాకిటువాఁడ లెవ్వ గం
చప్పలుగాకి తా నెఱుఁగన ట్లడుగం బ్రియుఁ జూచి వాఁ డనున్
గప్పినమబ్బులో నితఁ డొకం డిదె వాకిట నిల్చి చోటుకై
యొప్పెడు నెన్నఁడేనియు నెఱుంగుదునో ననుఁ దా నెఱుంగునో. 449

ఉ. ఆలఁట చంటిపాఁపడఁట యంగడిలేదె పచారముల్ గృహం
బేల ప్రవాసి గాఁడె తన కెక్కుడనైనఁ బరుండరాదె యీ
నేలయె గాని నిల్వఁ బెఱనేల మనోజ్ఞముగాదె యంకచం
డాలముగాదె యిట్లునికి నా నది రెడ్డినిఁ జూచి యిట్లనున్. 450

ఉ. ఆలఁట చంటిపాఁపడఁట యాయన యెంతటివాఁడొ యేరికిన్
జాలిది గాదె యిట్లేడలఁజాలనివారు బయళ్ళనుందురే
వేలుపులైనఁ దక్కురుల వేఁడరె యక్క అపాటుసం జలం
బేల పరుండనిమ్ము మన కిప్పని పుణ్యముగాదె వల్లభా. 451

క. పసిబిడ్డతల్లితోఁ గ,క్కస మొండొకదెసకు నరుగఁగా నితనికి ని
వ్వసుధఁ దలఁ గట్టుకొనియెదె, కసరకు నేఁడెల్ల నుండుఁ గా కిచోటన్. 452

క. చాలుఁ బిసాళింపకు మని, యాలరిరెడిసాని మగని నదలించి సుతుం
డాలును నీవును నిచోఁ, దాలిమి వసియింపు మని యతని లాలించెన్. 453

వ. ఇట్లుపలాలితుండై మణిమంతుం డయ్యింటిపసులకొట్టంబున నుండె నంత. 454

సీ. కలదండి పసిఁబిండి కాఁచి చేమిరిఁ బెట్టి యొఱగకుండఁగఁ బట్టి యుట్టినొట్టి
కోళ్ళసంకటితోడఁ గూడు నీళ్ళిడి జాగు నెరపక బంటుబానిసలఁ బనిచి
తనివెచ్చకలినీటఁ దా నమర్చి యనుంగునిసువు జోవలఁ బాడి నిద్రఁబుచ్చి
యోతువు గొనిపోవకుండఁ గూయిడ దెచ్చి కోడితండంబులఁ గూండ్లగమ్మి

తే. దాలిఁ గాఁగిన నీరాడి నీలికమ్మి, మడుఁగుఁ బైఁగప్పుకొని కాళ్ళు ముడిచిపట్టి
మంచమునఁ గూలి నిదురించుమగనిలేపి, కూరయును వెన్నఁ బడవైచి కూడొసంగి.

తే. సన్నజాదపునేఁతమంచంబుమీఁద, దుగ్ధగంబడిఁ బఱచి నిద్దురకుఁ దూలు
మగనిఁ గూర్కకు మనుచు నమ్మాయలాఁడి, వెడదగంగాళమునఁ గూడుగుడిచిలేచి.

క. గుడుసుంబోఁకలు బ్రద్దలు,ల్పడ తోఁకటఁ గుమ్మితెచ్చి పతికిడి సున్నం
బిడక యొకకొన్నిసున్నం,బిడి యొండొకకొన్నిమడుపు లిచ్చుచుఁ బలికెన్. 457

క. మగవాఁ డనఁగాఁ గుమ్మెద, పొగరుంబ్రాయమునఁ గన్నుపూవుల నెల్లన్
దగిలి రమియించుఁ గలదే, మగవానికి నెందు సరిసమానము జగతిన్. 458

ఉ. వారణలేక హస్తిగిరివల్లభు సేవకు వచ్చిపోవుచి
న్నారిమిటారు లీపురమునం గల రచ్చవురాకుబోండ్లతోఁ
దారసమైనతీరుగలదాని నొకానొకపోటి నెన్నఁడై
నా రతిఁ దేల్చవే కనువినం బ్రియమయ్యెను నాకు నింతయున్. 459

చ. పలుచనిమేను నిబ్బరపుఁ బ్రాయము వాఁడవు కంచి కెప్పుడుం
గలిగిన రెడ్డివిం గొనఁగఁ గత్తవు కాఁపుర మెచ్చునిన్ను నే
వెలయొలనాగ పిల్వ దది వేడుకఁ బోలిన నీకుఁ జిత్తమే
పొలఁతుకమీఁద నుండు నిది బొంకక నాకెఱుఁగంగఁ జెప్పుమా. 460

క. తపవులనుండియు నిది ని, న్నడిగెద నని యుంగు మఱితు ననుటయుఁ గాఁపుం
గొడుకు విడియంపుసొంపుం, జమపుం బెనఁగొనఁగ నప్పిసాళికి ననియెన్. 461

ఉ. ధీరత మంచిదానిపగిదిన్ మృదురీతుల వేఁడిమాట లే
తీరున నైనఁ బిల్చుకొని తిట్టుదుఁ గొట్టుదు నంచుఁ జూచెదే
యూరకయున్న జాల్వెఱతు నందు మెఱుంగుదు నిన్నుఁబోల ది
క్కేరడ మిట్టిగోల కెతెఁగింపక యెవ్వరితోడఁ జెప్పుదున్. 462

క. నావిని వెండియు నలయి, చ్చావతి పతిఁ జూచి పలికె సరసత నేనై
కావలెనని వేఁడుదునఁట, నావలనం గనలుపుట్టునా యింతైనన్. 463

క. వేడుకపుట్టెడు విన నా, తోఁడుసుమీ చెప్పకున్న దోషము లేదే
చేఁడియుఁ బోయితి వనఁ జలి, వీడి కృషీవలుఁడు నవ్వి వెలఁదికి ననియెన్. 464

ఉ. ఒట్టవు సత్యమే నెఱుఁగ నొండొకభోగము దానిఁ గాంచికా
పట్టణమందుఁ గూడి గడపె మనవాకట నాడి పద్యముం
గట్టినవీటిలంజగుతిగాఁ దిరుగాడ నెఱుంగవేమొ నా
చుట్టరికంబునం బ్రియము సుమ్మిఁక మాటలు వేయునేటికిన్. 465

ఉ. నావిని గోరగింప నయనంబులు విస్ఫురితాధరోష్ఠయై
యావెడమాయలాఁడి యను నాతని కోరి మెఱుంగుబోఁడు లే
కై వడినైన వేఁడుటురుగాదె మొఱుంగు లెఱుంగఁగోరువా
రై వినరానిమాట లకటా మగవానికిఁ జెప్పవచ్చునే. 466

క. దాపురము లేక యీక్రియ, గాపురములు సేయుచున్న గరితలతో నీ
తీపురములు వాక్రుత్తురె, కాఁపుల నినువంటివారిఁ గానవె తులువా. 467

క. అని కలసి పులుకుపులుకునఁ, దను జూడం జూడఁబట్టి తన్నెం గొట్టెన్
దనివిసనఁ దిట్టె ననలుం, గొనబుగ రోద మగని దెగనికొండాటమునన్. 468

ఉ. కావర మెత్తి యిట్లు తనుఁ గాఱియఁబెట్టుచు నున్నదాని ని
చ్ఛావతిఁ జూచి లేచి రభసంబున రెడ్డనపల్కెన్ నోసి నీ
చేవ యొఱింగికాదె మును జెప్పక గుంజిలిపెట్టియుంటి నీ
వే వలదన్న వేఁడుకొనవే మఱియేనయి చెప్పినాఁడ నే. 469

క. నాతోఁడని నన్నడుగుట, యీతెగుదెంపునకు ముగిసె నిఁక నేమనుచున్
రాతికొడుకు తఁడు హాలసం, జాతకిణాశ్మాతికఠినకఠయమునఁ జఱిచెన్. 470

వ. ఇట్లువ్రేటుపడి దండతాడితభుజంగియుంబోలె నమ్మోహనాంగి నింగిముట్టినయలు
కం బట్టిన సికవీడి నిలుపంబడి యిలువెలువడి. 471

క. ఆడికలం బడితినొ యం, కాడితినో యిల్లు ముంగిలననో తప్పితొఁ
గూడననొ నీళ్లననో, కూడునె యిల్లాలి నన్నుఁ గొట్టం దిట్టన్. 472

క. విరసమునఁ గొట్టుపడి నా, సరిగరితలలోన బ్రతుక సైఁతునె మఱి నే
నురెఁ బోదు త్రాటఁబోదున్, ధరియింతునె సైఁపు మింతదడ విచ్ఛేటన్.

క. ననుఁ గన్నతల్లి ప్రజలకు, వినిపించినపిదప నచుచు వెసఁ బుట్టిల్లుం
దునికి యటకేగు కైతవ, మున నుపవల్లభునికటమున కదిపోయెన్. 474

క. ఏతెంచి నిర్ధురద్ధ, ప్రీతి న్మణిమంతుఁ గ్రుచ్చి బిగికౌఁగిటవ్రా
జ్జాతపృథుప్రథనంబున, శాతోదరి పెనఁగె రెండుజాలవ్వేళన్. 675

క. విసువక చనునెమకడున, ప్పనిఁపాఁపఁడు తల్లి దాఁపుఁ బాయుటఁ గడువె
(క్కసమున నాఁకలి గొని తా,) నసురుసురై చెవులు గింద్రమున వాపోయెన్.

వ. అయ్యేడుపు విని యుపపతికి నయ్యువతి యిట్లనియె. 477

చ. అడలెడుఁ జంటిపాఁపఁ బదె యాకొని వానికి నేను జన్నుబా
లిడి చనుదెంతు నింటిమగఁ డింతయెఱుంగకయుండ నీవు నా
యొడల వసించి యేమినిసువేడ్చెడు రెడ్డన నాకుఁ దెల్పుమం
చడుగు మతండు చంటికొఱకై యని నిక్కమ మొప్పఁ జెప్పెనున్. 478

ఉ. చెప్పినఁ దల్లి యొందరిగెఁ జిన్నికుమారుని డించి సర్వముం
జెప్పఁగదయ్య యివ్విధముచిత్రము నాకని వేఁడఁ మాతఁ డి
ట్లొప్పనిమోముతో నను దురుక్తులఁ బల్కుచు మంకుబుద్ధి యే
తప్పునులేమి నిల్వెడలి తల్లిగృహంబున కేగ నంతగన్. 479

క. నావిని మాయాతనితో, నీనను నుతు విడిచిపోయెనే యకటా నీ
దేవియుఁ బుట్టింటికి న,య్యో వలదని మాన్ప కెట్టులుండితి విచటన్. 480

ఉ. ఐన నిఁకేమిసేయఁగల మాకట నేఁడ్చుకుమారుఁబట్టుఁబె
ట్టీనిశి యోసరించి నిలు మోపు మదీయవధూటి వచ్చి నీ
కానకకన్నపట్టి కిడుఁగాని ఘనస్తనగుగ్ధ మంచు స
న్మాన మెలర్ప నాఁడు మనుమానముతే కతఁ డోసరించినన్. 481

వ. పంతంబు చెల్లించుకొనుదాన నని చెప్పిన మణిమంతుం డమ్మాటలు కాఁపుగోడునన
కటింగించె నెఱింగించిన. 482

ఉ. ఉండెదఁ జెప్పినట్లు నిలుపోపనియాఁకట నేడ్చి యేడ్చి య
క్కుండినచంటిపాఁపఁ డిపుడేమగునో మఱిలేరు బిడ్డ లో
క్కొం డిదె వీఁడు నాకొడుకు గాఁడు భవత్తనయుండు సత్కృపా
మండన వీనిఁ బ్రోచికొనుమా యని హాలికుఁ డోసరించినన్. 483

క. అప్పలువచెలువ జారుని, గుప్పటిమును కలవరించి తోఁగపుమురిపం
బుప్పతిలఁ గుఱుకునడలం, జొప్పెప్పడకుండ దనశిశువుకడ కరిగెన్. 484

తే. అరిగి పెరిగినయాఁకట నఱచి యఱచి, యేడ్పు విడువనితనపట్టి నెత్తి పట్టి
కులికి చన్నిచ్చి పొత్తిపొత్తుల నమర్చి, మగనికెంగేలఁ జెనకి యమ్మగువ వెడలె.

క. ఆలరితనమున లీలం, గేలం దనుఁ జెనకి చనినగిరిసుత తనయి
ల్లాలని తెలియక పరుని, ల్లాలని యారెడ్డిబిడ్డఁ డవరు విరాళిన్. 486

శా. రావే వల్లనిగుమ్మ నీవనుచు నారాటంబునన్ రెడ్డి నా
నావిభ్రాంతులఁ గుబ్బతిల్లు నెడ వోన స్మినకేతుండు కీ
ళ్ళ్వై చెం గొఱకచ్చులం బొడిచెఁ గాలం గేల మర్దించె నా
పోప న్నమ్మెటఁ గొట్టెఁ దిట్టెఁ జిఱునిప్పు ల్రాల్చె నేత్రంబులన్. 487

క. చేసెడువలరాయనికై, కాసములకుఁ గాక జడిసెఁ గాపుంగొడు కా
లో సుదతిఁ దెచ్చుటకు ని, ద్రాసక్తుని మీఁటెఁ జన్నుద్రావెడుకొడుకున్. 488

క. మీటుటయు మిట్టిపడి య, చ్చోట న్రుధిరంబు గ్రమ్మ స్రుక్కుచు నొడ లా
రాటపడఁ జంటిపాఁపఁడు, కాటుకకన్నీరుదొరుగఁ గావున నేడ్చెన్. 489

వ. అయ్యేడ్పు విని యుచ్ఛావతి యుపపతి కిట్లనియె. 490

క. కొడుకుంగుట్టుకుఁ జనుబా, లిడి నీతో రతులఁ బెనఁగ నేతెంచుచు నా
కడకేలం దాఁకించితి, గడుదెర్లికపుట్టి పొఱలఁగా మా రెడ్డిన్. 491

చ. తమకమువుట్టి నేఁ డదికతంబున రెడ్డన నిద్రఁబోవులేఁ
గొమరుని నేడిపించె నదిగో తిరుగంబడి చన్నొసంగి ర
మ్ము మరల నంచు నన్నటకుఁ బొమ్మని నీవనుపం దృఢానురా
గమునఁ బ్రియంబుఁ జెప్పి నను గౌఁగిటఁ జేర్చి సుఖించుదారికిన్. 492

శా. ఘోరం బోర్చెఁగదయ్య యాఁకటికి నీపుత్త్రుం డయో యింటి కిం
కారాదా రెడిసాని యి ట్లలుకలం గాఁబట్టఁగా వచ్చునే
దూరక్షోణి వసింపవచ్చునె సఁగఁ బుత్త్రుం గూర్చి నిల్లాల నీ
తూరిన్ లోపలికంపుఁ బల్కు మతఁ డుండుం గొంది నంచాడినన్. 493

క. కలితనమునఁ జని యలనా, పలుకుం బంతంబు చెల్లుబడిగా రెడ్డిన్
గలసి యొకముడుపుఁ గైకొని, పిలిచిన నీకిత్తు నేఁ బెట్టుదు మగనిన్. 494

వ. అని యుప్పు డప్పిసాళి పుణిముంతుం దటిమిన నతం డది పలుకుమన్నట్లు పలికె
నమ్మాటలు విని కర్షకుం డుత్కర్షింపుచు నిట్లనియె. 495

క. ఎడగలుగ నుండెఁ దనమే, న్వడకెడు మతిపసులవంటి వారము చనుబా
లిడుఁగాని పుణ్యమయ్యెడు, విడనాడక యిటకుఁ బనుపవే యిల్లాలిన్. 496

క. నావానిమాటలకు లోఁ,లో వెడవెడ నగుచు నింటిలోపలి కలయి
చ్ఛావతి పోయెం బోయినఁ, గోవరపుంబ్రేమఁ గాఁపుకొడుకవ్వేళన్. 497

ఉ. కేలఁగలించిపట్టి రతికిం బిలుబీకులుసేయ లోనుగా
కాలరిజంత నేఁ జెడితి నమ్మక సిగ్గులవాఁడవౌదు నీ
యాలనె వింతదాన మగనాల నయో తెకతేఱ నన్నుఁ బ్రా
ల్మాలుపఁ జూచెదో తెగరె మామగవార లెఱింగిరేనియున్. 498

ఉ. మేనికిఁ జేటుగాదె పులిమీసల నుయ్యెలలూఁగ మాను నేఁ
గానటువంటిదానఁ గొఱగానిపను ల్దలమీఁదవచ్చునే
రానిఁకఁ జాలుఁ జే విడువరా యని సూత్క్షరవంబున న్సరో
జానన పల్కినన్ వాలిసుఁ డాజగజాఁగకుఁ బ్రీతి నిట్లనెన్. 499

క. ఇటువంటిదాన వేలా, చిటిపొటికేంగేల నన్నుఁ జెనకితి నినుబా
యుట ప్రాణంబులఁ బాయుట, కుటిలాలక కరుణలేదకో యిట్లాడన్. 500

క. అని బాఁతిఁబాఁతిపెట్టిన, పెనుబ్రాతవరాలసోలఁ బెకలించి ఘన
స్తన కిచ్చి కుచ్చి కౌఁగిట, నెనయించెం బంచబాణుఁ డేసకొల్పంగన్. 501

క. అది యాత్తెఱఁగున నతనిన్, గదియుంబడనిచ్చి వెఱపుగలదానిగతిన్
గుదులుకొను నేలబుసకో, త్రైద యను నేనెట్లుచేపడితి నను నడలున్. 502

క. పోవలె వడిగా వడిగా, లేవయ్యా ప్రక్కలోన లేకుంటే నేఁ
గావఁడు మగఁడని యలయు, చ్ఛావతి కర్షకునిఁ ద్రోచెఁ జదికిలబడఁగన్. 503

వ. కరపాతంబుకంటె మున్నుగా లేచి యుప్పలువచెలువ కన్నులసొం పామతింపఁ
జని వి త్తిమిచ్చి పంతంబు చెల్లెఁగదా యని జారుని నిజకరంబునం జఱచి చక్కిలి

గింత పెట్టె నప్పుడు చతుర్ఘటికావశేషంబుగా రాత్రి చనియె దిక్కులు ప్రకాశ ప్రతతిం బొందెఁ బిచ్చుకలు పిచపిచ మనియెఁ గాకంబులు గూకలిడియె దధిమ థనఘుమఘుమధ్వానంబులు సెరసె గోవత్సకోలాహలంబులు విననయ్యె నయ్యెడ గృహంబు వెడలి పెరడు చొచ్చి వచ్చుటకు విహారగృహంబునకు పోయినఁ గనుఁగొను కునియుండి. 504

క. అపు డిచ్ఛావతి యచ్చో, నుపవల్లభు నిలువఁబనిచి యోడక యిలుసొ
చ్చి పొడవుగల మచ్చుపయిం, గపటవ్యాపార మమరఁగాఁ గూర్చుండెన్. 505

క. హాలికుం డాలోపల లో, పలికిం జనుదెంచి మచ్చుపైఁ దనయిల్లాల్
నిలిచిన తెఱఁ గెఱుఁగక యపు, డిలువెడలినబుద్ధి నిశ్చయించి కనలుతోన్. 506

ఉ. ఈలువు వంగడంబు గల దీజవరాలని యోలి రొక్కరొ
క్కాలిడి యొట్టిజంపు తడక స్వరియించితి దీని నక్కటా
చాలు సహింప దీచెనఁటిసంగతి యొండొక మాయుపన్నియో
యాలరిజంతఁ జంపి సుఖినై యొకదిక్కునఁ బెండ్లియాడెదన్. 507

వ. అని హాలికుండు యాతుగటిచి మీసంబులు దీటుచుండ నయ్యంపజయాన మచ్చు
డిగ్గ నుతికి యొదురు నిలువంబడి యిట్లనియె. 508

ఉ. ఈలువు వంగడంబు గలదే మనుబోంట్లకు నీవుఁ గాక రొ
క్కాలిడి యిట్టిజంకుతడక స్వరియించుట రోఁత గాదె నీ
కేలసహింతు నన్ను మడియింపు మొకానొకచోటఁ బెండ్లిఁగ
మ్మాలనె నీకు నేఁ దగుదు నా చను నీ కిటులాడ నిచ్చలున్. 509

ఉ. నిక్కము రెడ్డిబిడ్డవని నిన్నిటు నమ్మి గృహంబుఁ జేరి యీ
దిక్కున నున్నహాద్రసుదతి న్మనుపిచ్చి రమించినాఁడ వి
త్తెక్కలిఁజను నాకుఁ గలదే యని ముందలఁ బట్టి యీడ్చి యా
దక్కున దన్నె ముక్కు చెదరం జరణంబున వాని నెవ్వడిన్. 510

ఉ. తన్నిన వాఁడు తచ్చరణతామరసంబుల వ్రాలి నిన్ను నే
మన్నది లేదు నావలన నన్నియు నేరము లోర్చుకొమ్ము నా
పిన్నతనం బొకళ్లచెవిఁ బెట్టకు పెట్టిన సిగ్గుపోవు నా
వన్నియ యన్న మా నగరివారికి దండుగఁ బెట్టని మ్మగున్. 511

క. చెలువకుము కాఁపురంబని, పతిపరి యగు తొల్లి నట్లు ప్రార్థింపంగాఁ
గుఱుఁగట నేగుచుఁ దలవరు, లరిమురికర్షకునిమాట లాలించి తగన్. 512

క. గిలుకలువైచిన గుదియలు, ఘులుఘుల్లన నూఁదికొనుచుఁ గదియం జని యా
హాలికునిఁ గొని చని సభకుఁ, దలవల్లభు మ్రోల నిలుపఁ దప్పేర్పడఁగన్. 513

క. నరపతి దండుగఁ గొని యు, ప్పరి వెడలం గొట్టె నపుడు భువనచరాదు
ల్చరియాలగు నీకు నుదా, హరణం బిది యనుచు వానరాగ్రణి చెప్పెన్. 514

వ. చెప్పి వెండియు బహూమానుండు. 515

క. తులువా నీయిల్లాల, య్యాలి వేణికిఁ దోడుబోయినది దానిమ్మృషో
క్తులకుఁ దెగఁజూచితివి నీ, తలద్రెవ్వను బొలిసిపోయెదవు తరువాతన్. 516

క. చేపడినసొమ్ము మారం, బై పోయె న్మోసమయ్యె నని యంతస్సం
తాపమునఁ బొక్కి పొరలకు, మీపాటిం బొమ్ము చాలు నింటికిఁ గ్రకచా. 517

క. క్రౌంచామూఢుని నిను దం, డించుట యన నెంత సింధుకీలాలమునన్
వంచింపఁబడదె మున్నొ, క వంచక మఖిజాతకమఠవల్లభుచేతన్. 518

క. నావిని కాననచరగో, త్రావరు నీక్షించి పలికెఁ గ్రకచుఁడు నయవి
ద్యావైభవగుణసుభగం, భావుక వివరింపు మాయుపాఖ్యానంబున్. 519

ఆ. కుటిలుఁ డప్రయోజకుఁడు వీఁడు వినితో, నేటిజోలి నన్ను బోఁటి కనక
వివరపుట్టఁ జెప్పవే నిష్కళంకస్వ, భావ నావుఁ డలరె ప్లవగవిభుఁడు. 520

వ. క్రకచునకు నక్కథఁ జెప్పందొణంగె. 521

సీ. కలిగొట్టు మోఁదుగు కానుఁగు గలుగువావిలి మేడి నేరేడు సెలసు బలుసు
మఱ్ఱి మంకెన మద్ది మారేడు బూరుగు గోరంట లొద్దుగు క్రోవి రావి
జువ్వి మామిడి జీడి సురుగుడు మొలఁగుపాపట చంద్ర పనిరిక పాల రేల
పొన్న బొట్టుగు పోఁక పొగడ దాడిమ యిప్ప గుమ్ముడందు గురువింద గోను రేను
తే. చిల్ల చింత మొగలి చీకిరే ఈడుగ, నిమ్మ తమ్మ తుమికి నెమ్మి జమ్మి
వేగి వేము మొదలుగాఁ గలమ్రాకుల, కాన నగుచు నొక్క కాన మెఱయు. 522

చ. కరపుటికాంతరాళచుళుకక్రమణాయితసింధుసర్వతః
పరివృతకృత్పయోదములు వాసిన దధ్భటజాన్యపాణిజ
ఝరితములై నభోగతికిఁ జాలక పల్వలము ల్భజించె నాఁ
గర మెఱు న్సమగ్రబలకాయము లవ్వనికొలులాయముల్. 523

ఉ. ఆహృతజంతుభీషణబలాభ్యుదయాప్తి గుహానురక్తి గో
త్రాహితవృత్తి వజ్రకఠినాతిశయాకృతి శౌర్యగర్వరే
ఖాహమికం బ్రసిద్ధరుచిరామృతపారణజంభదానవో
త్సాహవిఘాతిచందమునఁ దద్గహనంబునఁ గ్రాలుబెబ్బులుల్. 524

మ. చరణప్రాంతచరిష్ణువు ల్నిరుపమోచ్ఛస్థానసంక్రీడన
స్ఫురణం జన్మఘనత్వమంద నరుదెంచుం గీడు మీ కంచు మ

త్సరబుద్ధిం బలెఁ జించుమేఘముల దంతత్రోటికోటిం జలా
హరణారంభణజృంభణంబులు దదీయవ్యాళశుండాలముల్. 525

మ. తనరస్థుల్కావిసంభవాండభువనధ్వాంతచ్ఛిదాచంచువు
ల్వీనఁ జెప్ప న్వెఱఁగైమహాతిమిరపాళి న్విచ్చిపోఁ దోలతే
వని రథ్యోత్థరజోదర స్తిమితదీక్షాభోగుఁడై హేళిగ
న్గాన నఘోరతరాటవి న్మను నెలుంగు ల్గుంపులై వేసవిన్. 526

శా. పైపైఁ బ్రాణివహప్రధానగుణ మొప్పం గారగారద్యుతుల్
దీపింప న్విషమాంబకభ్రమిఁ బ్రభీతిం జేయ నత్యుత్కటా
టోపం బుగ్రగజాహ్వాతిస్యసనకండూలంబుగా నుండుగుం
పై పంచాస్యము లయ్యరణ్యమునఁ బంచాస్యప్రకారంబునన్. 527

శా. క్రందై పెల్వడు ఘుర్ఘురధ్వనిమృదంగస్థాయిగాఁ దాలుని
ష్యందస్థూలవిశాలలాలసవరంబై యొప్పుశృంగోద్ధతిం
జిందుల్ ద్రొక్కఁ గుడుంగరంగముల నిస్సీమత్వరాతిభ్రమిం
బందుల్ దిక్కృగయుచ్ఛిదాగుణపరిస్పందుల్ దదుగ్రాటవిన్. 528

క. అలఘుతరవారిధారా, దళితప్రతికూలసకలధరణీభృత్సం
కులమై యొకసెలయేఱు, ప్పొలమున జగదేకవీరుపోలిక నమరున్. 529

వ. అది రామలక్ష్మణాలంకృతంబై పంచవటస్థానంబును సత్వసంపన్నంబై సమీర
ణంబును గజగవయవిహారయోగ్యంబై కిష్కింధానగరంబును సుపానీతపరమ
హంసంబై వేదాంతశాస్త్రంబును నఖండశబ్దక్రియానిరూపణంబై వ్యాకరణం
బును ప్రబోధితనిగమజాలంబై ధర్మంబును ఘనరసప్రధానంబై విద్వత్ప్ర
బంధంబు ననుకరించిన యమ్మహాప్రవాహంబున. 530

క. నీతికళానిధిగలఁ డభి,జాతుం డనుకమఠవిభుఁడు సంతతపంక
స్థాత్మత నొందియు నద్భుత, మాతం డేవంకఁ బంక మంటక తిరుగున్. 531

శా. అతాఁబే లోకనాఁటిరేయి ధరణీవ్యాపారలిప్సాపరం
బై తానంబులఁ బాసి తీరశరత్పణ్యావీథుల న్నిల్వ భూ
జాతచ్ఛాయలశీతలానిలకృతాంచద్వాలుకాలేఖికా
వ్రాతాభ్యగ్రముల న్విశృంఖలగతి న్వర్తించె వర్తింపఁగన్. 532

చ. అటిముటి చిచ్చు నాఁ బొగులు నాఁకట బ్రుంగుడువంగుడై యొడల్
సుఱసుఱ స్రుక్క నయ్యడవిలో నొకనక్క తటస్ఫుటంబులన్
బొటియలఁ దోఁకఁ జొన్ని వెలిభూమికిఁ దార్చిన యొండ్రితండముల్
గొఱుకుచు వచ్చి వచ్చి యలకూర్మముఁ గాంచి ప్రహృష్టచిత్తమై. 533

క. ఘనరభసంబునఁ గదియుం, జనునపు డక్కమఠవిభుఁడు స్వగతంబున ని
ట్లని తలఁచె నిప్పు డీమ దుఁడ, ననియుండుదు నేఁటితుదకు నది బొంకయ్యెన్. 534

ఆ. సకలదుష్టజంతుసంక్రాంతజలదుర్గ, సీమనుందు వెట్టచెట్టలేక
చెడుగుఁబాము గాముచేఁ బెద్దమీనుచే, నీరుకుక్కచేత నెగడుచేత. 535

ఆ. రొయ్యపుర్వు క్రొవ్వి రోధోవసుంధర, కెగసి తెగినపగిది నిట్టులేల
జలతలంబు విడిచి చనుదెంచి నాబుద్ధి, పుర్వు మేయఁ జెట్ట బొందఁ గంటి 536

క. కాలంబు దాఁట నెవ్వరు, చాలరు రని వగచి నిరవసాదవిషాద
జ్వాలం దూలి కబంధచ, రాలంకరణంబు వపురుపాహితకంబై. 537

క. రాతింబలె నతినిశ్చల, రీతి న్నిలుచుటయుఁ గని గరీయఃక్షుద్బా
ధాతురకృశంబు జంబుక, మాతతదంష్ట్రికలఁ గచ్ఛపాగ్రణిఁ బట్టెన్. 538

క. పొదివి తెకతేఱఁ గలిగెం, గద నాకీకష్మతే నెకరుఁడని దానిన్
దుదకోఱలు కోరలుపోఁ, గొదలే కటునీటుఁ బొరల్చి కొఱుకుచు నుండెన్. 539

క. విఱుగుట గానక నెరయం, దఱతఱకలువాఱఁ గొంతదడ వది గొఱికెన్
గొఱికిన నొగులదు పగులదు, చిఱుమొఱకలు పోయెఁ బుల్లనిలె దంతంబుల్. 540

వ. ఇట్లు మృగధూర్తదశనదంశనసిర్వ్యశకలితమర్మంబై యక్కూర్మంబు తనలో
నిట్లని వితర్కించె. 541

చ. జరుగదు రోసి పో విడువఁజాలదు వేసటలేక కోఱలం
గొఱికెడు దీనికేమితుద గోరము నాఁటిలె నాయుపాయ మం
దఱుఁ గొనియాడ నిచ్చెనఁటి నక్క దటాలునఁ దక్కఁబెట్టి యే
మఱక ననశ్వరం బయినమన్నడఁ గాంచెద నీరుసొచ్చెదన్. 542

క. అని నిశ్చయించి ధీర, త్వనిరూఢుం డగుచుఁ గమఠవరుఁ డానక్కన్
గనుఁగొని యిట్లను నేలా, తను వఱయన్ మల్లిపోయెదవు పిసవెట్టెన్. 543

క. మఱవక యేఁడులుపూఁడులు, గొఱికిన నాయొడలు మృదువగునె నీకేలా
వెరవిడిచందము పుట్టెన్, దరిదీనికి వెరవుఁ జెప్పెద న్వినుమర్థిన్. 544

క. నానకమృదుమార్గమునకు, రానేరదు మేన నీచరణ మనఘా నా
పై నునిచి యేతదంబు, స్థానములోఁ బెట్టు కొంతదడ వట్లయినన్. 545

క. చెన్నార నపుడు చేసిన, వెన్నవలె న్మెత్తనగుడు విపులవసాసం
పన్నము సుమ్మీ తను వాఁ, కొన్నమహాత్ముడను నీకు గుడునఁగవచ్చున్. 546

క. తనివిసనఁ దినకపోవని, మనమునఁ దలపోసి రోసి మనుగడపై నీ
కనువైనవెరవుఁ జెప్పితి, వని కూర్మప్రవరుఁ డాడె నట్లాడుటయున్. 547

వ. అప్పలుకులు సిద్ధాంతీకరించి యవ్వంచకం బట్లచేసెఁ జేసి ముహూర్తమాత్ర మూర
కుండ యయ్యభిజాతున కిట్లనియె. 548

క. తడవయ్యె నీటిలో ని, న్నిడి మే నేమైన నానెసే తనివిసనన్
గుడువవలె నిజముఁ జెప్పుమా, జడియక నీ వనిన వారిసత్వము తనలోన్. 549

క. ఈవంచకంబు నామా, యావాగురఁ జిక్కి దక్కి నసుపంచకమం
చావిర్భూతోత్కలికా, ప్రావృతమై యపుడు కచ్ఛపం బిట్లనియెన్. 550

క. ఆసమోదక మంటఁగ నా, నె సమృద్ధము లంగకములు నీపాదము క్రిం
దిసుమంతనాన దెవ్విధి, మెసవెదు నీపంటి కెట్లు మృదువై యుండున్. 551

క. మెత్తనగుఁగాని నీఘ్రము, గుత్తముగా వెన్ను ద్రొక్కికొనియున్న పదం
బెత్తుము నీరంటఁగవలెఁ, జిత్తము సుఖపారణావశీకరమైనన్. 552

క. పోఁగుఁగఁబో యీ వాఁకట, జాగేమిటికంచుఁ బలుక సంతుద్బాధా
జాగరణబుద్ధి జంబుక, మాగోచరుమాట నిశ్చయము పొమ్మనుచున్. 553

క. పై దారుణముగ నూఁదిన, పాదము దివియుటయు గచ్ఛపము సంతోష
ప్రాదుర్భావప్రాప్తము, హాదించద్వేగ మగుచు నురువడిఁ బఱచెన్. 554

క. క్రకచా యీచాడ్పునన, క్కను మోసము గల్గియుంపఁగా మఱి నినుబోఁ
టికిఁ దగులెంత యని కీ, శకులాగ్రణి చెప్పి మఱియుఁ జలచరుఁ బలికెన్.

క. వెడమాయనక్క మాటల, కడవికిఁ జని తిరిగి వచ్చి యప్పటియుం దా
నడవిఁ బడి బడుగువారిచేఁ, గడ తేఱినగర్దభమ్ము గాఁ జూమ్ము శఠా. 556

క. అనినవిని శింశుమారుఁడు, వనచరు నీక్షించి యింతవాఁడవు గాకుం
డిన ముదిసి ముప్వాధనుకా, మనుదే యిది తెలియఁబలుకుమా వినవలతున్. 557

వ. అని యడిగిన బహుమానుండు. 558

సీ. కల దొకదుర్గాంతకాంతార మరవిందబంధుఘృణ్యాంతర్హితపాదపంబు
దీర్ఘదంష్ట్రాభిఖ్యఁ జేజరిల్లుమహోగ్రసింహ మొక్కొ నివసించియుండు
దానికి ఘుటకాభిధానజంబుక మొకం డహరహం బాప్తకృత్యము లొనర్చు
నట్లు కొండొకకాల మరిగినఁ గర్మానుకూలత నసదృశకుక్షిరోగ

తే. మసృణతరవేదనాకంపమాన మగుచు, వెగ్గలంబైనధృతి జారి యగ్గజారి
పొలు వాపోవు నలమరుఁ బొక్కు నుక్కు, బొదగిలఁబడు నిట్టూరుపులు నిగుడ్చు.

క. ఈరీతిఁ గడుపునొప్పిం, గూరాకై యుడికి గోఁడు గుడుచుచు నుండా
లారి యొకనాఁడు నిజర, క్షారససంఘుటకుఘుటకుఁ గనుఁగొని పలికెన్. 560

చ. తినదెసఁ జూచినాఁడవొకదా ఘుటకా కటకాంతభూమికిం
జని యతిగోపనం బమరఁ జంపి శరీరము వ్రచ్చి లోపలం

గనుఁగొనవైన గర్దభముకందనగాయ గ్రహించి తెచ్చి యి
చ్చి నిలుపుపానిపోఁ జలిదిఁ జేకొని యుండెడు జీవితంబులన్. 561

చ. తడసినఁ జత్తుఁ బొమ్మనినఁ దచ్చరణంబుల సమ్మదంబునం
బడిపడి లేచి యప్పనికిఁ బాల్పడి జంబుక మేగి యొక్కచో
గడుకృశమైనదాని నొకగర్దభముం గని చేరి యిట్లనున్
బడలితి వేల రాసభ శుభంబగు నాకెఱిఁగింపవే యనన్. 562

వ. గర్దభంబు జంబుకంబున కిట్లనియె. 563

క. చాకలవాని కధీనమ,నై కోకలు మోసి తెత్తు నాపణవీథి
వ్యాకీర్ణప్రీహితుష,స్వీకృతి మేన్ బ్రోతు నెట్లు చిక్కక యుందున్. 564

క. కోనఁ గనని పాపకర్ముఁడు, తను నాహారాదివిధులఁ దనుపఁడు మేయన్
జననీఁడు కాలుగట్టు, న్మనుటయుఁ జచ్చుటయుఁ గాదు మద్విధ మనఘా. 565

ఉత్సాహ. మేను పొందుగాదు లేదు మేనసౌఖ్య మక్కటా
కైనవానిచేతి పేనుచందమైతి నంచు న
మ్రానవంబుతోడనున్న వాత్మ లేని నెయ్యమున్
గానరాఁ జెవంటి జంబుకంబు దాని కిట్లనెన్. 566

మత్తకోకిల. కాఁక గుంటివి గావు బీఁకువు గావు గర్దభముఖ్య ని
కేలయి విధి నెవ్వచేఁ గృశియింపఁబోదము రమ్ము మ
త్కేళికావనశాద్వలంబులఁ గ్రీడసల్పఁగ మృద్యసే
వాలఘుత్వము చాలు నీకు నవారివారితృణావళుల్. 567

క. అని చెలువు గులుకుపలుకుల, మనమూఱించుటయుఁ దేఱి మనుజానధీనం
బున నున్కి కష్టమని ఖర, మనయుంబై నక్కబడి మహాటవి కరిగెన్. 568

క. అరిగినఁ బరిచితపటుసం, భరమున్ ఖరము న్విముక్తబలగర్దభశే
ఖరముం గురవము ఖరమున్, హరిపాలం బెట్టె నక్క యుక్కటికమునన్. 569

క. నెఱిసరిగ దానిపైఁ బడి, కఱపన్ లాఘవములేమి గాల్కొద్దుచు న
ద్వీఱువం గదిసిన నత్తెఱఁ, గెఱిఁగి ఖరం బదరి తిరిగి యేగుచు నుండెన్. 570

క. గునుకెత్తుచున్నగాడిదె, గనుఁగొని సింహంబు పలికె ఘుటకునితో నీ
చనుఖరము దరిమికొన నా, తనువున నడిలేగు తెమ్ము దగ్గఱఁజేగన్. 571

చ. చనుమన వట్లకాక యని జంబుక మప్పుడు గర్దభంబుఁ జే
ర నరిగి యేలపోయెద కటా వసనంబులమోప బస్తుఁన్
పనరఁగ వేడ్క యయ్యెడినొ నద్దిటుపంటికుబుద్ధు లివ్వనం
బునఁ గొన మేఁపు నీళ్లు గలవో పతిమన్న న నీకుఁ జాలదో. 572

వ. రమ్మనిన గర్దభంబు జంబుకంబున కిట్లనియె. 573

క. కేసరినఘ కుద్యోగముఁ, జేసిన నగ్గమక మెఱిఁగి చెలికాఁడా సం
త్రాసమునఁ దలఁగి వచ్చితి, గాసిలి ప్రాణములు తీఁపుగా యొవ్వరికిన్. 574

క. నావిని ఘటకుం డనుఁ దగ,వా వెరవఁగ నధిపుఁ డట్టివాఁడా నిను సం
భావించుటకి ట్లొరయుం,గా వచ్చుట యిందుకేల గళవళమందన్. 575

చ. తవతవ గ్రొత్తక్రొత్త యగుటం జనియించెను నీకు నేఁడు రే
పవుటయు మమ్ము మీరఁ జనునంతయు నీయది కొంక నేల ర
మ్మవసర మిప్పు డంచుఁ జను నాఖరము న్మరలించి తెచ్చి గా
రవగుణ మెక్క నక్క మృగరాణ్నికటంబున బెట్టెఁబెట్టినన్. 576

తే. కలుకుకలుకునఁ గుత్తుకఁ గఱచి విఱిచి, నక్క నక్కఁ జేరి శుండాలవైరి
గర్దభము కుక్షి భేదించి కర్ణహృదయ, ముదయ దాహ్లాదమున దివ్వ మోపననక.

వ. ఏను సెలయేటిజలంబు లానివచ్చెద నని చెప్పి యాడు గామడగా నరిగిన. 578

సీ. ఖరశరీరము విప్పగా గొప్పలగుదంతకుంతసంఘంబులఁ గ్రుచ్చి గ్రుచ్చి
మృగధూర్త మాకర్ణహృదయంబు భేదించి యది యనర్ఘ్యం బగు టెఱిఁగి కాద
యతుఁరంహాము సింహ మాశించె భక్షింప నత్యాజ్య మివ్వస్తు వనుచుఁ దాన
భక్షించి పరిశుద్ధుపగిది నూరకయుండె నపుడు కంఠీరవ మరుగుదెంచి

తే. కొనవలయు నౌషధంబు దెస్మునినఁ గొంకు, కొసగుతే కది పలికె నోకుంభివైరి
గర్దభాకారమున లేదు కర్ణహృదయ, మదియ కలిగిన నిన్నేల కదియువచ్చు. 579

సీ. అని నక్క తక్క కిట్లాడుమాటలు యథార్థీకరించి యాదల్పఁ దెరువులేమి
నడిగెఁ గేసరి యూరకుండె న ట్లావంచకను మహాకపటవాక్యములు నమ్మి
గహనమండలి సొచ్చి క్రమ్మఱ మఱియు నేతెంచి దుర్వ్యాధితద్విరదవైరిఁ
జేరి తద్దంష్ట్రిలదోరినఖకముగాఁ దలఁపకు నన్నని బలిముఖుండు

తే. పలుక నేమియు ననక యజ్జలచరుండు, లబ్ధనాశవ్యథాజాతలఘుగుణేత
రావిలపిపాస దీఱ నీ రానిచనియె, నద్భుతత్వరతోఁడ నిల్లాలిఁ జూడ. 580

క. అని విష్ణుశర్మఁ డాదర,మునఁ జెప్పినరాజసుతులు ముదమున గురునిన్
గనుఁగొని పంచమతంత్రం, బనఘా మాతోడఁ జెప్పుమని యడుగుటయున్. 581

మ. అతి హృద్బోద్ధ్రిపమోహ భక్తినతదివ్యవ్యూహ విధ్యార్జిత
క్రతుపుంజార్చితపాద వర్ధితపటుప్రహ్లాద పుణ్యాశ్రితా
యతనాథ్వన్య జగత్త్రయీభరణవిద్యాధన్య త్రయ్యంతకీ
ర్తితపీతాంబర కృత్తిధారణకుగాధివ్యాధినిర్వారణా. 582

క. ఆదృతశుకముక్తిమహా, పాదపకిసలాయమనపదయుగనానా
వేదశిరఃప్రసవప్రా, సాదవ్యాపారదీనజనమందారా. 583

మాలిని. హరిముఖసురమౌళిన్యస్తపాదాంబుజాతా
పరహితరతిధామప్రాంతయుక్పారిజాతా
పరుషతరవిలోకప్రాంశుధూతారిజాతా
చరణశరణరక్షాజాగరూకైకచేతా. 584

గద్య. ఇది శ్రీవేంకటనాథ కరుణాలబ్ధసరససాహిత్యనిత్యకవితావిలాస సకలసుకవిస్తుతిభాషణోల్లాస రాజకులపారావారపర్వశర్వరీరమణ నీతిశాస్త్రమార్గపరిశ్రమణ ధైర్యపర్యాయధిక్కృతనీహారపర్వతరాజకుమార నిస్సహాయప్రబంధనిర్మాణ భోజభూదార సుధామధుర భారతీసనాథ వేంకటనాథప్రణీతంబైన పంచతంత్రంబున లబ్ధనాశం బన్నది చతుర్థాశ్వాసము.

---

శ్రీరస్తు.

# పంచతంత్రము

## పంచమాశ్వాసము.

క. హిమగుప్రియతనయా
మోహాస్నేహావలోకముగ్ధభ్రమర
వ్యూహసముపాస్యసిద్ధ
వ్యాహృతిమధుముఖసరోజ హరిహరనాథా. 1

వ. దేవా యసమీక్ష్యకారిత్వాభిధానం బగుపంచమతంత్ర మాకర్ణింపు మధీతనీతిశాస్త్రమర్మం డగువిష్ణుశర్మం డందు సుదర్శనకుమారుల కిట్లనియె. 2

క. అపరీక్షితం బకార్యము, సుపరీక్షిత మభిమతంబు సురిమ్మెన్వరి క
య్యపరీక్షితవిధిఁ గాదా, యుపతాపము పుట్టె విప్రయువతికిఁ బతికిన్. 3

క. నావిని రాజకుమారకు, లావిప్రునిఁ జూచి పలికి రది వీనులవిం
దై వెలయఁగ నీకథఁ జెపు,మా వినియెద మనిన వారి కతఁ డిట్లనియెన్. 4

సీ. గౌడదేశంబునఁ గలఁ డాగమాభ్యాసజడుఁడు విప్రుఁడు దేవశర్మ యనఁగ
నతఁడు సోమసుధాత్మసుత యాజ్ఞసేని నాఁ బెంపొందుకులకన్యఁ బెండ్లియయ్యె
సంతులే కలశరజ్జలజలోచన తాయి గన్నతాతికిఁగుండు గన్నగుంటి
కెలఁగుచు మఱుగుచు నెవ్వరే వ్రతములఁ జెప్పి రావ్రతములఁ జేకొనుచును
తే. సుతులఁ గనిపెంచుగరితలఁ జూచి యేచి,యిచ్చ ముచ్చట నొందుచు నిట్టులుండఁ
గొంతగాలంబు వోయిన గొడ్డువీఁగి, కాంతిజితహేమసుమగర్భగర్భ మయ్యె. 5

సీ. ఓఁకర బలిసె జిట్టుములసందడి మించెఁ గలకవాలెఁగ పోలఫలకయుగళి
బుద్ధిమృద్భక్షణంబునకు నువ్విళులూరె రశ్మిచామన మేన నచ్చజేసెఁ
గాళిమ గుఱకుచాగ్రములఁ బాళెము డిగ్గె గార్శ్యంబునకు బొమ్మగట్టె నడుము
నిద్రారతిప్రీతి నేత్రంబులకుఁ గల్గె మురిపంబు ముంగర మోసులెత్తె
తే. నరుచి యాహారసుఖముల నడ్డగించె, మధురరుచులకు నెమరెక్క మానసంబు
నిర్భరశ్రాంతి నడకల నెఁవడకొనియె, నక్కరంగేక్షణకుఁ జీర చిక్కుటయును. 6

క. ఈలక్షణములలీలన్, మేలాలై యున్న జాయ సుగుణనికాయన్
వేలాతీతప్రీతిం, బాలితనిజగోత్ర సమితిపతి యిట్లనియెన్.

క. దైవముకృప గలదావవు,గా వంధ్యాత్వంబు వీడెఁగా నీతికళా
కోవిదుఁ డగుసుతుఁ గనియెదు,గా వంశము వృద్ధిఁబొందఁగా నా కనుచున్.

వ. మనోరథంబునం బొట్టుపాటలగుమగనిం గని నగుమొగంబున ఘటప్రతిభట స్తని
యిట్లనియె.

క. బహుళమనోరథభీషణ, గహనంబునఁ జిక్కి వెడలఁ గాననినీచో
త్సాహనుఁడు చనుసక్తురజః, పిహితుం డగుసోమశర్మపితచందమునన్. 10

క. నావిని దేవికి విపులా, దేవుం డిట్లనియె గుణవతీ యెట్లెట్లూ
నీవీకథ నాతోఁ జెపు,మా వినియెద ననినఁ బతికి మానిని పలికెన్. 11

సీ. కలఁడు దాశార్ణభూతలమున నత్యర్థసారశర్ముఁడు సోమశర్మ యనఁగ
నతనికి నెనమండ్రుసుతు లందులో నగ్రపుత్రుండు పిత్రన్నభోక్త వాఁడు
కడుపారఁ గృష్ణపక్షశ్రాద్ధమున నొక్క భూమినిర్జరుగృహంబున భుజించి
యొకసక్తుఘటము పైతృకకర్తచేఁ గొని చని విజనప్రదేశమున నిలిచి

తే. ఘటము గలయంపిగా నీరుగా విషంచెఁ,బఱచి శయనించియెటుగుగాఁ బాణి నిలిపి
యత్తు లడమోడ్చి ధనవృద్ధనై చరింతు, నని దురంతోద్యమంబుననతఁడు దలఁచె

సీ. అవన నీసక్తు వమ్మిద నమ్మి యొకమేఁక గొనియెదఁ గొనకొని కొనిన మంద
నేటేట నొకరెంటి నీనెడునవియును నవియు వానికిఁ బుట్టినవియు నీన
బహువత్సరములకు బహుసహస్రంబులై నెగడెడువాని నన్నింటి విలిచి
సంతరించెద ధేనుశత మది పెట్టినకోడెలచే ధారఁ గొనిన చేల

తే. విరివిగాభైరు విత్తింతు వేళ్ళగొలుచు, గాఁగ మామకసస్యము ల్గడుఫలించు
పంటకొలుచమ్మి కూర్తు నపారధనము, ధనికుఁ డని నాకు నొకఁడిచ్చుఁ దనకుమారి

క. దొడ్డతన మరసి యీక్రియ, గడ్డాయం బనిన విప్రకన్యకవలనన్
గొడ్డ కొకసుతునిఁ గని యా,బిడ్డని మాసోమశర్మ పేరే యిడుదున్. 14

క. ఆయర్భకుఁ డూర్జితగతి, హాయనపరిమితవయస్కుఁ డగుఁ బోషింపన్
సాయంతనమున గృహకా, ర్యాయత్తమనీషభామ యబ్బాలకునిన్. 15

క. కరుణఁ దనచంక నిడుకొని, యరుగక యటువైచి పోవు ననునాలో భూ
సురుఁ డీపన్నిద్రాసం, భరముద్రితనయనుఁ డగుచు మఱియాలోనన్. 16

క. ధేనువు లేతెంచిన నటు, లైన న్వడిఁ ద్రొక్కు నాత్మజునిఁ దేవో సీ
వీని నిటువైచి పోఁదగు,నే నీచంకకు భరంబె నిసువానుకొనన్. 17

క. అని కలవరించి లగుడముఁ, గొని త్రిప్పుచు నిక్కువంబు కుంభపతి యనుచున్
జెనఁటిషరాసురుఁ డాగ్రహ, మున సక్తుఘటంబు భిన్నములుగా వైచెన్. 18

వ. సక్తుచూర్ణపాండురాకృతుండును విషాదవిహ్వలుండును నయ్యె నిది మనోరథరాజ్య
పాలనఫలం బనిచెప్పి యప్పల్లవాధర సుముహూర్తంబునఁ గుమారుం గాంచి
పంచమదివసంబున. 19

క. అతులలేనికుమారునిఁ, బొత్తులలో నునిచి గూర్మిఁ బురుషుని రక్షా
వృత్తికి నియమించి ధరా, భృత్తులితో రాజ జనసుగృహమున కరిగెన్. 20

క. ఆలోఁ బెంపుడునకులము, బాలునకుం గాపువెట్టి బ్రాహ్మణుఁడు నికే
తాళిందమునకుఁ జనియెం, గాలోరగ మపుడు బిలముఖమున వెలుపడుచున్. 21

క. ఆలభూమిసురతనూభవు, తలిమంబునఁ బఱచి నూర్జితక్రోధ సమా
కులమై నకులము చిలువన్, బలుపాతన్ గఱచి త్రుంచి పాఱఁగవైచెన్. 22

ఉ. ఆసమయంబున న్మహీసురాగ్రణి పుత్రుఁ దలంచి గాఢసం
త్రాసము పేర్మి లోఁగిటికి గ్రమ్మఱ వచ్చుచు నుండఁ జూచి యు
ల్లాసరసం బెలర్ప నకులంబు ఫణిస్రవదస్రపంకసం
భాసితవక్త్రమై యెదురఁ బర్వె పదాబ్జములం బెనంగినన్. 23

చ. ప్రకటభుజంగమక్షతజపంకవిలిప్తముఖంబు నమ్మహా
నకులముఁ జూచి భూమిసురుఁ డాహతభీతపరీతచిత్తుఁడై
యొకగడెసేపు రిమ్మగొని యుండి పదంపడి తేఱి నిష్ఠురీ
క్రుద్ధుఁ డసమీక్ష్యకారియును గావున రోషవశుండు గావునన్. 24

క. తప్పదు చంపె న్వదనము, చెప్పక చెప్పెడును రక్తసిక్తంబయి నా
కుప్పాకలువోలెఁ గలిగిన, యిప్పాపని దీనికేన యిచ్చితి మెసవన్. 25

క. సతిమాట మీఱ కన్మ, త్సుతుదగ్గఱఁ గాచియుండఁ జూచిన నీదు
స్థితి యిచ్చునె నాకుత్సిత, మతిగూల న్నకుల యుచితమా కావలికిన్. 26

క. అని కన్నుల జేవురుగఁ, లోఁకన లగుడం బెత్తి విసరికొట్టిన వెలికిన్
గనుగ్రుడ్లు వెడల నొప్పిం, బనివి యహో నకుల మపుడు ప్రాణము విడిచెన్. 27

చ. నకులముఁ జంపి పోయి సదనంబున భూమిసురుండు గన్గొనం
జికిలిమడుంగుపానుపునఁ జెక్కు చెమర్పక యున్నపుత్రకున్
బ్రకటభుజంగఖండములఁ బ్రాంతమునం గని బిచ్చఁబోయి యే
టికి నిటుసేసితిం గలువరించి యయో నను రోయ నుత్తముల్. 28

వ. అని యుదరతాడనంబుఁ జేసికొనుచు బ్రాహ్మణుం డుచ్చైస్స్వనంబున రోదనంబు
సేయం దొడంగె నక్కలకలంబు చేరువఁ బుట్టినింటనునికిం జేసి యాకర్ణించి యాజ్ఞసే
ని గృహంబునకు వచ్చి ప్రాణేశ్వరు నాలోకించి. 29

క. కడిఖండ లైనపాము, క్కడిది కడుం బ్రేమఁ బెంపఁగా రాజిలు పెం
పుడునకుల మేలపాలిసెం, దడయక నీ వేటికేడ్చెదవు చెపు మనఘా. 30

ఉ. నావిని బ్రాహ్మణుం డనియె నన్నుఁ బ్రయత్నమెలర్పఁ బట్టికిన్
గావలిఁబెట్టి పుట్టినిలు గాల్వఁగ నీవటుబోవ నేను నా
లో వివరంబు మాలి మృగలోచన ముంగిసనే కిశోరర
క్షావిధి కొప్ప నేర్పఱిచి జాఱితి మందిరబాహ్యభూమికిన్. 31

క. ముంగియును మన్నియోగము, నం గదలక కాచియుండ నందును నాలో
నం గాలసర్ప మరుదే, రం గని భవదీయపుత్త్రరక్షాబుద్ధిన్. 32

క. తలఁ గొఱికి నఱికి భుజగ, జ్వలదస్రరసాతిరక్తవదనముతో ద
ర్వ్యాల కెదురువచ్చి నకులము, కలకంఠీ పెనఁగఁదొణఁగెఁ గాళ్ళన్ వ్రేళ్ళన్. 33

తే. అపుడు పన్నగరక్తసిక్తాననంబు, బభ్రునేత్రంబుఁ గని గుండె పగిలి నొగిలి
తనయు నిర్జించెనిఁక నేటితాళి మనుచు,నువిద లగుడాభిహతి దీనియసురుఁ గొంటి.

క. ఈయుగ్రాఘం బేమిటఁ, బాయు నిశాచరుఁడఁ గాక బ్రాహ్మణుఁడనె యం
చాయన యేడ్చుచుఁ జెప్పిన, నాయిభనిభయాన ఖిన్నయై మూర్ఛిల్లెన్. 35

వ. మూర్ఛిల్లి యొట్టకేలకుం దేఱి కన్నీరు కరతలంబునం దుడిచికొనుచు సతి పతికి
గద్గదస్వరయై యిట్లనియె. 36

క. సుపరీక్షితము సుదృష్టము, సుపరామృష్టంబు మఱియుఁ గుశ్రుతముం గో
నిపురుషుఁడు నాపితుని క్రియ, నపరిమితాపత్పరీతుఁడై చెడిపోవున్. 37

క. అనినవిని భూసురుఁడు సతిఁ, గనుగొని యోవంశపాలికా! మంగలి యే
పనిఁజేసి చచ్చె నీకథ, విననిష్టం బయ్యెఁ జెప్పవే నాకనుడున్. 38

వ. యాజ్ఞసేని యిట్లని చెప్పందొణంగె. 39

చ. జడమతిభార్య యొక్క సెటిసాని విదర్భనివీటనుండి సొం
పడరఁగఁ గర్భలబ్ధిఁ గడుపై కడుఁబైకొనుదండినొప్పలం
బడి యది పుత్త్రుఁగాంచి పిదపం బరలోకముఁ జేర నంతలో
నడల దొడంగె నాకటికి నారసి చన్నిడలేమి బాలుఁడున్. 40

క. చుట్టంబులు పక్కంబులు, కట్టడియై వీఁడు తల్లిగండము తెలగా
బుట్టె నవలక్షణుం డికఁ, గట్టా యెవ్వారిఁ జెలుపఁగా నున్నాఁడో. 41

ఆ. ఇంట నుండగూడ దిప్పుడ గొని చని, గుంటనైనఁ బెద్దకుంటనైనఁ
బెంటనైన వైచి యింటికి నరుదెం డ,నంగ నద్దురుక్తు లాలకించి. 42

క. ఆయిండ్లఁ గూలి సుప్పటు, లాయముగా నితపధీనయై మనునొకవ
ర్షీయసి వేఁగినపుదిలో, బాయనితమి మ్రొక్కి నిలువఁబడి యిట్లనియెన్. 43

ఉత్సాహ. కన్నవారివంకవారిఁ గానఁ బ్రాణనాథుఁడున్
మున్నెచచ్చె యేను గుంకముండ నెట్లు లేగుదున్
మున్ను వెన్క లేదు నేఁడు మూఁడుగాళ్ళవృద్ధనా
యన్నలార వీని నీరె యంచు వేఁడి మ్రొక్కినన్. 44

మ. అరసాన్న గ్రహణాస్థిశేషనతదేహన్ సౌఖ్యకృత్తైలసం
స్ఫురణాభావజటీకృతాలకననిషద్దైన్యతామ్యన్ముఖం
బరుషప్రాక్పరిధానసంవృతనితంబ న్నిర్గతాలంబనా
జరతం గన్గొని యొందునాక నగరస్వాముల్ ప్రసాదించినన్. 45

క. వనిత పనిఁబూని వానిన్, దనయునిగాఁ బెనుచుకొనిన దత్సుకృతం బే
మనిచెప్పవచ్చు విద్యా, ఘనుఁడు గుణాకరుఁడు ధీరతరుఁ డతఁడయ్యెన్. 46

క. అతఁడొకనాఁడు దారి, ద్వాస్థితుఁడై ధాత సోఁసి యలసి మహీశ
య్యాతలమున నిదురించి యా,హా తేజోలాభమూల మొకలఁ గనియెన్. 47

ఉ. చేరి తృతీయయామమున సెట్టి గలంగి సదుల్లసన్మరు
ద్భూరుహభంగిఁ గెంజడలు భూతిపరిక్షితమైన మేన నిం
డారఁగఁ గావికావు మసినంటినమోము సలక్ష్మశుభ్రరో
చీరుచి సేవగింప నొకసిద్ధుఁడు వచ్చి సదాదరాయతిన్. 48

చ. అనియె నహో కిరాటతనయా వినయాదిగుణంబులందు నే
మనుజుఁడు నీకు సాటి యలమాటలటుండెఁ బ్రభాతమైననీ
కనుఁగవకు న్ఘనక్షపణకత్రయము న్గనుపట్టు ముంగిటం
బడివడి దానిఁ జంపు మది భర్మనిధిత్రయమూర్తి నుండెడున్. 49

క. అనిధులఁ బుచ్చుకొని ధని,వై నీతిఖ్యాతిరీతు లమరఁగ మనుమం
చానిత్యసత్యుఁ డరిగిన,మానస మలరం గిరాటమణి మేల్కనియెన్. 50

తే. మేలుకని భక్తిఁ బ్రణమిల్లి మేర నిలిచి,తల్లి యూరుజమహిళామతల్లి కనియె
నమ్మ యిమ్మందిరంబున నలికి ముగ్గుఁ, బెట్టు మిపుడు శుభంబు లభించు మనకు.

క. వలదు విలంబన మన న,ప్పలితగృహం బలికి పూసి పసపాసఁగం గు
గ్గులు మ్రుగ్గులు నిడి యక్కథ, నలఘుమతిం దెలిపె సనయుఁ డగుతనయునకున్. 52

క. క్షౌరమునకు సమయంబగు, టూరసి నాపితుఁడు వచ్చె నాలో దైవ
ప్రారంభమున నపూర్వవి, భారూఢక్షపణకత్రయంబును వచ్చెన్. 53

వ. వచ్చిన. 54

క. మే నుప్పొంగఁగఁ బెంజెర, కూన న్నగు లగుడమెత్తికొని ప్రాణంబుల్
పోనడఁచె సెట్టి యాలో, దీనత్రితయం బహో నిధిత్రయ మయ్యెన్. 55

వ. అయిన. 56

క. ఆనిధులఁ బుచ్చుకొని ధని,యై నాపితుఁ జూచి వణిజుఁ డాదృతి మెఱయన్
దీనారశతక మిడి మదిఁ, బూనినకౌతూహలమునఁ బొమ్మని పల్కెన్. 57

చ వెఱగు జనింప నత్తెఱఁగు వెంగలిమంగలి నూది కన్నుమి
న్నెఱుఁగక యింటి కేగి యటులేనును భూరినిధు ల్గడింతు నం
చటిముటి గొంపులేక లగుడాగ్రముఁ గైకొని యత్నమేమియున్
గరిపడకుండ నాక్షపణకత్రితయాగమనంబుఁ గోరఁగన్. 58

క. ఒకముగురు నిగురుగప్పిన, ప్రకటాంగారము లనంగ భస్మవిలిప్తాం
గకులు చనుదేర నారసి, తుకతుకపో నడచె నాపితుఁడు చేసేతన్. 59

క. లగుడంబున మస్తకముల్, పగిలి పడ న్వ్రేయుఁ జచ్చిపడి రెన్నఁగ న
మ్ముగురును మఁగుర నిధిత్రయ, మగుఁబయి లేదవని మెఱసెనస్త్రము మెదడున్.

వ. అట్టి దుష్కృత్యంబునకుఁ జౌరులాహాకారంబు లొనర్చి రాక్షణంబ నగరరక్షకులు. 61

చ. పటురభసంబున న్బ్రదివిపట్టి దురాత్మక యిట్టివారి నేఁ
డిటునరె జేసి చంపుటకు నెవ్వని నీమన సోర్చె వీని ని
ష్కృతి యిది చరిత్రు లన్యులకుఁ గోర కొంకింతయు గేదు వీరిపైఁ
గటకట మచ్చరం బెటులఁ గల్గె వృథా యిది పోల దెయ్యెడన్. 62

క. నిటలలిఖితాక్షరంబులు, కుటిలాత్మ మసలదెసల గొనబగు జటులం
జటులగతిఁ జంపితీవని, కటములు బొంగారఁ గ్రూరగతి వారంతన్. 63

క. ఆతనికుఁ డోడిపడ న, బ్భిక్షులపాదముల సరసఁ బెట్టి భుజాహో
తిక్షితి దునిమిరి ధర నప, రీక్షితకార్యులు భజింపరే యాపదలన్. 64

చ ప్రశమనరేఖఁ బాదమునఁ బ్రామి మహో యవిశేషరోషసం
వశుఁ డగుమన్ ధరాస్థలి నవారణ నెవ్వఁడు వేగిరించి సం
భృశతరకార్యము ల్సలుపుఁ బెద్దయు వేయునునేల సర్వదు
ర్దశలు గలంచు వానిఁ దము దా గుణలుబ్ధులఁ బొందుసంపదల్. 65

వ. కావున నీవును నాపితునకు దోడుబోయినవాఁడ వని ప్రాణేశ్వరుం దూరెఱ వాయ
సుఖస్థితి నుండి రని విష్ణుశర్మండు సెప్పిన విని నీతికథావర్ణనంబున సుదర్శనకుమా
రులు లబ్ధవర్ణులై పూర్ణులై తండ్రి నలరింపుచుండిరి. 66

మ. సతతశ్రీధృతరాగదేహకృతమోహాభాగరత్నాస్థిదా
మతటిత్తారకయుక్తవారిధరసమ్యక్కాయ చిద్గేయ ప
న్నతమోహాన్వితికర్తృ కాను హితగానప్రేమ గోపాంగనా
శతచామీకరచామరానిలచరాంచత్కేళిలోలాలకా 67

క. హాటకమణినూపురన్యక, రోటీకములా ప్తచరణ రుచిరాగ్నిశిఖా
పాటీరభసితపల్లవ, పాటలమందారపాదపప్రతిమానా 68

మాలిని త్రిపురరిపువరస్త్రీతీవ్రమానచ్ఛిదాఢ్య, నిపుణతరవిహారా నిత్యసంతోషపూరా
జపకరణచణార్యాసక్తముక్తాభిగమ్యా, త్రిపటుతనువిలాసా దివ్యభామైకవాసా. 69

గద్య. ఇది శ్రీవేంకటనాథ కరుణాలబ్ధ సరససాహిత్యనిత్యకవితావిలాస సకలసుకవి
స్తుతిభాషణోల్లాస రాజకులపారావారపర్వశర్వరీరమణ నీతిశాస్త్రమార్గపరిశ్రమణ
ధైర్యపర్యాయ ధిక్కృతనీహారపర్వత పర్వతరాజకుమార నిస్సహాయప్రబంధనిర్మాణ
భోజభూదారసుధామధుర భారతీసనాథ వేంకటనాథ ప్రణీతం బయిన పంచతం
త్రంబున నసమీక్ష్యకారిత్వ మన్నది సర్వంబును పంచమాశ్వాసము.

---

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.--1924.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
T HYDERABAD (A. P.)

Cl. No. 81 Acc. No. 29420

VSS P DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 29420

Call No. 81 VSS P

Author [illegible]

Title [illegible]

**UNIVERSITY OF HYDERABAD**
**LIBRARY**
**HYDERABAD (A. P.)**

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**